**Al - Shabaab Fee Zuel Qur'an**
**(Telugu)**

# కుర్‌ఆన్ వెలుగులో

# యువకులు


రచన

**ముహమ్మద్ అజీజుర్రహ్మాన్**



ప్రకాశకులు

**తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్**

సందేశ భవనం, లక్కడ్ కోట్, ఛత్తాబజార్,

హైదరాబాద్–500 002 ఫోన్ : 040–24576237

# Qur'an Velugulo Yuvakulu

## Al - Shabaab Fee Zuel Qur'an (Telugu)

**TIP Series No. : 301**

Writer : **Muhammad Azeezur Rahman**

*All Rights Reserved with Publishrs*

First Edition : June 2017

Copies : 2000

**Price : Rs. 75/-**

ISBN : 978 - 93 - 81111 - 51 - 2

Published by : **Telugu Islamic Publications Trust** (Regd.)
Sandesha Bhavanam,
Lakkadkot, Chatta Bazar,
Hyderabad-500 002. India.
Phone: 040 - 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com

Typeset by : Geeturai Graphics
Lakkadkot, Hyderabad-2.

Printed at : : Cosmic Printers
Lakkadkot, Hyderabad-2.

తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | తాగూత్ వ్యవస్థపై తిరగబడిన టీనేజీ కుర్రాడు | 8 |
| 2. | అత్యుత్తమ గాథ (అహ్సనుల్ ఖసస్) | 18 |
| 3. | ఫిరౌన్ చెర నుండి విడుదలైన ఇస్రాయీల్ బిడ్డలు | 83 |
| 4. | దైవప్రవక్త ఈసా(యేసు- అలైహిస్సలామ్) సిసలైన ప్రబోధనలు | 93 |
| 5. | దివ్యఖుర్ఆన్ వెలుగులో ఈసా(అ) | 104 |
| 6. | గుహవారి వృత్తాంతం | 110 |
| 7. | స్వీకృతి పొందిన పశ్చాత్తాపం | 121 |

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

# కృతజ్ఞతలతో...

## 1983 నాటి మాట-

'స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్' (ఎస్.ఐ.ఓ) శిక్షణా సమావేశాలలో విద్యార్థుల, యువకుల శీల నిర్మాణంలో భాగంగా హైదరాబాద్‌లో 'కుర్‌ఆన్ మెచ్చిన నవ యువకుడు' అనే శీర్షికపై సుదీర్ఘమైన చర్చ జరిగేది. 'సూరయె యూసుఫ్' వ్యాఖ్యానాన్ని విద్యార్థులు అధ్యయనం చేసి వచ్చి పలు కోణాల నుండి ఈ అంశంపై చర్చించేవారు. ఆ రోజుల్లోనే నాలో ఈ ఆలోచన మొగ్గ తొడిగింది- ఏనాటికయినా ఈ టాపిక్‌పై రచన చేయాలనీ, దానిని ఓ చిరు పుస్తకంగా ప్రచురించాలనీని.

ఈ మాటే గతేడాది (2016) గురువర్యులు జనాబ్ ఎస్.ఎం. మలిక్ గారితో చెప్పాను. "ఈ అంశాన్ని ఒక్క హజ్రత్ యూసుఫ్(అ) వరకే ఎందుకు పరిమితం చేస్తావు? కుర్‌ఆన్ వెలుగులో యువకులు పేరుతో మరో ఐదారు పాత్రలను కూడా తీసుకుంటే బావుంటుంద"ని ఆయన సూచించారు. 'బిస్మిల్లాహ్' అంటూ గీటురాయిలో ధారావాహిక రచన చేయడం మొదలెట్టాను.

పాఠకుల నుండి లభించిన స్పందనను గమనించిన తరువాత దీనికి పుస్తక రూపం ఇవ్వాలన్న ఆలోచన మరింత బలపడింది. ధారావాహిక రచనను చదివిన పాఠకులే పుస్తక ముద్రణకు ఆదరువుగా నిలిచారు. ఈ విధంగా చివరి ఎపిసోడ్ పూర్తి కాకముందే పుస్తక ముద్రణా సన్నాహాలు మొదలయ్యాయి. శ్రేయోభిలాషుల సూచనల మేరకు పుస్తకంలో కొన్ని ఇమేజెస్‌ని- సింబాలిక్‌గా- తీసుకోవడం జరిగింది.

యువత శీల నిర్మాణం ఈ రచన ముఖ్య ఉద్దేశం. వారు ఇంట ఉన్నా, వీధిలో ఉన్నా, స్వదేశంలో ఉన్నా, విదేశాలలోఉన్నా, వారొక విద్యార్థిగా ఉన్నా, ఉద్యోగిగా ఉన్నా, ఒక అధికారిగా ఉన్నా, ఒక పాలితునిగా ఉన్నా తమలోని విశిష్ఠ నడవడి ద్వారా ఏ విధంగా ఒక సత్ప్రేరునిగా, ప్రయోజకునిగా, సంస్కర్తగా, శ్రేయోభి లాషిగా రాణించగలరో సోదాహరణంగా విశదపరిచే సంఘటనలు ఇందులో ఉన్నాయి.

అలాగే దైవప్రవక్తలైన మహనీయ మూసా(అ), మహనీయ ఈసా(యేసు-అ)లు ఇస్రాయీల్ సంతతి వారికి చేసిన కర్తవ్య బోధను, నైతికోపదేశాలను చదువుతున్నప్పుడు అవి కేవలం ఆ కాలానికి, ఆ జాతి వారికి మాత్రమే వర్తిస్తాయని భావించనవసరం లేదు. అవి ఎల్లరికీ ఆదర్శప్రాయమే. అన్ని కాలాలకూ ఉదాహరణ ప్రాయమే.

ఈ రచన సందర్భంగా నేను అధ్యయనం చేసిన గ్రంథాలివి :

- మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ (రహ్మ)గారి కుర్‌ఆన్ వ్యాఖ్యానం 'తర్జుమానుల్ కుర్‌ఆన్'.
- మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది (రహ్మ) గారి వ్యాఖ్యానం 'తఫ్‌హీముల్ కుర్‌ఆన్'.
  (జనాబ్ ఎస్.ఎం మలిక్ గారి తెలుగు రూపం: ఖుర్‌ఆన్ అవగాహనం)
- మౌలానా ముఫ్తీ షఫీ (రహ్మ)గారి వ్యాఖ్యానం 'మారిఫుల్ కుర్‌ఆన్'.
- మౌలానా అమీన్ అహ్సన్ ఇస్లాహీ (రహ్మ) గారి వ్యాఖ్యానం 'తదబ్బురె కుర్‌ఆన్'.
- హాఫిజ్ సలాహుద్దీన్ యూసుఫ్ గారి వ్యాఖ్యానం 'తఫ్సీర్ అహ్సనుల్ బయాన్'.
- మౌలానా ఖాలిద్ సైఫుల్లాహ్ రహ్మానీ గారి వ్యాఖ్యానం 'ఆసాన్ తఫ్సీర్- కుర్‌ఆనె మజీద్'.
- పరిశుద్ధ గ్రంథం (పాత నిబంధన, కొత్త నిబంధన).
- మౌలానా మౌదూదీ (రహ్మ) చే విరచితమైన 'సీరతె సర్వరె ఆలమ్'.

ఈ పుస్తక ముద్రణకై ఆదరువుగా నిలిచి, ఆర్థికంగా తోడ్పాటునందించిన శ్రేయోభిలాషి జనాబ్ అబ్దుర్రహ్మాన్ కసీర్ (అబూ అహ్మద్) గారికి, విలువైన సలహాలు సూచనలిచ్చిన గురువర్యులు ఎస్.ఎమ్ మలిక్ గార్కి, మిత్రులు మౌలానా అబ్దుల్ ఖాదిర్ ఉమరీ, మౌలానా సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమరీ గార్లకు అల్లాహ్ ఉత్తమ ప్రతిఫలం ప్రసాదించాలని వేడుకుంటున్నాను. ఈ బృహత్కార్యంలో ఆద్యంతం నన్ను ప్రోత్సహించిన టి.ఐ.పి డైరెక్టర్ జనాబ్ ఎస్.హెచ్ సమ్దానీ గారికి నిండు హృదయంతో కృతజ్ఞతలు. పుస్తకాన్ని అందంగా తీర్చిదిద్దడంలో తోడ్పడిన శ్రీ లక్ష్మీనారాయణ, శ్రీ ముహమ్మద్ రఫీఖ్, శ్రీ సయ్యిద్ సమీయుద్దీన్ గార్లకు ఈ శుభ సందర్భంగా నా ప్రత్యేక అభినందనలు.

దైవ చిత్తమయితే ఇదే తరహాలో 'కుర్‌ఆన్ మెచ్చిన వనితలు', 'కుర్‌ఆన్ మెచ్చిన చక్రవర్తులు' అనే మకుటంతో కూడా రచనలు చేయాలని ఉంది.

కారుణ్య ప్రభువు దయతో ఈ చిరు కృషిని స్వీకరించాలని, ఇందులో శుభాన్నీ, సమృద్ధినీ పొందుపరచాలనీ, నా వల్ల జరిగిన పొరపాట్లను క్షమించాలని కడు దీనంగా వేడుకుంటున్నాను.

**- ముహమ్మద్ అజీజుర్రహ్మాన్**

క్రీ.శ. 19-04-2017
హిజ్రీ 22, రజబ్ - 1438.

# అభినందన

సోదరుడు అజీజుర్రహ్మాన్ రచనా కౌశలం గల పాఠకుడు, చదివిన దాన్ని ఆలోచనగా మార్చగల సమర్థుడు, ఆలోచనల్ని కలం ద్వారా వినిపించగల యోగ్యుడు. తాను యువకునిగా ఉన్నప్పుడు వచ్చిన తలంపును నడి వయసులో పేపరు కెక్కించిన యోధుడు. ఓ యోధునికే ఇంత ఓర్పు! ఇంత సంయమనం!! ఇది సమంజసమయిన నిర్ణయం. ఆలోచనల్లో యవ్వనం తొణికిసలాడుతున్నా వ్రాతల్లో పరిపక్వత నిండిన దశలో చేసిన రచన ఇది!

ఇది అజీజుర్రహ్మాన్ కలలు గన్న పుస్తకం, కలల్ని నిజం చేసుకున్న పుస్తకం, సందేశాత్మకమయిన పుస్తకం. ఈ పుస్తకంలో అజీజుర్రహ్మాన్ ఓ సందేశాన్నిచ్చారు, తనకు, తనలాంటి ఓనాటి యువకులకు, ఈనాటి యువకులకు, రాబోవు నాటి యువకులకు కూడా! ఈ సందేశాన్ని అజీజుర్రహ్మాన్ నిక్షిప్తంగానో, గాఢంగానో, గూఢంగానో అందజేయలేదు. చాలా స్పష్టంగా, ఎంతో సరళంగా, మరెంతో సుబోధకంగా కథల రూపంలో, కుర్‌ఆన్ గాథల రూపంలో, దైవప్రవక్తల నిజ గాథల రూపంలో, ప్రవక్తల అనుయాయుల గాథల రూపంలో– కథానికల Diction – లో అందజేశారు. ధార్మిక గాథల్లో ఆ శైలిని అలవోకగా ప్రయోగించారు. చదువరులు అతి సునాయాసంగా అర్థం చేసుకోగలిగేలా, అవలీలగా గుణపాఠం గ్రహించగలిగేలా, ధార్మికత, నైతికత, సద్గుణ సంపన్నత పాఠకుల్లో పాదుకునేలా రచన సాగించారు.

ఈ పుస్తకంలోనివన్నీ కుర్‌ఆన్ గాథలు కాబట్టి వాటిని గురించి నేను చెప్ప వలసిందేమీ లేదు. ఈ పుస్తకం గురించి ఏమయినా చెప్పదలిస్తే అది కేవలం అజీజ్‌ని

గురించి మాత్రమే, అజీజ్ రచనా పటిమను గురించి, శైలిని గురించి మాత్రమే చెప్పాలి. అజీజుర్రహ్మాన్ కొత్త రచయిత కాదు. గీటురాయిలో పుట్టి పెరిగిన రచయిత. గీటురాయి గర్వించదగ్గ రచయిత. అందువల్ల నేనేమయినా చెబితే నా వీపు నేనే తట్టుకున్నట్లవుతుంది. అందువల్ల శ్లాఘనీయాంశాలన్నీ ఇతరులకు వదిలిపెట్టి నాలోని లోపాలు అజీజ్‌లోనూ సహజంగానే, సహవాస దోషాలుగా పొడసూపాయని బాధ పడుతూ ఎత్తి చూపాలనుకున్నాను. కాని ప్రేమ అడ్డు వచ్చింది.

అజీజ్ నాకు ప్రేమపాత్రుడు. వ్యక్తిగా, రచయితగా, ఆచరించే ముస్లిమ్‌గా, ఉద్యమ సానుభూతిపరునిగా, దైవభీతిపరునిగా! అయినా... మనిషికి పరిమితులుంటాయి. నాకయినా, మరొకరికయినా, అజీజ్‌కయినా. అయితే సామూహికత, సామాజికత, సాముదాయికత, ఉద్యమ ఆవశ్యకత కొన్ని సందర్భాలలో ఆ పరిమితుల్ని ఉల్లంఘించమని బలంగా కోరుతాయి. ఆ కోరికను నెరవేర్చడం అందరికీ సాధ్యం కాదేమో మరి!

ఈ పుస్తకంలో సందేశముందని ముందే విన్నవించుకున్నాను. ఆ సందేశాన్ని కుర్ఆన్ కన్నా, అందునా ప్రవక్తల గాథలకన్నా విడమర్చి చెప్పగలవారెవరు, దానికి తోడు అజీజుర్రహ్మాన్ శైలి! ఈ పుస్తకం ద్వారా ఉద్దిష్ట ప్రయోజనం తప్పక ఒనగూడుతుందన్న ఆశ నాకుంది. ఆ ఆశతో ఈ పుస్తకాన్ని తెలుగు ప్రజకు ముఖ్యంగా యువతకు సమర్పిస్తున్నాము!

దైవం రచయితకు, పాఠకులకు, ప్రకాశకులకు, ప్రోత్సాహకులకు సకల విధాల ప్రతిఫలాలు ప్రసాదించాలని ప్రార్థన!

హైదరాబాద్
29-4-2017

**ఎస్.ఎమ్. మలిక్**

# 1

# తాగూత్ వ్యవస్థపై తిరగబడిన టీనేజీ కుర్రాడు

**ఇబ్రాహీమ్ (అలైహిస్సలామ్) మా వాడు అని యూదులంటారు.**

కాదు, ఆయన మా వాడు అని క్రైస్తవులంటారు.

లేదు, ఇబ్రాహీమ్ (అలైహిస్సలామ్) అసలు మా వాడు. అతను మా వంశీయుడు, మాకు ఆదర్శప్రాయం అని అరబ్బు ముష్రిక్కులనేవారు.

కాని–

ఇబ్రాహీమ్ (అ) యదార్థానికి యూదుడూ కాడు, క్రైస్తవుడూ కాడు, ఆయన ఏకాగ్రచిత్తంతో భూమ్యాకాశాల సృష్టికర్త వైపునకు మరలి, ఆయన యందే మనసును లగ్నం చేసిన ఏక దైవారాధకుడని ఖుర్‌ఆన్ అంటోంది. ఇంకా ఆయన గొప్పతనాన్ని కొనియాడుతూ ఖుర్‌ఆన్ ఇలా అంటోంది–

## ఆయన ఒక ఉమ్మత్

ఇబ్రాహీమ్ (అలైహిస్సలామ్) తనకు తానుగా ఒక 'ఉమ్మత్'.

అందరికీ అనుసరణీయ నాయకుడు. అందరినీ ముందుండి నడిపించేవాడు.

ఆయన తన ఉనికి రీత్యా ఒక వ్యక్తే కావచ్చు.

కాని అనుపమమయిన తన త్యాగాల దృష్ట్యా,

అసాధారణమయిన పోరాటాల రీత్యా,

మొక్కవోని సాహసం దృష్ట్యా,

ఆయన 'ఒక్క మనిషి' కాడు.

ఆయన ఒక్కడే ఒక గొప్ప అకాడమీ,

ఆయన ఒక్కడే ఒక సంస్థ, ఒక వ్యవస్థ.

ఒక సైన్యం.

ఒక మార్గదర్శక నేత.

నాయకత్వానికి (లీడర్‌షిప్) మూల పురుషుడు.

ఆయన బహుదైవోపాసకులలో చేరినవాడు ఎంతమాత్రం కాడు.

పైగా ఆయన–

దైవానుగ్రహాల పట్ల కృతజ్ఞతా భావంతో జీవించినవాడు.

ఈ ప్రత్యేకతల కారణంగానే,

దేవుడు ఆయన్ని తన కార్యం కొరకు ప్రత్యేకంగా ఎన్నుకున్నాడు.

రుజుమార్గం వైపునకు ఆయనకు మార్గబోధన చేశాడు.

దైవం ఆయనకు ఇహలోకంలోనూ మేలును ప్రసాదించాడు, పరలోకంలోనూ ఆయన సజ్జనుల సరసన ఉంటాడు.

ఇబ్రాహీమ్(అలైహిస్సలామ్) విధానం పట్ల అయిష్టతను వ్యక్తం చేసేవాడెవడుంటాడు– శుద్ధ అవివేకి తప్ప!?

**'నువ్వు ఆత్మ సమర్పణ చేసుకో'** అని లోకేశ్వరుడు ఎప్పుడు ఆదేశించినా, 'సకల లోకాల ప్రభువు సమక్షంలో నన్ను నేను (హృదయ పూర్వకంగా) సమర్పించుకుంటున్నాను' అని సకారాత్మకంగా స్పందించిన త్యాగధనుడు ఇబ్రాహీమ్(అ).

ఇంతకీ ఇబ్రాహీమ్ (అ) ఎవరు? ఎచటివారు? ఎందుచేత ఆయన సమస్త మానవాళికి మార్గదర్శక నేతగా చేయబడ్డారు? ఏ కారణంగా ఆయన ప్రవక్తల పితామహుడు (అబుల్ అన్బియా)గా పిలువబడ్డారు?

అదంతా గత చరిత్ర. నాలుగు వేల సంవత్సరాల వెనక్కిపోయి చూస్తే–

## 'ఉర్' నగరంలో...

ఇరాక్ ప్రదేశంలోని 'ఉర్' నగరమది. క్రీ.పూ. 2100 ఏళ్ళ క్రితం ఉర్ నగర జనాభా రెండున్నర లక్షలని అంచనా. అయిదు లక్షలని మరో అభిప్రాయం. అప్పట్లో



**నమ్రూద్ హయాంలోని 'ఉర్' నగరంలో గల ఒక ప్రసిద్ధ దేవాలయం**

అది మహా గొప్ప పారిశ్రామిక, వాణిజ్య కేంద్రంగా విరాజిల్లేది. దేశ జనాభాలో అధికాంశం పారిశ్రామిక వేత్తలు, వర్తకులే. ఆ నగర శిథిలాల్లో లభ్యమయిన ఆ కాలపు లేఖనాల ప్రకారం ఆ ప్రజలలో అత్యధికుల జీవన దృక్పథం భౌతికవాద ప్రధాన మయినదే. ధనార్జనతోపాటు భోగలాలస వస్తువుల్ని సమకూర్చుకుని, రుచులను ఆస్వాదిస్తూ జీవించటం వారి ప్రధాన జీవిత లక్ష్యం. వడ్డీ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా పరిఢవిల్లేది. ఎంతసేపటికీ డబ్బు డబ్బు డబ్బు. పచ్చి వ్యాపార దృక్కోణం గల జనులు వారు. ప్రతి ఒక్కడూ రెండవవాణ్ణి అనుమానించేవాడు. పరస్పరం వ్యాజ్యాలు వేసుకొని కోర్టులు కచేరీల చుట్టూ తిరిగేవారు. వారిలో చాలామంది దీర్ఘాయుష్షు కోసం, సిరిసంపదల కోసం, వ్యాపార వృద్ధికోసం తమ దేవతలను ప్రార్థించేవారు. ఆ జనాభా మూడు వర్గాలుగా చీలి ఉండేది.

1. **అమీలు** : వీరు అత్యున్నత శ్రేణికి చెందినవారు. పూజారులు, ప్రభుత్వాధి కారులు, సైనికాధికారులు ఈ వర్గంలో ఉండేవారు.

2. **మిష్కీనులు** : వీరు వ్యాపారస్థులు, పారిశ్రామికులు, వ్యావసాయకులు.

3. **అర్‌దూలు** : అంటే బానిసలు.

వీరిలో అగ్ర వర్ణానికి చెందిన 'అమీలు'కు సమాజంలో విశిష్ఠ స్థానముండేది. వీళ్ళ సివిల్, క్రిమినల్ హక్కులు వేరితరులకంటే భిన్నంగా ఉండేవి. వీళ్ళ ధన ప్రాణా లకు ఇతరుల కన్నా అధికమయిన విలువ ఉండేది.

ఇలాంటి నిమ్నోన్నతల వాతావరణంలో హజ్రత్ ఇబ్రాహీమ్(అలైహిస్సలామ్)

కళ్ళు తెరిచారు. 'తల్మూద్'లో ఉన్న వివరాల ప్రకారం ఆయన అమీలు వర్గానికి చెందినవారు. ఆయన తండ్రి ఆజర్ ప్రభుత్వంలో అత్యంత ఉన్నత హోదా కల వ్యక్తి, విగ్రహాల వ్యాపారి, పురోహితుడు.

## ఆనాటి మందిరాలు, మతాచారాలు

'ఉర్' నగరంలో లభ్యమయిన శిలా లేఖనాల్లో దాదాపు అయిదు వేల దేవతల పేర్లున్నాయి. ఆ రాజ్యంలోని వివిధ పట్టణాలకు వేర్వేరు దేవతలుండేవి. ప్రతి పట్నానికి ఓ రక్షక దేవత ఉండేది. దాన్ని నగర దేవతగా, పట్టణ వేలుపుగా, మహాదేవునిగా, దేవదేవునిగా భావించేవారు. దాని గౌరవ ప్రతిపత్తి ఇతర దేవతల కన్నా అధికం. 'ఉర్' నగర దేవత పేరు 'నన్నార్' (చంద్ర దేవత). దాని మూలంగానే తరువాతి వారు దానిని 'కమరీనా' (చంద్ర నగరి)గా పేర్కొన్నారు. రెండవ మహానగరం 'లర్సా'. అది తరువాతి కాలంలో 'ఉర్'కు ప్రత్యామ్నాయ రాజధానిగా మారింది. ఆ నగర దేవత పేరు 'షమాష్' (సూర్యదేవత). ఈ మహా దేవతలకు లోబడి అనేక చిల్లర దేవతలు ఉండేవి. వాటిని అధికంగా ఆకాశంలోని నక్షత్రాల నుండి, కొన్నింటిని భూమి నుండి ఎన్నుకోవటం జరిగింది. తమ చిన్న చిన్న అవసరాలు ఈ చిల్లర దేవుళ్ళకు సంబంధించినవని జనులు తలపోసేవారు. ఈ భూమ్యాకాశాల దేవతల ఆకారాలను విగ్రహాల రూపంలో తయారు చేసుకొని సకల ఉపాసనా రీతులు వాటి సమక్షంలోనే ఆచరించేవారు.

## నాటి సామాజిక స్థితి

'నన్నార్' విగ్రహం 'ఉర్' నగరంలో అన్నింటికన్నా ఎత్తయిన పర్వతంపై వైభవోపేతమయిన కట్టడంలో ప్రతిష్ఠించబడి ఉండేది. దాని సమీపంలోనే నన్నార్ భార్య 'నన్‌కల్' మందిరముండేది. నన్నార్ దేవాలయం ఓ రాజ ప్రాసాదంలా ఉండేది. దాని శయనాగారంలో ప్రతి రోజూ రాత్రి ఒక పూజారిణి వెళ్ళి ఆ దేవతకు వధువుగా తన్ను తాను అర్పించుకునేది. ఆ ఆలయంలో అనేకమంది స్త్రీలు దేవుని పేరిట ప్రత్యేకించబడి ఉండేవారు. వారు దేవదాసీలు (Religious Prostitutes)లా వ్యవహరించేవారు. తన కన్యాత్వాన్ని 'దేవుని' పేరిట అర్పించుకునే స్త్రీ మర్యాదస్తురాలిగా, గౌరవనీయమైనదిగా పరిగణించబడేది. కనీసం ఒక్క మారయినా తనను 'దైవమార్గం'లో ఒక కొత్తవానికి అర్పించుకోవటం స్త్రీకి మోక్ష సాధనమని తలపోసే వారు. ఇక ఈ మతపరమయిన వ్యభిచారిణుల ద్వారా సుఖాలననుభవించేవారు

అత్యధికంగా పూజారులేనన్న సంగతి వేరుగా చెప్పనవసరం లేదు.

## నన్నార్ స్థానం

'నన్నార్' కేవలం దేవత మాత్రమే కాదు, దేశంలో అందరినీ మించిన భూస్వామి, అందరికంటే గొప్ప వాణిజ్యవేత్త. మహా కర్మాగార యజమాని. దేశ రాజకీయ వ్యవస్థలో అందరికన్నా గొప్ప రాజకీయాధికారం గల శక్తి కూడా నన్నార్‌దే. అసంఖ్యాకమయిన తోటలు, ఇండ్లు, భూములు ఆ ఆలయానికి అర్పించబడి ఉండేవి. ఆ ఆస్తుల రాబడితోపాటు కర్షకులు, భూస్వాములు, వ్యాపారస్థులు– అందరూ సకల ధాన్యాలు, పాలు, బంగారం, వస్త్రాలు, ఇతర వస్తుసామగ్రి తెచ్చి ఆలయానికి అర్పించు కునేవారు. వాటిని వసూలు చేయడానికి ఆలయంలో భారీ ఎత్తున సిబ్బంది ఉండేది. అనేక ఫ్యాక్టరీలు ఆలయ యాజమాన్యం ఆధ్వర్యంలో నడపబడేవి. పెద్దఎత్తున వాణిజ్య కార్యకలాపాలు కూడా ఆలయం తరపున సాగించబడేవి. ఈ కార్యకలాపాలన్నింటినీ దేవతల ప్రతినిధులుగా పూజారులే నిర్వహించేవారు. దేశంలోని అత్యున్నత న్యాయ స్థానం కూడా ఆలయంలోనే ఉండేది. పూజారులే దాని న్యాయమూర్తులు. వారు చేసే తీర్పులు దేవుని తీర్పులుగా చెలామణీ అయ్యేవి. స్వయానా రాజవంశానికి చెందిన అధికారం కూడా 'నన్నార్' దేవత తరఫున సంక్రమించినదే. అసలు ప్రభువు నన్నార్ అయితే, దేశ పరిపాలకుడు ఆ దేవత తరఫున పరిపాలన సాగించేవాడన్న మాట! ఈ 'సంబంధం' కారణంగా రాజు కూడా ఆరాధ్యుడైపోయేవాడు. ప్రజలు అతన్ని కూడా దేవతలకు మాదిరిగానే పూజించేవారు.

## నమ్రూద్

హజ్రత్ ఇబ్రాహీమ్(అలైహిస్సలామ్) కాలంలో 'ఉర్'ను పరిపాలించిన రాజ వంశానికి చెందిన తొలి పాలకుడి పేరు 'ఉర్ నమ్మొ'. ఇతను క్రీ.పూ. 2300లో ఒక సువిశాల రాజ్యాన్ని స్థాపించాడు. దాని రాజ్య సరిహద్దులు తూర్పున 'సూస' నుండి పశ్చిమాన 'లెబనాన్' వరకు విస్తరించి ఉండేవి. ఇతని వల్లనే ఆ కుటుంబానికి 'నమ్మొ' అన్న పేరు వచ్చింది. అది కాస్తా అరబీలో 'నిమ్రూద్' (Nimrud) గా మారింది.

ఇప్పటి వరకూ బయల్పడిన పురావస్తు పరిశోధనల ఫలితాలు నిజమైనట్లయితే వీటి ద్వారా ఒక విషయం తేటతెల్లమవుతోంది– హజ్రత్ ఇబ్రాహీమ్(అ) జాతిలో బహు దైవారాధన కేవలం ఒక మతపరమయిన విశ్వాసం, ఆరాధన మాత్రమే కాదు, వాస్తవానికి ఆ జాతి ఆర్థిక, నాగరిక, రాజకీయ, సామాజిక జీవన వ్యవస్థ యావత్తు ఆ నమ్మకం ఆధారంగానే రూపొందింది. అదే సమయంలో హజ్రత్ ఇబ్రాహీమ్(అ)

తెచ్చిన తౌహీద్ (దేవుని ఏకత్వపు) సందేశ ప్రభావం కూడా కేవలం విగ్రహారాధన వరకే పరిమితం కాలేదు. రాజ కుటుంబం, ఆరాధ్య కుటుంబం, ప్రభు సత్తా గల కుటుంబం అన్న భావనలు కూడా దానికి తప్పక గురవుతాయి. పూజారులు, అగ్రవర్ణాల సామాజిక, ఆర్థిక, రాజకీయ స్థితిగతులతోపాటు రాజ్యంలోని సామూహిక జీవన వ్యవస్థలన్నీ తీవ్రంగా ప్రభావితమవుతాయి. ఇబ్రాహీమ్(అ) సందేశాన్ని స్వీకరించటమంటే సమాజపు కట్టడాన్ని పైనుంచి క్రిందివరకు కూలదోసి, దేవుని ఏకత్వం ప్రాతిపదికగా సరికొత్త వ్యవస్థను నిర్మించటమన్నమాట! అందువల్లనే ఇబ్రాహీమ్(అ) ఏక దైవారాధన సందేశం వెలువడగానే సమాజంలోని సామాన్యులు మొదలుకుని అగ్రస్థాయి వారూ, పూజారులు, నమ్రూద్– అందరూ ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. అందరూ కలసి ఆ సందేశాన్ని అణిచివెయ్యడానికి సమాయత్త మయ్యారు.

## ఇబ్రాహీమ్(అ) కలత చెందిన వేళ...

ఇంతకీ హజ్రత్ ఇబ్రాహీమ్ (అ) తన జాతి వారితో ఏమన్నారు?

రోగగ్రస్తమై ఉన్న ఉర్ సామాజిక వ్యవస్థను చూసి ఆ నూనూగు మీసాల కుర్రవాడు తీవ్ర వ్యాకులతకు లోనయ్యాడు. తమ స్వహస్తాలతో చేసిన విగ్రహాల ముందు ఈ మనుషులు సాగిల పడటం అతనికి వింతగా తోచింది. చూడబోతే ఆ మట్టిబొమ్మలు కదలలేవు. మెదలలేవు. కనులు విప్పి చూడలేవు. పెదవి విప్పి పలకలేవు. అయినప్పటికీ ఈ జనులు తమ అవసరాల కోసం వాటి వద్దకే వెళు తున్నారే! వాటినే మొక్కుకుంటున్నారే!! వాటి ముందే నైవేద్యాలు సమర్పించు కుంటున్నారే!!!

ఆ అబ్బాయి సత్యాన్ని శోధించటంలో నిమగ్నుడయ్యాడు. విశ్వప్రభువు అతని పరిశోధనా మార్గాన్ని సుగమం చేశాడు. సత్యాలు ఒకదాని తరువాత ఒకటిగా అతని కళ్ళ ముందుకు రాగాసాయి. అతని దృష్టి సూర్యచంద్ర నక్షత్రాదులపై పడింది. అంతకు ముందు అతను వాటిని చూడలేదని కాదు, చూశాడు. కాని లోగడ చూసిన దృష్టి వేరు. ఇప్పటి దృష్టి వేరు. ఇది యోచనా దృష్టి! పరిశోధనా దృష్టి! కాని కొంత సేపటి తరువాత అవన్నీ అస్తమించేసరికి, అస్తమించేవి నా దైవాలు కాలేవన్న నిర్ధారణకు వచ్చాడు.

ఇక నుంచి తాను అస్తమించని వాని వైపునకు,
ఆదిమధ్యాంత రహితుని వైపునకు

భూమ్యాకాశాల నిర్మాత వైపునకు

ఏకాగ్ర చిత్తంతో అభిముఖుణ్ణి కావాలని కృతనిశ్చయం చేసుకున్నాడు.

తాను బహుదైవారాధకుల కోవకు చెందినవాణ్ణి కానని దృఢంగా నిర్ణయించు కున్నాడు.

బహు దైవారాధన ప్రబలిన సమాజంలో సంబరాలకు, ఉత్సవాలకు, జాతరలకు ఏమాత్రం కొరత ఉండదు. యజ్ఞ యాగాదులు వైభవోపేతంగా జరుగుతుంటాయి. భారీ ఎత్తున అధికార యంత్రాంగం మోహరించబడుతుంది. జాతీయ సంపద మంచినీరులా విరివిగా ఖర్చు చేయబడుతుంది. ఇబ్రాహీమ్ (అ) జాతి ప్రజల పరిస్థితీ ఇదే.

## సంస్కరణకు సిద్ధమైనప్పుడు...

తొలుత ఆ అబ్బాయి తన తండ్రి ఆజర్‌కు ఎంతో వినయంతో విగ్రహపూజలోని అనౌచిత్యాన్ని గురించి వివరించాడు. కాని తండ్రి ససేమిరా అన్నాడు.

మీరు మొరపెట్టుకుంటున్న ఆ దైవాలు మీ మొరను ఆలకిస్తాయా? మీకు లాభం గాని, నష్టం గానీ కలిగిస్తాయా? అని తన జాతి వారిని నిలదీసి అడిగాడు.

అదంతా మాకు అనవసరం. మా తాతముత్తాతలు ఇలా చేస్తూ ఉండగా మేము చూసి ఉన్నాం. కాబట్టి మేము కూడా అలాగే చేస్తామని జాతి జనులు చెప్పారు.

ఈ సమాధానం ఇబ్రాహీమ్(అ)కు సంతృప్తిని కలిగించలేదు.

మీరూ, మీ తాతముత్తాతలు పూజిస్తూ వస్తున్న ఈ విగ్రహాలతో, చిల్లర దేవుళ్ళతో నేను విసుగెత్తిపోయానన్నాడు. వాటితో పూర్తిగా తెగత్రెంపులు చేసుకుంటున్నానని ప్రకటించాడు. తనను సృష్టించినవాడు, తనకు అనునిత్యం మార్గబోధన చేసేవాడు, తనకు తినిపిస్తున్నవాడు, త్రాగిస్తున్నవాడు, తనకు జబ్బు చేసినప్పుడు స్వస్థతను ప్రసాదించేవాడు మాత్రమే తన నిజ స్వామి అని చాటి చెప్పాడు. తనను చంపే, తనను తిరిగి బ్రతికించే శక్తి ఆయనకు మాత్రమే ఉందని, తీర్పుదినాన ఆయన తన తప్పులను మన్నిస్తాడన్న ఆశ తనకు ఉందని చెప్పాడు.

ఒకరోజు వారు తమ దేవుళ్ళ ఆశీర్వాదం తీసుకుని ఉత్సవానికి వెళ్ళినప్పుడు ఆ అబ్బాయి మెల్లగా ఆలయంలోనికి ప్రవేశించాడు. అక్కడ ప్రతిష్ఠించబడి వున్న దేవీ దేవతలను ఉద్దేశించి, మీరు మాట్లాడరేమిటి? మీ భక్తులు ఎంతో ప్రేమతో భక్తితో మీకు సమర్పించుకున్న పండ్లు ఫలహారాలను, స్వాదిష్టమయిన ఆహార పదార్థాలను మీరు తినరేమిటి? ఇంత చెప్పినా మీలో ఉలుకూ పలుకూ లేదే? అంటూ తన చేతికి

పని తగిలించాడు.

'మా దేవుళ్ళకు ఈ దుర్గతిని పట్టించినదెవరు? వాడెవడో పెద్ద దౌర్జన్యపరుడే అయి ఉంటాడ'ని కేకలేసుకుంటూ, లబోదిబోమంటూ వచ్చారు ఉర్ ప్రజలు. బహుశా అతను ఇబ్రాహీమే అయి వుంటాడని అనుకుని కబురంపారు. మా దేవతలకు ఈ స్థితిని కల్పించింది నువ్వేనా? అంటూ గర్జించారు.

"ఏమో! ఆ పెద్దాయన్నే అడిగి తెలుసుకోండి" అని నింపాదిగా బదులిచ్చాడు ఆ అబ్బాయి అతిపెద్ద విగ్రహాన్ని చూపిస్తూ.

## అహంకారం బుసలు కొట్టింది

ఆ మాట వారికి తగలాల్సిన చోటే తగిలింది. అసలు దుర్మార్గులము మేమే కదా! అంటూ గొణుక్కున్నారు. కాని సత్యాన్ని ఒప్పుకోవడానికి వారి అహం అడ్డుపడింది. పురోహితులు, అగ్రవర్ణాల వారైతే మరీ రెచ్చిపోయారు– ఎందుకంటే ఇబ్రాహీమ్ భావజాలం గనక ప్రజా బాహుళ్యంలో చొచ్చుకుపోయిందంటే తమ పౌరోహిత్యం ప్రమాదంలో పడిపోతుంది. తమ నాయకత్వానికి నూకలు చెల్లుతాయి. అందుకే వారు సామాన్య ప్రజానీకాన్ని ఉసిగొల్పారు–

***"మీరేదన్నా చేయాలనే అనుకుంటే ఇతన్ని అగ్నికి ఆహుతి చేయండి. మీ మీ దేవుళ్లకు అండగా నిలబడండి"*** అని పిలుపు ఇచ్చారు.

## ఎంత విచిత్రమయిన పిలుపు ఇది!?

'దేవుడు చేసిన మనుషులు' దైవం గురించి ఇచ్చే ఈ పిలుపులో దేవుని నిస్సహాయ స్థితి కొట్టొచ్చినట్లే కనిపిస్తోంది. మనిషి ఆగ్రహోదగ్రస్థితికి లోనైనపుడు విజ్ఞతను, వివేచనను కోల్పోతాడు. తన స్థాయికి ఏమాత్రం శోభించని పిచ్చి వాగుడు వాగుతాడు. ఆధి భౌతికతత్వం పెనుభూతంలా పెనవేసుకుపోయిన 'అమీలు' అగ్రవర్ణం వారు ఆ క్షణంలో చేసింది కూడా అదే. ఎందుకంటే వారు ఆ కుర్రవాణ్ణి తమ దారి నుంచి తొలగించుకోకపోతే తమ స్వలాభాల కట్టడం కుప్పకూలిపోతుంది.

ఆ కాలపు చక్రవర్తి నమ్రూదు కోరుకున్నదీ అదే. తన అభిమతానికి ప్రభుత్వాధి కారులు, మతాధిపతులు, సైన్యాధికారులు సయితం వత్తాసు పలికినపుడు ఇంక తనకు కావలసిందేముంది? ఎందుకంటే సాక్షాత్తూ దైవాంశ సంభూతుడుగా వెలిగిపోతున్న నమ్రూదు చక్రవర్తినే ఆ కుర్రవాడు ఎదిరించాడు. అతని కళ్ళల్లో కళ్ళు పెట్టి ప్రశ్నాస్త్రాలు సంధించాడు. 'జీవన్మరణాలు ప్రసాదించేవాడే నా ప్రభువు' అని ఆ

అబ్బాయి చెప్పినప్పుడు నమ్రూదు భృకుటి ముడివేశాడు. 'నేను కూడా జీవితాన్ని ప్రసాదిస్తాను. నేను కూడా కోరిన వారిని ప్రాణాలతో వదిలేస్తాను. నేను కోరిన వారి ప్రాణాలు తీస్తాను' అని చెప్పాడు నమ్రూద్ ఇబ్రాహీమ్(అ) ఏమాత్రం తొణక్కుండా.

'అలాగా! సరే, నా ప్రభువు సూర్యుణ్ణి తూరుపు నుంచి ఉదయింపజేస్తున్నాడు. పడమటన అస్తమించేలా చేస్తున్నాడు. మరి నువ్వు నిజదైవమే అయినట్లయితే సూర్యుణ్ణి పడమటి దిక్కున ఉదయించేలా చెయ్యి. తూర్పు దిక్కున అస్తమించేలా చెయ్యి చూద్దాం' అని సవాలు విసిరేసరికి నమ్రూదుకు దిమ్మ తిరిగినంత పనయింది.

## అగ్నిగుండంలో ఇబ్రాహీమ్ (అ)

ఈ విధంగా రాజు పంచన చేరినవారంతా ఏకమై తాగూత్ వ్యవస్థను కాపాడు కోవడానికి నడుం బిగించారు. ఇబ్రాహీం(అ)ను అగ్నికి ఆహుతి చేయాలనే వారంతా సంకల్పించుకున్నారు. అతని కోసం ఓ పెద్ద అగ్నిగుండం తయారు చేయబడింది. ఆ విధంగా వారు తమ దేవుళ్ళకు 'సహాయం' చేయాలనుకున్నారు. వారి నరనరాన జీర్ణించుకుపోయిన అవిశ్వాసం, బహు దైవారాధన వారి మనోనేత్రాన్ని కాంతిహీనం చేసేసింది. అదే సమయంలో దేవుని కారుణ్య కడలి ఉప్పొంగింది. తన ప్రియతముని కోసం 'చల్లారిపో' అని అల్లాహ్ అగ్నిని ఆజ్ఞాపించాడు. అంతేకాదు, అతని పాలిట 'సురక్షితం అవ్వు' అని కూడా ఆదేశించాడు.

అంతే! ఆ అగ్నిగుండం ఇబ్రాహీమ్(అ) పాలిట నందన వనంగా పరిణమించింది. అందరూ కళ్ళప్పగించి చూస్తూ ఉండగానే ఆ అబ్బాయి ఆ అగ్నిగుండంలో నుంచి హాయిగా బయటికి నడిచి వచ్చాడు. ఈ అద్భుత సంఘటనకు నమ్రూద్ చక్రవర్తి సిగ్గుతో కుంచించుకుపోయాడు. కాని సత్యం కొరకు వాళ్ళ హృదయ కవాటాలు తెరుచుకోలేదు. ఆ గడ్డపై సత్యామృతాన్ని ఆస్వాదించే శుభాత్ములు లేవని ఆ అబ్బాయికి అర్థమైపోయింది. తన ఏక దైవారాధనా వాదానికి అనువైన మరో ప్రాంతానికి, మరో జాతి వైపునకు ప్రస్థానం చేయవలసిన తరుణం ఆసన్నమైందని అతను తెలుసుకున్నాడు. దైవాజ్ఞపై దేవుడు సూచించిన కన్‌ఆన్ ప్రదేశం వైపునకు వెళ్ళాలని సంకల్పించుకున్నాడు.

## దేవుడు సూచించిన ప్రదేశానికి

చెడు వాతావరణం నుండి శుభప్రదమైన వాతావరణం వైపునకు, చెడు సహచర్యం నుండి సద్వర్తనుల సహచర్యం వైపునకు, చెడు వ్యవస్థ నుండి సత్య ప్రధానమైన

వ్యవస్థ వైపునకు ప్రయాణం సాగించారాయన.

హజ్రత్ ఇబ్రాహీమ్(అ) అక్కణ్ణుంచి వలసపోయిన తరువాత ఆ రాజ కుటుంబంపై, ఆ జాతి వారిపై ఎడతెగని ఆపదలు వచ్చి అది సర్వనాశనమైంది. తొలుత ఎలామీయులు (Elamites) 'ఉర్'ని నాశనం చేశారు. నమ్రూద్‌ను 'నన్నార్' విగ్రహాలతో సహా బందీగా చేసుకుని తీసుకెళ్ళిపోయారు. ఆ తరువాత 'లర్సా'లో ఎలామీయుల ప్రభుత్వం ఏర్పడింది. దానికి లోబడి 'ఉర్' సామంత రాజ్యంగా ఉండేది. చివరికి ఒక అరబీ కుటుంబం ఆధ్వర్యాన 'బాబిలోనియా' బలపడసాగింది. అప్పుడు 'లర్సా', 'ఉర్' రెండూ దాని అధీనంలోకి వచ్చాయి. ఈ వినాశాల కారణంగా 'నన్నార్' దేవత పట్ల ఉర్ ప్రజల నమ్మకం వమ్మయింది. కారణం; అది వారిని కాపాడలేకపోవటమే.

దైవప్రవక్త ఇబ్రాహీమ్ (అలైహిస్సలామ్) ఇచ్చిన పిలుపును చిన్నచూపు చూసిన బాబిలోనియా పాలకులు, పురోహితులు, పండితులు, కళ్ళు మూసుకుని ఆ దుర్మార్గుల అడుగులకు మడుగులొత్తిన ముష్రిక్ జనులు అందరూ ఈ లోకంలో పుట్టగతు ల్లేకుండా పోయారు. ఈ రోజు ప్రపంచంలో వారి నామరూపాల్లేవు.

అయితే –

దైవవాక్కు ఉన్నతికై నోరు విప్పాడన్న నేరంపై కాల్చిబూడిద చేసెయ్యాలని జనులు సంకల్పించుకున్న 'వ్యక్తి'ని మాత్రం అల్లాహ్ కీర్తిశేషునిగా మిగిల్చాడు. నాలుగు వేల సంవత్సరాలుగా ప్రపంచంలో అతని పేరు దేదీప్యమానంగా వెలిగిపోతోంది. ప్రళయం వరకూ వెలుగుతూనే ఉంటుంది. ప్రపంచంలోని ముస్లిములు, క్రైస్తవులు, యూదులు విశ్వప్రభువుకు 'ఖలీల్' (స్నేహితుడు) అయిన ఈ త్యాగమూర్తిని తమ నాయకునిగా ఆదరిస్తున్నారు. 40 శతాబ్దులుగా లోకానికి సన్మార్గ వెలుగు ప్రాప్త మయ్యిందంటే, అది ఆ మహా మనీషి ద్వారానే! ఆయన వంశంలో పుట్టిన సజ్జన సంతతి వల్లనే!! ఆయన అసాధారణ త్యాగాలకు పరలోకంలో మంచి ప్రతిఫలం ఎలాగూ లభిస్తుంది. అయితే ఇహలోకంలో కూడా ప్రపంచం వెనుక పరుగెత్తే వారెవ రికీ ప్రాప్తించని గౌరవోన్నతులు, కీర్తి ప్రతిష్టలు ఈ మహనీయునికి ప్రాప్తించాయి.

**ఏ ఖౌమ్ అప్నె బిరాహీమ్‌కి తలాష్‌మే హై**
**సనమ్ కదాహై జహా లా ఇలాహ ఇల్లల్లాహ్**

# 2

## దైవప్రవక్త హజ్రత్ యూసుఫ్ (అ)

# అత్యుత్తమ గాథ

## (అహ్‌సనుల్ ఖసస్)

### సౌశీల్యానికి, పవిత్రతా పారిశుద్ధ్యాలకు నిర్వచనం ఆయన!

స్థిత ప్రజ్ఞతకు, సమయ స్ఫూర్తికి నిలువెత్తుటద్దం ఆయన.

సంస్కరణా ప్రియుడు ఆయన!!

మానవ శ్రేయోభిలాషకు ప్రతిరూపం ఆయన!!!

ఎంతటి గడ్డు పరిస్థితిలోనయినాసరే ప్రజా ప్రయోజనాలకు, దేశ ప్రయోజనాలకు ప్రథమ ప్రాధాన్యతనిచ్చే మానవ రత్నాల రాశికి చెందిన మహోన్నత వ్యక్తి ఆయన!!!!

అయిన వారి అపరాధాలను పెద్ద మనసుతో మన్నించి ఔదార్యం కురిపించిన మానవతా మూర్తి ఆయన!!!!!

కానివారి కుయుక్తులను సయితం ఉపేక్షించి వారి హృదయాలను జయించిన ఉదాత్తుడు ఆయన!!!!!!

విషయం లోతుల్లోకిపోయి, అందలి మర్మాలను పసిగట్టి, పొంచి ఉన్న ప్రమాదాల గురించి సావధానపరచి, దేశాన్ని ఆర్థిక సంక్షోభాల సుడిగుండం నుండి గట్టెక్కించిన నిస్వార్థ సేవా పరాయణుడాయన!!!!!!!

అందుకే అంతిమ దైవప్రవక్త ముహమ్మద్(సఅసం) ఆయన గొప్పతనాన్ని కొనియాడుతూ 'కరీం ఇబ్నె కరీమ్ బిన్ కరీమ్ ఇబ్నె కరీమ్' గా ఖరారు చేశారు.

*(బుఖారీ – కితాబుల్ అన్బియా)*

మహాప్రవక్త(సఅసం) ఆయన గురించి ఇంకా ఇలా అన్నారు :

"ఆయన స్వయంగా ఒక ప్రవక్త. ఆయన తండ్రి ప్రవక్త. ఆయన తాత ప్రవక్త. ఆయన ముత్తాత కూడా ప్రవక్తే. ముత్తాత అగు ఇబ్రాహీమ్‌ను అల్లాహ్ తన నేస్తంగా చేసుకున్నాడు." *(బుఖారీ : కితాబుల్ అన్బియా)*

ఇంతకీ ఆయన ఎవరో ఈ పాటికి మీకు అర్థమయ్యే ఉంటుంది–

నాగరికతలో ముదిరిపోయిన ఈజిప్షియన్లకు నైతిక రీతినీ, దైవభక్తిని నేర్పిన 'కనాన్' కుర్రవాడు.

ఒక దైవప్రవక్తగా, దేశ పరిపాలకునిగా ఈజిప్టు చరిత్ర గతిని మార్చిన యుగ పురుషుడు.

కనాన్ ప్రదేశంలో పశువుల కాపరులుగా ఉన్న తన కుటుంబీకులకు (ఇస్రాయీలీయులకు) 'ఐగుప్త' దేశంలో 'ప్రవేశం' కల్పించిన మార్గదర్శకుడు.

'ఇస్రాయీల్'గా బిరుదాంకితుడైన మహనీయ యాకూబు (అలైహిస్సలామ్) గారి గారాల పుత్రుడు– ఆయనే హజ్రత్ యూసుఫ్ (అలైహిస్సలామ్).

## గుణపాఠం నిండిన గాథ

దైవప్రవక్త హజ్రత్ యూసుఫ్ (అలైహిస్సలామ్) వృత్తాంతాన్ని వివరించే పూర్తి అధ్యాయం ఒకటి దివ్యకుర్‌ఆన్‌లో ఉంది. 111 ఆయతులతో కూడుకున్న 'యూసుఫ్ అధ్యాయం' ఆద్యంతం మహనీయ యూసుఫ్ (అ) చుట్టూ తిరుగుతుంది. కుర్‌ఆన్‌లో వేరితర ప్రవక్తల జీవిత గాథలు, వారి సందేశాలు విడివిడిగా– సందర్భోచితంగా– వస్తాయి. కాని మహనీయ యూసుఫ్ (అ) వృత్తాంతం మాత్రం ఒకే సూరాలో వస్తుంది. అదీగాక అల్లాహ్ దీనిని **'అహ్సనుల్ ఖసస్'** (అత్యుత్తమ గాథ)గా పేర్కొన్నాడు. ఈ జీవిత గాథ పడి లేచే కెరటంలా, సాగర గర్భంలో మహెూత్తుంగ తరంగంలా ముందుకు సాగుతుంది. ఇందులో అడుగడుగునా హితవు ఉంది. గుణపాఠం ఉంది. స్ఫూర్తి ఉంది.

మహనీయ యూసుఫ్ (అలైహిస్సలామ్)కి– అంతిమ దైవప్రవక్త మహనీయ ముహమ్మద్(సఅసం)కి మధ్య సుమారు 24 శతాబ్దాల అంతరం ఉంది.

## అంతిమ దైవప్రవక్త(స) జీవితంతో సామ్యం

హజ్రత్ యూసుఫ్ (అ) ప్రవక్తల పితామహుడైన ఇబ్రాహీమ్(అ) గారి ముని మనవడైతే, మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఇబ్రాహీమ్(అ)కు ముని ముని ముని

ముని... మనవడు. ఒకరు ఇస్‌హాఖ్ (అ) సంతతి నుండి వచ్చిన వారైతే, మరొకరు ఇస్మాయిల్ (అ) సంతతిలో ప్రభవించినవారు.

ఒకరి కార్యక్షేత్రం సిరియా, పాలస్తీనా, ఈజిప్టు అయితే మరొకరి కార్యక్షేత్రం హిజాజ్, మక్కా మదీనాలు.

ఇబ్రాహీమ్ (అ) గారి ప్రార్థనా ఫలంగా మక్కాలో ప్రభవించిన ముహమ్మద్ (సఅసం)కి యూసుఫ్ (అ) గురించి ఏమాత్రం తెలియదు. పైగా ముహమ్మద్ చదువు రాని వ్యక్తి. ఆయన చరిత్ర గ్రంథాలు గానీ, యూదులు క్రైస్తవుల మత గ్రంథాలు గానీ చదవలేదు. మక్కా జీవితంలో ఆయన(స)కు యూదు విద్వాంసులతో తర్జన భర్జన చేసే అవకాశం కూడా లభించలేదు. అలాంటి ఒక వ్యక్తి మక్కాలో తనను చివరి ప్రవక్తగా ప్రకటించుకోవడం అరబ్బు ముష్రిక్‌లకు వింతగా తోచింది. అది వారికి నమ్మశక్యం కాలేదు. అగ్నికి వాయువు తోడైనట్లుగా అరేబియాకు చెందిన యూదులు ఉండుండి కొంగ్రొత్త ప్రశ్నాస్త్రాలు సంధించేవారు. అదీ ప్రత్యక్షంగా కాకుండా అరబ్బు బహు దైవారాధకులను అడ్డుగా పెట్టుకుని, వారి భుజాలపైనుండి మరీ సంధించేవారు. అలాంటి వాటిలో ఒకటి యూసుఫ్(అ) వ్యవహారం!

యూసుఫ్ (అ) ఎవరు? ఎచటి వారు? ఆయన జీవిత విశేషాలేమిటి? అసలు ఇస్రాయీల్ సంతతి వారు ఏవిధంగా ఈజిప్టు రాజ్యంలో అడుగు పెట్టారు? అని ముహమ్మద్(స)ను అడగండి. ఏం చెబుతారో చూద్దాం! అని కొంతమంది యూదు విద్వాంసులు మక్కాలోని సత్య తిరస్కారులను ఉసిగొల్పారు. అప్పుడు దేవుడు తన అంతిమ ప్రవక్త(స)పై సూరయె యూసుఫ్‌ను అవతరింపజేసి, దీనిని 'అత్యుత్తమ గాథ'గా అభివర్ణించాడు.

మక్కాలోని ఖురైషులు తమ పార్లమెంటు– దారున్నద్వా–లో ముహమ్మద్ (సఅసం)ను హతమార్చడానికి సమాలోచనలు సాగిస్తున్న కాలమది.

అలాంటి గడ్డు పరిస్థితులలో భూతకాలంలో జరిగిన ఈ వాస్తవిక గాథ ద్వారా వర్తమాన భవిష్యత్కాలాలలో చిట్టచివరి ప్రవక్తకు ఎదురయ్యే కఠిన పరీక్షలేమిటో సంకేత ప్రాయంగా తెలియపరచబడ్డాయి.

దారున్నద్వాలో జరిగిన కుట్ర నుంచి మహాప్రవక్త(స) సురక్షితంగా బయట పడటం,

సౌర్ గుహలో తలదాచుకోవటం,

మదీనా చేరుకుని సంస్కరణా కార్యానికి నడుం బిగించటం,

ఆయన(స) జాతికి చెందిన విశ్వాసులు మక్కా నుండి క్రమక్రమంగా మదీనాకు తరలిరావటం,

మదీనాలో దైవభీతి, పరలోక భీతి పునాదిగా ఒక సుస్థిరమయిన శ్రేయోరాజ్య స్థాపన జరగటం,

కరువు కాటకాల బారిన పడిన మక్కా ముష్రిక్కులు ఆయన(స) వద్దకు వచ్చి 'సుభిక్షం కొరకు ప్రార్థించండి' అని కడు దీనంగా అభ్యర్థించటం,

'మక్కా విజయం' సందర్భంగా మహాప్రవక్త(స) ఎదుట నిలబడిన శత్రువులు 'తమరు మా మంచి సోదరులు. మర్యాదస్తుడైన మా సోదరుని కుమారులు. తమరు మా యెడల ఉదార భావంతో మెలగుతారని ఆశిస్తున్నామ'ని నిస్సహాయులై క్షమాభిక్ష కోరటం,

"పొండి.  ఈ రోజు మీపై ఎలాంటి ఫిర్యాదూ లేదు. మీరంతా స్వతంత్రులు. అలనాడు నా సోదరుడు యూసుఫ్(అ) తన అన్నలతో వ్యవహరించినట్లే ఈ రోజు నేను మీ యెడల వ్యవహరిస్తాన"ని కారుణ్యమూర్తి ముహమ్మద్(స) అనటం–

ఇదంతా దేన్ని సూచిస్తోంది!?

మహనీయ ముహమ్మద్(స) తన వర్తమానాన్ని, భవిష్యత్తును ఈ 'దర్పణం'లో చూసుకున్నట్లే, శత్రువులు కూడా తమ పర్యవసానాన్ని ఈ అద్దమందు చూసుకుని ఉంటారు.

## బంగారు కొండ

సాధారణంగా జనులు నైతికంగా తమను నష్టపరిచే ప్రేమ ఘట్టాలు, సౌందర్య సన్నివేశాలున్న గాథల పట్ల ఎంతో మక్కువ కనబరుస్తారు. కాని ఈ యదార్థ గాథలో సౌందర్యం, ప్రేమ సన్నివేశాలు ఉన్నప్పటికీ వాటిలో మహనీయ యూసుఫ్(అ) సౌశీల్యం విశేషంగా తొణికిసలాడుతూ ఉంటుంది. గడ్డు కాలం వచ్చినప్పుడల్లా ఆయనలోని అత్యుత్తమ సహజ గుణాలు ఒక్కసారిగా ప్రస్ఫుటం అవుతుంటాయి. నిశిత దృష్టితో అధ్యయనం చేసేవారికి అవి అడుగడుగునా మార్గదర్శకంగా ఉంటాయి.

హజ్రత్ యూసుఫ్ (అ) బాహ్య సౌందర్యంతోపాటు ఆత్మ సౌందర్యం కూడా కలిగి ఉన్న బంగారు కొండ. అయితే ఆయనలోని అసలు సిసలు సౌందర్యం జీవితంలో ఎదురయ్యే కఠిన పరీక్షల సందర్భంగా ప్రస్ఫుటమయ్యేది. ఏక కాలంలో ఆయనలో ప్రస్ఫుటమయ్యే విజ్ఞత, బుద్ధి కుశలత, స్థితప్రజ్ఞత, ఉదాత్తత, సౌశీల్యం, మన్నింపు గుణం వేటికవే ప్రత్యేకం.

హజ్రత్ యూసుఫ్ (అలైహిస్సలామ్) గుణ శీలాన్ని అధ్యయనం చేసే ముందు మనం ఈ నేపథ్యాన్ని దృష్టియందుంచుకోవటం అవసరం.

## పిరమిడ్ల గడ్డపై పరిమళించిన 'కనాన్ పువ్వు'

చరిత్ర కూడా ఎంత విచిత్రమైనది!?

అది మంచి వారినీ తన పుటలలో పొందుపరుస్తుంది. చెడ్డ వారిని కూడా తనలో అంతర్లీనం చేసుకుంటుంది. చరిత్ర గ్రంథాలలో చరితార్థులూ ఉంటారు, కళంకితులూ ఉంటారు.

ఒక్కోసారి నిష్కళంకమైన వ్యక్తులకు చరిత్రకారులు కళంకం అంటగట్టే ప్రయత్నాలు కూడా చేస్తారు.



**ఈజిప్టులోని ప్రసిద్ధ పిరమిడ్లు**

ఒక్కోసారి చరిత్రకెక్కని చరితార్థుల చరిత్రను దేదీప్యమానం చేసే ఏర్పాటు దైవికంగా జరుగుతుంది.

అలాంటి ఒక చరితార్థుని చరిత్రే దైవప్రవక్త హజ్రత్ యూసుఫ్ (అలైహిస్స లామ్) చరిత్ర! అంతకుముందు అది చరిత్రకెక్కలేదని కాదు, ఎక్కింది. పాత నిబంధన లోని ఆది కాండం అధికాంశం యూసుఫ్(అ), ఐగుప్తీయుల చుట్టే పరిభ్రమిస్తూ ఉంటుంది. కాని అది కాలం వేసిన కళ్ళెంలో ఇరుక్కుని, స్వార్థపరులైన మతాధి పతులచే ప్రక్షిప్తాలకు లోనవటం వల్ల ఒక ప్రవక్త స్థాయికి శోభించని ఆక్షేపణీయ

మయిన అంశాలెన్నో అందులో జొరబడ్డాయి.

'ఇస్రాయీలీయులు ఈజిప్టు భూభాగంలో ఎలా ప్రవేశించారో ముహమ్మద్ (సఅసం)ని అడగండి' అని యూదు విద్వాంసులు మక్కా ముష్రిక్‌లను రెచ్చగొట్టి నపుడు వారు అనుకున్నదొకటైతే, అయింది మరొకటి. వారి ప్రశ్నకు సమాధానంగా విశ్వప్రభువు ఒకేసారి 'సూరయె యూసుఫ్' అంతటినీ అవతరింపజేసి, దానిని 'అహ్‌సనుల్ ఖసస్' (అత్యుత్తమమయిన వాస్తవ గాథ)గా ఖరారు చేశాడు. కాలచక్రపు మెట్టపల్లాలలో ఈ 'యదార్థ గాథ'కు తగిలిన కళంకాన్ని కూడా తుడిచేసి, పునీతం చేశాడు.

## వల్లాహు ఖైరుల్ మాకిరీన్

ఈ వాస్తవిక గాథ ద్వారా ఖుర్‌ఆన్ మనకు అవగతం చేసే మరో యదార్థం ఏమిటంటే–

అల్లాహ్ చెయ్యదలచుకున్న పని ఎట్టి పరిస్థితిలోనూ నెరవేరి తీరుతుంది. మనిషి తన ఉపాయాల ద్వారా ఆయన పథకాలను అడ్డుకోవటంలోనూ, వాటిని మార్చటంలోనూ ఎన్నడూ విజయం సాధించలేడు. పైగా మనిషి పలుమార్లు తన పథకం ప్రకారం ఒక పని చేస్తాడు. తాను గురి చూసి దెబ్బకొట్టానని అనుకుంటాడు. కాని ఫలితం మరో విధంగా తేలుతుంది. అతని పథకానికి వ్యతిరేకంగా, దేవుని పథకానికి అనుకూలంగా మనిషి చేత దైవం పని చేయించుకుంటాడు.

దైవం ఒకరిని పైకి లేవనెత్త దలిస్తే ప్రపంచమంతా కలిసి కూడా అతన్ని క్రిందికి పడవెయ్యజాలదు. అంతేకాదు, అతని పతనానికి అత్యంత ప్రభావవంతమయిన యుక్తిగా భావించి ప్రపంచం అవలంబించే విధానంలో నుంచే అల్లాహ్ అతని ఉత్థాన మార్గాలు తీసి పెడతాడు. అతన్ని పడతోయాలని కోరుకున్న వారి వాటాలో పరాభవం తప్ప మరేమీ మిగలదు. అదేవిధంగా దైవం ఎవరినయినా పతనానికి గురి చేయదలిస్తే వారిని ఎన్ని ఉపాయాలయినా చక్కదిద్దలేవు. పైగా చక్కబరిచే ఉపాయా లన్నీ విలోమంగా పరిణమించి, ఉపాయాలకు పాల్పడేవాడు ఎదురుదెబ్బలు తినాల్సి వస్తుంది.

## శీల సంపద ఉంటే...

ఈ గాథ ద్వారా లభించే అన్నింటికన్నా గొప్ప పాఠం ఇంకొకటి ఉంది :

ఒక విశ్వాసి (మోమిన్) నిజంగానే ఇస్లామీయ శీల స్వభావాలు కలిగి ఉంటే,

ఔచితీ విజ్ఞతలు కూడా అతనికి తోడై ఉంటే, కేవలం తన నైతిక ప్రవర్తన ద్వారా ఒక దేశం మొత్తాన్ని గెలవగలడు. యూసుఫ్ (అలైహిస్సలామ్)నే గమనించండి,

పదిహేడేళ్ళ ప్రాయం
ఒంటరి బ్రతుకు,
నిరాధార స్థితి,
కొత్త దేశం,
అధమాతి అధమ స్థితిలో
బానిసగా అమ్ముడు పోయారు.

ఆనాటి చరిత్రలో బానిసల స్థితిగతులేమిటో ఎవరికీ తెలియనివి కావు. పైగా ఒక తీవ్రమయిన నైతిక నేరారోపణ మీద జైల్లోకి తోయబడ్డారు. దానికి నిర్ణీత శిక్షా వ్యవధి కూడా లేదు. ఈ స్థితికి చేరిన తరువాత ఆయన కేవలం తన విశ్వాసం, నైతిక తల ఆధారంగా పైకి ఎదుగుతారు. కడకు దేశాన్నంతా లోబరుచుకుంటారు.

యూసుఫ్ (అ)ని బావిలో పడవేస్తున్నప్పుడు ఆయన సోదరులు, తాము తమ దారిలోని ముల్లును చిరకాలానికి గాను తొలగించుకుంటున్నామని అనుకున్నారు. కాని వాస్తవానికి వారు యూసుఫ్‌ను ఉన్నత శిఖరారోహణ కొరకు అతన్ని ప్రథమ సోపానాన నిలబెట్టారు. అల్లాహ్ ఆయన్ని చేర్చాలనుకున్నది కూడా అక్కడికే. వారు తాము చేసిన ఈ చేష్ట వల్ల తమ కొరకు సాధించుకున్నదేమీ లేదు. యూసుఫ్ (అ) ఉన్నత శిఖరాలను అధిరోహించిన తరువాత వారు గౌరవప్రదంగా తమ సోదరుని కలుసుకోవడానికి వెళ్ళే బదులు, అవమానం తలవంపుల లజ్జాభారంతో క్రుంగిపోతూ ఆ సోదరుని సమక్షంలో వినమ్ర శిరస్కులై నిలబడవలసి వచ్చింది.

★ ★ ★

నేటికి 3900 సంవత్సరాల వెనక్కిపోయి చూస్తే–

ప్రపంచ పటంలో ఈజిప్టు సామ్రాజ్యం సంస్కృతీ నాగరికతల కేంద్రంగా విరాజిల్లేది. అదే సమయంలో దాని చుట్టు ప్రక్కల ప్రదేశాలు నాగరికతకు ఆమడ దూరాన ఉండేవి. అక్కడి ప్రజలు పశువుల కాపరులుగా ఎడారి జీవితం గడిపేవారు. ఈజిప్టు సరిహద్దులకు అవతల ఉన్న ఒక ప్రదేశమే తరువాతి కాలంలో 'ఫలస్తీనా'గా ప్రసిద్ధి చెందింది. ఆ ప్రాంతంలో నివసించే తెగలలో ఒక తెగ దైవప్రవక్త హజ్రత్ ఇబ్రాహీమ్ (అలైహిస్సలామ్) కుటుంబీకులది.

నమ్రూద్ చక్రవర్తి నిరంకుశ నియంతృత్వ చర్యలకు తాళలేక దైవప్రవక్త ఇబ్రాహీమ్(అ) 'ఉర్' నగరం నుండి వలసపోయారు. జోర్డాన్, సిరియా, ఈజిప్టు తదితర ప్రాంతాలలో పర్యటిస్తూ ఆయన తన సందేశ ప్రధానమయిన కేంద్రాలు (దావా సెంటర్లు) అనేక చోట్ల స్థాపించారు. నేడు 'ట్రాన్స్ జోర్డాన్'గా పిలువబడుతున్న ప్రదేశంలో తన సోదరుని కుమారుడైన లూత్ (అలైహిస్సలామ్)ను నియమించారు. ఇబ్రాహీమ్ (అ) మాత్రం 'కనాన్'లో స్థిరపడ్డారు. మృత సముద్రానికి (Dead Sea) పశ్చిమాన ఉన్న ప్రదేశమే కనాన్. ఇబ్రాహీమ్(అ) కొరకు ఈ భూభాగం దేవుని తరఫున ఎంపిక చేయబడిన భూభాగమని తౌరాతు ద్వారా తెలుస్తోంది–

## శుభవంతమైన భూమి

"లోతు అబ్రామును విడిచిపోయిన తరువాత యెహోవా– ఇదిగో నీ కన్నులెత్తి నీవు ఉన్న చోటి నుండి ఉత్తరపు తట్టు, దక్షిణపు తట్టు, తూర్పు తట్టు, పడమర తట్టును చూడుము; ఎందుకనగా నీవు చూచుచున్న యీ దేశమంతటినీ నీకును, నీ సంతానమునకును సదా కాలము ఇచ్చెదను. మరియు నీ సంతానమును భూమి మీద నుండు రేణువుల వలె విస్తరింపజేసేదను. ఎట్లనగా ఒకడు భూమి మీద నుండు రేణువులను లెక్కింపగలిగిన యెడల నీ సంతానమును కూడా లెక్కింపవచ్చును"

*(ఆదికాండము– 13: 14–17)*

అంతిమ దైవగ్రంథమయిన ఖుర్‌ఆన్ సయితం అనేకచోట్ల ఈ శుభవార్తలను సంక్షిప్తంగా ప్రస్తావించింది. ఉదాహరణకు– అల్ బఖరా సూరాలోని 124వ ఆయతు, హూద్ సూరాలోని 71వ ఆయతు. ఈ శుభవార్తల సారాంశం ఇదే– అల్లాహ్ ఇబ్రాహీమ్(అ)ను వివిధ సముదాయాలకు సారథిగా, చక్రవర్తులకు పితామహునిగా, వంశాలకు మూల వృక్షంగా చేశాడు. ఈయన సంతతిలో శుభాలను పొందుపరిచాడు. వారు మార్గభ్రష్టతకు లోనుకాకుండా– రాచబాటపై నడిచినంత కాలం–ఈ వంశానికి దేవుని ఈ 'వాగ్దానం' వర్తించింది. అంటే దేవుని వాగ్దానం ఎట్టి పరిస్థితిలోనూ నెరవేరకుండా ఉండదు. కాకపోతే దేవుడు ఇబ్రాహీమ్(అ)కు చేసిన వాగ్దానం షరతుతో కూడుకున్నది– **'లా యనాలు అహ్‌దిజ్జాలిమీన్'** (అల్ బఖరా – 124)

ఒకానొక సందర్భంలో దైవప్రవక్త ఇబ్రాహీమ్(అ)కు తెలియజేయబడిన ఈ సమాచారం కూడా ఈ సందర్భంగా గమనార్హమే. తౌరాతులో ఇలా వుంది :

'నీ సంతతి వారు తమది కాని పరదేశమందు నివసించి, ఆ దేశపు వారికి దాసులుగా నుందురు. వారు నాలుగు వందల యేండ్లు వీరిని శ్రమ పెట్టుదురు.'

(ఆది కాండము– 15: 13,14)

హజ్రత్ ఇబ్రాహీమ్(అ)కు హాజిరా అనే భార్య ద్వారా హజ్రత్ ఇస్మాయీల్, సారా అనే భార్య ద్వారా హజ్రత్ ఇస్హాఖ్ జన్మించారు. ఇస్మాయీల్(అ) హిజాజ్ క్షేత్రంలో స్థిరపడగా, ఇస్హాఖ్ (అ) కనాన్ భూభాగంలో ఇబ్రాహీమ్ సంతతికి వారసులయ్యారు. ఇస్హాఖ్ (అ) గారికి యాఖూబ్(అ) పుట్టారు. ఆ కాలంలో కనాన్‌లోనూ, దాని పరిసర ప్రాంతాలలోనూ నివసించే వారంతా పల్లెటూరి బైతులుగానే జీవితం గడిపేవారు. పశువుల కాపరులుగా ఉండేవారు. పశు సంపద ద్వారా వచ్చే ఆదాయమే వారి జీవనాధారం.

## సామాజిక అసమానతలు

అయితే–

'కనాన్' ప్రాంతానికి బహు దూరాన ఉన్న ఈజిప్టు సంస్కృతీ నాగరికతలకు పుట్టినిల్లుగా భావించబడేది. పారిశ్రామికంగా, వైజ్ఞానికంగా, ఈజిప్టు రాజ్యం ప్రపంచంలోనే సాటిలేనిదిగా పరిగణించబడేది. తత్కారణంగా అక్కడి పౌరులు, ఇతరులకంటే తాము గొప్పవారమని, ప్రగతి శీలకులమని తలపోసేవారు. చుట్టుపక్కల రాజ్యాలలో నివసించే వారిని అల్పుల క్రింద జమ కట్టేవారు. ముఖ్యంగా కనాన్ ప్రాంతవాసులను వారు మరీ చులకనగా చూసేవారు. 'ఓయీ పశువుల కాపరీ!' అని వారిని సంబోధించేవారు. సదస్సులలో, సదనాలలో తమతో కలిసి కూర్చునే అర్హత వారికి లేదని అనుకునేవారు. కనాన్ ప్రాంతానికి చెందిన ఏ వ్యక్తి అయినా తమతో సహపంక్తి భోజనం చేయడం కూడా వారికి సహించేది కాదు.

"ఐగుప్తీయులు హెబ్రీయులతో కలిసి భోజనము చేయరు. అది ఐగుప్తీయులకు హేయము.' (ఆది కాండము– 43: 32)

ఆఖరికి ఈజిప్టులోని పల్లెటూరి ప్రజలు (సైదీలు) కూడా కనాన్ వాసులను తమతో కలిసి కూర్చోవటాన్ని, తమ గ్రామాలలో నివాసమేర్పరచుకోవటాన్ని ఇష్టపడేవారు కాదు.

అలాంటి వాతావరణంలో ఒక చిత్ర విచిత్రమయిన సంఘటన దైవికంగా జరిగింది. కనాన్‌లో నివసించే పల్లెటూరి తెగకు చెందిన ఓ నూనూగు మీసాల కుర్రవాడు తన ప్రమేయంగానీ, తన కాంక్ష గానీ లేకుండానే, తన ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండానే పిరమిడ్ల గడ్డపై అడుగు పెట్టాడు. అనతి కాలంలోనే అతను బ్రహ్మాండమయిన ఐగుప్త సామ్రాజ్యపు అధికార పగ్గాలను తన చేతుల్లోకి తీసుకోవ

టాన్ని ప్రపంచం తిలకించింది. ఈజిప్టు రాజ్యాధినేత మొదలుకొని ఒక సామాన్య పౌరుని వరకూ అందరూ అతని తరుణోపాయాల ముందు వినమ్రంగా తలవంచారు. అతను ప్రతిపాదించిన ప్రణాళికాబద్ధమైన ఆర్థిక విధానాలను 'జీ హుజూర్!' అంటూ పరిపాలనా యంత్రాంగం శిరసావహించింది. నిన్నటివరకూ పశువుల కాపరులంటూ చిన్న చూపు చూసిన మోస్ట్ సివిలైజ్డ్ పర్సన్సే ఈనాడు అతనిలోని శ్రేయోభిలాషా గుణానికి 'సలామ్' చేశారు.

ఇదంతా ఎలా సంభవమైంది? అంటే కనాన్ కొండ ప్రాంతంలో ఆ అబ్బాయి కన్న అద్భుతమైన 'కలే' దీనికి కారణం. ఇంతకీ ఏమిటా కల? అందలి మర్మం ఏమిటి? అతని సోదరులు అతనిపై ఎందుకంతగా అసూయ చెందారు? దాని పర్యవసానం ఏమైంది?

## ఈజిప్టులో బానిసగా అమ్ముడై....

'ఇస్రాయీల్'గా బిరుదాంకితుడైన హజ్రత్ యాఖూబ్ (అలైహిస్సలామ్) గారికి 12 మంది కుమారులు. బనీ ఇస్రాయీల్‌కి చెందిన 12 గోత్రాలు (శాఖలు) మున్ముందు ప్రసిద్ధి చెందినది ఈ 12 మంది అన్నదమ్ములతోనే. వీరంతా ఒకే తల్లి బిడ్డలు కారు, సవతి సోదరులు. అంటే యాఖూబ్ గారి నలుగురు భార్యలకు పుట్టిన వారు.

యూసుఫ్, బిన్ యామీన్‌లు మాత్రం ఒకే తల్లిబిడ్డలు– వీళ్ళిద్దరూ అందరికంటే చిన్నవారు. బిన్ యామీన్ పసితనంలో ఉండగానే తల్లి చనిపోవటం వల్ల దైవప్రవక్త యాఖూబ్ (అ) వారిద్దరినీ ప్రత్యేకంగా కనిపెట్టుకుని ఉండేవారు.

లేబ్రాయంలోనే యూసుఫ్‌లోని విశిష్ఠ గుణాలను పసిగట్టిన యాఖూబ్(అ)కు సహజంగానే ఆ అబ్బాయి పట్ల ప్రత్యేకమయిన శ్రద్ధాసక్తులు ఉండేవి. సవతి సోదరులు యూసుఫ్‌పై ఈర్ష్య చెందడానికి ఇది ప్రధాన కారణం. సవతి సోదరుల మధ్య ఇది సహజమే.

## యూసుఫ్ కన్న కల

ఒకరోజు యూసుఫ్ (అ) తన తండ్రితో, "నాన్నా! నేనొక కలగన్నాను. ఆ కలలో పదకొండు నక్షత్రాలు, సూర్యచంద్రులను చూశాను. అవి నాకు ప్రణమిల్లుతు న్నట్లు నేను చూశాను" అని చెప్పినప్పుడు, తండ్రి యాకూబ్ (అ)కు అందలి మర్మం అర్థమైపోయింది.

“నా ముద్దుల కన్నా! నాకు చెబితే చెప్పావుగాని, ఈ కల గురించి నీ సోదరులకు మాత్రం చెప్పకు. వాళ్ళు నీకు వ్యతిరేకంగా ఏదయినా కుట్ర పన్నవచ్చు. ఎందుకంటే మానవుని బద్ధ విరోధియైన షైతాన్ ఉండనే ఉన్నాడు” అని తన కుమారునికి హితబోధ చేశారాయన.

**“ఒరేయ్ చిన్నా! నీ ప్రభువు నిన్ను (తన కార్యం కొరకు) ప్రత్యేకంగా ఎన్నుకుంటాడు రా! విషయాలలోని వాస్తవికతకు చేరుకునే విద్యను నీకు నేర్పుతాడురా! నీ పూర్వీకులైన ఇబ్రాహీమ్ ఇస్‌హాఖ్‌లపై తన వరప్రసాదాలను పరిపూర్ణం గావించినట్లే నీపైన, యాఖూబ్ సంతతిపైన కూడా తన అనుగ్రహ భాగ్యాన్ని పూర్తిగావిస్తాడు రా! కచ్చితంగా నీ ప్రభువు గొప్ప విజ్ఞాన సంపన్నుడు, వివేచనా దురంధరుడు”** అంటూ ఆ కలలోని విషయాన్ని విడమరిచి చెప్పారు ఇస్రాయీల్, అదే యాఖూబ్ (అలైహిస్సలామ్).

పువ్వు పుట్టగానే పరిమళిస్తుందన్న దానికి ఒక తార్కాణం యూసుఫ్ (అ) కన్న కల. ఆ కల పీడకల కాదని, అది తన అభివృద్ధికి సంకేతంగా ఉన్న కల అని ఆయనకు చూచాయగా తెలిసిపోయింది. అయితే అందలి మర్మం ఏమిటో తెలుసుకోగోరి తన కన్న తండ్రిని సంప్రతించారు– అంతేగాని తన గొప్పతనాన్ని ఇతరుల ముందు చాటుకోలేదు. ఇది ఆయనలోని వినమ్రతకు, బుద్ధి కుశలతకు, సాధు స్వభావానికి మచ్చుతునక– తండ్రిని సంప్రతించటం వల్ల జరిగిన మేలు ఏమిటంటే, **‘ఈ సంగతి ఎవరికీ చెప్పకు’** అన్న ఒక అమూల్యమైన సలహా లభించింది. ప్రతిభ కలవారిని షైతాన్ అదే పనిగా వెంటాడుతూ ఉంటాడన్న హెచ్చరిక కూడా తండ్రి మాటల ద్వారా అందింది.

సరే, ఇక జరిగిందేమిటో కూడా చూడండి!

## అసూయాగ్ని రాజుకున్న వేళ...

తండ్రి అనుమానం నిజమయింది. యూసుఫ్‌పై ఆయన కురిపిస్తున్న అమితమయిన పుత్ర వాత్సల్యాన్ని చూసి యూసుఫ్ అన్నలు ఓర్చుకోలేకపోయారు. తామంతా ఒక బలమైన జట్టుగా ఉన్నప్పటికీ ఈ ముసలి తండ్రి యూసుఫ్‌పైనే, అతని సోదరుడైన బిన్ యామీన్‌పైనే ఎందుకంతగా వాత్సల్యం కనబరుస్తున్నాడు? నిజానికి ఆయన గారికి మతిభ్రమించినట్టుంది! ఇక లాభం లేదు. యూసుఫ్‌ను హతమార్చటమో లేక అతన్ని ఎక్కడయినా పారవేయటమో చెయ్యాలి. అలా చేస్తేనే గాని మన తండ్రి వాత్సల్యానికి మనం నోచుకోలేము. ఇలా చెయ్యటం పాపమే. కాని ఏం చేస్తాం?

చెయ్యక తప్పదు. ఈ ఒక్క పని కానిచ్చి ఆ తరువాత మంచివాళ్ళుగా మెలగుదాము అని కూడబలుక్కున్నారు.

★ ★ ★

సాధారణంగా మనిషి మంది మార్బలం ఉన్న ముఠానే అభిమానిస్తాడు. దాని పంచన చేరితే తాను సర్వవిధాలా సురక్షితంగా ఉంటానని అనుకుంటాడు.

## మాతాపితల మమకారం

కాని తల్లిదండ్రుల విషయం తద్భిన్నం. వారిలో సంతాన వాత్సల్యం అణువణువునూ పెనవేసుకుని ఉంటుంది. అందులోనూ తమ పిల్లల్లో ఎవరయినా శారీరకంగా బలహీనులు, అంగవైకల్యం కలవారుంటే, సద్గుణ సంపన్నులై ఉంటే– వారిపై వాత్సల్యం మరింతగా ఉప్పొంగుతుంది. ఆ పిల్లల అశక్తత, నిస్సహాయ స్థితి కారణంగా వారి జాలి గుండెలు మరింతగా ద్రవిస్తాయి. హజ్రత్ యూసుఫ్ (అ)లోనూ, ఆయన తమ్మునిలోనూ ఈ రెండు విషయాలూ కూడి ఉన్నాయి. అందుకే యాఖూబ్(అ) ఆ పసివాళ్ళను ప్రత్యేకంగా గమనిస్తూ ఉండేవారు. వాస్తవానికి అందులో పక్షపాతం గానీ, రాగద్వేషాలు గానీ ఏమీ లేవు. నిజానికది సహజ భావనే. ఏ తల్లిదండ్రుల్లో అయినా అది ఉండేదే. కాని యాఖూబ్ కొడుకులు మాత్రం దానిని తప్పుగా అర్థం చేసుకున్నారు. తప్పంతా తమ తండ్రిదే అనుకున్నారు. ఒక తండ్రికి 20 ఏళ్ళ కుమారుడు, రెండు మూడేళ్ళ కుమారుడు కూడా ఉన్నప్పుడు అతను రెండేళ్ళ పసివాడినే ఎత్తుకుంటాడు. అతన్ని ముద్దాడుతాడు. ఆ పసివాడు ఏడిస్తే జోలపాట పాడతాడు. లాలిపాట పాడతాడు. ఉయ్యాల లూపుతాడు. అంతమాత్రాన 20 ఏళ్ళ కుమారునిపై అతనికి పుత్ర వాత్సల్యం లేదని అర్థం ఎంతమాత్రం కాదు.

**"ఈ ఒక్క పనీ కానిచ్చి, ఆ తరువాత బుద్ధిమంతులుగా మెలగుదాం"** అని యాఖూబు కొడుకులు చెప్పటం ఈ సందర్భంగా గమనార్హం. షైతాన్ మనిషిని మోసపుచ్చే పద్ధతుల్లో ఇదొకటి. నేర ప్రవృత్తికి అలవాటు పడని వారిలో– ఎన్ని అసూయా ద్వేషాలున్నప్పటికీ– అంతర్యంలో సత్యాగ్ని కణం, దైవభీతి మిగిలి ఉంటాయి. అలాంటి వారు తప్పు చేయడానికి ఊగిసలాడుతున్నప్పుడు, 'ఎందుకు జంకుతారు? పశ్చాత్తాప (తౌబా) ద్వారం ఎలాగూ తెరచుకునే ఉంది కదా! ఈ ఒక్క తప్పు చేసేసి, ఇక మీదట సజ్జనులుగా జీవితం గడపవచ్చు. సంకోచమేలా?' అని షైతాన్ బుజ్జగిస్తాడు. అంతే, మనిషి ధైర్యం తెచ్చుకుంటాడు. దుస్సాహసానికి పూనుకుంటాడు.

యూసుఫ్ అన్నలకు షైతాన్ నూరిపోసింది కూడా ఇదే.

అన్నదమ్ములంతా కలిసి ఈ కుట్ర పన్నుతుండగా వారిలోని ఒక సోదరుడు, 'వద్దొద్దు. యూసుఫ్‌ను చంపకండి. ఒకవేళ ఏదన్నా చెయ్యాలనే అనుకుంటే అతన్ని ఏదయినా పాడుబడిన బావిలో పడవెయ్యండి. ఆ మార్గంలో రాకపోకలు సాగించే బిడారు ఏదో ఒకటి అతన్ని తీసుకుపోతుంద'ని సలహా ఇచ్చాడు. యూసుఫ్ పట్ల కాస్తో కూస్తో జాలి హృదయం కలవాడతను. అంటే అతనిలో ఎంతో కొంత దైవభీతి ఉండేది. బహుశా అతను యాఖూబు గారి పెద్ద కుమారుడై ఉంటాడని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) అభిప్రాయపడ్డారు.

## అందమైన అబద్ధం

యూసుఫ్‌ను ఏదన్నా చెయ్యాలనే అనుకుంటే ఆ ఊళ్ళో ఏమీ చెయ్యలేరు. అతన్ని అక్కణ్ణుంచి మరో ప్రదేశానికి తీసుకెళ్ళాలి. దానికోసం వారు బాగా ఆలోచిస్తే ఒక ఉపాయం తోచింది. ఆ ఉపాయం కూడా వారు చెప్పబోయే అబద్ధానికి అతికి నట్లుగానే ఉంది. ఆ పది మంది అన్నదమ్ములు ఒక్కటై,

'నాన్నగారూ! యూసుఫ్ విషయంలో మీరు మమ్మల్ని బొత్తిగా నమ్మరేమిటి? నిజానికి మేము అతని బాగోగులను కోరుకునేవారము. అతను మాకెంతో ప్రియతముడు. మేమొక పిక్‌నిక్ ప్రోగ్రాం తయారు చేసుకున్నాం. మీరతన్ని మా వెంట పంపండి. అతను కూడా మాతోపాటే హాయిగా ఆడుకుంటాడు. ఆ పండూ ఈ పండూ ఆరగిస్తాడు. ఖులపాటం తీర్చుకుంటాడు. అతని గురించి మీరేమీ భయపడాల్సిన అవసరం లేదు. ప్రమాదాల బారిన పడకుండా అతన్ని చూసుకోవటానికి మేమున్నాము కదా!' అంటూ తండ్రికి అందమైన 'హరిత వనం' చూపెట్టారు.

ఈజిప్టులోని ఒక పిక్నిక్ స్పాట్



(ఎడారి ప్రాంతాలలో నివసించే మిడిల్ ఈస్ట్ ప్రజలకు పిక్నిక్ అన్నా, వన భోజనమన్నా ఎంతో మక్కువ. దానిని వారు 'రెహ్లో' అంటారు. చలికాలంలోనైతే ఊరికి దూరంగా ఎడారుల్లో గుడారాలు వేసుకుని వారాల తరబడి అక్కడే ఉంటుంటారు. కళ్ళు చెదిరే ఎయిర్ కండీషనింగ్ భవనాలలో నివసించే అరబ్బులు వారం పది రోజుల కన్నా ఎక్కువగా తమ ఇండ్లల్లో ఒకచోట ఉండరు. ఏదో ఒక వంకతో వారు 'బర్'లో ఉండే తమ 'మజ్రా'లకో, వ్యవసాయ క్షేత్రాలకో వెళ్ళి క్యాంప్ చేస్తూ ఉంటారు. వరుసగా రెండేసి మూడేసి రోజులు అక్కడే వారి విందులు, వినోదాలు. ఆ విధంగా బడలిక తీరిన మీదటే తమ స్వగృహాలకు తిరిగి వస్తుంటారు)

## తండ్రి ఆందోళనకు కారణం

తండ్రి యాఖూబ్(అ) మాత్రం తన పుత్ర రత్నాన్ని వారి వెంట పంపడానికి సుముఖంగా లేరు. మరి చూడబోతే యూసుఫ్ మరీ చిన్న పిల్లాడేమీ కాదు. పదహారేళ్ళ ప్రాయంలో ఉన్నారు. కాని దూరదృష్టి కల తండ్రిగా యాఖూబు భయాలు యాఖూబ్‌కు ఉన్నాయి. యూసుఫ్ పట్ల వారి శ్రద్ధాసక్తులు ఏ పాటివో ఆయనకు తెలియనివి కావు. కాని ఆ మాట వారికి నేరుగా చెప్పకుండా, మరో విధంగా ఇలా అన్నారు :

"నాకెందుకో భయంగా ఉంది. మీరతన్ని తీసుకెళతాననటం బాగానే ఉంది గాని మీరు మీ క్రీడల్లో వినోదాల్లో లీనమై పరధ్యానంలో ఉండగా ఏదయినా తోడేలు లాంటి మృగం వచ్చి అతన్ని తినేయవచ్చు. ఆనక బాధపడి లాభమేమిటి?"

'పితాశ్రీ! మేమింత మందిమి– ఒక జట్టుగా– ఉండగా తోడేలు వచ్చి అతన్ని తినటమా! అదే గనక జరిగితే మేము దేనికీ పనికిరాని చవటలమే అవుతాము' అని కొడుకులు ధీమాగా చెప్పారు.

కుమారులు ఇంత గట్టిగా కోరటం వల్ల– తనకిష్టం లేకపోయినా– యాఖూబ్‌కు అంగీకరించక తప్పలేదు.

సవతి సోదరులు అనుకున్నంత పనీ చేసేశారు. తమ్ముడు యూసుఫ్‌ను ఒక పాడుబడిన బావిలో పడవేశారు. ఆ విధంగా వారు ఇక్కడ భూమండలంపై అతని పతనాన్ని శాసిస్తుంటే, అక్కడ ఊర్ధ్వలోకాలలో ఆ అబ్బాయిని ఉన్నత శిఖరాలకు చేర్చే వ్యూహరచన జరుగుతోంది–

'(యూసుఫ్!) నీవు ఆందోళన చెందవలసిన పని లేదు. దేవుడు నిన్ను వృథా గావించడు. ఆయన నీకు ఉన్నత స్థానాలు ప్రసాదిస్తాడు. నీ అన్నలు ముష్టెత్తుకుంటూ

నీ దగ్గరకు ఏతెంచే రోజు రానున్నది. అప్పుడు వారు నిన్ను గుర్తు పట్టరు. నువ్వు వాళ్ళ దాష్టీకాన్ని ఎత్తి చూపుతావు. వాళ్ళు ఆశ్చర్యపోతారు. సిగ్గుతో కుంచించుకుపోతారు' అనే విషయాన్ని అల్లాహ్ యూసుఫ్(అ) ఆంతర్యంలో ప్రేరేపించాడు.

## అన్నలు అల్లిన కట్టుకథ

పొద్దుగూకే సమయానికి వాళ్ళంతా తండ్రి వద్దకు ఏడుస్తూ వచ్చారు. 'నాన్నా! మేము పరుగు పందెంలో పడి ఉండగా తోడేలు వచ్చి యూసుఫ్‌ను తినేసింది. మేము నిజం చెప్పినా మీరు మా మాటను నమ్మకపోవచ్చు. కాని జరిగింది మాత్రం ఇదే' అంటూ నమ్మబలికారు. దానికి సాక్ష్యాధారంగా యూసుఫ్ చొక్కాకు నకిలీ నెత్తురు అంటించారు.

తౌరాతులో ఉన్న వివరాల ప్రకారం యూసుఫ్ (అ) అన్నలు ఒక మేక పిల్లను కోసి, దాని రక్తంలో యూసుఫ్(అ) చొక్కాను ముంచి, ఆ చొక్కాను తండ్రికి చూపించగా, తండ్రి యాఖూబు దానిని గుర్తుపట్టి, దుష్ట మృగము వానిని తినివేసేనని, నిశ్చయముగా యూసుఫ్ చీల్చబడెనని యాఖూబు అంటాడు. (చూడండి : ఆది కాండము– 37: 32,33). కాని ఖుర్‌ఆన్ ప్రకారం దైవప్రవక్త యాఖూబ్ తన దూర దృష్టి, దార్శనికత (రూయ, విజన్) ఆధారంగా, కొడుకుల దౌష్ట్యాన్ని పసిగట్టేశారు. "మీ ఆంతర్యం ఒక దారుణమైన కృత్యాన్ని మీకు సులభతరం చేసేసిందిరా" అని చెప్పనే చెప్పారు. "సరే, ఇక చేసేదేముంది? ఓర్పు వహిస్తాను. అత్యుత్తమ రీతిలో ఓపిక పడతాను. మీ కల్పనపై దైవ సహాయాన్ని అర్థించటం వినా నాకు మార్గాంతరం లేద"ని కూడా చెప్పారా వృద్ధ తండ్రి.

కట్టుకథలు అల్లేవారు ఎక్కడో ఒకచోట తప్పటడుగు వేయకుండా ఉండరు. చొక్కాను రక్తంలో ముంచితే చాలన్న ఐడియా మాత్రం వారికి వచ్చింది గాని, చొక్కాను చించాలన్న ధ్యాసే వారికి లేకపోయింది. తోడేలే గనక యూసుఫ్‌ను చీల్చి చెండాడి ఉంటే, అతని చొక్కాను కూడా ఎడాపెడా చించి (చీల్చి) ఉండాల్సింది. ఆ అంగీని చూడగానే తండ్రి యాఖూబు (అ) గారి అనుమానం మరింత బలపడింది. అదీగాక తన పుత్రరత్నం యూసుఫ్(అ) కన్న కల ఏ విధంగా పరిణమించనున్నదో కూడా ఆయనకు తెలుసు. అందుకే ఆయన ఈ వ్యవహారాన్నంతటినీ దైవాధీనం చేశారు.

★ ★ ★

ఇక్కడ కనాన్‌లో హజ్రత్ యాఖూబ్ పరిస్థితి ఇలా ఉండగా అక్కడ ఎడారిలో అందాల యూసుఫ్(అ) పడవేయబడిన బావి వైపునకు– దారి తప్పి వచ్చింది ఓ

బిడారు. నీళ్ళు తోడుకొని రమ్మని ఆ బిడారు జనులు ఒక వ్యక్తిని పంపగా, ఆ వ్యక్తి బావిలో చేద వేయగానే, దాన్ని పట్టుకున్న అందమైన అబ్బాయిని చూసి ఆనందంతో ఎగిరి గంతేశాడు. యూసుఫ్(అ) కూడా సంతోషించారు – బహుశా తన అన్నలకు తనపై జాలేసి, తనను బావి నుండి బయటికి తీయడానికి చేద వేశారనుకున్నారు. వెంటనే ఆ చేదను పట్టుకున్నారు.

కాని ఆ విముక్తి క్షణికమైన విముక్తి మాత్రమేనని ఆ అబ్బాయికి అప్పుడే అర్థమై



**ఈజిప్టులోని అందమైన ప్రాచీన ప్రదేశాలలో ఇదొకటి**

పోయింది. ఒక గండం నుండి గట్టెక్కానని అనుకుంటుండగానే అన్నలు అతన్ని మరో గండంలోకి నెట్టేశారు. యూసుఫ్(అ) తమ నుండి పరారై వచ్చిన బానిస అని అబద్ధం చెప్పి బిడారు జనులకు ఆయన్ని అమ్మివేశారు. ఆ విధంగా యూసుఫ్ (అ) ఒక కొనుగోలుదారుల నుండి మరో కొనుగోలుదారులకు అమ్ముడుపోయేందుకు ఈజిప్టు సంతకు తేబడ్డారు. అదీ ఎటువంటి బానిస!? అత్యంత చవుక ధరకు అమ్ముడుపోయిన బానిస. ఎందుకంటే వర్తక బిడారుకి అతి తక్కువ ధరకే ఆ అబ్బాయి లభించాడు. కాబట్టి వాళ్ళు అతని మూల్యం విషయంలో భేషజాలకు పోలేదు. వచ్చిన మటుకే చాలనుకున్నారు.

ఇంతకీ ఆ అందాల యూసుఫ్(అ)ను కొనుగోలు చేసినదెవరు? యూసుఫ్(అ) విషయంలో అతను అనుకున్నదేమిటి? అయిందేమిటి?

★ ★ ★

యూసుఫ్ (అ) కేవలం 'సాలెహ్' మాత్రమే కాదు, 'ముస్లెహ్' కూడా!
ఆయన కేవలం 'నాసెహ్' మాత్రమే కాదు, 'నాఫె' కూడా!
శీల సంపన్నునిగా,
సంస్కరణా ప్రియునిగా,
శ్రేయోభిలాషిగా,
ప్రజోపయోగకునిగా

ఈజిప్టు అధికారి ప్రాసాదంలో అడుగు పెట్టినప్పుడు ఆయన పొజిషన్ ఏమిటి? కేవలం ఇరవై దిర్హములకు అమ్ముడుపోయిన బానిస!

## ప్రతిభకు పట్టం

కేవలం ఆ అబ్బాయి అందాన్ని చూసి కొనుగోలు చేసిన ఈజిప్టు అధికారి, ఆ తరువాత అతనిలోని బుద్ధికుశలతకు, నిజాయితీ తత్పరతకు, విషయావగాహనకు ముగ్ధుడై తన దివాణపు పర్యవేక్షణాధికారాలన్నీ అతనికి కట్టబెట్టాడు. అజీజె మిస్ర్ ప్రధాన సైన్యాధికారి అనీ, అతని అసలు పేరు పోతిఫార్ (Potiphar) అనీ తౌరాతులో ఉంది (ఆది కాండము–37: 36). హజ్రత్ యూసుఫ్ (అలైహిస్సలామ్) గారి పరిపాలనా దక్షత మూలంగా, ఆదాయ వ్యయాలను ఆయన క్రమబద్ధీకరించిన తీరుతెన్నుల కారణంగా పోతీఫారు రాబడి రెట్టింపు అయిందని కూడా తౌరాతు ద్వారా తెలుస్తోంది. *(ఆది కాండము– 39 : 4)*

దివ్యఖుర్ఆన్ ఈ వ్యవహారమంతటినీ ఒక చిన్న వాక్యంలో ఎంతో సమగ్రంగా, మరెంతో మనోజ్ఞంగా చెప్పేసింది. ఈజిప్టు అధికారి తన భార్యనుద్దేశించి ఇలా అంటాడు :

**'ఇతన్ని సాదరంగా చూసుకో. ఇతని వల్ల మనకు ప్రయోజనం చేకూరవచ్చు. లేదా మనం ఇతన్ని (దత్త) పుత్రునిగానయినా చేసుకోవచ్చు.' (యూసుఫ్– 21)**

## కాగల కార్యం కొరకు...

ఆ విధంగా యూసుఫ్ (అ) జీవితం కొత్త మలుపు తిరిగింది. ఈజిప్టు అధికారి ఆయన్ని ఒక బానిసగా కాకుండా తన ఆంతరంగిక వ్యవహారాల అధికారిగా చూశాడు. ఆయన్ని నమ్మాడు. ఆయన సలహాలను స్వాగతించాడు.

ఈ విధంగా కనాన్‌లో పుట్టి, అన్నల చేత బావిలో పడవేయబడిన యూసుఫ్ (అ)ను దేవుడు ఈజిప్టు రాజ్యానికి చేర్చటమేగాక, ఆనాటి అత్యంత నాగరిక దేశమైన

ఈజిప్టులో నిలదొక్కుకునేందుకు మార్గం సుగమం చేశాడు. ఎందుకంటే విషయాల లోతుల్లోకి పోయే విద్యలో యూసుఫ్(అ) నిష్ణాతుడు కావాలంటే, దానికి తగిన వాతావరణం కూడా ఉండాలి. మాణిక్యాన్ని ఏ మూలన పడవేసినా అది మెరుస్తుంది. పరిసరాలను ప్రకాశమానం చేస్తుంది. కాని ఆ మాణిక్యం ద్వారా ప్రజా బాహుళ్యానికి ప్రయోజనం ఇతోధికంగా చేకూరాలంటే, దానిని చక్రవర్తుల, అధికారుల అంత:పుర వేదికలపై ఆవిష్కరించాల్సిన ఆవశ్యకతా ఉంటుంది. అల్లాహ్ కావలసిన కార్యాన్ని ఎలాగయినాసరే నెరవేర్చుకుని తీరుతాడు. కాని చాలామంది ఈ విషయాన్ని గ్రహించరు.

హజ్రత్ యూసుఫ్ శిక్షణ అప్పటివరకూ ఎడారిలో– దాదాపు దేశదిమ్మరుల వాతావరణంలో– పశువుల కాపరిలాంటి స్థితిలో జరిగింది. కనాన్ ప్రాంతంలో ఆనాడు సంఘటిత రాజ్యమూ లేదు. నాగరికతా సంస్కృతులు పెద్దగా ప్రగతి సాధించ లేదు. కాకపోతే అక్కడ కొన్ని స్వతంత్ర తెగలుండేవి. అవి అప్పుడప్పుడూ వలస పోతుండేవి. కొన్ని తెగలయితే విభిన్న ప్రాంతాల్లో శాశ్వత నివాసాలు ఏర్పరచుకుని చిన్న చిన్న రాజ్యాలు స్థాపించుకున్నాయి. అక్కడ యూసుఫ్‌కు లభ్యమయిన బోధనా శిక్షణలలో అరేబియా పల్లెవాసుల జీవితంలోని మేళ్ళూ, మహనీయ ఇబ్రాహీమ్(అ) వంశావళిలోని దైవభక్తి, ధార్మికత కలగలిసి ఉన్నాయి. కాని ఆనాటి అత్యంత నాగరిక దేశమైన ఈజిప్టులో అల్లాహ్ ఆయన చేత చేయించదలచిన మహా కార్యానికి కావలసిన తెలివిడి, అనుభవం, అంతర్ దృష్టి– ఇత్యాదివి వికసించే అవకాశమేదీ ఆయనకు పల్లె జీవితంలో ప్రాప్తం కాలేదు. అందువల్ల అల్లాహ్ తన శక్తిచేత ఈ ఏర్పాటు కూడా చేశాడు. ఈయన్ని ఈజిప్టు సామ్రాజ్యానికి చెందిన ఒక గొప్ప హోదా గల వ్యక్తి ఇంట చేర్చాడు. అతను ఆయనలోని అసాధారణ ప్రజ్ఞాపాటవాలను చూసి ఆయన్ని తన ఇంటికే, తన యావదాస్తికే సర్వాధికారిగా చేశాడు. తత్ఫలితంగా, ఇప్పటివరకూ ఉపయోగంలోకి రాలేకపోయిన ఆయనలోని శక్తిసామర్థ్యాలన్నీ– పూర్తి స్థాయిలో పరిపక్వత చెందే అవకాశం ఆయనకు దొరికింది. ఆ విధంగా ఆయనకు మొదటి దశలో– ఒక చిన్న జాగీరును నిర్వహించే అనుభవం వచ్చింది. ఆ తరువాత ఒక పెద్ద సామ్రాజ్యాన్ని పరిపాలించేందుకు అవసరమయిన అనుభవమది!

అప్పటివరకూ పెట్టిన పరీక్షలలో ఆయన నికార్సుగా నెగ్గుకు వచ్చిన కారణంగా దేవుడు ఆయనకు నిర్ణయశక్తిని ప్రసాదించాడు. విజ్ఞానాన్ని వొసగాడు. దైవప్రవక్తగా ఆయన్ని ఎన్నుకున్నాడు. దాంతో ఆయనలోని సద్గుణాలు, ప్రతిభాపాటవాలు మరింత ఉజ్వలమయ్యాయి.

**"ఈ విధంగా మేము సదాచార శ్రేష్ఠులకు (వారి సదాచరణకు గాను) ఉత్తమ ప్రతిఫలం ఇస్తూ ఉంటాము"** ***(యూసుఫ్ : 22)***

# భావోద్రేకాల పరీక్ష

సూరయె యూసుఫ్ 23వ వచనం నుండి హజ్రత్ యూసుఫ్(అ)కు మరో రకమయిన పరీక్ష ఎదురయింది. ఈ పరీక్ష మొదటి పరీక్ష కన్నా కఠినమైనది. తన అందచందాల రీత్యా, సౌశీల్యం దృష్ట్యా, బుద్ధికుశలత రీత్యా 24 క్యారెట్ల బంగారం లాంటి ఆ నవ యువకునిపై ఈజిప్టు అధికారి భార్య కన్నేసింది. ఆయన్ని కవ్వించ సాగింది... ఆయనపై వలలు వేయసాగింది. చూడబోతే వయసులో ఆమె యూసుఫ్ (అ) కన్నా చాలా పెద్దది. అతనికి మర్యాద ఇవ్వమని, భవిష్యత్తులో అవసరమైతే అతన్ని దత్తపుత్రునిగా చేసుకుందామని ఆమె భర్త ఆమెతో చెప్పి ఉన్నాడు. కాని ఇప్పుడు ఆమె ఆలోచనలు పెడదారి పట్టాయి. ఆయన సౌందర్యానికి ముగ్ధురాలై ఆయనపై మనసు పారేసుకుంది. ఆయన్ని పిచ్చిగా ప్రేమించింది.... కాదు మోహించింది. ఆయన కోసం పడి చావసాగింది. తల్మూద్‌లో ఆ స్త్రీ పేరు జలీఖా (Zelicha) అని ఉంది. ఆమె సాధారణ స్త్రీ కాదు. అత్యున్నత అధికారి భార్య అయి వుండి తన అంత:పురంలో ఒక బానిసగా అడుగుపెట్టిన వ్యక్తిని మరులుగొల్పటం మొదలెట్టిన నెరజాణ. బరి తెగించిన ఆడదానికి వావి వరుసలు ఉండవు. అంతస్తు గురించి అసలే పట్టింపు ఉండదు. సిగ్గూ ఎగ్గూ ఏమీ ఉండదు. అవును, ***'కామా తురాణాం న భయం న లజ్జ'.***

మరోవైపు మోహించబడిన వ్యక్తి పరిస్థితిని చూడండి! ఆయన ఆమె ఇంట్లోని సేవకుడు. కొద్దిపాటి సొమ్ముకు కొనుగోలు చేయబడిన బానిస. కనుసైగలతో తనపై అధికారం చెలాయించగల యజమానురాలి చేతిలో బందీగా ఉన్న నౌకరు. పరువం ఉరకలు వేసే వయసులో ఉన్న వ్యక్తి. ఇంతకుముందు ఆ పసివాడు ఎదుర్కొన్న పరీక్ష రాగద్వేషాల పరీక్ష అయితే ఇది భావోద్రేకాల పరీక్ష. ఒక మనిషి పాలిట అత్యంత కఠినమయిన పరీక్ష ఏదంటే అది భావోద్రేకాల పరీక్షే. అందులోనూ యవ్వనంలో ఉన్న మనిషి తన లైంగిక వాంఛలకు పగ్గం వేయటం అంత తేలిక కాదు.

అతను కడలి కెరటాలకు ఎదురీదగలడు.

పర్వత శిఖరాలను అధిరోహించడానికీ వెనుకాడడు.

ఆకాశ గర్జనలకు, ఉరుముల మెరుపులకూ భయపడడు.

బలిష్టమైన ఎనుబోతులతో తలపడటానికి కూడా వెనుకంజ వేయడు.

క్రూరమృగాలను వేటాడటానికీ జంకడు.

ఖడ్గాల నీడలో విన్యాసాలు చేయడానికీ, కత్తి మీద సాము చేయడానికి కూడా వెరవడు.

కాని–

భావోద్రేకాల ముందు వివశుడైపోతాడు.

తన మనసులో మగువ రేపే చిన్న అలజడికి కూడా తట్టుకోలేడు. వలచి వచ్చిన వయ్యారి భామ వాలు చూపులకు ఉక్కిరిబిక్కిరై పోతాడు. కైపులో తేలిపోతాడు. కరిగిపోతాడు. అతని ఊహలకు ఒక్కసారిగా రెక్కలొచ్చేస్తాయి. కోర్కె కదము తొక్కుతుంది. అతని అడుగులు తడబడతాయి.

అయితే–

మహనీయ యూసుఫ్ (అ)లోని సౌశీల్యపు శిల ఇక్కడ కూడా ఏమాత్రం చలించలేదు. పైగా అది మరింత కుందనంలా, మేలిమి బంగారంలా మెరిసి పోయింది.

ఒకరోజు ఇంట్లో భర్త లేని సమయంలో ఆ స్త్రీ తలుపులు మూసేసి యూసుఫ్ (అ)తో రమించడానికి సిద్ధమయింది. యూసుఫ్(అ)ను బలవంతం చేయసాగింది. ఆ సమయంలో యూసుఫ్(అ) పలికిన మాటలు నవతరానికి మహోత్కృష్ట మంత్రం వంటివి. ముఖ్యంగా తమ యజమానుల దగ్గర డ్రైవర్లుగా, ఆంతరంగిక కార్యదర్శులుగా, సేవకులుగా, గుమాస్తాలుగా, బాడీగార్డులుగా, ఆఫీస్ బాయ్‌లుగా పనిచేసే యువకులకు ఆ పలుకులు స్ఫూర్తిదాయకమే కాదు, మేల్కొలుపు కూడాను.

## ఆ మాట... మహనీయుని నోట

'రా...రమ్మ'ంటూ మీదకొస్తున్న యజమానురాలితో యూసుఫ్(అ) ఇలా అన్నారు :

> **"అల్లాహ్ శరణు! నిశ్చయంగా ఆయన నా స్వామి. ఆయన నన్ను మంచి స్థితిలో ఉంచాడు. నేనాయనకు నమ్మకద్రోహం చేయలేను. నమ్మకద్రోహం చేసేవారు ఎన్నటికీ కృతకృత్యులు కాలేరు."**

మహనీయ యూసుఫ్(అ) గారి ఈ వాక్యంలో విశ్వాస పాత్రత తొణికిసలాడు

తోంది. 'స్వామిద్రోహం' ఘోర అపచారం. తిన్న ఇంటి వాసాలు లెక్కించే ధోరణి శ్రేయస్కరం కాదు. అందులోనూ 'శీలాపహరణం'మరింత దారుణమైన విషయం.

లజ్జా, బిడియం, రోషం ఉన్న వారిని ఈ మాటలు కుదిపివేస్తాయి. కాని ఎదలో రగిలి వెతలు రేపే కోర్కెకు వివశురాలైపోయిన ఆ మగువ ముందు ఈ సుభాషితం బధిర శంఖారావమే అయింది. ఆమెలో ఏ కాస్త పౌరుషం ఉన్నా యూసుఫ్ పలికిన మాటలకు ఆమెలోని కామవాంఛ చల్లారిపోవలసింది. కాని సిగ్గు విడిచిన ఆ అంత: పుర స్త్రీ ఇదేమీ పట్టించుకునే స్థితిలో లేదు.

ఆవిడ ఏ కాస్తయినా రాచమర్యాదలను, ప్రోటోకాల్ నిబంధనలను పాటించే మాటైతే ఆగి ఆలోచించేది...

నా అంతస్తు ఏమిటి? ఆ కుర్రవాని అంతస్తు ఏమిటి? అతని గుండె స్వామి భక్తితో నిండి ఉంది. తన ప్రభువు ఉపకారాన్ని అతను పదేపదే గుర్తు చేసుకుంటు కున్నాడు. తన 'అయ్య గారు' చేసిన ఒక మేలుకు గాను అతని అంతరాళం ఆనందాతి శయంతో, కృతజ్ఞతా భావంతో ఉవ్విళ్ళూరుతోంది. విశ్వాస పాత్రత అతని అణువణు వునూ పెనవేసుకుపోయి ఉంది. ఏకాంతంలో రాసలీల సాగిద్దామని పిలిస్తే 'రాను పొ'మ్మంటున్నాడు. తన స్వామికి 'ద్రోహం' చేయలేనంటున్నాడు. స్వామిద్రోహం చేసేవారెన్నటికీ బాగుపడరని హితవు పలుకుతున్నాడు...

మరి నేనూ ఉన్నాను. కాని ఏం లాభం?

నా పతికి ధర్మపత్నినై ఉండి కూడా,

నన్ను నేను అతని దాంపత్యంలో సమర్పించుకున్న దానినై ఉండి కూడా,

నా శీల కుసుమాన్ని ఆస్వాదించే అధికారం అతనికి కట్టబెట్టిన దానినై ఉండి కూడా,

అతని చల్లని లోగిలికి సామ్రాజ్ఞినై ఉండి కూడా,

అతని సొమ్మును ఖర్చుపెట్టుకునే ఆనతిని పొంది ఉండి కూడా– నేను నా 'పతి' పట్ల విశ్వాస పాత్రతను కనబరచలేకపోతున్నానే! నా భర్తచే కొనుగోలు చేయబడిన ఒక బానిస ప్రేమలో గుడ్డిదానినై 'స్వామి ద్రోహం' చేయబోతున్నానే!?

అయ్యో! నాదీ ఒక ఆడజన్మేనా? అని తనను తాను ప్రశ్నించుకొని సిగ్గుతో కుంచించుకుపోవాల్సింది.

కాని ఆమె చేసిందేమిటి?

★ ★ ★



ప్రాచీన ఈజిప్టులోని రాజ ప్రాసాదాలలో ఇదొకటి

## స్వామి ద్రోహం చేసే వారెన్నడూ బాగుపడరు

**'అపచారం అమ్మగారూ! నేనీ పని చెయ్యలేను. అమ్మగారూ! తమరు ఒక గౌరవనీయుడైన వ్యక్తికి ధర్మపత్నిగా ఉన్నారు. అమ్మగారూ! మీరు ఆయన సొత్తు. ఆ అయ్య నాపై అమితమయిన వాత్సల్యం కురిపిస్తు న్నాడు. ఈ ఇంటి పరువు ప్రతిష్ఠలను మంటగలిపే ఏ చేష్టకూ నేను ఒడిగట్టలేనమ్మ గారూ! నేను గాని అలా చేశానంటే నా స్వామికి అన్యాయం చేసినవాడనవుతాను. ఆత్మద్రోహిగా కూడా పరిగణించ బడతాను. తప్పు అమ్మగారూ! నన్ను మన్నించండి...'**

కాని బరి తెగించిన అజీజు భార్యకు ఇవేమీ బుర్రకెక్కటం లేదు. ఎన్నాళ్ళ నుంచో అవకాశం కోసం ఎదురుచూసిన ఆ మోహిని ఎలాగయినాసరే అతని కౌగిలిం తలో కరిగిపోవాలని ఉవ్విళ్ళూరుతోంది... అతన్ని తీవ్రంగా ఆశిస్తూ అతని వైపు ముందడుగు వేసింది.

ఆ క్షణంలో అతను గనక తన ప్రభువు నిదర్శనం (బుర్హాన్) చూసి ఉండకపోతే అతను కూడా ఆమెను ఆశించి ఉండేవాడే. అయితే మేము అతన్నుంచి చెడుగును, నీతిబాహ్యతను దూరం చేశాము. నిశ్చయంగా అతను మేము ఎన్నుకున్న ప్రత్యేక దాసులలో ఒకడు (12: 24) అని అల్లాహ్ అంటున్నాడు.

ఇంతకీ 'ఆ నిదర్శనం' ఏది? అంటే అది దైవభీతి అని కొందరు అభిప్రాయ

పడ్డారు. ఆ సమయంలో ఆయన స్మృతి పథంలో తండ్రి యాఖూబ్ మెదిలారని మరి కొందరు అభిప్రాయపడ్డారు. ఆ సమయంలో మహనీయ యూసుఫ్ (అ) మనసులో అలజడి రేగలేదని కాదు, రేగింది. కాని ఆయన ఆమెను ఆశించలేదు. మనసులో అలజడి కలగటం వేరు– ఆశించటం వేరు. ఎదలో కోరిక రగలని వ్యక్తి పాపకార్యం నుంచి తనను కాపాడుకోవటం గొప్పేమీ కాదు, కోరిక రగిలినప్పటికీ దానిని నియంత్రించుకుని తనను పాపకార్యం నుంచి కాపాడుకోవటమే గొప్ప విషయం. ఈ ఇంద్రియ నిగ్రహంలో హజ్రత్ యూసుఫ్ (అలైహి) నిరుపమానమయిన ఉదాహరణను నెలకొల్పారు.

## అంతరాత్మ ప్రబోధాన్ని అణిచివేస్తే...

ఆ విషయానికి వస్తే అల్లాహ్ ప్రతి మనిషిలోనూ ఈ జ్యోతిని ప్రోది చేశాడు. అది అడుగడుగునా మనిషిని మేలు కొరకు ప్రేరేపిస్తూ, కీడు పట్ల హెచ్చరిస్తూ ఉంటుంది. దేవుడు ప్రసాదించిన ఈ జ్యోతిని ఆదరిస్తూ తద్వారా లబ్ధి పొందగోరిన వారి ఆంతర్యం ప్రకాశమానమవుతూ ఉంటుంది. వారి ఆత్మ బలం అనుదినం ప్రవర్ధమానమవుతూ ఉంటుంది. కఠినాతి కఠినమయిన సమయాలలో కూడా అది మనిషిలోని మనసును పైశాచిక మాయల నుండి రక్షిస్తూ ఉంటుంది. కాని దీనికి భిన్నంగా ఎవరయితే ఆ జ్యోతి విలువను గ్రహించరో, మరెవరయితే ఆ మార్గదర్శనాన్ని త్రోసిపుచ్చుతారో వారిలో క్రమక్రమంగా అది మసకబారుతుంది. మిణుకు మిణుకు మంటూ చివరకు అది ఆరిపోతుంది. తత్ఫలితంగా వారి మనో నేత్రం కాంతిహీనమై పోతుంది. నైతికంగా అది గుడ్డిదైపోతుంది. ఇలాంటి వారి గురించే ఖుర్‌ఆన్ **'ముమ్మాటికీ కాదు, వారి హృదయాలపై వారి స్వయంకృతాల చీకటి కమ్ముకున్నది'** అని చెప్పింది.

మహనీయ అలీ(రజి) చే ఉటంకించబడిన కథనం ప్రకారం ఆ సమయంలో అజీజు భార్య ఆ హాలులో ఉన్న విగ్రహంపై దుప్పటి కప్పేసింది. 'ఎందుకిలా చేస్తున్నావు?' అని హజ్రత్ యూసుఫ్(అ) అడిగితే, 'అది మా ఇలవేలుపు. ఆ దేవత చూస్తూ ఉండగా నేను సిగ్గుమాలిన పని చేయలేను కదా!' అని చెప్పింది. 'నీకు నీ మిథ్యా దేవత గురించే అంత భక్తి భయం ఉన్నప్పుడు, నేను నా నిజ ఆరాధ్య దైవానికి భయపడకుండా ఎలా ఉంటాననుకున్నావ్?' అని హజ్రత్ యూసుఫ్(అ) అనుకున్నారు మనసులోనే.

మొత్తానికి దేవుడు తనను చూస్తున్నాడనే భావనే మహనీయ యూసుఫ్ (అలైహిస్సలామ్)ను నైతిక పరిధిలో ఆపి ఉంచింది. అదీగాక ఆయన సాధారణ వ్యక్తి కాదు. దైవప్రవక్త. తన ప్రవక్తను నిష్కళంకమైన వ్యక్తిగా మిగిల్చి ఉంచే బాధ్యత దేవుడు స్వయంగా తీసుకున్నాడు.

హ॥జత్ యూసుఫ్ (అ) తలుపు వైపు పరుగెత్తారు. మూసి వున్న ఆ తలుపు దేవుని మహిమ వల్ల ఒక్కసారిగా తెరుచుకుంది. యూసుఫ్(అ) గుమ్మం దాటుతుండగా అజీజు భార్య కూడా ఆయన్ని వెంబడిస్తూ వచ్చింది. యూసుఫ్ (అ)ను ఎలాగయినా చేజిక్కించుకోవాలని ఆడ పులిలా ఆయనపై పంజా విసిరింది. తత్కారణంగా ఆయన చొక్కా వెనుక వైపు నుంచి చిరిగిపోయింది. సరిగ్గా అదే సమయంలో... యాదృచ్ఛికంగా ఈజిప్టు అధికారి వారిద్దరికీ ఎదురుపడ్డాడు.

## జాణతనం

భర్తను చూడగానే అజీజు భార్య క్షణాల్లో తన స్ట్రాటజీని మార్చేసింది. ఎంతయినా ఆమె తెలివైన మహిళ. భర్త అడగకముందే అతని ముందరి కాళ్ళకు బంధం వేయాలనుకుంది. అప్పటివరకూ మనసు పారేసుకున్న వ్యక్తిపైనే నిందను మోపుతూ, **'నీ ఇల్లాలి పట్ల దురుద్దేశం కల వ్యక్తికి కారాగార శిక్ష విధించటమో లేక మరేదయినా కఠిన శిక్ష విధించటమో తప్ప వేరే శిక్ష ఏముంటుంది?'** అని భర్తను నిలదీసి మరీ అడిగింది.

ఆ సమయంలో యూసుఫ్ (అ) గనక మౌనం వహిస్తే ఒక ప్రవక్తగా ఆయన స్థానానికి తీవ్ర విఘాతం కలిగేది. అందుకే ఆయన 'ఈవిడగారే నన్ను ఉచ్చులో బిగించేందుకు యత్నించింది' అని చెప్పారు ధైర్యంగా. ఆ సౌశీల్యవంతుని శీలాన్ని రుజువు చేయడానికి ఆ క్షణంలో దైవ సహాయం కూడా అందింది. ఆవిడ వంశానికే చెందిన ఒక వ్యక్తి ఆ వ్యవహారంలో జోక్యం చేసుకుంటూ, చొక్కా ముందు వైపు నుండి చినిగి వుంటే తప్పంతా యూసుఫ్‌దే. ఎందుకంటే అతను దుశ్చర్యకై ముందంజ వేసి ఉంటాడు. స్త్రీ ఆత్మరక్షణకై అతని చొక్కాను చించి ఉంటుంది. ఒకవేళ చొక్కా వెనుక వైపున చినిగి ఉంటే దోషమంతా స్త్రీదే. ఎందుకంటే చెడు చేష్ట నుంచి తనను కాపాడుకునే నిమిత్తం యూసుఫ్ బయటికి పరుగులు తీసి ఉంటాడు. స్త్రీ అతని వెనుక పడి అతని చొక్కా పట్టుకుని ఉంటుంది. దాంతో ఆ చొక్కా వెనుక వైపు నుండి చినిగి ఉంటుంది అని సాక్ష్యమిచ్చాడు.

వాస్తవానికి ఇది (ఈ సాక్ష్యం) దైవికంగా జరిగిన ఏర్పాటు. అందువల్ల ఈజిప్టు అధికారి తన భార్య తప్పును అంగీకరించక తప్పలేదు. ఈ సందర్భంగా అతను చెప్పిన మాటలు గమనార్హమైనవి. అతనిలా అన్నాడు : "ఇవన్నీ మీ ఆడువారి మాయోపాయాలు. నిజంగానే మీ మాయోపాయాలు మహా దారుణంగా ఉంటాయి."

తన బానిసను ఉద్దేశించి, 'యూసుఫ్! ఈ విషయాన్ని ఇంతటితో వదిలెయ్యి. (దీని మీద చర్చ అనవసరం)' అని సూచించాడు.

అదే సమయంలో అతను తన ఇల్లాలిని మందలిస్తూ "నువ్వు మాత్రం నీ తప్పుకు గాను (దైవాన్ని) క్షమాపణ వేడుకో. ఎందుకంటే అసలు తప్పంతా నీదే" అన్నాడు.

## గమనార్హ విషయాలు

ఈ సందర్భంగా కొన్ని విషయాలు గమనార్హమైనవి:

☛ ఈజిప్టు అధికారి అయిన అజీజు భార్య ఇంటిని ఖుర్‌ఆన్ 'అతని భార్య ఇల్లు'గా ఖరారు చేసింది. దీనినిబట్టి అవగతమయ్యేదేమిటంటే భార్య స్థానం కేవలం సేవకురాలిది కాదు. పైగా ఆమె తన భర్త ఇంటికి యజమానురాలు వంటిది, గృహసీమకు సామ్రాజ్ఞి వంటిది.

☛ అజీజు భార్య అక్రమ సంబంధం కొరకు పూనుకోగానే ఇంటి తలుపులు మూసేసిందన్న విషయాన్ని ఖుర్‌ఆన్ ప్రత్యేకంగా ప్రస్తావించింది. దీనినిబట్టి సుబోధకమయ్యేదేమిటంటే స్త్రీ పురుషుల మధ్య లైంగిక సంబంధం ఏర్పడినప్పుడు ఎవరి దృష్టీ పడకుండా చాటున ఉండటం చాలా అవసరం. కాని శోచనీయమయిన విషయం ఏమిటంటే నేడు పాశ్చాత్య ప్రపంచం ఈ సందర్భంగా కూడా చాటున ఉండాల్సిన అవసరం లేదన్నట్లే ప్రవర్తిస్తోంది.

☛ హజ్రత్ యూసుఫ్ (అలైహిస్సలామ్) ఈజిప్టు అధికారి భార్యను చెడు నుండి వారిస్తూ "తప్పమ్మ గారూ! మీ 'అయ్య' నన్ను బాగా చూసుకుంటున్నాడు" అని చెప్పారు. దీనివల్ల తెలిసేదేమిటంటే ఉపకారం చేసినవాడు ముస్లిమైనా– ముస్లిమేతర వ్యక్తి అయినా, పుణ్యాత్ముడు ఉపకారం చేసినా– పాపాత్ముడు ఉపకారం చేసినా, ఎట్టి పరిస్థితిలోనూ 'ఉపకారి'ఉపకారాన్ని జ్ఞాపకముంచుకుని, తదనుగుణంగా వ్యవహరించాలి. అంతేగాని అన్నమేసిన చేతినే కరవకూడదు.

☛ ధర్మంతో గల దృఢమైన సంబంధం మనిషి పాలిట 'ప్రభువు నిదర్శనం' స్థాయిని కలిగి ఉంటుంది. ఏ చెడు కార్యం వైపునకైనా మనిషి అడుగు పడినప్పుడు అతను తన ధార్మిక అనుబంధాన్ని, దైవంతో చేసిన వాగ్దానాన్ని తలచుకుని తనను తాను నియంత్రించుకోవాలి.

☛ మూయబడి ఉన్న తలుపు కాస్తా ఆ క్షణంలో– దానంతట అదే– తెరచుకోవటాన్ని బట్టి విదితమయ్యేదేమిటంటే, మనిషి ఏదేని దురుద్దేశం నుండి తన ఆత్మను కాపాడుకోవాలని దృఢ సంకల్పం చేసుకున్నప్పుడు అతనికి అగోచర సహాయం తప్పక అందుతుంది.

☛ ఈజిప్టు అధికారి తన ఇల్లాలికి 'అయ్య'గా సంబోధించబడ్డాడు. ఎందుకంటే అలనాడు ఈజిప్టులోని 'ఖిబ్తీల' సముదాయంలో భార్యలు తమ భర్తలను 'నాథా', 'అయ్యా!', 'దొరా!', 'స్వామీ!' అని పిలిచేవారు. దీనినిబట్టి విదితమయ్యేదేమంటే ఈజిప్షియన్ సమాజంలో ఆనాడు మహిళ స్థాయి 'ప్రైవేటు ప్రాపర్టీ' స్థాయిని మించినది కాదు. అంటే భార్యాభర్తల బంధాన్ని యజమానికీ– యజమాని ఆస్తికీ మధ్య ఉండే సంబంధంగా భావించేవారు. కాని ఇస్లామ్ ఈ నిమ్నోన్నతా భావాన్ని రూపుమాపి, వివాహ బంధాన్ని– దైవ సాక్షిగా– ఇరువురు వ్యక్తుల మధ్య జరిగే పవిత్ర ఒడంబడికగా ఖరారు చేసింది. 'పతి' అనేవాడు తన ధర్మపత్నికి పతిగానే ఉంటాడు గాని 'పతి దేవుడు' కాలేడు. ఆమెను దాసిగా పరిగణించలేడు.

☛ యూసుఫ్ (అ)– ఈజిప్టు స్త్రీ సంఘటన అజీజె మిస్ర్ దృష్టికి వచ్చినప్పుడు అతనిలోని పౌరుషం అతనికి నిద్రాహారాలు లేకుండా చేయాల్సింది. నేరం చేసిన వారిని కఠినంగా దండించాల్సింది. కాని అజీజె మిస్ర్ అలాంటి చర్యేమీ గైకొనలేదు. అంటే అతనిలోని రోషం, స్వాభిమానం చచ్చుబడిపోయిం దన్న మాట! లేదా నేటి పాశ్చాత్య సమాజం మాదిరిగా ఆనాటి ఈజిప్షియన్ల సంస్కృతిలో కూడా 'మితిమీరిన ఉదారవాదం' (Permissiveness) పొడ సూపిందన్నమాట!! నీతికి విలువా నాతికి వలువా కొరవడిన సమాజంలో ఇలాంటివన్నీ మామూలే. ఏ జాతి లేక ఏ సముదాయమైనా దేవుని షరీఅతుకు దూరమైనపుడు అందులో పుట్టుకువచ్చే చెడుగులలో 'లజ్జా విహీనత' కూడా ఒకటై ఉంటుంది. అందుకే ఈజిప్టు అధికారి ఈ విషయాన్ని ఏమంత గంభీరమైనదిగా తీసుకోలేదు.

☛ 'క్షమాభిక్షకై వేడుకో' అని ఈజిప్టు అధికారి తన భార్యను ఆదేశించాడు. దీనినిబట్టి సుబోధకమయ్యేదేమిటంటే మనిషి చేసిన తప్పు శిక్షార్హ స్థాయికి చేరినా, చేరకపోయినా శిక్షించే పరిస్థితి లేనప్పుడు లేక ఆ చెడుగు ప్రజలకు తెలియకుండా ఉన్నప్పుడు అపరాధి దైవ సన్నిధిలో క్షమాపణ కోరుకోవాలి. జరిగిన దానిపై పశ్చాత్తాప భావంతో కుమిలిపోవాలి. తద్వారా అపరాధి అంత రంగం ప్రక్షాళనమయ్యేందుకు ఆస్కారముంటుంది.

మరైతే ఈజిప్టు అధికారి భార్య తన భర్త ఆజ్ఞను పాలించిందా? క్షమాపణకై వేడుకుందా? లేక గాయపడిన ఆడపులిలా విజృంభించిందా?

## నాకు ఆ చెరసాల జీవితమే మిన్న ఈ దొరసానుల మాట వినటం కన్నా

సుగంధ పరిమళాన్ని గుబాళించకుండా తెరలచాటున మరుగుపరచటం ఎంత కష్టమో ప్రేమ పురాణాలను, రంకు వ్యవహారాలను గుట్టు చప్పుడు కాకుండా ఉంచటం కూడా అంతే కష్టం.

'ఈ విషయాన్ని మరచిపో'మ్మని ఈజిప్టు అధికారి మహనీయ యూసుఫ్ (అలైహిస్సలామ్)కు సూచించాడు- యూసుఫ్ (అ) కూడా ఆ చెడుగును గురించి ఎవరితోనూ చెప్పి ఉండరు. అయినాసరే అంత:పుర ప్రాంగణంలో జరిగిన ఈ అవాంఛనీయ సంఘటన నగరంలో దావానలంలా వ్యాపించింది. జనులు చిలువలు పలువలుగా ఈ విషయం గురించి చెప్పుకోసాగారు. మరీ ముఖ్యంగా కంటోన్మెంట్ పరిధిలోని కులీన స్త్రీలు, బస్తీ దొరసానులు దీనికి ఉప్పు కారం కూడా తగిలించి ఘాటైన విమర్శలు గుప్పించారు. వారిలా అన్నారు:

'మన సైన్యాధికారి భార్య తన ఇంట్లోనే ఉన్న కట్టు బానిసపై పడి చస్తోంది. అతని ప్రేమలో పిచ్చిదైపోయింది. విడ్డూరంగా ఉంది కదూ! ఏమయినా ఆమె ధోరణి మరీ దారుణమైనది'.

## ... అర్థాలే వేరులే

ఇలా చెప్పటంలో వారి ఉద్దేశం మరో విధంగా ఉంది. యూసుఫ్ (అ) అపురూప సౌందర్యమూర్తి అని వారు అప్పటివరకూ విని ఉన్నారు. కాని వారు ఆయన్ని ఇంతవరకూ చూడలేదు. ఆ అందగాడిని చూడాలంటే అజీజ్ భార్యను బాగా

రెచ్చగొట్టాలి. ఆమెలోని అహం దెబ్బతినే మాటలు చెప్పాలి– మొత్తానికి ఆ కులీన కాంతలు తమ ఎత్తుగడలో సఫలీకృతులయ్యారు. తన గురించి పురములోని స్త్రీలు పేలుతున్న అవాకులు చెవాకులను విని అజీజ్ భార్యలోని పౌరుషం పురి విప్పింది. తోక తొక్కిన త్రాచుపాములా కస్సున పడగవిప్పి లేచింది. బుస కొట్టింది. తాను మనసు పారేసుకున్న మనిషి సాధారణ మనిషి కాదన్న సంగతి వారికి అర్థమయ్యేలా చెప్పాలి! అతన్ని చూసిన ఏ ఆడదయినాసరే పిచ్చెక్కకుండా ఉండదన్న సంగతి తెలిసి వచ్చేలా చేయాలి!!

## విందు

అందుకే అంత:పురంలో అట్టహాసంగా విందు ఏర్పాటు చేసింది. ఖరీదైన కార్పెట్లు, ఒరుగు దిండ్లు పరచబడ్డాయి. స్వాదిష్టమయిన ఆహార పదార్థాలు, రుచికర మయిన మధుర భక్ష్యాలు తయారు చేయబడ్డాయి. పసందైన పండ్లు సమర్పించ బడ్డాయి. అజీజ్ భార్య ఇచ్చే విందు అంటే మాటలా!? ఆ విందుకు ఆహ్వానించబడిన వారంతా గొప్పింటి స్త్రీలు, దొరసానులే అయి ఉంటారు. పండ్లు కోసుకోవటానికి ఒక్కొక్కరి ముందు ఒక్కో చాకు కూడా ఉంచమని పురమాయించారు అమ్మ గారు. ఆహూతులైన కులీన కాంతలంతా తమ తమ స్థానాలలో ఆసీనులైన మీదట, వారం దరి సమక్షంలోకి రావలసినదిగా యూసుఫ్ (అ)ను పురమాయించింది అజీజ్ భార్య.

హజ్రత్ యూసుఫ్ (అలైహిస్సలామ్) అసలే అందమైన వ్యక్తి. 'యూసుఫ్‌కు సౌందర్యంలో సగభాగం ఇవ్వబడింద'న్న హదీసు *(సహీహ్ ముస్లిం–కితాబుల్ ఈమాన్)* ఈ సందర్భంగా గమనార్హం. దానికితోడు ఆ స్త్రీ ఆజ్ఞానుసారం ఆయనకు మరింత ముస్తాబు చేయటం జరిగింది.

ఇక్కడొక ప్రశ్న జనించక మానదు. రెచ్చిపోయిన ఆ స్త్రీ మరీ ఇంతగా బరి తెగించి హంగామా చేస్తున్నా ఆమె భర్త (ఈజిప్టు అధికారి) ఏం చేస్తున్నట్టు? మీనమేషాలు లెక్కించుకుంటూ, గోళ్ళు గిల్లుకుంటూ కూర్చున్నాడా? అతనిలోని పౌరుషం చచ్చిపోయిందా? అంటే అలనాడు నాగరికం ముదిరిన ఈజిప్టు రాజ్యంలో నైతికంగా పరిస్థితి ఎంతగా దిగజారి ఉందో దీనినిబట్టి విదితమవుతోంది. ఈనాడు యూరప్, అమెరికాలు వారి ప్రాచ్య శిష్యగణం స్త్రీల స్వేచ్ఛపేరిట ప్రోత్సహిస్తున్న విచ్చల విడి తనానికీ ఆనాటి ఈజిప్షియన్ మహిళల విశృంఖలత్వానికి మధ్య పెద్దగా తేడా లేదనిపిస్తోంది.

## లేకపోతే ఏమిటి?

సదస్సులో కులీన కాంతామణులంతా ఆసీనులయ్యాక వారందరి సమక్షంలోకి రమ్మని అజీజ్ భార్య యూసుఫ్ (అ)ని ఆజ్ఞాపించింది. యూసుఫ్ (అ)ను చూడగానే ఆ మహిళలంతా ఆశ్చర్యచకితులయ్యారు. పండ్లు కోయటానికి ఇవ్వబడిన చాకులతో తమ చేతులు కోసుకున్నారు. అతని సౌందర్యానికి పరవశించిపోతూ, 'దేవదేవ! ఇతను మానవ మాత్రుడు కానేకాడు. కచ్చితంగా ఇతను మూర్తీభవించిన సౌందర్యం, అపురూపు దైవదూతే' అన్నారు.

దాంతో అజీజ్ భార్యకు ఎక్కడలేని ధైర్యం వచ్చేసింది. యూసుఫ్‌ను చూడగానే మతి చలించిన మహిళలనుద్దేశించి, 'అబ్బో, ఒక్క చూపుకే అంత ఇదైపోయారే?! ఇప్పుడయినా తెలిసి వచ్చిందా నా ప్రేమ రహస్యం ఏమిటో!?' అని నిస్సిగ్గుగా చెప్పింది.

## వాడే వీడు

అంతేకాదు,

మగతలో ఉన్న ఆ ఆహూతుల వాలకాన్ని చూసి ఆవిడకు పట్టపగ్గాల్లేకుండా పోయాయి–

'ఎవరి గురించి ఇప్పటివరకూ మీరంతా నన్ను ఆడిపోసుకున్నారో ఆ వ్యక్తి ఇతనే. నేనితన్ని బుట్టలో వేసుకోవడానికి యత్నించిన మాట నిజమే. కాని ఇతను మాత్రం తన శీలాన్ని కాపాడుకున్నాడు. ఇప్పుడు మళ్ళీ చెబుతున్నాను. నేను చెయ్యమన్న దానిని గనక ఇతను చేయకపోతే, ఇతను కటకటాల వెనక్కిపోయి, పరాభవం పాలవక తప్పదు' అని లజ్జావిహీనంగా ప్రకటించింది. ఆ ప్రకటనలో ప్రలోభమూ, బెదిరింపు, హెచ్చరిక కలగలసి ఉన్నాయి. అతనిని నా దారికి తెచ్చుకో వటానికి అవసరమయిన సామ దాన భేద దండోపాయాలన్నీ నా దగ్గర ఉన్నాయి. అతన్ని నా కాళ్ళ బేరానికి రప్పించుకోలేనంత తెలివి తక్కువ దానిని కానన్న గడసరి తనం కూడా ఆమె మాటల్లో అంతర్లీనమై ఉంది.

## అడుగడుగునా శీల పరీక్ష

నయానా భయానా యూసుఫ్(అ)ను తన దారికి తెచ్చుకుని, తాను కోరింది నెరవేర్చుకోవాలనుకుంది ఆ గొప్పింటి స్త్రీ. అలాగే ఆ విందులో ఆయన్ని చూసిన కాంతామణులంతా ఇంచు మించు అలాగే కోరుకుంటున్నారు. ఇప్పుడు ఒక పక్కన

అతనొక్కడు! మరో పక్కన వందలాది వలలు! అన్నివేళలా, అన్నిచోట్లా అతన్ని వెంటాడి చేజిక్కించుకోవడానికి సర్వసన్నద్ధమై ఉన్నాయి. అతని భావోద్రేకాలను ఉద్దీప్తం చేయడానికి, అతని నిష్ఠను భంగపరచడానికి సకల విధాల ప్రయత్నాలూ జరుగుతున్నాయి. పాపం ఆ పసివాడు, తాను అడుగుపెట్టిన ప్రతిచోటా సమ్మోహనాస్త్రాలతో ద్వారాలు తెరచుకుని నిరీక్షించటం గమనిస్తున్నాడు. సాధారణంగా ఎవరయినా అత్యాచారం చేసేందుకు అవకాశం కోసం ఎదురు చూస్తుంటారు. కాని ఇక్కడ మాత్రం అవకాశాలే అతన్ని వెదుక్కుంటూ వస్తున్నాయి. అతని కోసం అవి మాటేసి కూర్చుని ఉన్నాయి. అతని ఆంతర్యంలో ఏ కాస్తయినా పాపకార్యం వైపు మొగ్గు కనిపించినా తమ్ము తాము అతని సమక్షంలో అర్పించుకోవడానికి సిద్ధంగా ఉన్నాయి. పాపం, నవనవలాడే యవ్వనంలో ఉన్న ఆ వన్నెకాడు రేయింబవళ్ళు- ఇరవై నాలుగు గంటలూ- ఇలాంటి ప్రమాదంలోనే గడుపుతున్నాడు. అతని సంకల్ప బంధం క్షణకాలం సడలినా, తెరచుకుని వేచి ఉన్న అసంఖ్యాక ద్వారాల్లో దేనిలోనయినా అతను ప్రవేశించటం సంభవమే.

## యూసుఫ్ (అ) గొప్పతనం

అలాంటి పరిస్థితులలో దైవభీతిపరుడయిన ఆ నవ యువకుడు పైశాచిక ప్రేరణలను ఎదుర్కొంటున్న తీరు కూడా అమోఘమైనదే. 'మనో నిగ్రహం' విషయంలో ఉత్కృష్ట స్థాయికి ఎదిగిన అతని హృదయంలో గర్వం లేశమయినా జనించదు. 'ఓహో, ఏమి నా ఈ శీల పరిపక్వత! చక్కని చుక్కలు నా కోసం పడి చస్తున్నప్పటికీ నా అడుగులు తడబడటం లేదే!' అని గర్వించడు. దీనికి బదులు అతను తన మానవ సహజ బలహీనతల్ని దృష్టిలో ఉంచుకుని కంపిస్తూ ఎంతో వినమ్రతతో సహాయం కొరకు దైవాన్ని ప్రార్థిస్తాడు- 'ప్రభూ! నేనొక బలహీన మానవుణ్ణి. ఈ అసాధ్యమయిన దుష్ప్రేరణల్ని ఎదుర్కొనే శక్తియుక్తులు నా వద్ద లేవు. నీవే నాకు సహాయపడాలి. నీవే నన్ను రక్షించాలి. నీ అండదండలే కావాలి. అన్యథా నా కాళ్ళు జారిపోతాయేమోనని భయపడుతున్నాను' అంటాడు.

వాస్తవానికి ఇది మహనీయ యూసుఫ్ (అ)కు నైతిక శిక్షణ దృష్ట్యా అత్యంత సున్నితమయిన, మహత్తరమయిన దశ, ఆయనలో దాగివున్న నిజాయితీ తత్పరత, విశ్వాస పాత్రత, సౌశీల్యత, సత్య పరాయణత, సదాచార గమనం, ఆత్మ నిగ్రహం, బౌద్ధిక సంతులనం లాంటి అసమాన సద్గుణాలను గురించి స్వయంగా ఆయనకూ తెలియదు. అయితే అవన్నీ ఇప్పుడు... ఈ కఠిన పరీక్షా సమయంలో ఒక్కసారిగా

పైకెగసి వచ్చాయి. శక్తిమంతంగా సక్రియమయ్యాయి. తనలో దాగివున్న శక్తులేవో, వాటిని తానెలా ఉపయోగించుకోగలడో ఇప్పుడు తనకు తెలిసి వచ్చింది.

## మొర ఆలకించబడిన వేళ

అంతే–

అతని అధరాల మీదుగా ఓ తిరుగులేని మాట జాలువారింది. ఆ మాట

సూర్యచంద్రులు వెలిగే దాకా,

గిరులు ఝరులు నిలిచేదాకా

భావి తరాలకు కమ్మని మాటలా ఉంటుంది

సౌశీల్యవంతులకు సుభాషితంలా పనిచేస్తుంది

మహనీయ యూసుఫ్(అలై) ఇలా అన్నారు :

**'ప్రభూ! ఈ మగువలు దేనివైపునకు నన్ను పిలుస్తున్నారో దానికన్నా చెరసాల జీవితమే నాకెంతో ప్రియమైనది. నీవు గనక వీళ్ళ జిత్తులను నా నుండి దూరం చేయకపోతే, నేను (వీళ్ళ వలలో పడిపోతాను) మూర్ఖుడనైపోతాను'**

***(యూసుఫ్ : 33)***

అతని ప్రభువు అతని మొరను ఆలకించి ఆమోదించాడు. ఆ మగువల మాయోపాయాల నుండి అతన్ని రక్షించాడు. నిశ్చయంగా ఆయన అంతా వినేవాడు, అన్నీ తెలిసినవాడు.

ప్రార్థన (దుఆ) విశ్వాసి పాలిట ఆయుధం. హదీసు ద్వారా కూడా ఈ విషయం రూఢీ అవుతోంది. ఏడుగురు వ్యక్తులకు అల్లాహ్ తీర్పుదినాన తన సింహాసనం (అర్ష్) క్రింద నీడ కల్పిస్తాడు. వారిలో ఒకడెవడంటే అందం, అంతస్తు గల స్త్రీ పాపకార్యం కోసం పిలిచినప్పుడు, 'నేను అల్లాహ్‌కు భయపడుతున్నాను' అంటూ తిరస్కరించేవాడు (సహీహ్ బుఖారీ– కితాబుల్ అజాన్; సహీహ్ ముస్లిం– కితాబుజ్జకాత్).

★★★

## కారాగార చీకట్లలో ప్రసరించిన కాంతిరేఖ

అతను ఈజిప్టు రాజ్యానికి చెందిన 'ఖిబ్తీ' పౌరుడు కాదు.

ఇబ్రానీ తెగ నుంచి వచ్చిన పరదేశీ వ్యక్తి మాత్రమే.

అందునా ఎలాంటి వ్యక్తి?

స్వల్ప మొత్తానికి కొనుగోలు చేయబడిన బానిస వ్యక్తి!

ఇప్పుడు అతని యజమాని అతనిని నిందితునిగా భావించి శిక్ష విధించాడు.

ఎలాంటి శిక్ష?

కారాగార శిక్ష!

ఒక వ్యక్తిని పరాభవం పాల్జేసి, మానసికంగా అతన్ని కృంగదీసి, అతని ఉజ్వల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా చేసే శిక్ష!

ఇప్పుడతను ఈజిప్షియన్లంతా అసహ్యించుకుంటున్న ఇబ్రానీ యువకుడు!

కళంకితుడు!!

కట్టు బానిస!!!

అపరాధి!!!!

ఖైదీ!!!!!

కాని కాస్త ఆలోచించండి!

అకస్మాత్తుగా ఆ ఖైదీ కోసం జైలు తలుపులు తెరువబడతాయి. ఇంతకీ ఆ తలుపులను తెరిపించినదెవరు?

స్వయంగా ఈజిప్టు రాజ్యాధికారే!

ఎందుకు తెరిపించినట్టు?

కారాగార చీకటి గదిలో మగ్గుతున్న కనాన్ బానిసను బయటికి తీసి ఏకంగా ఈజిప్టు సింహాసనంపై కూర్చోబెట్టడానికి!

అంటే ఈజిప్టు కారాగారానికి– ఆ రాజ్య సింహాసనానికి మధ్య ఉన్న దూరం కేవలం రెండడుగుల కంటే ఎక్కువేమీ కాదు. కారాగారం నుండి ఆ యువకుని ఒక అడుగు బయటపడగానే మరో అడుగు సింహాసనంపై పడింది. అదీ విచిత్రం, విశేషం! ప్రపంచంలో సంభవించే అరుదైన వింతల్లో ఇదొకటి కదూ!

అయితే ఆ నవ యువకుడు జైలులో ఉండగా సంభవించిన పరిణామాలు, అతనిలో నిక్షిప్తమై ఉన్న సద్గుణాలే అతన్ని ఉన్నత శిఖరానికి చేర్చాయన్న విషయం విస్మరించరానిది.

ఇంతకీ జరిగిందేమిటంటే–

## భౌతిక శక్తికి- ఆధ్యాత్మిక శక్తికి మధ్య సాగిన సంఘర్షణ

హజ్రత్ యాఖూబ్ (అ) వంశీయుల వద్ద సత్యధర్మమనే 'అమానతు' ఉంది. దివ్యవాణి శుభాలను ఆ కుటుంబీకులు తనివితీరా ఆస్వాదించారు. అయితే భౌతిక ప్రగతికి, ప్రాపంచిక వైభవాలకు వారు అల్లంత దూరాన ఉన్నారు. కనీసం ఒక పట్టణ ప్రాంత ప్రజలకు లభించే వసతి సౌకర్యాలెలాంటివో కూడా వారికి తెలియవు. ఆ కుటుంబీకులంతా ఎడారి ప్రాంతంలో నివసించేవారు. పశువుల కాపరులుగా ఉండే వారు. దేవుడిచ్చిన దాంతో సరిపెట్టుకుని, నిరాడంబర జీవితం గడిపేవారు.

కాని ఈజిప్టు ప్రజల జీవన ప్రమాణాలు దీనికి పూర్తిగా భిన్నం. వారి వద్ద సత్య ధర్మం గానీ, ధర్మజ్ఞానం గానీ బొత్తిగా లేవు. అయితే నాగరిక జీవనానికి అవసర మయిన సకల వస్తు సామగ్రి వారి వద్ద పుష్కలంగా ఉండేది. ముఖ్యంగా రాజధాని నగరంలోని ప్రజలంతా చదువుకున్నవారు, మేధావులు. పరిపాలనా వ్యవస్థ గురించి తగు పరిజ్ఞానం కలవారు. వారి దేవాలయాలలోని పండితులు, జ్యోతిష్కులు మాటల మర్మాన్ని ఎరిగినవారు. అలాంటి నాగరికుల మధ్య ఒక పల్లెటూరి అబ్బాయి అనుకోకుండా అడుగు పెట్టాడు. ఒక్కమాటలో చెప్పాలంటే యూసుఫ్(అ) వద్ద 'సత్య ధర్మం' తప్ప మరేదీ లేదు. అదే సమయంలో ఈజిప్షియన్ల దగ్గర 'ఒక్క సత్యధర్మం' తప్ప మిగిలినవన్నీ ఉన్నాయి. భౌతికంగా సర్వవిధాలా అందె వేసిన చేయి వారిది. అయినాసరే వారందరిపై యూసుఫ్‌దే పైచేయి అయింది.

## ఎలాగంటే...


యూసుఫ్ (అ) జీవిత గాథలోని మూడవ ముఖ్యాంశమిది! యూసుఫ్ (అ)తో పాటు మరో ఇద్దరు యువకులు కూడా చెరసాలకు పంపబడ్డారు. వ్యాఖ్యాతలు సేకరిం చిన సమాచారం ప్రకారం ఆ ఇద్దరిలో ఒకడు చక్రవర్తి కొరకు ప్రత్యేకంగా రొట్టెలు తయారు చేసేవాడు. రెండవవాడు చక్రవర్తికి పానీయాలు సమర్పించేవాడు. అతని కొరకు సారాయి పిండేవాడు. చక్రవర్తిపై విష ప్రయోగం చేసి, అతనిని చంపే కుట్రలో వారిద్దరూ కీలకపాత్ర పోషించారన్న అభియోగం వారిపై మోపబడింది.

ఆ యువకులిద్దరూ యూసుఫ్ (అ) వాలకాన్ని, నడవడికను, క్రమశిక్షణను చూసి ఇతనెవరో మహా పురుషుడై ఉంటాడని ఊహించారు.

తౌరాతు ప్రకారమైతే మహనీయ యూసుఫ్(అ) నిజాయితీ తత్పరతకు, సత్ప్ర వర్తనకు ప్రభావితుడైన జైలర్, ఆయన్ని కారాగార పర్యవేక్షకునిగా నియమించాడు–

*"యెహెూవా యోసేపునకు తోడై యుండి, అతని యందు కనికర పడి, అతని మీద ఆ చెరసాల యొక్క అధిపతికి కటాక్షము కలుగునట్లు చేసెను. చెరసాల అధిపతి ఆ చెరసాలలో నున్న ఖైదీలనందరినీ యోసేపు చేతి కప్పగించెను...'*

*(ఆదికాండము– 39: 22, 23)*




ఒకరోజు ఆ యువ ఖైదీలిద్దరూ కలగన్నారు. ఆ కలల భావార్థాన్ని యూసుఫ్‌(అ)కన్నా చక్కగా ఎవరూ విడమరచి చెప్పలేరని వారికనిపించింది. అందుకే వారిద్దరూ యూసుఫ్‌(అ) దగ్గరకు వచ్చారు. వారిలో ఒకడు, 'అయ్యా! నేను సారాయి పిండు తున్నట్లు నాకు కల వచ్చింద'న్నాడు. రెండవ వాడు, 'నేనేమో (కలలో) నా తలపై రొట్టెలు ఎత్తుకుని ఉన్నాను. వాటిని పక్షులు టకటకా పొడిచి తింటున్నాయి' అనన్నాడు. ఆ తరువాత వారిద్దరూ ఇలా విన్నవించుకున్నారు :

**"మాకు దీని అన్వయం ఏమిటో చెప్పండి. మేము తమరిని 'ఉత్తమోత్తముడు' (మహెూపకారి)గా చూస్తున్నాము." (యూసుఫ్‌– 36)**

## యూసుఫ్‌(అ)లోని ధర్మ బోధకుడు మేల్కొన్న వేళ...

**"ఇక్కడ మీకు పెట్టబడే భోజనం రాక ముందే నేను మీకు మీ కలల 'భావా న్వయం' చెబుతాను. ఇది నా ప్రభువు నాకు ప్రసాదించిన జ్ఞాన సంపదలో**

**ఒక భాగం. ఎవరు అల్లాహ్‌ను విశ్వసించరో, పరలోకాన్ని తిరస్కరిస్తారో వారి విధానాన్ని విడిచిపెట్టి నేను నా తండ్రి తాతలైన ఇబ్రాహీమ్, ఇస్‌హాఖ్, యాఖూబుల విధానాన్ని అవలంబించాను. అల్లాహ్‌తోపాటు మరెవరినయినా సహవర్తులుగా ఎంచటం మాకు ఎంతమాత్రం తగదు. ఇది మనపైనా, సమస్త మానవులపైనా అల్లాహ్ అనుగ్రహమనే చెప్పాలి. కాని చాలామంది కృతఘ్ను లుగా మెలగరు. ఓ నా చెరసాల సహవాసులారా! అనేక మంది విభిన్న ప్రభు వులు ఉండటం మంచిదా? లేక అందరిపై పూర్తి నియంత్రణ కలిగి ఉన్న అల్లాహ్ ఒక్కడే ఉండటం మంచిదా? ఆయన్ని కాదని మీరు ఎవరెవరి దాస్యం చేస్తున్నారో వారంతా, మీరూ, మీ తాతముత్తాతలు పెట్టుకున్న కొన్ని పేర్లు తప్ప మరేమీ కావు. అల్లాహ్ దానికి సంబంధించిన ఎలాంటి 'ప్రమాణాన్నీ' పంప లేదు. 'అధికారం' ఒక్క అల్లాహ్‌కు తప్ప మరెవరికీ లేదు. మీరు ఆయనకు తప్ప మరెవరి దాస్యమూ చేయరాదని అల్లాహ్ ఆదేశించాడు. ఇదే సరైన ధర్మం (దీన్). కాని చాలామంది ఎరుగరు. నా కారాగార సహవాసులారా! మీలోని ఒకడు తన ప్రభువు (చక్రవర్తి)కి సారాయి తాపే సేవపై నియమించబడతాడు. ఇకపోతే రెండవవాడు; అతను ఉరి తీయబడతాడు. పక్షులు అతని తలను పొడిచి పొడిచి తింటాయి. మీరు ప్రశ్నించిన విషయం గురించి తీర్పు (దైవ సన్నిధిలో ఎప్పుడో) జరిగిపోయింది."**

యూసుఫ్ (అ) గాథ అంతటికీ ఊపిరిలాంటిది ఈ 'ప్రసంగం'. కారాగారంలో మగ్గుతున్న యూసుఫ్ (అ)కు తన మనోభావాన్ని అభివ్యక్తం చేసే మొట్టమొదటి అవకాశం లభించింది. ఇప్పటివరకూ ఆయన మౌనంగానే ఎదిగారు. తనలోని నిజాయితీ, సత్యసంధత, కార్యనిబద్ధత ద్వారా తానొక మంచి మనిషినన్న సంగతిని ఆయన చెప్పకనే చెప్పారు. కాని అసలు తానెవరో, ఏ వంశస్థుడో ఎవరికీ చెప్పలేదు. ఆయన మానవత్వం పరిమళించే మంచి మనిషి అన్న విషయం దగ్గరున్న వారందరికీ తెలుసు. లేకపోతే ***'ఇన్నా నరాక మినల్ ముహ్‌సినీన్'*** (మిమ్మల్ని మహోపకార గుణం కల వ్యక్తిగా గమనిస్తున్నాము) అని ఆయనతో ఖైదీలిద్దరూ చెప్పి ఉండేవారు కారు.

## సమయస్ఫూర్తి

ఇప్పుడు అసలు తానెవరో, తన జీవిత లక్ష్యమేమిటో, ప్రజలు చేయవలసిం దేమిటో, చేస్తున్నదేమిటో చెప్పే అవకాశం ఆయనకు లభించింది. దానిని ఆయన

సద్వినియోగం చేసుకున్నారు. అవకాశం కోసం ఇంతకాలంగా నిరీక్షిస్తూ ఉన్న తన లోని 'ధర్మబోధకుడి'ని అపురూపమైన రీతిలో ఆవిష్కరించారు.

కారాగారంలో ఈ పూట మీకు ఇవ్వబడే భోజనం రాకముందే మీ కలల భావార్థాన్ని మీకు విడమరచి చెబుతాను–

1) (కాని అసలు విషయం ఏమిటో వినండి) **"జాలికుమా మిమ్మా అల్లమనీ రబ్బీ"** – కలల భావార్థాన్ని విడమరచి చెప్పే ఈ విద్య వాస్తవానికి నా ప్రభువు తరఫున నాకు ప్రసాదించబడింది. ఇది చాలా గొప్ప విద్య అని మీరు భావిస్తున్నట్లయితే, ఆ ఘనత నాదేం కాదు, నా ప్రభువుదే. ఆయన గొప్ప జ్ఞాన సంపన్నుడు. సకల శాస్త్రాలకు మూల సరోవరం నా ప్రభువు. ఆ సరోవరం నుండి ఆయన తాను కోరుకున్న వారికి కోరినంత జ్ఞానామృతాన్ని వొసగుతాడు అని స్పష్టం చేశారు. అంటే తానొక జ్యోతిష్కుణ్ణి కానని చెప్పకనే చెప్పేశారు.

2) ఆ తరువాత ఆయన ఒక ప్రవక్త స్థాయికి శోభాయమానమయిన విధంగా కలల భావాన్వయం వివరించే ముందు ఏకేశ్వరోపాసన, పరలోక జీవితపు వాస్తవికతను స్పష్టం చేశారు. దైవాన్ని, అంతిమ దినాన్ని నమ్మని వారితో నాకెలాంటి సంబంధం లేదు. నేను వారి విధానాన్ని పరిత్యజించాను అని నిర్ధిష్టంగా ప్రకటించారు.

ఈ సందర్భంగా ఏకేశ్వర వాదం (తౌహీద్), పరలోక జీవితం (ఆఖిరత్) గురించి యూసుఫ్(అ) నొక్కి వక్కాణించటం గమనార్హం. ఎందుకంటే విశ్వాసానికి (ఈమాన్‌కు) ప్రాతిపదిక ఇవి రెండే. ఈ రెండింటినీ నమ్మి నడుచుకున్నప్పుడే మనిషి విశ్వాసాలు, ఆచరణలు సంస్కరించబడతాయి. ఆ రోజుల్లో ఈజిప్టులో బహు దైవారాధన సర్వసామాన్యమై ఉండేది. ఏకేశ్వరోపాసన (తౌహీద్) అనే సరికి, అది కనానీయుల, ఇస్రాయీలీయుల మతధర్మమని ప్రజలు భావించేవారు. అందుకే యూసుఫ్(అ) తన అంతరంగంలోని విషయాన్ని మరింత తేటతెల్లం చేస్తూ తాను ఇబ్రాహీమ్, ఇస్‌హాఖ్, యాఖూబ్‌ల మత ధర్మాన్ని అవలంబించేవాడనని చెప్పారు.

## ధర్మ బోధకులకు పాఠం

దైవప్రవక్త యూసుఫ్(అ) ప్రసంగం ఆధారంగా ధర్మ సందేశాన్ని ప్రజలకు పరిచయం చేసే విధానమేదో తెలుసుకోవచ్చు–

ప్రజా బాహుళ్యంలో సత్యాన్ని, దేవుని ఏకత్వాన్ని ప్రవేశపెట్టాలన్నదే ఒక వ్యక్తి ధ్యేయమై ఉంటే, దానికితోడు ఆ వ్యక్తిలో విజ్ఞత కూడా ఉన్నట్లయితే, అతను తన

సంభాషణను ఎంత అందంగా ఆరంభిస్తాడో, మరెంత మృదువుగా దానిని తన సందేశం వైపునకు మలచుకుంటాడో ఈ ప్రసంగం ద్వారా అంచనా వేయవచ్చు. మహనీయ యూసుఫ్ (అ) మొదటి సమావేశంలోనే ధార్మిక నియమ నిబంధనల గురించి, ధర్మాధర్మాల (హలాల్– హరామ్)ను గురించి చెప్పలేదు. ఏకేశ్వరవాదం లోనూ– బహు దైవారాధనలోనూ గల వ్యత్యాసాన్ని మాత్రమే తెలియజేశారు. ఆ వ్యత్యాసాన్ని కూడా సహేతుకంగా వివరించారు. తన దగ్గరకు మార్గదర్శకత్వం కొరకు వచ్చిన వ్యక్తుల స్థాయిని, వారి పరిస్థితులను బేరీజు వేసి **ఒక్క స్వామి దాస్యం చెయ్యడం ఉత్తమమా? లేక అనేక స్వాముల ఊడిగం ఉత్తమమా?** అని అడిగారు. ఈ విషయం వారికి అర్థమయ్యేంత సులువుగా మరొకరికి అవదు.

సంబోధనా తీరును కూడా కాస్త గమనించండి! **'నా కారాగార సహచరులారా!'** అనే మాటలో ఆత్మీయత ఉట్టిపడుతోంది. అందులో ఓదార్పు ఉంది. ప్రేమ, జాలి, శ్రేయోభిలాష, సహకార భావం కలగలసి ఉన్నాయి.

ఎవడయినా ఒక అవసరార్థుడు తన వద్దకు వచ్చినప్పుడు, అతనికి తోడ్పాటు నందించే ముందు ధర్మ సందేశాన్ని అందజేసే సదవకాశాన్ని జారవిడువరాదన్న పాఠం కూడా మహనీయ యూసుఫ్ (అ) ప్రసంగం ద్వారా మనకు లభిస్తోంది. ఒకవేళ ఆయన ముందే కలల భావార్థం చెప్పేసి ఉంటే, తరువాత ఆ ఖైదీలిద్దరూ ఆయన మాటను శ్రద్ధగా విని ఉండేవారు కారు. అందుకే సన్మార్గ బోధన చేసిన మీదటే కలల సారాంశం చెప్పారు. ఆ చెప్పటంలో కూడా ఎంతో విజ్ఞతను ప్రదర్శించారు– "నువ్వు జైలు నుండి విడుదల అవుతావు... నువ్వేమో ఉరి తీయబడతావు" అని గుచ్చుకునే విధంగా చెప్పకుండా, "మీలోని ఒకడు చక్రవర్తికి మధుపానం అందిస్తాడు. రెండవ వాడు ఉరి తీయబడతాడు" అని చెప్పారు. కాని తన ధర్మ సందేశం వారిద్దరికీ అంద జేయటంలో ఏమాత్రం తాత్సారం చేయలేదు. చెప్పదలచిన విషయాన్ని నిష్కర్షగా చెప్పారు. ఎందుకంటే తన సందేశాన్ని వారిరువురూ స్వీకరించేటట్లయితే ఉరితీతకు గురయ్యే వ్యక్తి– మరణానికి ముందే పశ్చాత్తాపపడి– నిజ ముస్లింగా తనువు చాలించవచ్చు. తత్ఫలితంగా అతని పాపాలు ప్రక్షాళనమై పరలోకంలో అతను దైవ ప్రసన్నతకు నోచుకోవచ్చు. ఇక జైలు నుండి విడుదలయ్యే వ్యక్తి కూడా సత్యసందేశాన్ని స్వీకరించి దైవ విధేయునిగా, ఏకేశ్వరోపాసిగా జీవితం గడిపే మాటైతే అతని జీవిత లక్ష్యం నెరవేరటమే గాకుండా అతను మరెంతో మందికి ఆదర్శప్రాయం కావచ్చు.

ఆ విధంగా మహనీయ యూసుఫ్(అ) చీకటిమయమైన ఆ కారాగారాన్ని తన దివ్య వచనాలతో దేదీప్యమానం చేశారు. బహు దైవోపాసనకు ఆలవాలమైన ఈజిప్టు సమాజంలో విశ్వాస (ఈమాన్) బీజం నాటారు. ఆ తరువాత ఏమయింది?

## ఎల్లరి శ్రేయస్సును కోరుకునే వాడే సిసలయిన ధర్మ బోధకుడు

... ఆ విధంగా ఈజిప్టులోని చీకటి కారాగారం అతిలోక సుందరుడైన యూసుఫ్(అ) గారి ఆగమనంతోనూ, సుందరమైన ఆయన ప్రబోధనలతోనూ ప్రకాశ మానమయింది. అప్పటివరకూ నేరస్థుల బందీఖానాగా ఉన్న ఆ చెరసాల యూసుఫ్ (అ) గారి శిక్షణాలయంగా మారిపోయింది. యూసుఫ్(అ)లోని కార్య దక్షతకు, క్రమ శిక్షణకు ప్రభావితుడైన జైలర్ క్రమక్రమంగా ఆ చెరసాల పర్యవేక్షణా బాధ్యతలను ఆయనకు అప్పగించాడని, అనతి కాలంలోనే ఆ జైలు అధికారాలు ఆయనకు దత్తత మయ్యాయని ఇంతకుముందు తౌరాతు (పాత నిబంధన) ద్వారా తెలుసుకున్నాము.

మహనీయ యూసుఫ్ (అలై) కారాగారంలో కల గన్న ఇద్దరు సహచరులకు ఆ కలల భావం వివరించిన మీదట, వారిద్దరిలో జైలు నుండి విడుదల అవుతాడను కున్న వ్యక్తితో, 'నీ అయ్యగారి (చక్రవర్తి) ముందు నా గురించి ప్రస్తావించు' అని చెప్పారు. అంటే వీలు చూసుకుని, అతనికి నేను వినిపించిన ఈ సత్య సందేశాన్ని వివరించు. ఈ సందేశం గనక అతనికి చేరవేస్తే అతనికీ, రాజ్య ప్రజలకూ అది ఎంతో మేలు కలిగిస్తుంది అని తలపోశారు. కొంతమంది ఖుర్ఆన్ వ్యాఖ్యాతలు ఈ మాటను అర్థం చేసుకోవటంలో పొరబడ్డారు. జైలు నుండి విడుదల కావాలన్న కోరికతోనే ఆయన అలా అని ఉంటారని వ్యాఖ్యానించారు. కాని మహనీయ యూసుఫ్ (అ) ఎన్నడూ జైలు నుండి బయటికి రావటానికి ఆరాటపడలేదన్న సంగతి ముమ్ముందు రానున్నది.

ఆ ఇద్దరిలో జైలు నుండి విడుదల అయిన ఖైదీ యూసుఫ్ (అ) సూచనను రాజుగారి ముందు ప్రస్తావించలేదు. ప్రస్తావించకుండా షైతాన్ అతనిని మరుపునకు గురిచేస్తాడు. మంచి పని జరగకుండా మరుపునకు గురి చేయటం అంటే షైతాన్‌కు మహా ఇష్టం కదా! ఇలా కొన్ని ఏండ్లు గడిచిపోయాయి.

కాని దేవుడు ఏదన్నా కార్యాన్ని చేయదలచుకుంటే అనూహ్యమయిన రీతిలో దానికి అనువైన పరిస్థితులు వాటంతటవే ఉత్పన్నమవుతాయి. అందులో భాగంగానే ఒకనాడు ఈజిప్టు చక్రవర్తి ఒక కలగన్నాడు. అది మామూలు కల కాదు. అతనికి నిద్రాహారాలు లేకుండా చేసిన కల అది! ఈజిప్టు చరిత్రను కీలకమయిన మలుపు

తిప్పే కల అది!! రాజదర్బారులోని జ్యోతిష్కులను, తాంత్రికులను, పండితులను సయితం సందిగ్ధంలో పడవేసిన కల అది!!!

## విచిత్రమయిన కల

ఆ కలలో రాజు గారికి ఏడు బలిసిన ఆవులతోపాటు ఏడు బక్కచిక్కిన ఆవులు కనిపించాయి. బక్కచిక్కిన ఆవులు బాగా బలిసిన ఆవుల్ని మింగేస్తున్నాయి. అలాగే ఏడు పచ్చని ధాన్యపు వెన్నులు, ఏడు వాడిపోయిన ధాన్యపు వెన్నులూ ఉన్నాయి. వాడిపోయిన ఏడు ధాన్యపు వెన్నులు పచ్చగా ఉన్న వెన్నులను స్వాహా చేసేస్తున్నాయి...

ఈ కల గన్న రాజు గారికి చెమటలు పట్టాయి. ఆందోళనకు గురయ్యాడు. అందుకే అతను తన దర్బారులోని ప్రముఖులను సమావేశపరచి ఆ కలను వినిపించాడు. మీరు గనక కలల భావార్థాన్ని వివరించేవారే అయితే నేను చూసిన ఈ కలకు భావం ఏమిటో చెప్పండి అని కోరాడు.

రాజు గారి చివరి వాక్యాన్ని బట్టి ఆ కాలంలో కలల భావాన్వయానికి ఎనలేని ప్రాముఖ్యం ఉండేదని తెలుస్తోంది. తాను కన్న కలకు నిజమయిన భావం చెప్పటం ఈ అల్ప జ్ఞానులకు అంత సులభం కాదన్న విషయం కూడా ఆ మాటల్లో అంతర్లీనమై ఉంది.

రాజు గారి అనుమానం నిజమే అయింది. దర్బారులోని జ్యోతిష్కులు, తాంత్రికులు, పండితులంతా ఇది విని నోరు తెరిచారు. ఆలోచించి... చించి జుట్టు పీక్కున్నారు. కాని అందులో దాగివున్న పరమ రహస్యాన్ని ఛేదించలేకపోయారు. అలా అని వారు తమ ఓటమిని అంగీకరించారా అంటే అదీ లేదు. రాజు గారిని బుజ్జగించే ప్రయత్నంలో,

'మహా ప్రభో! తమరు కలవరం చెందనవసరం లేదు. ఇదొక అర్థం పర్థం లేని పీడ కల. అసలు ఇలాంటి కలలకు భావాన్వయం చేయటమే దండగ. అర్థవంత మయిన కలలకు మేము భావార్థం చెబుతామే గాని అర్థరహితమయిన ఇలాంటి చెదిరిన కలలకు భావార్థం చెప్పలేము' అన్నారు.

దర్బారులోని తాంత్రికుల నిస్సహాయ స్థితిని గమనించిన ఒకప్పటి కారాగార ఖైదీకి యూసుఫ్ (అ) గుర్తుకు వచ్చారు. అంతకుముందు తాను జైలులో కన్న కలకు యూసుఫ్ (అ) చెప్పిన భావార్థం అక్షర సత్యమైంది. అందుకే అతను ఏమాత్రం ఆలస్యం చేయకుండా,

'తమరు నన్ను బయటికి వెళ్ళేందుకు అనతినిస్తే తొందరగానే ఈ కలకు భావార్థం కనుక్కుని వస్తాన'న్నాడు.

★ ★ ★

ఇక్కడి నుండే దైవప్రవక్త యూసుఫ్ (అలైహిస్సలామ్) జీవితంలోని ఆసక్తికర మయిన అంకం మొదలవుతుంది. జైలు నుండి విడుదలై రాజు గారికి మధుపానం అందించే టీమ్‌కు నాయకత్వం వహిస్తున్న వ్యక్తి పరుగులు తీస్తూ జైలుకు వచ్చి,

'సత్య స్వరూపి అయిన ఓ యూసుఫ్! నాకు ఈ కల భావార్థం చెప్పవా! బాగా బలిసిన ఏడు ఆవుల్ని బక్కచిక్కిన ఏడు ఆవులు మింగేస్తున్నాయి. ఏడు ధాన్యపు వెన్నులు పచ్చగా కళకళలాడుతుండగా మరో ఏడు వెన్నులు ఎండిపోయి ఉన్నాయి. (నీవు గనక ఇందలి పరమ రహస్యం చెప్పావంటే) నేను ఆ పెద్దల వద్దకు వెళతాను. బహుశా వాళ్ళు కూడా తెలుసుకుంటార'ని ప్రాధేయపడ్డాడు.

## యూసుఫ్ (అ)లోని శ్రేయోభిలాషి మేల్కొన్న వేళ...

కారాగారంలో మగ్గుతున్న ఏ వ్యక్తికయినా ఇంతకన్నా సువర్ణావకాశం అంది రాదు. తెలివి గలవాడు, అవకాశాలను వినియోగించుకోవటమే లక్ష్యంగా పెట్టుకున్న వాడు ఇలాంటి సమయంలోనే బేరసారాలు మొదలెడతాడు. మీరు సంక్షోభం నుండి బయటపడే మార్గం నేను చూపెడతాను, ముందు నన్ను ఈ చెరసాల నుండి విడుదల చేయండి అంటాడు. కాని మహనీయ యూసుఫ్(అ) నుండి ఇలాంటి డిమాండ్లు ఏవీ రాలేదు. ఎందుకంటే ఆయనలో ఉన్నది కేవలం 'ప్రతిభ' (సలాహియత్) ఒక్కటే కాదు. దాంతోపాటు మంచితనం (సాలీహియత్) కూడా ఆయనలో మెండుగా ఉంది. ఆయన ఒక సంఘ సంస్కర్త (ముస్లెహ్) మాత్రమే కాదు, ఒక దేశ శ్రేయోభిలాషి (నాసెహ్) కూడాను. ప్రజా ప్రయోజనాలకు పెద్దపీట వేసే ప్రయోజకుడు (నాఫె) కూడాను. సాధారణ మేధావులు, కవులు, సాహితీపరుల్లాంటి వారైతే ఇలాంటి బంగారు అవకాశాలను వినియోగించుకుంటూ తక్షణం తమను రాజు గారి సమక్షంలో హాజరు పరచమని చెప్పేవారేమో! కాని యూసుఫ్ మామూలు మనిషి కారు, ఆయన మహా మనీషి! విస్తృత ప్రాతిపదికన మానవ ప్రయోజనాలపై దృష్టి నిలిపిన మానవ మహోపకారి!! అందుకే ఆయన ఈ సందర్భంగా బేరసారాలు చేయకుండా, సన్నాయి నొక్కులకు ఆస్కారమివ్వకుండా, ఎలాంటి తాత్సారం కూడా చేయకుండా– నిస్వార్థ సేవాభావంతో–రాజుగారి కలకు భావార్థం చెబుతూ ఇలా అన్నారు :

**“మీరు ఏడు సంవత్సరాల వరకూ నిరంతరం సేద్యం చేస్తూ ఉంటారు. ఈ (ఏడేండ్ల) కాలంలో మీరు కోసిన పంటల్లో నుంచి కేవలం మీ తిండికి సరిపడి నంత భాగం తీసుకుని, మిగిలినదంతా వెన్నుల్లో అట్టే (నిలువ చేసి) పెట్టండి. ఆ తరువాత చాలా కఠినమయిన ఏడు సంవత్సరాలు వస్తాయి. ఆ దుర్భిక్ష కాలంలో మీరు, ఇదివరకే నిల్వ చేసుకున్న ధాన్యాన్నంతా తినేస్తారు. ఒకవేళ ఏదన్నా మిగిలినా అది బహుకొద్దిగానే ఉంటుంది. ఆ తరువాత ఒక సంవత్సరం వస్తుంది. ఆ ఏడు ప్రజల మొర ఆలకించబడుతుంది (పుష్కలంగా వర్షాలు కురుస్తాయి). ఆ ఏడు మీరు ద్రాక్ష రసం పిండుతారు.”**

***(యూసుఫ్ : 47-49)***

చూశారా!

ఆయన కేవలం ‘కల’కు భావార్థం చెప్పి ఊరుకోలేదు. దేశం ఎదుర్కోబోతున్న సంక్షోభాన్ని అధిగమించే తరుణోపాయం కూడా సూచించారు.

ప్రశ్నించేవాడు రాజ్యాధిపతి!

సమాధానం ఇచ్చేవాడు జైలులోని చీకటి గదిలో మగ్గుతున్న బానిస వ్యక్తి.

అయితే తన వద్ద ఉన్న జ్ఞాన పరిమళాన్ని పంచిపెట్టడంలో అతను చక్రవర్తి కన్నా ఎక్కువ ఉదారబుద్ధిని కలిగివున్నాడు.

తనకు నీడ కల్పించిన రాజ్యం పట్ల, ఆ రాజ్య ప్రజల ఉజ్వల భవిష్యత్తు పట్ల అతనిలో గల చింతన, శ్రేయోభిలాష ఒక్కసారిగా పైకెగసి వచ్చాయి. కోరిన దానికన్నా అధికంగా ఆయన రాజుగారి జోలి నింపేశారు.

## ధర్మ ప్రదాత లక్షణం

ఈ రాజ్యం నాకిచ్చిందేమిటి? నా నైతిక నిబద్ధత వల్ల ఈజిప్టులో నాకు ఒరిగిందేమిటి? అని ఆయన నకారాత్మకం (Negative)గా ఆలోచించలేదు. ఈ రాజ్యానికి నేనివ్వగలిగిందేమిటి? అని మాత్రమే ఆలోచించారు. ఇప్పుడాయన దృష్టిలో మానవసేవే పరమావధిగా ఉంది. దేవుడు తనకు వొసగిన విద్య ద్వారా, తన మనోనేత్రం చూస్తున్న పరిస్థితుల స్వరూపం ఆధారంగా తాను పసిగట్టిన ప్రమాదాన్ని ఎరుకపరచి, అందరినీ అప్రమత్తం చేయటంలో మహనీయ యూసుఫ్ (అ) ఒక్క క్షణం కూడా ఆలస్యం లేదు. ఒక సామాన్య మనిషికీ– ఒక ప్రవక్తకు మధ్య ఉండే వ్యత్యాసం ఇదే. తాను నివసించే ప్రదేశంలోని ప్రజల బాగోగులను కోరుకోని వానికి ‘ధర్మ

బోధకుడు' అనిపించుకునే హక్కే ఉండదు. ఒక మానవ సముదాయంపైన కష్టాల ఖడ్గం వ్రేలాడుతూ ఉండగా, తనను జైలు నుండి విడుదల చేసే మాటైతేనే తాను అందరినీ గండం నుంచి గట్టెక్కిస్తానని బేరమాడటం నిస్వార్థ సేవ అనిపించుకోదు. పైగా అది పచ్చి అవకాశవాదమవుతుంది. స్వార్థబుద్ధి అనిపించుకుంటుంది.

యూసుఫ్ (అలైహిస్సలామ్) ద్వారా ఈ కల భావార్థం తెలుసుకున్న వ్యక్తి, ఈ శుభవార్తను మోసుకుని అమితానందంతో రాజుగారి దర్బారుకు వెళ్ళాడు. అది కేవలం కలకు భావాన్వయం మాత్రమే కాదు,

అదొక తరుణోపాయం!

అదొక సప్తవర్ష ప్రణాళిక!!

దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుండి గట్టెక్కించే అమూల్యమైన సలహా!!!

వీటన్నింటికీ మించి ఎదుటివారి దాష్టీకాన్ని గురించి ప్రశ్నించకుండా, నెపమెన్నకుండా ఉపకారం చేయాలన్న నేర్పరితనం!!!!

నిస్వార్థ సేవా పరాయణత!!!!!

మరి ఈ కల భావార్థం తెలుసుకున్న ఈజిప్టు రాజ్యాధిపతి ఏం చేశాడు? యూసుఫ్ (అ)ని జైలు నుండి విడుదల చేశాడా? యూసుఫ్ (అ)గారి ఆర్థిక ప్రణాళికకు ఆమోదముద్ర వేశాడా?

## కారాగారం నుండి కింగ్ కోరికి

యూసుఫ్ (అ) చెప్పిన కల భావార్థం విన్న రాజు అమితంగా ప్రభావితు డయ్యాడు. ఆ ఖైదీని గురించి వాకబు చేశాడు. అతనిని విడుదల చేసి తన దగ్గరకు పిలుచుకు రమ్మని పురమాయించాడు. రాజ దూత రాజుగారి సందేశాన్ని మోసుకుని జైలుకు వచ్చాడు సంతోషంగా.

ఈ సందేశాన్ని మహనీయ యూసుఫ్(అ) సంతోషంతో స్వాగతించాల్సింది. ఎందుకంటే రాజ్యాధిపతి స్వయంగా తనకు కబురంపాడు. తనను కారాగారం నుండి విడుదల చేస్తున్నాడు. కాని యూసుఫ్ (అ) ఆలోచనలు మరో విధంగా ఉన్నాయి. ఆయన జైలు గడప దాటడానికి గానీ, రాజ్యాధిపతితో సమావేశమవటానికి గానీ సుముఖంగా లేరు. తన దగ్గరకు వచ్చిన రాజ దూతతో, 'నీవు నీ చక్రవర్తి వద్దకే తిరిగి వెళ్ళు. తమ చేతులు కోసుకున్న ఆ ఇంతుల సంగతి ఏమయిందో ఆయన గారిని అడుగు' అన్నారు.

## వజ్ర సంకల్పి

ఇక్కడొక ప్రశ్న ఉదయిస్తుంది– సాధారణంగా ప్రపంచంలోని ఏ బాధిత ఖైదీ అయినా ఇలాంటి సందర్భంలో చేసేదేమిటి? ఈ సత్య స్వరూపుడు చేసిందేమిటి?

కాస్త ఆలోచించండి! ఈయన ఏ మట్టితో చేయబడ్డారు? ఈయన శీలం ఏ ఏ అణు పదార్థాలతో పాకాన పడింది. ఎటువంటి మనో నిగ్రహమది? ఎలాంటి వజ్ర సంకల్పమది? పౌరుషం, స్వాభిమానం, ఆత్మ గౌరవం ఆయన అణువణువునూ పెనవేసుకుని ఉన్నాయి. రాజు గారి ఆఫర్‌ను తిరస్కరించి, జైలులోనే నిరీక్షించాలను కున్న యూసుఫ్(అ) నైతిక నిబద్ధతలో జగమంతా ఒదిగి వుంది.

ఆయన సంకేతప్రాయంగా చెప్పదలచిందేమిటంటే; నిశ్చయంగా జైలు నుండి విడుదలవటమనేది శుభవార్తే! కాని నేను చేయని నేరానికి నన్ను కటకటాల వెనక్కి పంపారే!? నా నేరమేమిటో తేల్చకుండానే విడుదల చేస్తే అది నాకు సంతోషకరం ఎలా అవుతుంది? పైగా ఇది రాజుగారి 'క్షమాభిక్ష' పైననో, 'దయా దాక్షిణ్యాల'పైననో ఆధారపడిన విడుదలే అవుతుంది. నేను జైలు నుండి బయటపడతాను. కాని నేను లోకం దృష్టిలో మాత్రం కళంకితుడినే. కాకపోతే రాజు గారు ఒక కలగన్నారు. ఆ కలకు భావార్థం ఎవరూ చెప్పలేకపోతే నేను దాని భావార్థం చెప్పగలిగాను. కాబట్టి రాజు గారు సంతోషించి నన్ను కటాక్షించారు. దాంతో నేను స్వేచ్ఛా వాయువులు పీల్చగలిగాను. అంతేగా! ఆ విధంగా ఇది రాజుగారి ఉపకారం అయింది, న్యాయా న్యాయాల నిర్ణయం మాత్రం కాదు. నాకు అంటుకున్న కళంకం మాత్రం ఇంకా ప్రక్షాళనం కానేలేదు. వద్దొద్దు... ఇలాంటి ఉపకారం నాకొద్దు. రాజు గారి దయా దాక్షిణ్యాలపై ఆధారపడిన విడుదలకు నేనంగీకరించను. ఒకవేళ నేను అపరాధానికి ఒడిగట్టి ఉంటే శిక్షార్హుణ్ణే. ఒకరి 'క్షమాభిక్ష' నాకెందుకు? ఒకవేళ నేను అపరాధం చేయలేదనుకుంటే నా నిర్దోషిత్వాన్ని బాహాటంగా ఒప్పుకోవాలి. నేను శిక్షార్హుణ్ణి కాను గనకనే సగౌరవంగా విడుదల చేయబడ్డానన్న సంగతి లోకానికి తెలియాలి.

## కడిగిన ముత్యం

ఆత్మ గౌరవానికి, సత్యంపై స్థిరత్వానికి సంబంధించిన ఈ 'స్థానం' ఎంత ఉన్నతమయిందీ!? శీలానికి సంబంధించిన ఈ స్థయిర్యం ఎంత విచిత్రమైనది!? ఇందులో ఎక్కడా ఎలాంటి తడబాటుకు, ఊగిసలాటకు తావు కన్పించదు. రాజీ ధోరణి అస్సలే కానరాదు. ఏ కోణం నుంచి చూసినా, ఎటు నుండి వీక్షించినా అందులోని

నిష్కళంకమయిన ప్రత్యేకతలు కొట్టొచ్చినట్లే కనిపిస్తాయి. ఈ సూర్య తేజస్సు ఎన్నటికీ తరగనిది, మసకబారనిది.

★★★

మహనీయ యూసుఫ్ (అ) గారు చేసిన డిమాండు వల్ల రాజు గారి దృష్టిలో ఆయన విలువ మరింతగా పెరిగింది. చేతులు కోసుకున్న మహిళల కేసులో విచారణ ముమ్మరమైంది. ఆ వ్యవహారంలో యూసుఫ్(అ) తప్పేమీ లేదని, ఆనాటి సదనంలో పాల్గొన్న దొరసానులంతా సాక్ష్యమిచ్చారు. 'దేవ దేవ! మేమతనిలో ఏ చెడూ చూడలేద'ని పలికారు. దాంతో అజీజు భార్య జిత్తుల ద్వారాలన్నీ మూసుకుపోయాయి. ఆమె సయితం యూసుఫ్ (అ) సౌశీల్యాన్ని, నిర్దోషిత్వాన్ని ధ్రువీకరించక తప్పలేదు–

"సత్యం ఇప్పుడు బట్టబయలైపోయింది. అతన్ని బుట్టలో వేసుకోవటానికి యత్నించింది నేనే. కాని అతను మాత్రం సత్యసంధుడు. ఇందులో సందేహానికి తావే లేదు."

చూశారా!

ఏలినవారు కదలాలి, కదిలించాలే గాని ఆఘమేఘాల మీద ఎలాంటి చిక్కు ముడులయినా విచ్చుకుంటాయి. ఎలాంటి వివాదాలైనా యుద్ధ ప్రాతిపదికపై పరిష్కారమవుతాయి. రాజు గారి ఆజ్ఞపై న్యాయ విచారణ శీఘ్రగతిన పూర్తయింది. ఇప్పుడు యూసుఫ్ (అ) ఒంటికి అంటుకొని ఉన్న కళంకం ప్రక్షాళనమైపోయింది. ఇప్పుడాయన రాజ్య ప్రజలందరి దృష్టిలో నిష్కళంకమైన వ్యక్తి!

నిర్దోషి!!

కడిగిన ముత్యం!!!

కాపాడని వజ్రం!!!!

## యూసుఫ్ (అ) ప్రత్యేకత

ఈ శుభవార్తను వినిపించడానికి జైలుకు వచ్చిన దూతతో యూసుఫ్(అ) చెప్పిన మాటలు సువర్ణాక్షరాలతో లిఖించదగినవి. ఆయన(అలైహిస్సలామ్) ఇలా అన్నారు :

**"నా మనసు నిర్దోషిత్వం గురించి చాటుకోవాలన్నది నా ఉద్దేశ్యం కానేకాదు. మనసైతే సదా చెడు వైపునకే పురికొల్పుతూ ఉంటుంది– నా ప్రభువు**

**దయదలచినవారు తప్ప. నిశ్చయంగా నా ప్రభువు క్షమాగుణం కలవాడు, దయాశీలుడు."** ***(యూసుఫ్– 53)***

అంటే, నా మనసులో చెడు అన్నదే జనించదని నేను అనటం లేదు. నేనూ మనిషినే. నేనూ ఉప్పూ కారం తినేవాడినే. నాలోనూ మనసనేది ఒకటి ఉంది. అది నన్ను కవ్విస్తూనే ఉంటుంది. అయితే ప్రభువైన అల్లాహ్ కటాక్ష వీక్షణాలు తోడై ఉన్నంతవరకూ, పైశాచిక ప్రేరణల నుండి మనిషి దేవుని శరణు వేడుకుంటూ ఉన్నంతవరకూ అతను అశ్లీలం, నీతి బాహ్యత నుండి సురక్షితంగా ఉంటాడు. ఆంతర్యంలో జనించే దుష్ప్రేరణలను జయించగలుగుతాడు. నేను ఆ స్త్రీలు బిగించిన ఉచ్చులో నుండి బయట పడగలిగానంటే అది నా గొప్పతనం ఏమీ కాదు. కేవలం నా ప్రభువు కృప వల్లనే నేను నా శీలాన్ని కాపాడుకోగలిగాను. అదీగాక నేను ఈ న్యాయ విచారణ కోసం పట్టుబట్టడంలోని ఔచిత్యమేమిటంటే, నిజమేమిటో రాజు గారికి తెలియాలి. నేను నిరపరాధినైనప్పటికీ కారాగారంలో పడవెయ్యబడ్డానన్న వాస్తవం ఆయనకు అవగతమవ్వాలి. అజీజ్ లేని సమయంలో నేను అతని పట్ల ఎలాంటి విశ్వాస ఘాతుకానికి, నమ్మకద్రోహానికి పాల్పడలేదన్న కఠోర సత్యం ఆయనకు సుబోధకమవ్వాలి. విశ్వాసఘాతుకానికి పాల్పడి, వెన్నుపోటు పొడిచేవారి ఎత్తుగడలను అల్లాహ్ విజయవంతం కానివ్వడనీ, నీతికి నిలబడి నిజాయితీగా ముందుకు సాగేవారే సఫలీకృతులవుతారన్న సంగతి వారికి తెలిసి రావాలి. ఈ ఉద్దేశ్యంతోనే నేను, న్యాయవిచారణ జరిపించమని కోరాను...

## రాజుగారి ఆహ్వానం

అంతే... యూసుఫ్‌లోని నిజాయితీ తత్పరతకి, విశ్వాస పాత్రతకి, బహుళార్థక సాధక దృష్టికీ రాజు అమితంగా ప్రభావితుడయ్యాడు. అతని దృష్టిలో ఇప్పుడు యూసుఫ్ (అ) మామూలు మనిషి కారు; మహా మనీషి!

**"ఆయన గారిని నా వద్దకు తీసుకురండి. నేనాయన్ని నా ఆంతరంగిక వ్యవహారాల కొరకు ప్రత్యేకించుకుంటాన"న్నాడు రాజు.** ***(యూసుఫ్ – 54)***

రాజు గారికీ– మహనీయ యూసుఫ్ (అ)కి మధ్యన చర్చలు మొదలయ్యాయి.

తన కలకు భావార్థం చెప్పిన నాడే రాజు ఆయన(అ) మేధా సంపత్తికి ముగ్ధుడై పోయాడు. కేవలం భావార్థం చెప్పి ఊరుకోకుండా, దేశానికి పొంచి ఉన్న విపత్తు నుండి కాపాడే విధానాన్ని కూడా ఆయన సూచించారు. ఈ రెండింటికీ మించిన మరో

గొప్ప విషయం ఏమిటంటే, జైలు నుండి ఆయన్ని తన వద్దకు రప్పించుకోవటానికి మనిషిని పంపించినప్పుడు ఆయన రాలేదు. నిజానిజాల నిర్ధారణ జరిగిన మీదటే వస్తానన్నారు.

ఏక సత్తాక, నిరంకుశ, నియంతృత్వ వ్యవస్థల్లో సర్వాధికారి అయిన పరిపాలకుడు ఎవరినయినా తన ఆంతరంగిక వ్యవహారాల అధికారిగా, హితునిగా నియమించుకున్నాడంటే, అది సాధారణ విషయం కాజాలదు. కీలకమయిన అధికారాలు అతనికి కట్టబెట్టినట్లే.

రాజుగారు– మహనీయ యూసుఫ్ (అ) పరస్పరం ప్రత్యేకంగా సమాలోచన జరిపారంటే, రహస్య మంతనాలు సాగించారంటే ఆ సమావేశానికి గల ప్రాధాన్యత ఎటువంటిదో అనూహ్యం కాదు. ఈ విషయాన్ని ఖుర్‌ఆన్ చాలా క్లుప్తంగానే ప్రస్తావించింది గాని చర్చ సుదీర్ఘంగానే జరిగి ఉంటుంది. ధార్మిక నైతిక విషయాలు కూడా ఆ సందర్భంగా బహుశా ప్రస్తావనకు వచ్చి ఉంటాయి. దేశ ఆర్థిక వ్యవస్థపై, పౌర సరఫరాల నియంత్రణపై తప్పకుండా సంభాషణ జరిగి ఉంటుంది. ముఖాముఖీగా సంభాషణ సాగించినప్పుడే పరిస్థితుల నిజ స్వరూపం ముందుకు వస్తుంది. ఈ సంభాషణ తర్వాత రాజు గారికి మహనీయ యూసుఫ్ (అ)పై మరింత నమ్మకం కుదిరిందని తెలుస్తోంది. అందుకే రాజు గారు యూసుఫ్(అ)నుద్దేశించి,

**"ఈనాటి నుంచీ మీరు మా దగ్గర విశిష్ఠాధికారాలు కల ఆంతరంగికులు"** అని చెప్పాడు.

## యూసుఫ్(అ) ప్రతిపాదనలు

ఈ మాటలకు యూసుఫ్ (అ) ఉబ్బితబ్బిబ్బవలేదు. ధన్యవాదాలు తెలుపుకుని, లభించిన పదవిని కళ్ళకద్దుకోలేదు. ఎందుకంటే, ఆయనకు కావలసింది కేవలం పదవి కాదు, అధికారం అంతకన్నా కాదు. ఇప్పుడు ఆయన ధ్యాసంతా రాజ్య సంక్షోభంపైనే ఉంది. ఆయన ఆలోచనలన్నీ ప్రజా సంక్షేమం చుట్టే తిరుగుతున్నాయి. ఈజిప్టు రాజ్యాన్ని, ఈజిప్టు ప్రజలను తీవ్రమయిన ఆర్థిక సంక్షోభం నుండి కాపాడటమే ఇప్పుడు ఆయన ముందున్న ప్రప్రథమ లక్ష్యం. ఆ లక్ష్యసాధనకై ఏ పోర్టుఫోలియో ఉంటే బాగుంటుందో, తాను ఇప్పుడు చేయాల్సిందేమిటో ఆయనకు తెలుసు. అందుకే ఆయన (అ) ఇలా అన్నారు :

**దేశంలోని ఆదాయ ఒనరులన్నీ నాకు స్వాధీనపరచండి. నేను వాటిని కాపాడు తాను. ఆ పరిజ్ఞానం నాకుంది.”** ***(యూసుఫ్– 55)***

తనలోని ‘నాసెహ్’ (దేశ శ్రేయోభిలాషి, బాగోగులు కోరేవాడు) జాగృతమయిన క్షణాన రాజుగారి సమక్షంలో ఎలాంటి దాపరికం, మొగమాటం లేకుండా యూసుఫ్ (అ) నిర్ధిష్టంగా, నిష్కర్షగా చెప్పిన మాటలివి!

అంటే వ్యవసాయోత్పత్తులపై, పౌర సరఫరాల వ్యవస్థపై నాకు పూర్తి అధికార ముండాలి. డిమాండు – సప్లయ్ (Demand and Supply) లను క్రమబద్ధం చేసి మార్కెట్ సమతౌల్యం (Equilibrium) ఎలా స్థాపించాలో నాకు తెలుసు. ఆ విషయ పరిజ్ఞానం నాకుంది. ఈ శాఖలో కొన్ని సంస్కరణలు కూడా తీసుకు వస్తాను. రాజ్య ప్రయోజనాల దృష్ట్యా ఎగుమతి– దిగుమతులను నియంత్రిస్తాను. పొదుపు చర్యలను చేపడతాను. నన్ను నమ్మండి. ఈ పోర్టుఫోలియోకు సంబంధించినంతవరకూ వేరితరుల ప్రమేయం ఉండకూడదు.

మహనీయ యూసుఫ్(అ) ప్రతిపాదనను ఈజిప్టు చక్రవర్తి సంతోషంగా ఆమోదించాడు. ఎందుకంటే అతను కోరుకున్నదీ అదే. ఒక విధంగా చెప్పాలంటే ఈజిప్టు రాజ్యాధికారం యూసుఫ్(అ) ఉంగరం క్రిందికి వచ్చేసింది. తౌరాతు ప్రకారం ఈజిప్టు చక్రవర్తి (ఫిరౌన్) యూసుఫ్ ప్రతిపాదనలను తన దర్బారు ప్రముఖుల దృష్టికి తీసుకువస్తూ “ఇటువంటి వానిని మనం ఎటునుండి తేగలము? ఇతనిలో దేవుని ఆత్మ తొణికిసలాడుతోంది” అన్నాడు. ఆ తరువాత అతను యూసుఫ్(అ) నుద్దేశించి ఇలా అన్నాడు :


*“దేవుడు ఇదంతయూ నీకు తెలియపరిచెను గనుక నీ వలె వివేక జ్ఞానములు గలవారెవరును లేరు. నీవు నా ఇంటికి (రాజ్యానికి) అధికారివై యుండవలెను. నా ప్రజలందరు నీకు విధేయులై యుందురు; సింహాసన విషయంలో మాత్రమే నేను నీకంటే పైవాడనై యుందును. మరియు ఫరో– చూడుము, ఐగుప్త దేశమంతటి మీద నిన్ను నియమించి ఉన్నానని యోసేపుతో చెప్పెను. మరియు ఫరో తన చేతినున్న ఉంగరము తీసి యోసేపు చేతికి పెట్టి, సన్నపు నార బట్టలు అతనికి తొడిగించి, అతని మెడకు బంగారు గొలుసు వేసి తన రెండవ రథము మీద అతనినెక్కించెను. (అతను వెడలి)నప్పుడు– వందనము చేయుడని అతని ముందర జనులు కేకలు వేసిరి. అట్లు ఐగుప్త దేశమంతటి మీద అతనిని నియమించెను. మరియు ఫరో యోసేపుతో–*

*ఫరోను (ఫిరౌన్) నేనే. అయినను నీ సెలవులేక ఐగుప్త దేశమంతటను ఏ మనుష్యుడును తన చేతినైనను కాలినైనను ఎత్తకూడదు అని చెప్పెను. మరియు ఫరో యోసేపునకు 'జప్నత్పనేహు' (లోక విమోచకుడు) అను పేరు పెట్టెను.*

*(ఆదికాండము– 41: 40–45)*

ఈ విషయాన్నంతటినీ ఖుర్‌ఆన్ ఎంతో క్లుప్తంగా ఇలా చెప్పింది:

**"ఈ విధంగా మేము యూసుఫ్‌కు (ఈజిప్టు) రాజ్యంలో అధికార సత్తా పొందే మార్గం సుగమం చేశాము. తాను కోరిన చోట నివాసమేర్పరచుకునే అధికారం అతనికి ఉండేది. మేము కోరిన వారిని మా కృపతో (ఇలాగే) కటాక్షిస్తాము. సదాచార శ్రేష్ఠుల ప్రతిఫలాన్ని మేము వృథా కానివ్వము. అయితే పరలోకంలో లభించే ప్రతిఫలం ఇంతకన్నా మేలైనది. విశ్వసించి, దైవభక్తి పరాయణతతో కృషి చేసిన వారికి అది ప్రాప్తమవుతుంది."** ***(యూసుఫ్ – 56, 57)***



**అలనాటి ఈజిప్టులోని పల్లె సీమలు, వ్యవసాయ క్షేత్రాలు ఇలా ఉండేవి**

దీని ద్వారా అర్థమయ్యేదేమిటంటే, ఒక్క కిరీటం (Crown) తప్ప మిగిలిన రాజ్యాధికారాలన్నీ హజ్రత్ యూసుఫ్ (అ)కు లభించాయి. ఆయన ఈజిప్టు రాజ్యం లోని ఏ ప్రాంతంలోనయినా అధికార నివాసాన్ని ఏర్పరచుకోవచ్చు. ఎప్పుడయినా, ఏ ఆర్డినెన్సునయినా జారీ చేయవచ్చు. కాయిలాపడిన ఆర్థిక వ్యవస్థకు కాయకల్ప చికిత్సలో భాగంగా ఏ ఆంక్షలయినా విధించవచ్చు. అడ్డు చెప్పే అధికారం ఎవరికీ లేదు.

యూసుఫ్(అ) గారి పరీక్షలు కూడా ఆయన కన్న 'కల'తోనే మొదలయ్యాయి. ఆయన(అ)కు అధికారం, గౌరవం కూడా రాజు గారు కన్న 'కల'తోనే లభించాయి. అదీ విచిత్రం, విశేషం!


మహనీయ యూసుఫ్(అ)కు అందివచ్చిన ఈ రాజ్యాధికారాన్ని ఆయన స్వీకరించడంలో కూడా షరీఅత్ పరమయిన పరమార్థాలెన్నో ఇమిడి ఉన్నాయి. ఏమిటా పరమార్థాలు?

## దేశ శ్రేయస్సు దృష్ట్యా పదవిని స్వీకరించటం....

"రాజ్యంలోని ఒనరులపై (ఖజానాలపై) నన్ను అధికారిగా నియమించండి. నేను వాటిని కాపాడుతాను. ఆ పరిజ్ఞానం నాకుంది" (12: 55) అని ఈజిప్టు చక్రవర్తిని కోరారు మహనీయ యూసుఫ్(అ).

అలా కోరినంత మాత్రాన హజ్రత్ యూసుఫ్ (అ)కు పదవీ వ్యామోహం ఉందని భావించనవసరం లేదు. సాధారణ పరిస్థితుల్లోనయితే ప్రజలు తమంతట తాముగా పదవిని కాంక్షించకూడదు. ఇస్లాం దృష్టిలో పదవీ వ్యామోహం ఒక అనర్హత, అధర్మం కూడా. కాని రాజ్యంలో అరాచకం, అవ్యవస్థ, ఆర్థిక మాంద్యంలాంటి విపత్కర పరిస్థితులు ఉత్పన్నమైనప్పుడు ఆయా రంగాలలో నిష్ణాతులైనవారు తగు సూచనలివ్వటంతోపాటు దేశానికి తమ విశిష్ఠ సేవల అవసరం ఉందని భావిస్తే ఆ పదవీ బాధ్యతలను స్వీకరించటానికి ముందుకు రావచ్చు. రావాలి కూడాను. ఎందు కంటే సకాలంలో సంక్షోభాన్ని ఎదుర్కొని రాజ్యాన్ని ఆ సుడిగుండం నుంచి గట్టెక్కిం చడం చాలా అవసరం. లేకపోతే సమస్య మరింత జఠిలమవుతుంది.

అదలావుంచితే మహనీయ యూసుఫ్ (అలైహిస్సలామ్) తనకు తానై పదవిని కోరలేదు. కీలకమయిన శాఖలన్నీ కట్టబెట్టడానికి రాజ్యాధిపతి సిద్ధమైనప్పుడు, కేవలం




ఆర్థిక సంస్కరణలు తీసుకువచ్చే శాఖలు మాత్రమే తనకు అప్పగించమని ప్రతిపాదించారు. ఇదీ గమనార్హ విషయం.

**"ఇన్నీ హాఫీజున్ అలీమ్"** ***(12: 55)***

(నేను వాటిని కాపాడుతాను. ఆ పరిజ్ఞానం నాకు ఉంది).

ఆ కాపాడటం కూడా అట్లా ఇట్లా కాదు. చాలా కచ్చితంగా వ్యవహరిస్తాను. దుబారా ఖర్చులు తగ్గిస్తాను. పొదుపు చర్యలు గైకొంటాను. వ్యవసాయోత్పత్తులు చెడిపోకుండా ఉండేలా ఆహార గిడ్డంగులను కనిపెట్టుకుని ఉంటాను. దీనికి సంబంధించిన జమా ఖర్చులపై నిఘా వేసి ఉంచుతాను. దానిపై నాకు పూర్తి అవగాహన ఉంది. కాబట్టి ఈ విషయంలో మీరు నిశ్చింతగా ఉండండి అని హజ్రత్ యూసుఫ్ (అ) అక్కడి రాజ్యాధిపతికి హామీ ఇచ్చారు.

**"ఈ విధంగా మేము యూసుఫ్‌కు (ఈజిప్టు) రాజ్యంలో అధికారాన్ని ప్రసాదించాము. అక్కడ తాను కోరినచోట నివాసమేర్పరచుకునే సౌలభ్యం (కూడా) అతనికి వొసగాము, .... సదాచార శ్రేష్ఠుల ప్రతిఫలాన్ని మేము వృథా కానివ్వము."** ***(12 : 56)***

## ముందు జాగ్రత్త చర్యలు

అంటే, ఇప్పుడు ఈజిప్టు భూభాగమంతా ఆయనదే. అందులో ప్రతి స్థలాన్నీ ఆయన తనదిగా చెప్పగలరు. ఏ చోటనయినా ఆయన్ని నిరోధించగలవారు ఎవరూ లేరు. రాజుగారు కన్న కల దృష్ట్యా ఆయన మొదటి ఏడేళ్ళలో (పంటలు బాగా పండే సమయంలో) కరువు కాలానికి గాను అవసరమయిన ముందు జాగ్రత్త చర్యలన్నీ తీసుకున్నారు. ఆ తరువాత కరువు కాటకాలొచ్చాయి. ఒక్క ఈజిప్టే కాదు, చుట్టుపక్కలున్న దేశాలన్నీ దాని ప్రభావానికి గురయ్యాయి. సిరియా, ఫాలస్తీనా, తూర్పు జోర్డాన్, ఉత్తర అరేబియా అంతటా వర్షాభావం వల్ల కరువు రాజ్యమేలింది. అయితే హజ్రత్ యూసుఫ్(అ) గైకొన్న ప్రణాళికాబద్ధమైన చర్యల వల్ల– కరువు కాటేసి నప్పటికీ– ఈజిప్టు మాత్రం సిరిసంపదలతో తులతూగింది.

## ముఖ్యాంశాలు

యూసుఫ్ (అ) వృత్తాంతంలోని ఈ భాగంలో గుణపాఠం నేర్చుకునే అంశాలెన్నో ఇమిడి ఉన్నాయి. షరీఅత్‌తో ముడిపడిన పలు ఆదేశాల వైపు కూడా ఇందులో సంకేతం ఉంది. ఇక్కడ మనం కాస్త ఆగి ఆ ముఖ్యాంశాలను కూడా ఓసారి నెమరు వేసుకోవటం సమంజసంగా ఉంటుంది.

- మహనీయ యూసుఫ్ (అ) గారి ఈ గాథ వల్ల మనకు తెలిసేదేమిటంటే, కలలన్నీ కల్లలు కావు, కొన్ని కలలు నిజమైనవి కూడా అయి ఉంటాయి. ముఖ్యంగా దైవప్రవక్తల కలలు. కాని కలగన్న ప్రతి వ్యక్తీ లోకంలో సజ్జనుడు, సత్యమూర్తి అయి వుండాలనే ఏమీ లేదు. ఎందుకంటే ఈజిప్టు రాజ్యాధిపతి విశ్వాసి (మోమిన్) కాడు. అయినప్పటికీ అతను కన్న కల నిజమయింది.
- సాధారణంగా ఏ కలకయినా మొదట ఇవ్వబడిన భావాన్వయం ప్రకారమే జరుగుతుందన్న అభిప్రాయం ఉంది. కాని ఈ కల విషయంలో మాత్రం అలా జరగలేదు. రాజు గారి ఈ కల గురించి అతని ఆస్థాన ప్రముఖులు విని, ఇది అర్థం పర్థం లేని పీడ కల అన్నారు. అయితే ఇదే కలకు– ఆ తరువాత– హజ్రత్ యూసుఫ్ (అ) చెప్పిన భావార్థం నిజమని తేలింది. (ఖుర్తుబీ:9/201)
- హజ్రత్ యూసుఫ్ (అ) కేవలం కల భావార్థం చెప్పి ఊరుకోలేదు. పైగా ఆయన రాజ్యంలో ఏర్పడనున్న దుర్భిక్షాన్ని ఎదుర్కొనే ఉపాయాన్ని కూడా వివరించారు. దీనిద్వారా విదితమయ్యేదేమిటంటే ప్రపంచంలో ఉత్పన్నమయ్యే

సమస్యలకు పరిష్కారం చూపుతూ మార్గదర్శకత్వం వహించటం వాంఛ నీయం. పైగా ఇది ధార్మికంగా, షరీఅతు పరంగా అభిలషణీయమే.

*(ఖుర్తుబీ : 9/203).*

- హజ్రత్ యూసుఫ్(అ) కేవలం కరువు కాటకాల ప్రమాదం పొంచి ఉందని చెప్పేసినా కల భావార్థం పూర్తయిపోయేది. కాని దేవుడు ఆయనకు ప్రసాదిం చిన విద్యననుసరించి ఈ కరువు కాటకాల తరువాత మంచి రోజులు కూడా రానున్నాయని శుభవార్త వినిపించారు. దీనినిబట్టి బోధపడే మరో ముఖ్యాంశం ఏమిటంటే, ప్రశ్నించేవారు ఎదుర్కొంటున్న సవాళ్ళను దృష్టిలో పెట్టుకుని, సమాధానపరిచేటప్పుడు సముచితమయిన సలహాలు కూడా ఇవ్వవచ్చు.
- సుదీర్ఘమయిన కారాగార జీవితం తరువాత తన విడుదలకై ఉత్తర్వు జారీ అయినప్పుడు మహనీయ యూసుఫ్ (అ) ఏమాత్రం ఆత్రం కనబరచకుండా, ముందు తన మీద మోపబడిన నిందారోపణపై విచారణ జరపమని కోరారు. యూసుఫ్(అ)లోని ఈ గుణ విశేషాన్ని శ్లాఘిస్తూ మహాప్రవక్త ముహమ్మద్(స) ఇలా అన్నారు : "నా సోదరుడైన యూసుఫ్(అ)పై అల్లాహ్ అనుగ్రహం కురియుగాక! ఆయన గొప్ప సౌమ్యుడు, సహనశీలుడు. కనుకనే ఆయన అన్నాళ్ళు చెరసాల జీవితాన్ని భరించారు. ఆ స్థానంలో నేనుంటే విడుదల కబురు తెచ్చినవాని పిలుపుకు తక్షణం సకారాత్మకంగా స్పందించి ఉండేవాణ్ణి. బయటికి రావటానికి నిరాకరించేవాణ్ణి కాను" (ఖుర్తుబీ : 9/206)– దీని ద్వారా లభించే గుణపాఠం ఏమిటంటే, ధర్మసేవా మార్గంలో ఏదయినా కీలకమయిన స్థానంలో ఉన్నవారు తమ వ్యక్తిత్వానికి ఎలాంటి మచ్చలేకుండా జాగ్రత్తపడాలి. ఎవడయినా తమపై బురద జల్లినా, వాస్తవ స్థితిని ప్రజా బాహుళ్యానికి స్పష్టం చేయాలి. ధర్మావలంబీకుల నమ్మకం చెక్కుచెదరకుండా ఉండేందుకు ఈ జాగ్రత్త అవసరం.
- హజ్రత్ యూసుఫ్(అ) ప్రత్యేకంగా 'అజీజె మిస్ర్' భార్య గురించి ప్రస్తావించ కుండా, 'ఆ ఇంతుల సంగతి ఏమయింది?' అంటూ సర్వ సామాన్యమయిన రీతిలో అడిగారు. ఇది ఆయనలోని విశాల హృదయతకి, మంచితనానికి ఒక మచ్చుతనక. ఎందుకంటే ఆమె పేరుపెట్టి విచారణకై డిమాండ్ చేసివుంటే అది ఆమెకు మరింత అవమానకరంగా ఉండేది.

- 'నన్ను అశ్లీల కార్యం వైపునకు ఆహ్వానించిన ఆ స్త్రీల వ్యవహారం ఎంతవరకు వచ్చింది?' అని అనకుండా 'తమ చేతులు కోసుకున్న ఆ మహిళామణుల సంగతి ఏమయింది?' అని మాత్రమే అడిగారు. అంటే తన నోటితో చెడును ప్రస్తావించటం గానీ, ఆ మహిళలకు అశ్లీలాన్ని అంటగట్టడం గానీ చేయలేదు. *(మఫాతీహుల్ గైబ్ : 9/74)*
- మహనీయ యూసుఫ్ (అ)లోని సంస్కారాన్ని కూడా చూడండి– ఆయన స్వయంగా ఒక ప్రవక్త, ఆయన తండ్రి యాఖూబ్(అ) దైవప్రవక్త. ఆయన తాతగారు ఇస్‌హాఖ్(అ) దైవప్రవక్త. ఆయన ముత్తాత అయిన ఇబ్రాహీమ్(అ) కూడా ప్రవక్తే. అందుకే ముహమ్మద్ ప్రవక్త(స) యూసుఫ్(అ) గొప్పతనాన్ని వివరిస్తూ 'కరీమ్ బిన్ కరీమ్ బిన్ కరీమ్ బిన్ కరీమ్'గా ఖరారు చేశారు. (సహీహ్ బుఖారీ– కితాబుల్ అంబియా, హదీసు నెం. 3374). అయినప్పటికీ ఆయన తన మనసు పవిత్రత గురించి గొప్పలు చెప్పుకోలేదు. పైగా ఆయన (అ) ఇలా అన్నారు : "నేను నా మనసు నిర్దోషిత్వం గురించి చాటుకోవడం లేదు. మనసైతే చెడు వైపునకే పురిగొల్పుతుంది. తన ప్రభువు కటాక్షం ఉన్నవాడు మాత్రమే మనసు మాయ నుండి తనను కాపాడుకోగలుగుతాడు"– ఇదొక హెచ్చరిక వంటిది. ఎంతటి వేదాంతులైనా, మహానుభావులైనా తమ మనసులోని ప్రేరణల విషయంలో నిశ్చింతగా ఉండరాదు. పాపకార్యాల నుండి తప్పించుకున్నవారు ఎవరయినా, దానిని తమ గొప్పతనంగా కాకుండా, దైవకారుణ్యంగా భావించాలి.
- పదవిని కాంక్షించరాదని ప్రవక్త మహనీయులు(స) ఉద్బోధించారు. అయితే మహనీయ యూసుఫ్(అ) ఆర్థిక వ్యవహారాల శాఖను ఇవ్వమని ఈజిప్టు చక్రవర్తిని కోరారు. ఏమిటిది? అంటే వాస్తవానికి అందులో వైరుధ్యం, వ్యాఘాతం ఏమీ లేదు. ఏదయినా ఒక కీలక బాధ్యతను నిర్వర్తించగల సమర్థులు అనేకమంది ఉన్నప్పుడు, ఆ పదవి తనకే కావాలని చెప్పటం ధర్మసమ్మతం కాదు. కాని అలాంటి సమర్థుడు ఒక్కడంటే ఒక్కడే ఉన్నప్పుడు ఆ హోదా కొరకు ముందుకు రావటం ధర్మసమ్మతమే. పైగా కొన్ని అసాధారణ పరిస్థితుల్లోనయితే ఆ బాధ్యతను మోయడానికి ముందుకు రావటం అవశ్యం కూడా. ఎందుకంటే అందులో కేవలం అతని వ్యక్తిగత శ్రేయం మాత్రమే లేదు, ప్రజా శ్రేయస్సు ఇమిడి వుంది. నాకు ఫలానా శాఖ కేటాయించండి అని మహనీయ యూసుఫ్(అ) కోరటంలోని ఔచిత్యం ఇదే.

- ఈ సంఘటన ద్వారా విదితమయ్యే మరో విషయమేమంటే, ఒక ముస్లిం ఒక ముస్లిమేతర వ్యక్తి వద్దగానీ లేదా ప్రభుత్వంలోగానీ ఉద్యోగిగా పనిచేయటంలో తప్పులేదు. కాకపోతే అతనికి అప్పగించబడిన పని ధర్మసమ్మతమైనదై ఉండాలి.
- దీనిద్వారా తెలిసే ఇంకొక ముఖ్య విషయం ఏమిటంటే, ఏ రాజ్యంలోనయినా ప్రజాస్వామిక వ్యవస్థ ఉంటే, అక్కడి ఎన్నికలలో అభ్యర్థిగా పోటీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడితే అక్కడి ప్రజలకు నిస్వార్థంగా సేవ చేయాలన్నదే, తోటి ముస్లిం సోదరుల హక్కుల రక్షణకై పాటుపడాలన్నదే ధ్యేయమై ఉంటే- ఒక అభ్యర్థిగా పోటీ చేయటం కూడా ధర్మసమ్మతమే.
- మహనీయ యూసుఫ్ (అ) ఈజిప్టు చక్రవర్తితో, నేను హఫీజ్‌తోపాటు అలీమ్‌ను కూడా అంటారు. అంటే నిజాయితీగా ఒనరులను రక్షిస్తాను, ఆ విషయ పరిజ్ఞానం నాకుంది అని చెప్పదలిచారు. దీనినిబట్టి అవగతమయ్యే దేమిటంటే ఏదయినా ఒక కార్యాన్ని సమర్థవంతంగా నెరవేర్చడానికి ప్రాథమికంగా రెండు యోగ్యతలు చాలా అవసరం. 1) నిజాయితీ తత్పరత 2) విషయావగాహన, విషయ పరిజ్ఞానం. అవసరమయిన చోట- సందర్భాన్ని బట్టి - ఒక మనిషి తనలోని ప్రతిభను, కార్యదక్షతను, సుగుణాలను, సర్టిఫికేట్లను ప్రదర్శిం చటంలో తప్పు లేదని కూడా దీని ద్వారా అర్థమవుతోంది. ఎందుకంటే ఈ 'అభివ్యక్తి'లోని ఉద్దేశం తన గురించి తెలియజేయటమే తప్ప గర్వాహంకార ప్రదర్శన కాదు.

ఈజిప్టు రాజ్యమైతే ఆర్థిక సంక్షోభం నుండి గట్టెక్కింది. మరి దాని ఇరుగు పొరుగు రాజ్యాల సంగతేమిటి? కనాన్‌లోని యూసుఫ్(అ) అన్నలెలా ఉన్నారు? ఆయన తండ్రి హజ్రత్ యాఖూబ్(అ) పరిస్థితి ఎలా వుంది?

★★★

## అనుబంధం, ఆత్మీయత ఉప్పొంగిన వేళ...

కాలచక్రం నిరాటంకంగా తిరుగుతోంది. ఇక్కడ ఈజిప్టులో యూసుఫ్ (అ) ఒక ప్రవక్తగా, అధికారిగా తన పని తాను చేసుకోపోతుంటే, అక్కడ కనాన్‌లో ఆయన ముసలి తండ్రి యాకూబ్(అ) పసితనంలో దూరమైన కొడుకును తలచుకుని దు:ఖంతో తల్లడిల్లిపోతున్నారు. తన కొడుకు గురించి ఆయన ఇప్పటికీ ఆశ వదులుకోలేదు.

ఎందుకంటే బాల్యంలో యూసుఫ్(అ) కన్న కల తప్పక నిజమవుతుందని ఆయనకు తెలుసు.

ఏడు సంవత్సరాలు పంటలు బాగా పండాయి. ఈ ఏడేళ్ళ కాలంలో యూసుఫ్ (అ) నేతృత్వంలో ఆహార ధాన్యాల సరఫరాను క్రమబద్ధం చేయటం జరిగింది. మరో ఏడు సంవత్సరాలకు సరిపడా ధాన్యాలు నిల్వ చేయబడ్డాయి. ఆ తరువాత ఊహించి నట్లుగానే కరువు కాలం వచ్చింది. ఈజిప్టుతో సహా సిరియా, కనాన్, తూర్పు జోర్డాన్, అరేబియా ప్రాంతాలన్నీ వర్షాలు లేక విలవిల్లాడాయి. ఇప్పుడు ఈ ప్రాంతాల వారికి తిండి గింజలు లేవు. ఈజిప్టులో కరువు రాలేదని కాదు, అక్కడ కూడా కరువు వచ్చింది. అయితే మహనీయ యూసుఫ్ (అ) గారి ప్రణాళికాబద్ధమయిన ఆర్థిక విధానాల కారణంగా ఇప్పుడు ఈజిప్షియన్లకు ఏ సమస్యా లేదు.

## ప్రజా ప్రయోజనాలే ముఖ్యం

సాంస్కృతికంగా, వైజ్ఞానికంగా సమకాలీన రాజ్యాలలోకెల్లా బలోపేతమయిన ఈజిప్టు ఇప్పుడు ఆర్థికంగా కూడా ఓ తిరుగులేని శక్తిగా రూపొందింది. పశ్చిమాసి యాలోగానీ, ఆఫ్రికా ఖండంలోగానీ ఇప్పుడు ఈజిప్టుతో పోటీ పడగలిగే రాజ్యమేదీ లేదు. అయితే మహనీయ యూసుఫ్(అ)లోని ఔదార్యం ఈ సందర్భంగా పుష్కలంగా వర్షించసాగింది. ఆయన గనక తలచుకుంటే – నేటి అగ్రరాజ్యాల వారి మాదిరిగా– మిగులు ధాన్యాలను సముద్రం పాల్జేసి (ఎర్ర సముద్రంలో వేసేసి) ఆహార ధాన్యాల ధరలు పడిపోకుండా చేయగలరు. ఇరుగు పొరుగు రాజ్యాలలో ప్రజలు ఒకవైపున ఆకలిచావులు చస్తుంటే తాను మాత్రం వేడుక చూస్తూ ఈజిప్టును ఓ అగ్రరాజ్యంగా ప్రకటించుకోగలరు. కాని ఆయన అలా చేయలేదు. ఎందుకంటే ఆయన ప్రపంచాధి పత్యం కోసం పరిపాలనా పగ్గాలు చేపట్టిన వ్యక్తి కాదు.


లోక కళ్యాణం కోసం బరువు బాధ్యతలను మోస్తున్న సంస్కరణా ప్రియుడు.

ఆర్థిక సుడిగుండం నుండి జనులందరినీ కాపాడటానికి నడుం బిగించిన శ్రేయోభిలాషి!

అందుకే ఈజిప్టు దేశవాసులకు సరిపడా ఆహార ధాన్యాలను ఉంచుకుని, మిగిలిన ధాన్యాలను ఇరుగు పొరుగు రాజ్యాల వారికి సరఫరా చేయాలని నిర్ణయించు కున్నారు.

# అన్నల ఆగమనం

ఈ విధంగా ఇప్పుడు ఇరుగు పొరుగు రాజ్యాలకు కేంద్ర స్థానమయింది ఈజిప్టు. పొరుగు రాజ్యాల ప్రజలు తండోపతండాలుగా ఈజిప్టుకు వచ్చి- వస్తు మార్పిడీ పద్ధతిపై- ఆహారధాన్యాలు కొనుగోలు చేయసాగారు. ఎట్టకేలకు యూసుఫ్ (అ) అన్నలు కూడా వచ్చారు. ఆ క్షణంలో యూసుఫ్ (అ) పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించండి! ఆయన అన్నలను గుర్తుపట్టారు. కాని అన్నలు మాత్రం ఆయన్ని గుర్తుపట్టలేకపోయారు. ఎలా గుర్తు పట్టగలరు!? వాళ్ళ పథకం ప్రకారమైతే 20 ఏళ్ళ క్రితమే యూసుఫ్(అ)ను తమ దారి నుండి తొలగించుకున్నారు. ఒకవేళ యూసుఫ్ (అ) బ్రతికి ఉన్నా ఎక్కడో బానిసగా బ్రతుకు వెళ్ళదీస్తూ ఉంటాడు. అతనికి రాజయోగం ఎందుకు పడుతుంది?



అలనాటి ఎడారి ప్రయాణాలు

ఆహార ధాన్యాల కోసం పొరుగు రాజ్యం నుండి వచ్చి నిస్సహాయులుగా తన ఎదుట నిలబడి ఉన్న అన్నలను చూసినప్పుడు యూసుఫ్(అ)లో ఆసక్తి, ఆతృత, ఉత్కంఠ ఒక్కసారిగా పెల్లుబికాయి. అన్నలకు సాయం చేయాలన్న ఉబలాటం, తండ్రి క్షేమ సమాచారాలు తెలుసుకోవాలన్న కుతూహలం, తమ్ముడు బిన్ యామీన్ గురించి వాకబు చేయాలన్న కోరిక సహజంగానే జనించింది. కుశల ప్రశ్నల అనంతరం భోజన ఏర్పాట్లు కూడా చేయబడ్డాయి. వారికి కొలువ వలసిన ధాన్యం వారి ఒంటెలపై మోపబడింది. తీరా వాళ్ళు కనాన్‌కు బయలుదేరుతుండగా యూసుఫ్ (అ) వచ్చి,

'ఈసారి మీరు వచ్చేటప్పుడు మీ సవతి సోదరుణ్ణి (బిన్ యామీన్‌ను) కూడా వెంటబెట్టుకుని రండి. అన్యథా మీకు ధాన్యం కొలవబడదు' అని తెగేసి చెప్పారు. 'తప్పకుండా ప్రయత్నిస్తాం. మా నాన్న గారిని అందుకు ఒప్పిస్తాం' అని అన్నలు హామీ ఇచ్చారు.

కాని తండ్రి యాకూబ్(అ) మాత్రం బిన్ యామీన్‌ను వాళ్ళ వెంట పంపటానికి సుముఖంగా లేరు. ఎందుకంటే ఇప్పటికే ఆయన యూసుఫ్(అ) విరహంతో కృంగిపోతున్నారు. అయినప్పటికీ కొడుకుల ఆర్థిక ఇక్కట్లను చూసి అంగీకరించక తప్పలేదు.

## రసవత్తర సన్నివేశం

ఈ విధంగా యూసుఫ్(అ) అన్నలు మూడుసార్లు తిండిగింజల కోసం ఆయన దగ్గరకు రావలసి వచ్చింది. మూడవసారి వచ్చినప్పుడు కడు నిస్సహాయ స్థితిలో ఆయన ఎదుట నిలబడి,

'మహా ప్రభో! మాపై గడ్డుకాలం వచ్చి పడింది. మా కుటుంబ సభ్యులంతా కష్టాల్లో ఉన్నారు. మా తండ్రి తనకు దూరమయిన కొడుకులను తలచుకుని మంచమెక్కారు. ఇప్పుడు మా దగ్గర డబ్బు కూడా లేదు. మేము తెచ్చుకున్న ఈ అల్ప మూల్యాన్ని తీసుకుని మాకు ధాన్యం కొలవండి. మాకు దానం చేయండి' అని ప్రాధేయపడినప్పుడు, యూసుఫ్(అ) ఇంక ఆగలేకపోయారు. ఒక్కసారిగా ఆయనలోని అనుబంధం, ఆత్మీయత కట్టలు త్రెంచుకుంది. నిలువెల్లా కరిగిపోయారు. ఎందుకంటే ఇది నిందలు నిష్ఠూరాల సమయం కాదు. అన్నల అఘాయిత్యాన్ని ఎత్తిచూపుతూ వాళ్ళను మరింత సిగ్గుపడేలా చేయాల్సిన సందర్భం కూడా కాదు. కాకపోతే అజ్ఞానం పెనుభూతంలా వారి అణువణువునూ పెనవేసుకుపోయిన క్షణాన అసూయతో వారు ఒడిగట్టిన దారుణాన్ని ఒకసారి గుర్తు చేయాల్సిన అవసరం మాత్రం ఉంది, గుర్తు చేయనంతవరకూ ఈ చిక్కుముడి వీడదు కాబట్టి.

అందుకే–

'అజ్ఞానం ఆవహించిన క్షణంలో మీరు యూసుఫ్ పట్లా, అతని సోదరుని పట్లా ఎలా ప్రవర్తించారో మీకు తెలుసా?' అని అడిగేసరికి,

వాళ్ళ కాళ్ళ కింద నేల కంపించినట్లయింది. ఆశ్చర్యచకితులయ్యారు.

'ఏమిటి, నువ్వే యూసుఫ్‌వా?' అని ప్రశ్నించారు.

'అవును, నేనే యూసుఫ్‌ను. ఇతనేమో నా తమ్ముడు (బిన్ యామీన్). అల్లాహ్ మాపై దయ దలిచాడు' అంటూ దేవుని మహదానుగ్రహాన్ని చాటిచెప్పారు.

ఇంకా ఈ సందర్భంగా ఆయన చెప్పిన ఈ మాట ఈ యదార్థ గాథ అంతటికీ ప్రాణం వంటిది. ఆయన(అ) ఇలా అన్నారు

**'ధర్మనిష్ఠను అలవరచుకుని, సంయమనంతో వ్యవహరించిన వాడెవడయినా సరే– అలాంటి సదాచార శ్రేష్ఠుల ప్రతిఫలాన్ని అల్లాహ్‌ వృథా కానివ్వడు।** ***(12 : 90)***

అన్నలలోని పశ్చాత్తాప భావన ఒక్కసారిగా పైకెగసి వచ్చింది.

**'దైవసాక్షి! అల్లాహ్‌ నీకు మాపై ఔన్నత్యాన్ని ప్రసాదించాడు. ముమ్మాటికీ తప్పు మాదే'** ***(12: 91)***

అంటూ ఆత్మ సమర్పణ చేసుకున్నారు.

## ఔదార్యం వర్షించిన వేళ...

అన్నల కళ్ళల్లో కనిపించిన పశ్చాత్తాప భావనకు కరీమ్‌ బిన్‌ కరీమ్‌ నిలువెల్లా కరిగిపోయారు.

ఇది ప్రతీకారం తీర్చుకునే సమయం కాదు.

చచ్చి బతుకుతున్న వాళ్ళను మరింతగా చావబాదటం భావ్యం కాదు. ఈ రోజు పరస్పర నిందారోపణల రోజు కూడా కాదు.

ఇది వేరైన మనసుల్ని ఒక్కటిగా కలిపే రోజు.

ఈ రోజు నా ఆంతర్యంలో ఎలాంటి పగ లేదు. స్పర్థ లేదు. కాకపోతే నా యెడల మీ ప్రవర్తనకు ఆ దేవుడు ఏం చేస్తాడనేదే నా చింత. ఈ విషయంలో కూడా నేను మీకు సహాయకునిగానే ఉంటాను.

**"అల్లాహ్‌ మిమ్మల్ని క్షమించుగాక! ఆయన దయజూపే వారందరిలోకీ గొప్ప దయాకరుడు."**[1] ***(12 : 92)***

---

*1. 'మక్కా విజయం' సందర్భంగా అంతిమ దైవప్రవక్త ముహమ్మద్‌(స) మక్కా సర్దారులతో చెప్పిన మాటలు ఈ సందర్భంగా గమనార్హం. 23 ఏండ్ల పాటు తనను వేధించినవారు, తన మార్గంలో అవరోధాలు కల్పించినవారు, తనను సంఘ బహిష్కరణ చేసినవారు, ఆఖరికి తనను హతమార్చాలని నిర్ణయించు కున్నవారు, ముస్లింలపై సమరనాదం పూరించినవారు, తన పినతండ్రి హమ్జా*

ఆ విధంగా అన్నలందరినీ అక్కున చేర్చుకున్నారు. సోదరుని పట్ల అఘాయిత్యంతో కలుషితమయిన వారి చేతులను పశ్చాత్తాప కన్నీటితో తుడుచుకునే అవకాశం కల్పించారు. సకల విధాలా తన అన్నలను సత్కరించి వారిని ఇంటికి సాగనంపుతూ ఇలా అన్నారు.

**"ఇంద, నా చొక్కాను పట్టుకెళ్ళి నాన్నగారి ముఖంపై వేయండి. దాంతో ఆయనకు కంటిచూపు తిరిగివస్తుంది. ఆ తరువాత మీ పరివార సభ్యులందరినీ పిలుచుకుని నా దగ్గరకు వచ్చేయండి.'** ***(12 : 93)***

★★★

ఇక్కడ ఈజిప్టులో యూసుఫ్ (అ) చొక్కాను తీసుకుని ఇస్రాయీల్ పుత్రులు బయలుదేరారో లేదో అక్కడ కనాన్‌లో ఉన్న ఇస్రాయీల్ (అలైహిస్సలామ్) తన ముద్దుల కుమారుని సువాసనని ఆఘ్రాణించసాగారు.

"ఈ ముసలివాడికి మతి భ్రమించిందని జనులు అనుకోరంటే మీకొక మాట చెప్పాలనుంది– నేను యూసుఫ్ (అ) సువాసనను ఆస్వాదిస్తున్నాను"అన్నారు ఇస్రాయీల్, అదే యాఖూబ్ (అ).

ఈ వ్యవహారాన్ని సాధారణ దృష్టితో చూసినప్పుడు యాఖూబ్ (అ) పలుకులు విచిత్రమే అనిపిస్తాయి. అక్కడున్నవారంతా అనుకున్నది కూడా అదే. ఈ ముదుసలికి

---

*(రజి) మృతదేహాన్ని చీల్చి ఆయన పచ్చి కాలేయాన్ని కసిగా నమలటమే గాక ఆయన శరీరావయవాలను హారంగా చేసుకుని వికటాట్టహాసం చేసిన నరరూప రాక్షసులు ఆ రోజు నిస్సహాయులుగా నిలబడి ఉన్నారు.*

*కారుణ్యమూర్తి ముహమ్మద్(స) వారందరి వైపు ఓసారి దృష్టిని సారించి, 'చెప్పండి! ఈ రోజు నేను మీ యెడల ఎలా వ్యవహరించను?' అని ప్రశ్నించారు. దానికి వారంతా, '(ఓ ముహమ్మద్–స) తమరు మర్యాదస్తులైన సోదరులు. మర్యాదస్తుడగు మా సోదరుని పుత్రులు (పౌత్రులు)' అని సమాధానమిస్తారు. అంతే. ఆ మాటకు కారుణ్యమూర్తి ఆపాదమస్తకం కరిగిపోయారు. ప్రేమామృతాన్ని చిలికిస్తూ 'ఈనాడు మీపై ఎలాంటి ఆరోపణా లేదు. అలనాడు నా అన్న యూసుఫ్ (అలైహిస్సలామ్) తన అన్నలతో ఏమన్నారో నేనూ అదే అంటున్నాను– పొండి, ఇప్పుడు మీరు స్వతంత్రులు' అని పలికారు.*

నిజంగానే పిచ్చి పట్టిందన్నారు. కాని ఇస్రాయీల్ (అ) దృష్టి వేరు. ఆయన సాధారణ మనిషి కారు. తపోనిష్ఠా పరాయణుడు! దైవప్రవక్త! కొడుకు యూసుఫ్ స్వప్నం సాకారమయ్యే మధుర క్షణం కోసం వెయ్యి కళ్ళతో– ఆశతో– ఎదురు చూసిన తండ్రి.

ఎట్టకేలకు శుభవార్త మోసుకువచ్చేవాడు రానే వచ్చాడు. యూసుఫ్ (అ) చొక్కాను ఆయన ముఖం మీద వేయగానే ఆయనకు చూపు తిరిగి వచ్చింది. అక్కడున్న వారంతా ఆ దృశ్యాన్ని అవాక్కయి చూస్తుండగా, యాఖూబ్(అ) అంతరాళం ఆనందాతిశయంతో ఉప్పొంగింది. దైవానికి కృతజ్ఞతలు తెలుపుకుంటూ, చుట్టుపక్కల ఉన్న వారితో 'దేవుని తరఫున మీకు తెలియని విషయాలెన్నో నాకు తెలుసని అన్నానా!?' అని చెప్పారు.

ఈ విధంగా ఇరవై ఏళ్ళక్రితం ఆయన దు:ఖానికి (రక్తసిక్తమయిన) యూసుఫ్ చొక్కా కారణమవగా, ఈనాడు కూడా యూసుఫ్(అ) ధరించే మరో చొక్కాయే ఆయన జీవితంలో వెలుగు నింపింది.

ఇదంతా గమనించిన తరువాత కొడుకులకు తమ తప్పిదం తెలిసి వచ్చింది. వారు తమ నిర్వాకంపై సిగ్గు చెందారు. ఇంతకుముందు వారు తమ్ముని ఎదుటే తమ తప్పును ఒప్పుకున్నారు. ఇప్పుడు తండ్రి సమక్షంలో కూడా తమ అపరాధాన్ని అంగీకరించారు. తమ క్షమాపణకై అల్లాహ్‌ను ప్రార్థించమని తండ్రికి ప్రాధేయపడ్డారు.

తండ్రి తన కుమారుల అభ్యర్థనను సమ్మతించారు. అయితే త్వరలో మీ తప్పుల మన్నింపునకై దైవాన్ని ప్రార్థిస్తానని వాగ్దానం చేశారు. 'మీ తప్పుల్ని ఆ దేవుడే క్షమించాలి, పొండిరా' అని దాటవేయలేదు. కొడుకులు చేసిన తప్పు చాలా తీవ్రమైనది. వాళ్ళ క్షమాపణకై దైవాన్ని వేడుకోవాలంటే ప్రత్యేకంగా సమయం దొరకబుచ్చుకోవాలి. ప్రత్యేక రీతిలో ప్రార్థించాలి. ఏ తండ్రి అయినా తన కుమారుల మన్నింపునకై ప్రార్థించకుండా ఎలా ఉంటాడు? పైగా హజ్రత్ యాఖూబ్(అలైహిస్సలామ్) మహా పురుషుడు, దైవప్రవక్త.

తరువాత వారంతా–ఇంటిల్లిపాదీ– హజ్రత్ యాఖూబ్(అ) సారథ్యంలో ఈజిప్టు దేశానికి బయలుదేరారు.

ఇస్రాయీల్ సంతతి వారు దైవప్రవక్త ఇస్రాయీల్ – అలైహిస్సలామ్– నేతృత్వంలో ఐగుప్త రాజ్యంలో అడుగు పెట్టడానికి పూనుకున్న క్షణమది!

హ(జత్ యూసుఫ్(అ) బాల్యంలో కన్న కల నిజమయ్యే ఘడియలవి!

హ(జత్ యూసుఫ్(అ) వారందరినీ ఈజిప్టు రాజ్యానికి స్వాగతించారు. ఈజిప్టులోనే ఉండమని అభ్యర్థించారు. దైవచిత్తమయితే ఈజిప్టులో మీ ఈ ప్రవేశం శుభకరం కాగలదని, మీరంతా ఇక్కడ సురక్షితంగా ఉండగలరని చెప్పారు. తన తల్లిదండ్రుల్ని సింహాసనంపై కూర్చోబెట్టారు. అప్పుడు యూసుఫ్(అ) తల్లిదండ్రులు, ఆయన గారి పదకొండు మంది అన్నదమ్ములు ఈజిప్టు ఆనవాయితీ ప్రకారం యూసుఫ్ గౌరవార్థం- ప్రణమిల్లారు.

**“యా అబతీ! ఇన్నీ రఅయ్‌తు అహద అషర కవ్‌కబన్ వ్వష్షమ్స వల్ ఖమర రఅయ్‌తుహుమ్ లీ సాజిదీన్.”** ***(12 : 4)***

## భూమ్యాకాశాల నిర్మాతా! ఇహమునందును పరమునందును నీవే నా రక్షకుడవు

లేత్రాయంలో తాను కన్న కల యూసుఫ్(అ) కళ్ళ ముందు కదలాడింది. వెంటనే దేవుడు చేసిన మేళ్ళను తలచుకుని దైవానికి కృతజ్ఞతలు తెలుపుకున్నారు. షైతాన్ తనకూ, తన సోదరులకు మధ్య చిచ్చుపెట్టిన పిదప ఆ కారుణ్య ప్రభువు తమను ఏకం చేశాడని అన్నారు. ఆ సందర్భంగా మహనీయ యూసుఫ్(అ) అధరాల మీదుగా జాలువారిన పలుకులు గమనించదగినవి. ఆయన ఇలా అన్నారు:

**“రబ్బి ఖద్ ఆతయ్‌తనీ మినల్ ముల్కి వ అల్లమ్‌తనీ మిన్ తావీలిల్ అహాదీసి, ఫాతిరస్సమావాతి వల్ అర్జి, అంత వలియ్యీ ఫిద్దున్‌యా వల్ ఆఖిరతి, తవప్ఫనీ ముస్లిమ వ్వ అల్‌హిఖ్‌నీ బిస్సాలిహీన్.”** ***(12 : 101)***

(నా ప్రభూ! నీవు నాకు రాజ్యాధికారం ప్రసాదించావు. విషయాలకు భావాన్వయం చెప్పే విద్యను నేర్పావు. భూమ్యాకాశాలను సృష్టించినవాడా! ఇహమునందును, పరమునందునూ నీవే నా రక్షకుడవు. ముస్లిమ్‌గా ఉన్న స్థితిలోనే నాకు మరణమొసగు. నన్ను సజ్జనులతో చేర్చు)

ఈ సందర్భంగా హ(జత్ యూసుఫ్(అ) నోట వెలువడిన ఈ వాక్యాలు ఒక నిజమయిన విశ్వాసి (మోమిన్) సచ్చరితను మనోజ్ఞ రూపంలో చిత్రీకరిస్తున్నాయి. ఒకప్పుడు తనను ఈర్ష్యతో చంపివేయాలనుకున్న సోదరులు ఇప్పుడు అతని రాజసింహాసనం ముందు తలవంచుకుని నిలబడి ఉంటే, సాధారణంగా ప్రపంచ

రీతిననుసరించి గర్వించటం, గొప్పలు చెప్పుకోవడం, నిందలు నిష్ఠూరాలు మోపటం, వ్యంగ్యం వెటకారాలు, ఎత్తిపొడుపులు విసురుకోవటం జరుగుతుంది.

కాని ఒక నిజమయిన దైవభక్తుడు ఈ సందర్భంలో తద్భిన్నమయిన నీతినే ప్రదర్శిస్తాడు, అతను ఈ అభివృద్ధికి ఉబ్బిపోయి గర్వించడానికి బదులు తనకు ఈ స్థానాన్ని ప్రసాదించి దైవం చేసిన మహోపకారాన్ని స్మరిస్తాడు. అంతేగాని రక్త సంబంధీకుల దాష్టీకాన్ని ఎత్తిచూపుతూ అధిక్షేపించడు. ఇన్ని సంవత్సరాల ఎడబాటు తరువాత వారందరినీ కలిపినందుకు దైవానికి కృతజ్ఞతలు తెలుపుతాడు. తనకూ–తన సోదరులకూ మధ్యన షైతాన్ చిచ్చుపెట్టాడని ఆ సంఘటనలోని మంచి కోణాన్ని ఎత్తి చూపుతాడు. పరవశత్వంతో దైవ సమక్షంలో మోకరిల్లి కృతజ్ఞతలు అర్పించుకుంటాడు...

ఎంత ఉన్నతం, మరెంత పరిశుద్ధం ఈ శీలం!

★★★

★ ఖుర్ఆన్ వ్యాఖ్యాతల ప్రకారం; తన కొడుకు యూసుఫ్(అ) క్షేమంగా ఉన్నాడన్న శుభవార్త అందినప్పుడు మహనీయ యాఖూబ్ (అ) అమితంగా సంతోషించారు. అయితే కుమారుని ధార్మిక స్థితిగతుల గురించి వాకబు చేస్తూ 'మీరు యూసుఫ్(అ)ను చూశారు కదా, అతను ఏ మతధర్మంపై ఉన్నాడు?' అని సూటిగా అడిగారు. 'దైవకృప వల్ల ఆయన ఇస్లాం ధర్మంపైనే ఉన్నార'ని జవాబివ్వబడింది. దానికి యాఖూబ్(అ) సంతృప్తి చెందుతూ "ఇప్పుడు దేవుని వరప్రసాదం పరిపూర్తి అయింది" అని వక్కాణించారు (ఖుర్తుబీ : 9/261)– దీనినిబట్టి విదితమయ్యేదేమంటే మనిషి కేవలం తన పిల్లల భౌతిక ప్రగతిని చూసి మురిసిపోకూడదు. అంతకన్నా వారి ధార్మిక, నైతిక స్థితి గురించి వాకబు చేస్తూ ఉండాలి.

★ మహనీయ యాఖూబ్(అ) కుమారులు తండ్రి సమక్షంలో తమ తప్పును ఒప్పుకుంటూ సిగ్గు చెందారు. తమ తప్పుల క్షమాపణకై దైవాన్ని ప్రార్థించమని ప్రాధేయపడ్డారు. దీనినిబట్టి బోధపడేదేమంటే, మనిషి ఎవరిపైనయినా అఘాయిత్యానికి పాల్పడి ఉంటే, తన జీవిత కాలంలోనే బాధితునికి క్షమాపణ చెప్పుకుని ఆ తప్పును సరిదిద్దుకోవాలి. అంతిమ దైవప్రవక్త ముహమ్మద్(స) గారు ఇలా ప్రవచించారు : "ఎవరయినా తన తోటి సోదరుని మానమర్యాదల

విషయంలో అతిగా వ్యవహరించి వుంటే దీనార్లు దిర్హములు ఉండని 'ఆ రోజు' రాకముందే దానిని చక్కదిద్దుకోవాలి. అంటే ప్రళయదినం రాకముందే క్షమింప జేసుకోవాలి. అన్యథా ఇతని సదాచరణ ఆ బాధిత వ్యక్తికి ఇవ్వబడుతుంది. ఒకవేళ ఇతని వద్ద సత్కార్యాలు లేకుంటే, బాధితుని దుష్కార్యాలు ఇతని ఖాతాలో వేయబడతాయి."

*(బుఖారీ– అబూహురైరా–రజి– కథనం, హదీసు నం. 2317)*

బైబిల్ ప్రకారం యూసుఫ్ (అ) ఆహ్వానంపై ఈజిప్టు వెళ్ళిన ఇస్రాయీల్ (యాఖూబ్) పరివార సభ్యుల సంఖ్య 67 మాత్రమేనని తెలుస్తోంది. కాని 400 ఏండ్లు గడిచేసరికి ఈ పరివార సభ్యుల సంఖ్య లక్షలకు చేరుకుంది. బైబిల్ ప్రకారం 'నిర్గమం' (Exodus) తరువాత– రెండవ సంవత్సరం– సినాయ్ ఎడారిలో హజ్రత్ మూసా (అ) జనాభా లెక్కల్ని చూసినప్పుడు, అందులో కేవలం యుద్ధ సామర్థ్యం గల పురుషుల సంఖ్యే 603550. అంటే స్త్రీలు, పురుషులు, పిల్లలు, వృద్ధులు అంతా కలిపి కనీసం 20 లక్షల మంది వరకూ ఉంటారు. ఏ లెక్కల ప్రకారమయినా అయిదువందల ఏళ్ళలో 68 మందికి చెందిన పరివారం ఇంతగా పెరుగుతుందా? అన్నది ప్రశ్న. అప్పుడు ఈజిప్టు జనాభా అంతా 2 కోట్లని అంచనా. అంటే ఒక్క బనీ ఇస్రాయీలే వారిలో పదిశాతం వరకూ ఉండేవారన్నమాట.

ఒక కుటుంబం కేవలం సంతానోత్పత్తి ఆధారంగా ఇంతగా పెరగటం సాధ్యమా? దీని గురించి ఆలోచించినప్పుడు ఒక ముఖ్యమయిన యదార్థం బయట పడుతుంది– బనీ ఇస్రాయీల్ ప్రవక్తల సంతానం. వాళ్ళు ఈజిప్టులో కాలుమోపడానికి కారకుడైన వారి నాయకుడు హజ్రత్ యూసుఫ్(అ)స్వయంగా దైవప్రవక్త. వారి తదనంతరం చాలాకాలం వరకూ ఈజిప్టు రాజ్యాధికారం వారి చేతుల్లోనే ఉంది. అధికారం పూర్తిగా కాకపోయినా రాజ్యంలో వారికి పలుకుబడి ఉండేది. ఆ కాలంలోనే వారు ఈజిప్టులో ఇస్లాం ప్రచారం చేసి వుంటారు. ఈజిప్టు వాసుల్లో ఇస్లామ్‌ను స్వీకరిం చినవారు బనీ ఇస్రాయీల్ మతాన్నే కాకుండా వారి సంస్కృతీ నాగరికతలను, జీవన శైలిని కూడా పుణికిపుచ్చుకుని ఉంటారు. వారు ఈజిప్టులోని ముస్లిమేతరుల సంస్కృతికి దూరమై బనీ ఇస్రాయీల్‌తో మమేకమై ఉంటారు. కాగా; ఈజిప్షియన్లు ఈ ముస్లిములందరినీ వేరుగానే– 'పరకీయులు'గానే – పరిగణించి ఉంటారు!– భారత దేశంలో కొందరు హిందువులు ముస్లిములను వేరుగా పరిగణిస్తూ ఉన్నట్లు! (వారంతా

ఇస్రాయీల్ వారు కాకపోయినా) వాళ్ళందరినీ 'ఇస్రాయీలీయుల'న్న పదంతోనే పిలిచి ఉంటారు. వాళ్ళు స్వయంగానూ ధార్మికంగా, సాంస్కృతికంగా, పెళ్ళి పెటాకుల సంబంధాల రీత్యా ఈజిప్టులోని ముస్లిమేతరులకు భిన్నంగా బనీ ఇస్రాయీల్‌తో సన్నిహితులైపోయి ఉంటారు.

ఈ కారణంగానే ఈజిప్టులో జాతితత్వం తుఫానులా విజృంభించినప్పుడు దౌర్జన్యాలు కేవలం 'బనీ ఇస్రాయీల్' మీదనే జరగలేదు. ఈజిప్టు జాతీయులైన ముస్లిములు కూడా దాని వాతనపడ్డారు.

నాలుగు వందల యేండ్ల క్రితం మహనీయ యూసుఫ్(అ) ఈజిప్టు రాజ్యానికి చేసిన సేవలను భావితరాల వారు మరచిపోయారు. ఎక్కడి నుండో వచ్చిన గొర్రెల కాపరులు మా మీద పెత్తనం చేయటమేమిటి? అనే వింత వాదన వ్రేళ్ళూనుకుంది. అదీగాక ఈజిప్టు జనాభాలో ఇస్రాయీల్ సంతతి వారు పదిశాతం ఉన్నారనే సరికి ఫిరౌన్ చక్రవర్తుల శిబిరాలలో కలవరం పుట్టింది. 'స్వకీయులు– పరకీయులు' అనే బీజాన్ని ప్రజా బాహుళ్యంలో నాటి ఒకవైపు వర్గ దురభిమానాన్ని పెంచి పోషించడంతో పాటు, మరోవైపు ఇస్రాయీల్ సంతతి వారిపై అణిచివేత విధానాలను అమలుపరి చారు. ఒక దశలో వారు ఇస్రాయీలీయుల మగపిల్లలను చంపేసి, ఆడవారిని మాత్రం బ్రతికి ఉండనిచ్చేవారు. అది బనీ ఇస్రాయీల్ పాలిట గడ్డు పరీక్షగా ఉండేది (దివ్యఖుర్ఆన్– 2: 49 ఆధారంగా). ఇస్రాయీల్ సంతతివారిని వ్యవసాయ క్షేత్రాలకు పరిమితం చేసి, వారిచేత వెట్టిచాకిరీ చేయించుకోవడం జరిగేది. తౌరాతులోని ఆది కాండంలో– ఒకానొక సందర్భంలో దైవప్రవక్త ఇబ్రాహీమునకు ఇవ్వబడిన భవిష్య సమాచారం కూడా ఈ సందర్భంగా నెమరు వేసుకోదగినదే. ఈ విధంగా సెలవీయ బడింది:

> ***'నీ సంతతి వారు తమది కాని పరదేశమందు నివసించి ఆ దేశపు వారికి దాసులుగా నుందురు. వారు నాలుగు వందల యేండ్లు వీరిని శ్రమ పెట్టుదురు. వీరు ఎవరికి దాసులవుదురో ఆ జనమునకు నేనే తీర్పు తీర్చుదును..."*** ***(ఆదికాండము– 15: 13)***

ఈ విధంగా–

ఈజిప్టులో ఫిరౌనీయుల అమానుషాలు పెచ్చరిల్లిపోయినప్పుడు,

ఇస్రాయీల్ సంతతి ప్రజలు 'ఖిబ్తీల' జాత్యహంకార ధోరణికి నిర్దాక్షిణ్యంగా

బలైపోతూ, మానవత్వం మొరను ఆలకించే నాథుడే లేని నికృష్ట ఘడియలలో–

ఆ విశ్వేశ్వరుని కటాక్ష వీక్షణాలు బనీ ఇస్రాయీల్‌పై ప్రసరించాయి.

ధర్మ సంస్థాపనార్థం,

దుష్టశిక్షణ శిష్ట రక్షణ నిమిత్తం,

పీడిత జాతిని నిరంకుశ చక్రవర్తుల చెర నుండి విముక్తిని కల్పించే నిమిత్తం,

ఒకప్పుడు తన ప్రియ నేస్తమయిన ఇబ్రాహీమ్‌నకు చేసిన 'ప్రామిస్సడ్ ల్యాండ్'లో పున:ప్రవేశం కల్పించే నిమిత్తం,

ఇస్రాయీలీ సంతతివారు మరిచిపోయిన 'దేవుని ఏకత్వపు' పాఠాలను పునశ్చరణ చేయించే నిమిత్తం,

మరో గ్రంథాన్ని పంపవలసిన అవసరం ఏర్పడింది.

మరో ప్రవక్తను నియుక్తం చేయవలసిన తరుణం ఆసన్నమైంది.

ఇంతకీ ఆ గ్రంథమేది? ఆ ప్రవక్త ఎవరు? ఫిరౌన్ చక్రవర్తి ఎదుట నిలబడి ఆ ప్రవక్త చేసిన ప్రతిపాదన ఏమిటి? దాని పర్యవసానం ఏమయింది?

★★★

తెలుగు ఇస్లామిక్ సాహిత్య ట్రస్ట్

# 3

## దైవప్రవక్త హజ్రత్ మూసా(అ)

# ఫిరౌన్ చెర నుండి విడుదలైన ఇస్రాయీల్ బిడ్డలు

**ఇస్రాయీల్ సంతతి వారు శతాబ్దుల తరబడి ఈజిప్టులో కడు దుర్భర మయిన, అవమానకరమయిన జీవితం గడుపుతూ వచ్చారు.**

అలాంటి నికృష్ట స్థితిలోనే దేవుడు వారి మధ్యన మహనీయ మూసా (అలైహిస్స లామ్)ను ప్రభవింపజేశాడు. ఆయన ద్వారానే ఆ జాతి వారిని ఫిరౌనీయుల బానిస చెర నుండి విడిపించాడు. దరిమిలా వారిపై గ్రంథాన్ని అవతరింపజేశాడు. ఆ గ్రంథం ఆధారంగానే అప్పటి వరకూ అణగారి ఉన్న ఇస్రాయీల్ పిల్లలు సన్మార్గం పొంది లోకంలో ఓ ప్రసిద్ధ జాతిగా వినుతికెక్కారు.

## మహనీయ మూసా (అ) సందేశం

దైవప్రవక్త మూసా (అ) ఫిరౌన్ వద్దకు వచ్చినప్పుడు రెండు విషయాలను నొక్కి వక్కాణించారు :

1) అల్లాహ్ దాస్యాన్ని (ఇస్లామ్‌ను) స్వీకరించు.

2) ఇస్రాయీల్ సంతతి వారిని నా వెంట పోనివ్వు.

మరో వైపున ఆయన బనీ ఇస్రాయీల్‌కు చేసిన ప్రబోధన ఇది :

"సహాయం కొరకు అల్లాహ్‌ను అర్థిస్తూ వుండండి. ఓపిక పట్టండి. (ఈ) భూమి అల్లాహ్‌ది. ఆయన తన దాసులలో తాను కోరిన వారిని దీనికి వారసులుగా చేస్తాడు. ఆయనకు భయపడుతూ పనిచేసిన వారిదే అంతిమ విజయం."

## ఇస్రాయీల్ వంశీయుల ఊగిసలాట

అడుగడుగునా ప్రమాదాలు పొంచి ఉన్న ఆ కాలంలో సత్యాన్ని సమర్థించడానికి, సత్యధర్మ ధ్వజవాహకుణ్ణి (మూసా– అలైహి) తమ నాయకునిగా అంగీకరించడానికి కొద్ది మంది యువతీ యువకులు మాత్రమే సాహసించారు. కాని వారి మాతా పితలకు, సమాజంలోని పెద్దలకు, వృద్ధులకు మాత్రం ఈ సద్బుద్ధి ప్రాప్తించలేదు. ప్రాపంచిక స్వప్రయోజనాలలో, పదవీ వ్యామోహంలో పడి నిక్షేపంగా బ్రతకటానికి అలవాటుపడిన వారికి మూసా(అలైహి) మార్గం కష్టంగానే తోచింది. వారెలాగూ మూసాను అనుసరించలేదు. పైగా మూసా సందేశాన్ని స్వాగతించిన నవ యువకులను కూడా అడ్డుకున్నారు. మూసా అనుయాయులుగా మారి ఫిరౌన్ ఆగ్రహానికి గురికాకండి, మమ్మల్ని ప్రశాంతంగా బ్రతకనివ్వండి అని తమ పోరగాళ్ళను మందలించారు.

## కాలం వేసిన కళ్ళెంలో ఇరుక్కుని....

వారి ఈ వైఖరికి కారణం మహనీయ మూసా(అ)పై నమ్మకంలేక కాదు. మూసా(అ) ఒక సత్యసంధుడని, ఆయన తెచ్చిన సందేశం కూడా నిలువెల్లా సత్యమని వారి అంతరాత్మలు ఘోషించాయి. కాని వారు కాలం వేసిన కళ్ళెంలో ఇరుక్కుపోయారు. ఆ సముదాయంలోని కులీనులు, మర్యాదస్తులు మహనీయ మూసా(అ)కు చేదోడు వాదోడుగా నిలిచి ఫిరౌన్ తీక్షణ వీక్షణాలకు గురి కాదలచుకోలేదు. మరి చూడబోతే వారు ప్రవక్తల వంశంలో పుట్టినవారే. ఇబ్రాహీమ్, ఇస్‌హాఖ్, యాఖూబ్, యూసుఫ్ (అలైహిముస్సలామ్)ల ఉమ్మతీలే వారు. ఆ విధంగా చూసినప్పుడు వారు పైకి ముస్లిములే. కాని సుదీర్ఘకాలంగా వారిలో ప్రబలిన నైతిక అధోగతి, పిరికితనం లాంటి అవగుణాలు వారిని పరాధీనతకు రాజీపడేలా చేశాయి. అవిశ్వాసాన్ని, అపమార్గాన్ని ఎదిరిస్తూ విశ్వాసం, సన్మార్గాల ధ్వజం చేబూనే సాహసం వారిలో లేకపోయింది.

ఈజిప్టులో ఫిరౌనీయుల అమానుష కృత్యాల రెండు పర్వాలు ముఖ్యంగా ప్రస్తావించదగినవి. వాటిలో ఒకటి : హజ్రత్ మూసా (అలైహి) ప్రభవనానికి పూర్వం ద్వితీయ రామ్సేస్ (Ramses) కాలంలో సాగిన దమననీతి. రెండవది: హజ్రత్ మూసా (అలైహిస్సలామ్) ప్రభవనం తరువాత పెచ్చరిల్లిన దౌర్జన్యాలు, అత్యాచారాలు. ఈ రెండు కాలాలలోనూ ఒక విషయం మాత్రం ఉమ్మడిగా వుంది. అదేమిటంటే

ఫిరౌనీయులు ఇస్రాయీల్ సంతతి వారి మగపిల్లలను చంపేసి, వారి ఆడపిల్లల్ని మాత్రం బ్రతికి ఉండనిచ్చేవారు.

మహనీయ మూసా(అ)కి– ఫిరౌన్‌కి మధ్య సాగుతున్న ఈ సంఘర్షణలో సామాన్య ఇస్రాయీలీయుల ధోరణి కూడా ఏమీ బాగాలేదు. ఒకవిధంగా వారిది సహాయ నిరాకరణ ధోరణి! నిందలు నిష్ఠూరాలతో కూడుకున్న వైఖరి!!

తల్మూద్‌లో లిఖితమై ఉన్న దాని ప్రకారం ఇస్రాయీల్ వంశీయులు మూసా, హారూనుల (అలైహిముస్సలామ్)తో ఇలా అనేవారు:

"మా ఉపమానం తోడేలుకు చిక్కిన గొర్రె వంటిది. గొర్రెల కాపరి వచ్చి, దానిని కాపాడుకునే యత్నం చేశాడు. ఇరువురి సంఘర్షణలో ఆ గొర్రె ముక్కచెక్కలైపోయింది. ఇదేవిధంగా (ఓ మూసా!) నీకు– ఫిరౌన్‌కీ మధ్య కొనసాగుతున్న పెనుగులాటలో మా కథ సమాప్తమయ్యేలా ఉంది."



ఎర్ర సముద్రం చీలిన ఊహాచిత్రం

## ఐగుప్త దేశం నుండి బనీ ఇస్రాయీల్ ప్రస్థానం

ఎట్టకేలకు అల్లాహ్ ఇస్రాయీల్ సంతతి వారి హిజ్రత్‌కు ఒక సమయాన్ని నిర్ధారించాడు. నిర్ధారిత కార్యాచరణ పథకం ప్రకారం ముస్లింలైన ఇస్రాయీలీయులు,

ఇస్రాయీలేతరులు కూడా ఒకానొక రాత్రివేళ రాజ్యంలోని అన్ని ప్రాంతాల నుండి బయలుదేరి అందరూ ఒకచోట సమావేశమవ్వాలి, తరువాత వారంతా కలిసి– ఒకేసారి– జనవాహినిగా ఆ రాజ్యం నుండి వెళ్ళిపోవాలి.

దైవప్రవక్త మూసా(అలైహిస్సలామ్) ఎర్ర సముద్రం వైపునకు సాగిపోవాలని నిర్ణయించుకున్నారు... కాని ఈ పయన బృందం ఎర్ర సముద్రం తీరానికి చేరుకుంటూ ఉన్న సమయంలోనే ఫిరౌన్ చక్రవర్తి ఒక భారీ సేనా వాహినిని తీసుకుని వాళ్లను వెంబడిస్తూ వచ్చాడు. ముందు నుయ్యి వెనుక గొయ్యి అన్నట్టు తయారయింది పరిస్థితి. మూసా అనుయాయులైన కాందిశీకులు ఫిరౌన్‌సేనల చేతికి చిక్కుకుపోయే లానే ఉన్నారు. వెనుక శత్రు సేనలు, ముందేమో ఎర్ర సముద్రం! దిక్కుతోచని పరిస్థితి! 'మూసా! మమ్మల్ని తీసుకువచ్చి ఈ సముద్రం పక్కన నిలబెట్టావేమిటి? ఈజిప్టులోని ఖననవాటికలు సరిపోలేదా?' అని అసమ్మతీయులు నిష్ఠూరంగా పలుకుతున్న ఆ నికృష్ట ఘడియలో దైవ సహాయం అందింది. 'మూసా! నీ చేతికర్రతో సముద్రంపై కొట్టు' అని దైవాదేశమయింది. అంతే! సముద్రం రెండు ముక్కలుగా చీలిపోయింది. వాటిలోని ప్రతి భాగం ఓ పర్వతంలా వుంది. ఆ రెండు నీటి గుట్టల మధ్యన ఒక సందు, నీరు ఏ మాత్రం లేని ఓ పొడి దారి ఏర్పడింది. ఆ దారి గుండా మూసా అనుయాయులు సాగిపోవటం గమనించిన ఫిరౌన్ తన సైనికుల సమేతంగా వారిని వెంబడించాడు. మూసా అనుయాయులు సముద్రం దాటే సమయానికి ఫిరౌన్ సేనలు ఆ దారి మధ్యన ఉన్నాయి. దైవాదేశానుసారం అప్పటివరకు ప్రహరి గోడల్లా నిశ్చలంగా నిలిచి ఉన్న ఆ రెండు నీటి భాగాలు– కాల చరిత్రకు సంకేతమిస్తూ– పరస్పరం కలిసి పోయాయి. ఫిరౌన్ తన సేనల సమేతంగా సాగర గర్భంలో కలిసిపోయాడు.

దైవప్రవక్త మూసా(అ) ఇస్రాయీల్ సంతతి వారిని తీసుకుని సినాయ్ ద్వీపకల్పంలో ప్రవేశించారు. మారాహ్, ఏలిమ్, రిఫీదిమ్ మార్గాల గుండా సినాయ్ పర్వతం వైపునకు వచ్చారు. ఒక ఏడాదికన్నా ఎక్కువ కాలమే అక్కడ విడిది చేశారు. ఆ కాల వ్యవధిలో అక్కడ జరిగిన సంఘటనలు పలు కోణాల నుండి ఎంతో ముఖ్యమైనవి, గుణపాఠంతో కూడుకున్నవీను. ఆ మధ్యకాలంలో అద్భుతమయిన రీతిలో ఇస్రాయీల్ వంశీయులపై దైవానుగ్రహాలు వర్షించాయి. అదే సమయంలో ఇస్రాయీలీయులలోని భావ దారిద్ర్యపు పోకడలు, మూర్ఖత్వపు చేష్టలు కూడా అనేకం

పొడసూపాయి. 'సామిరీ' వంటి వంచనా శిల్ప నిష్ణాతులు పన్నిన కుట్రల్లో వారు పావులుగా మారి స్వామి ద్రోహం తలపెట్టారు. అనేకసార్లు మహనీయ మూసా(అ) మొరను ఆలకించి, దేవుడు వారి తప్పులను క్షమించాడు. మరోవైపున మూసా (అలై) కూడా ఇస్రాయీల్ బిడ్డలను సంస్కరించడానికి అహర్నిశలు ప్రయత్నించారు. ఒకవిధంగా చెప్పాలంటే, అది ఇస్రాయీల్ వంశీయుల శిక్షణా కాలం. తౌరాత్ గ్రంథంలోని పెక్కు ఆదేశాలు ఈ ప్రదేశంలో అవతరించినవే.

## పలస్తీనాపై దండయాత్రకు ఆదేశం

బనీ ఇస్రాయీల్‌ని పలస్తీనా వైపునకు తీసుకుపో. పలస్తీనాను జయించు. అది మీకు మీరాశిగా వొసగబడుతుందని ఆయనకు ఆదేశమయింది. ఈ ఆదేశాన్ని పురస్కరించుకొని మూసా(అ) తన అనుయాయులను తీసుకొని తబ్‌యీర్, హసీరాత్‌ల మీదుగా ఫారాన్ వరకూ చేరుకున్నారు. పలస్తీనాలోని పరిస్థితులను అధ్యయనం చేయడానికి ఒక ప్రతినిధి బృందాన్ని పంపించారు. ఆ బృందం తిరిగివచ్చి ఖాదస్ అనే చోట తన నివేదికను సమర్పించింది. హజ్రత్ యోషె, కాలిబ్‌లు తప్ప మిగిలిన వారంతా ఆ నివేదికను నీరుగార్చారు. పలస్తీనా వైపునకు పోయేది లేదని ఇస్రాయీల్ సంతతి వారంతా తెగేసి చెప్పేశారు.

## శిక్షగా....

ఆదేశాన్ని శిరసావహించకపోవడం చేత దేవుడు వారికి శిక్షగా నలభై ఏండ్ల వరకూ ఆ ఎడారి ప్రాంతాల్లోనే తచ్చాడుతూ తిరిగేలా చేశాడు. యోషే, కాలిబ్‌ల వంటి వారు తప్ప బనీ ఇస్రాయీల్‌లోని ప్రస్తుత జనులలో ఎవరూ పలస్తీనాను పొందలేరని నిర్ణయించబడింది. ఆ తరువాత బనీ ఇస్రాయీల్ ఫారాన్, షూర్ లోయల్లో, తీహ్ ఎడారిలో మకాం వేయవలసిన అగత్యం ఏర్పడింది. ఈ మధ్యకాలంలో వారు తరచూ అమాలిఖాలతో, అమూరియూలతో, మిద్‌యనులతో ఘర్షణ పడుతూ దుర్భరమైన జీవితం గడిపారు.

## పలస్తీనాపై విజయం

నలభై ఏండ్ల శిక్షా వ్యవధి పూర్తి కావస్తూ ఉండగా 'అరూమ్' సరిహద్దు ప్రాంతంలో మూసా (అ) సోదరులు హజ్రత్ హారూన్ (అలైహిస్సలామ్) పరమపదించారు. దరిమిలా మూసా(అ) బనీ ఇస్రాయీల్‌ను తీసుకొని 'మవ్‌ఆబ్' ప్రాంతంలో

అడుగుపెట్టారు. ఆ ప్రదేశమంతటినీ కైవసం చేసుకుంటూ హస్‌బూన్, షతీమ్ వరకూ చేరుకున్నారు. అక్కడే 'అబారీమ్' పర్వతంపై మహనీయ మూసా (అలైహిస్సలామ్) పరమ పదించారు. ఆయన తదనంతరం ఆయన ప్రథమ ప్రతినిధిగా యోషే (అలైహిస్సలామ్) తూర్పు వైపు నుండి జోర్డాన్ నదిని దాటి 'అరీహా' పట్టణంపై విజయకేతనం ఎగురవేశారు. ఇస్రాయీల్ సంతతి వారికి స్వాధీనమైన మొదటి పలస్తీనా పట్టణమిది. ఆ తరువాత స్వల్ప వ్యవధిలోనే పలస్తీనా ప్రదేశమంతా బనీ ఇస్రాయీల్ అదుపులోనికి వచ్చేసింది.

## బనీ ఇస్రాయీల్‌కి మహనీయ మూసా(అ) చేసిన హెచ్చరికలు

దివ్యఖుర్‌ఆన్‌లోని ఇబ్రాహీమ్ సూరా, ఏడవ ఆయత్‌లో దైవప్రవక్త మూసా (అలైహిస్సలామ్) ద్వారా బనీ ఇస్రాయీల్‌కు చేయబడిన దైవోపదేశం ప్రత్యేకంగా గమనించదగినది :

**".... మీరు గనక కృతజ్ఞులైతే, నేను మిమ్మల్ని ఇంకా ఎక్కువగా అనుగ్రహిస్తాను. ఒకవేళ కృతఘ్నుతకు పాల్పడితే నా శిక్ష చాలా కఠినంగా ఉంటుంది."**

ఇలాంటి ఉపదేశాలు, హెచ్చరికలు పదే పదే చేయాల్సిన ఆవశ్యకత ఎందుకు ఏర్పడిందంటే ఇస్రాయీల్ వంశీయులు దేవుని వరప్రసాదాల ద్వారా లబ్ధి పొందిన మీదట మేలును మరచి అవిధేయతకు ఒడిగట్టేవారు. వారిని సంస్కరించడానికి మహనీయ మూసా(అ) మాటిమాటికీ ప్రయత్నించేవారు. చేసిన తప్పుకు గాను సిగ్గుతో కుమిలిపోతూ, క్షమాపణ కోసం దైవాన్ని ప్రార్థించండి అని సూచించేవారు. పలస్తీనాపై సంపూర్ణ విజయం సాధించిన తరువాత షైతాన్ వారి మధ్యన జొరబడి వారిలో ధిక్కార వైఖరిని నూరిపోస్తాడన్న భయం ఉండేది. అందుకే వారిని దైవ శాసనం, దైవ సంప్రదాయం గురించి ముందస్తుగా హెచ్చరించాల్సిన అవసరం ఏర్పడింది.

దీనికి సంబంధించిన వివరాలు పాత నిబంధనలోని ద్వితీయోపదేశ కాండంలో సుదీర్ఘ ప్రసంగం రూపంలో వచ్చాయి. ఆ ప్రసంగంలో దైవప్రవక్త మూసా(అ) తన మరణానికి కొన్ని రోజుల ముందు ఇస్రాయీల్ వంశీయులకు వారి చరిత్రలోని కీలక ఘట్టాలను జ్ఞాపకం చేస్తారు. దరిమిలా అల్లాహ్ తన ద్వారా ఇస్రాయీల్ పిల్లలకు పంపిన తౌరాతులోని ఆదేశాలన్నింటినీ పునరుక్తం చేస్తారు. ఆ తరువాత సుదీర్ఘ ఉపన్యాసమిస్తారు. ఆ ప్రసంగంలోని కొన్ని భాగాలు ఆలోచనాత్మకమైనవి, గుణపాఠంతో కూడుకున్నవీను. ఉదాహరణకు : కొన్ని వాక్యాలను ఇక్కడ పొందుపరుస్తున్నాము–

**"నేడు నేను మీకాజ్ఞాపించు మాటలన్నింటిలో దేని విషయంలోనూ కుడికిగానీ ఎడమకు గానీ తొలగి, అన్యుల దేవతలను అనుసరింపకయు, వాటిని పూజింపకయు నున్న యెడల, నీవు అనుసరించి నడుచుకొనవలెనని నేడు నేను నీకాజ్ఞాపించుచున్న నీ దేవుడైన యెహోవా ఆజ్ఞలను విని, వాటిని అనుసరించి గైకొనిన యెడల, యెహోవా నిన్ను తలగా నియమించును గాని తోకగా నియమింపడు. నీవు పైవాడవుగా ఉందువు గాని క్రింది వాడవుగా ఉండవు... యెహోవా సెలవిచ్చిన మాట వినని యెడల ఈ శాపములన్నియు నీకు సంభవించును. పట్టణములో నీవు శపింపబడుదువు. పొలములో నీవు శపింపబడుదువు; నీ గంపయు పిండి పిసుకు నీ తొట్టియు శపింపబడును; నీ గర్భ ఫలము, నీ భూమి పంట, నీ ఆవులు, నీ గొర్రెలు, నీ మేకల మందలు శపింపబడును... యెహోవా క్షయరోగము చేతను, జ్వరము చేతను, మంట చేతను, మహాతాపము చేతను, ఖడ్గము చేతను, కంకి కాటుక చేతను, బూజు చేతను నిన్ను కొట్టును.... నీ తలపైని ఆకాశము ఇత్తడి వలే ఉండును... యెహోవా నీ శత్రువుల ఎదుట నిన్ను ఓడించును. .... నీవు హింసింపబడి నిత్యమును దోచుకొనబడెదవు... స్త్రీని ప్రధానము చేసికొందువు గాని వేరొకడు ఆమెను కూడును. ఇల్లు కట్టుదువు గాని దానిలో నివసింపవు. ద్రాక్ష తోట నాటుదువు కాని దాని పండ్లు తినవు. నీ యెద్దు నీ కన్నుల యెదుట వధింపబడును. ...నీ కుమారులును నీ కుమార్తెలును అన్య జనములకు ఇయ్యబడుదురు. వారి నిమిత్తము నీ కన్నులు దినమెల్ల చూచి చూచి క్షీణించిపోవునుగాని నీ చేత నేమియు కాకపోవును. .... నీవు విస్తారమైన విత్తనములు పొలములోనికి తీసుకొని పోయి కొంచెమే ఇంటికి తెచ్చుకొందువు... నీ దేవుడైన యెహోవాకు నీవు దాసుడవు కాలేదు, కనుక ఆకలిదప్పులతోను, వస్త్ర హీనతతోను అన్ని లోపములతోను యెహోవా నీ మీదికి రప్పించు నీ శత్రువులకు దాసుడవగుదువు. వారు నిన్ను నశింపజేయు వరకు నీ మెడ మీద ఇనుప కాడి యుంచుదురు... దేశము యొక్క ఈ కొన మొదలుకొని ఆ కొన వరకు సమస్త జనముల లోనికి యెహోవా నిన్ను చెదరగొట్టును.." (ద్వితీయోపదేశ కాండము– అధ్యాయం : 28, 15నుంచి 64 వరకు గల వాక్యాలలోని కొన్ని భాగాలు)**

## మహనీయ యోషే (అ) సంస్కరణోద్యమం

సుదీర్ఘ కాలం వరకు ఈజిప్షియన్ల ఊడిగం చేస్తూ జీవితం గడిపిన ఇస్రాయీలీయులలో భావదారిద్ర్యం, సావాస దోషం ప్రబలింది. మహనీయ మూసా (అ)

సారథ్యంలో ఈజిప్టు నుండి వెళ్ళిపోయి 70 ఏండ్లు గడిచిపోయిన తరువాత వారు మళ్ళీ విగ్రహారాధన వైపునకు మొగ్గు చూపారు. హజ్రత్ మూసా (అ) తొలి ప్రతినిధిగా వారి దిద్దుబాటుకు నడుం బిగించిన హజ్రత్ యోషే బిన్ నూన్(అ) తన చిట్టచివరి ఉపన్యాసంలో ఇస్రాయీల్ సంతతి వారినుద్దేశించి చేసిన హెచ్చరికలను బట్టి, వారి పరిస్థితి ఎంత అధ్వాన్నంగా తయారయిందో ఊహించవచ్చు.

> **“.... కాబట్టి యెహోవా యందు భయభక్తులు గలవారై, ఆయనను నిష్కపటముగాను సత్యముగాను సేవించుచు, మీ పితరులు నది అద్దరిని ఐగుప్తులోను సేవించిన దేవతలను తొలగద్రోసి యెహోవానే సేవించుడి. యెహోవాను సేవించుట మీ దృష్టికి కీడని తోచని యెడల మీరు ఎవని సేవించెదరో, నది అద్దరిని మీ పితరులు సేవించిన దేవతలను సేవించెదరో, అమోరీయుల దేశమున మీరు నివసించుచున్నారే, వారి దేవతలను సేవించెదరో నేడు మీరు కోరుకునుడి; మీరెవరిని సేవింప కోరుకొనినను నేనును నా ఇంటి వారును యోహోవాను (మాత్రమే) సేవించెదము” అనెను.**
>
> ***(యెహోషువ- 24: 14, 15)***

బనీ ఇస్రాయీల్ వక్ర స్వభావాన్ని, అధైర్యాన్ని దివ్యఖుర్‌ఆన్ చాలా వివరంగా ప్రస్తావించింది. ఈజిప్టులో ఉండగా మూసా(అ) పిలుపునకు సకారాత్మకంగా స్పందించే బదులు సంశయానికి లోనవటం, ఫిరౌన్ చెర నుండి విడుదలవగానే సామిరీ మాయమాటల్లో పడిపోయి ఆవుదూడను పూజించటం, ఆవును జిబహ్ చేయమన్న దైవాజ్ఞను శిరసావహించడానికి రకరకాల వంకలు పెట్టడం, అధిక ప్రశ్నలు వేసి చిక్కుల్లో పడటం, ఎడారిలో దైవానుగ్రహం వల్ల ప్రాప్తమయిన ‘మన్న్‌-సల్వా’ ఆహార పదార్థాలను కృతజ్ఞతగా స్వీకరించే బదులు పాత ఆహారాన్నే కావాలని పట్టుబట్టడం, యుద్ధ సందర్భంగా దైవాదేశాలను త్రోసిపుచ్చటం, శనివారం ఆజ్ఞలను ఉల్లంఘించటం, దైవగ్రంథంలో ప్రక్షిప్తాలకు పాల్పడటం, సత్యాన్ని కప్పిపుచ్చటం, దైవప్రవక్తను హత్య గావించటం, ప్రాపంచిక ఉద్దేశాలతో గ్రంథ జ్ఞానాన్ని అమ్ముకోవటం- బనీ ఇస్రాయీల్ చరిత్ర పుటలన్నీ ఇలాంటి దగుల్బాజీ చేష్టలతో నలుపెక్కాయి.

దైవప్రవక్త మూసా (అ) నలభై ఏండ్ల కాలం అవిశ్రాంతంగా సంస్కరించినప్పటికీ, 28 ఏండ్ల పాటు హజ్రత్ యోషే (అ) శిక్షణ ఇచ్చినప్పటికీ ఇస్రాయీలీయుల అణువణువునూ పెనవేసుకొని ఉన్న అజ్ఞాన కాలపు మూఢ భావాలు దూరమవలేదని దీనిని బట్టి విదితమవుతోంది.




**నిర్గమం తరువాత బనీ ఇస్రాయీల్ సంచరించిన కొన్ని ప్రదేశాలు**

## పలస్తీనా విజయం తరువాత...

దైవప్రవక్త హజ్రత్ మూసా (అలైహిస్సలామ్) తదనంతరం ఇస్రాయీల్ సంతతి వారు విజేతలుగా పలస్తీనాలో ప్రవేశించినప్పుడు అక్కడ విభిన్న జాతులవారున్నారు. వారిలో అమ్మూరీ, కనానీ, ఫిరిజ్జీ, హవీ, యబూసీ, ఫిలిస్తీలు ముఖ్యులు. ఈ జాతులు అత్యంత నీచమయిన షిర్క్‌కు ఆలవాలమై ఉండేవి. దైవత్వమంతా అసంఖ్యాకమయిన చిల్లర దేవుళ్ళ మధ్య విభజితమైపోయింది. ఆ దేవీదేవతలకు ఆపాదించబడిన లక్షణాలు ఎంత వికృతమైనవంటే నైతికంగా అధోగతిలో ఉన్న మనిషి సయితం అలాంటి వాటిని ఊహించనయినా లేడు. వారు తమ దేవీదేవతల ప్రసన్నత కోసం పసిపిల్లలను బలి ఇచ్చేవారు. వారి దేవాలయాలు వ్యభిచార కేంద్రాలుగా వర్థిల్లేవి. స్త్రీలను దేవదాసీలుగా చేసి ఆరాధనాలయాలలో ఉంచటం, వారితో రమించటం, ఆరాధనల్లో భాగంగా భావించబడేది.

తౌరాతులో మహనీయ మూసా(అ) ద్వారా బనీ ఇస్రాయీల్‌కు చాలా స్పష్టంగా ఇవ్వబడిన సూచనలలో ఒకటేమంటే, మీరు ఆ చిన్నా చితకా జాతులను తుద ముట్టించి, వారి స్వాధీనంలో ఉన్న పలస్తీనా భూభాగాన్ని కైవసం చేసుకోండి. వారితో సహజీవనం సాగించకండి. వారిలో ఉన్న నైతికపు రుగ్మతలకు, విశ్వాసపరమైన చెడుగులకు లోనవకండి.

కాని–

ఇస్రాయీల్ వంశీయులు పలస్తీనాలో కాలు మోపగానే ఈ ఉపదేశాన్ని మరిచి పోయారు. వారంతా కలిసి ఒక సుసంఘటితమైన, సంయుక్త రాజ్యాన్ని స్థాపించే బదులు ప్రతి తెగవారు తమకు స్వాధీనమైన ప్రదేశంలోని ఒక్కో ముక్కను తీసుకొని వేరుపోవడానికే ఇష్టపడ్డారు. ఈ వేర్పాటు ధోరణి కారణంగా ఇస్రాయీల్ వంశీయుల ఏ ఒక్క తెగ కూడా బలోపేతం కాలేకపోయింది. తమ ప్రదేశాన్ని ముష్రిక్ జాతుల దురాచారాల నుండి పవిత్రపరిచే శక్తి ఏ ఒక్క ఇస్రాయీల్ గోత్రంలోనూ లేకపోయింది. తత్కారణంగా వారు బహుదైవోపాసనకు ఆలవాలమైన వివిధ జాతులతో కలిసి మనుగడ సాగించక తప్పలేదు. ఆ విధంగా ఇస్రాయీలీయులలో 'షిర్క్' పాదరసంలా పాకిపోయింది. దాంతో పాటే క్రమక్రమంగా వారిలో ఇతరత్రా నైతికపు రుగ్మతలు కూడా చోటు చేసుకున్నాయి.

## బైబిల్ ద్వారా తెలిసేదేమిటంటే-

తాలూత్ కాలానికి పూర్వం వరకూ సైదా, షూర్, దూర్, ముజద్దా, బైత్‌షాన్, జజర్, జెరూసలేం తదితర పట్టణాలు బహుదైవారాధకుల అధీనంలోనే ఉండేవి. ఆ ప్రాంతాలలోని బహు దైవోపాసనా సంస్కృతి ప్రభావం ఇస్రాయీల్ సంతతిపై తీవ్రంగా పడింది. దానికితోడు బనీ ఇస్రాయీల్ తెగలు నివసించే సరిహద్దు ప్రాంతాలపై ఫిలస్తీలు, అదూమీలు, మవాబీలు, అమూనియులు తరచూ దాడులు చేసి బనీ ఇస్రాయీల్ అధీనంలో ఉన్న అనేక ప్రాంతాలను ఆక్రమించుకున్నారు. దేవుడే గనక తాలూత్ నేతృత్వంలో ఇస్రాయీల్ తెగలను ఏకత్రం చేసి ఉండకపోతే వారు పలస్తీనా క్షేత్రం నుండి కూకటివేళ్ళతో పెకలించబడేవారే.

# 4

## దైవప్రవక్త ఈసా (యేసు-అలైహిస్సలామ్)
# సిసలైన ప్రబోధనలు

**పాత నిబంధన** ద్వితీయోపదేశ కాండంలోని వివిధ భాగాల అధ్యయనం ద్వారా మనకు తెలిసేదేమిటంటే, దైవప్రవక్త హజ్రత్ మూసా(అ) ఇస్రాయీల్ సంతతి వారిని తౌరాతు గ్రంథ రక్షణ గురించి మరీ మరీ నొక్కి వక్కాణించారు. గ్రంథంలోని ఆదేశాలను మనోఫలకాలపై ముద్రించుకోవాలని, భావి తరాల వారికి గ్రంథాన్ని నేర్పాలని, ఇంట్లో ఉన్నా, మార్గంలో నడుస్తూ ఉన్నా ఎల్లవేళలా మీరు ఈ ఉపదేశాలను గురించి చర్చించుకుంటూ ఉండాలని మహనీయ మూసా(అ) తాకీదు చేశారు.

కాని యూదు పండితులు ఈ ఉపదేశాలను పెడచెవిన పెట్టారు. తౌరాతు విషయంలో వారు చేసిన మహాపరాధం ఏమిటంటే, ఆ జ్ఞాన పరిమళాన్ని సర్వ సామాన్యం చేసే బదులు, దానిని రిబ్బీలకు, మత పీష్వాలకు పరిమితం చేశారు. ఇతర మతాల వారికి తెలియపరచలేదు సరికదా, కనీసం యూదుల్లోని జన సామాన్యానికి కూడా ఆ సుగంధాన్ని ఆఘ్రాణించే అవకాశం కల్పించలేదు. పైగా వారు తమ స్వార్థ ప్రయోజనాల కోసం దైవవాక్యాలను అమ్ముకున్నారు. గ్రంథంలో ప్రక్షిప్తాలకు పాల్పడ్డారు. పోనీ అజ్ఞానం కారణంగా ప్రజాబాహుళ్యంలో దురాచారాలు, మూఢ నమ్మకాలు ప్రబలిపోయినప్పుడు యూదు విద్వాంసులు సంస్కరణకు నడుం బిగించారా అంటే అదీ చేయలేదు. పైగా వారు తమ మాటల ద్వారా, చేతల ద్వారా, వైఖరి ద్వారా పెడర్థాలకు తావునిచ్చేలా ప్రవర్తించారు.

యూదుల మాదిరిగానే క్రైస్తవులు కూడా తమ గ్రంథాన్ని కాపాడుకోలేదు. తత్కారణంగా 'ప్రక్షిప్తాల' ద్వారం గుండా వారి ధర్మం (దీన్)లో తప్పుడు విశ్వాసాలు,

ఆజ్ఞలు జొరబడ్డాయి. ఇంజీలు గ్రంథం గనక దాని నిజస్థితిలో ఉండి ఉంటే నేడు నసారా సముదాయం స్వరూప స్వభావాలే మరో విధంగా ఉండేవి. నేడు మనం 'ఇంజీలు'గా పిలిచే గ్రంథం వాస్తవానికి నాలుగు పెద్ద సువార్తల సమాహారం.

1. మత్తయి సువార్త
2. మార్కు సువార్త
3. లూకా సువార్త
4. యోహాను సువార్త

కాని విచిత్రం, విశేషం ఏమిటంటే వీటిలో ఏ ఒక్కటీ మర్యమ్ కుమారుడగు మహనీయ ఈసా మసీహ్ (అలైహిస్సలాం)ది కాదు.

'కొత్త నిబంధన'లో అత్యంత ప్రామాణికమైనవిగా పరిగణించి చేర్చబడిన ఈ నాలుగు సువార్తలను లిఖించిన వారి పుట్టు పూర్వోత్తరాలను చూస్తే, వారిలో ఏ ఒక్కరూ మహనీయ ఈసా (ఏసుక్రీస్తు అలైహిస్సలాం) ప్రత్యక్ష సహచరులు కారు. యేసు సహచరుల నుండి తెలుసుకున్న విశేషాలను తమ సువార్తలో నమోదు చేసినట్లు వారెవరూ చెప్పనూ లేదు. ఇతర ఉల్లేఖకుల పేర్లను కూడా వారు పేర్కొనలేదు.

దీనికి భిన్నంగా బర్నబాస్ ఇంజీలు (సువార్త) రచయిత నిర్ద్వంద్వంగా ప్రకటించాడు– తాను మహనీయ మసీహ్ (ఏసుక్రీస్తు– అలైహిస్సలామ్) గారి ప్రప్రథమ పన్నెండు మంది హవారీలలో ఒకడినని. మొదటి నుండి చివరివరకు తాను మసీహ్ (ఏసుక్రీస్తు–అ)కి చేదోడు వాదోడుగా ఉన్నానని, తాను కళ్ళారా చూసినదే, చెవులారా విన్నదే ఈ గ్రంథంలో నమోదు చేస్తున్నానని కూడా ఆయన వక్కాణించాడు.

అంతేకాదు–

మహనీయ మసీహ్ (అలైహిస్సలాం) ఈ లోకం నుండి నిష్క్రమించే ముందు తనతో చెప్పిన మాటలను కూడా ఆయన పొందుపరిచాడు– మహనీయ మసీహ్ (అ) ఇలా అన్నారు: 'నా గురించి ప్రజలలో వ్యాపించి ఉన్న సందేహాలను నివృత్తి చెయ్యటం, సిసలైన స్థితిగతులను లోకం దృష్టికి తీసుకురావటం నీ బాధ్యత.'

## బర్నబాస్ ఇంజీలు ప్రత్యేకతలు

ఈ 'సువార్త'ను ఎవరయినాసరే నిష్పక్షపాత దృష్టితో అధ్యయనం చేస్తే ఇది కొత్త నిబంధనలోని మిగతా నాలుగు సువార్తలకన్నా ఎన్నో రెట్లు మెరుగైనది, ప్రామాణికమైనది అన్న విషయం అర్థమైపోతుంది. ఈ సువార్తలో మహనీయ మసీహ్

(అలైహిస్సలాం) జీవిత కాలంలోని సంఘటనలెన్నో సవివరంగా నమోదు చేయబడ్డాయి. వాటిని చదువుతున్నవారికి, అక్కడ కూర్చుని ఆ దృశ్యాలను తిలకిస్తున్నట్లే ఉంటుంది.

మిగతా నాలుగు సువార్తలకన్నా బర్నబాస్ ఇంజీలులో మహనీయ మసీహ్ (ఏసుక్రీస్తు–అ) ప్రబోధనలు చాలా స్పష్టంగా, ప్రభావవంతంగా లిఖించబడ్డాయి. ఏకేశ్వరోపాసనకు సంబంధించిన ఉపదేశాలు, బహు దైవోపాసనను ఖండించిన తీరు, దేవుని గుణగణాలను వివరించిన వైనం, ఆరాధనలకు, నైతిక వర్తనకు సంబంధించిన అంశాలు ఈ సువార్తలలో సూటిగా, సులభ గ్రాహ్యంగా ఉన్నాయి. మనోజ్ఞమైన దృష్టాంతాల ద్వారా ఏసుక్రీస్తు విషయాన్ని వివరించిన తీరు అమోఘం. ఏసుక్రీస్తు (అ) తన శిష్యుల శిక్షణ నిమిత్తం అవలంబించిన వివేచనాభరితమయిన విధానాన్ని ఈ సువార్త కళ్ళకు కట్టినట్టే మన ముందుంచింది. దైవప్రవక్త ఈసా (ఏసుక్రీస్తు–అ) సంభాషణా తీరును, స్వభావాన్ని గురించి అధ్యయనం చేసివున్న ఏ వ్యక్తి అయినాసరే ఈ సువార్తను చదువుతున్నప్పుడు, 'ఇది తరువాతి కాలపు అనుయాయులు అల్లిన కాల్పనిక వృత్తాంతం కానేకాదు' అన్న నిర్ధారణకు వస్తాడు.

## దైవ ప్రవక్తలందరి ప్రబోధనలతో సమరసం

ఈ సువార్తలో పొందుపరచబడిన మహనీయ ఈసా(అ) జీవితం, ఆయన గారి ఉపదేశాలు అచ్చం ఒక ప్రవక్త నిజ జీవితానికి, ప్రబోధనలకు అద్దం పట్టినవిగానే కనిపిస్తాయి. ఈ సువార్తలో ఏసుక్రీస్తు (అ) తనను 'ఒక ప్రవక్త'గా సమర్పించుకుంటారు. తనకన్నా ముందు వచ్చిన ప్రవక్తలను, గ్రంథాలను ఆయన ధ్రువపరుస్తారు. దేవుని వాస్తవిక జ్ఞానం కొరకు దైవప్రవక్తల ప్రబోధనలపై ఆధారపడటం తప్ప వేరే సాధనం లేదని, దైవప్రవక్తలను విడనాడినవాడు దైవాన్ని విడనాడినట్లేనని ఆయన స్పష్టంగా ప్రకటించారు. తనకు పూర్వం వచ్చిన ప్రవక్తలు దేవుని ఏకత్వం, దైవదౌత్యం, పరలోకం గురించి చెప్పిన విషయాలనే ఏసుక్రీస్తు (ఈసా మసీహ్–అ) కూడా సమర్పించారు. నమాజ్, రోజా, జకాత్‌ల గురించి కూడా ఆయన నొక్కి వక్కాణించారు. బర్నబాస్ తన ఇంజీలులో నమాజుల వేళలను కూడా పొందుపరిచారు. వాటిని చదివినప్పుడు ఫజ్ర్, జుహ్ర్, అస్ర్, మగ్రిబ్, ఇషా, తహజ్జుద్ వేళలలోనే మహనీయ మసీహ్ (ఏసుక్రీస్తు–అ) కూడా దైవారాధన చేసేవారని అర్థమవుతోంది. దావూదు సులైమానుల (అలైహిముస్సలామ్)ను కూడా ఈయన దైవప్రవక్తలుగా నిర్ధారించారు. మరి చూడబోతే యూదులు, క్రైస్తవులు వీరిద్దరి పేర్లను ప్రవక్తల జాబితాలో నుండి

తొలగించి వేశారు. దైవప్రవక్త హజ్రత్ ఇస్మాయీల్ (అ)ని ఈయన 'జబీహ్'గా ఖరారు చేశారు.

## బర్నబాస్ ఇంజీల్ ప్రధాన లక్ష్యం

ప్రారంభంలోనే దీని రచయిత తన రచనా ఉద్దేశాన్ని వివరించారు. ఆయన ఇలా అంటున్నారు: "సాతాను మాయాజాలంలో చిక్కుకుని యేసును దైవ కుమారునిగా ఖరారు చేసి, సున్నతీ (సుంతి) అనవసరం అని చెప్పేవారి సిద్ధాంతాల సంస్కరణ నిమిత్తమే ఈ రచన. వారు అధర్మమైన (హరామ్) ఆహార పదార్థాలను ధర్మం (హలాల్)గా చేసుకుంటారు. ఈ విధంగా మోసపోయిన వారిలో పోలూస్ కూడా ఒకడు."

రచయిత అభిప్రాయపడిన దాని ప్రకారం మహనీయ మసీహ్ (యేసు–అ) ఈ ప్రపంచంలో ఉన్నప్పుడు, ఆయన గారి మహిమలను చూసి బహు దైవారాధకులైన రోమను సిపాయిలు ఆయన్ని దైవంగా తలపోశారు. మరికొందరు ఆయన్ని దేవుని కుమారునిగా పిలువసాగారు. ఆ తరువాత (క్రమేణా) ఈ అంటు బనీ ఇస్రాయీల్ ప్రజలకు కూడా సోకింది. ఈ పరిస్థితిని చూసి మహనీయ ఈసా(అ) ఎంతో వ్యాకులతకు లోనయ్యారు. ఆయన తన విషయంలో ప్రబలుతున్న ఈ తప్పుడు నమ్మకాన్ని గట్టిగా ఖండించారు. తనకు ఇలాంటి విషయాలను ఆపాదించే వారిని శపించారు కూడా. ఆ తరువాత ఆయన ఈ తప్పుడు విశ్వాసాన్ని ఖండించి, నిజ స్థితిని తెలియ పరిచేందుకు తన శిష్యులను యూదు ప్రజలలోకి పంపించారు. ఆయన ప్రార్థన వల్ల ఆయన శిష్యుల చేత అలాంటి మహిమలే చేయించబడ్డాయి. మహిమలు ప్రదర్శించేవాడు దేవుడు లేదా దేవుని కుమారుడై ఉంటాడన్న నమ్మకాన్ని ఖండించటం దీని అసలు ఉద్దేశం. ప్రజా బాహుళ్యంలో ఇలాంటి అంధ విశ్వాసాలు ప్రబలటం పట్ల ఈ మహనీయుడు ఎంతటి ఆందోళనకు గురయ్యారో బర్నబాస్ అనేక చోట్ల వివరించాడు.

## నాలుగు సువార్తలలో యేసు(అ) బోధనలు

నేడు మనం ఎదుర్కొంటున్న ఎన్నో సామాజిక, రాజకీయ సమస్యలు అలనాడు మహనీయ ఈసా(యేసు– అలైహిస్సలాం) ఎదుర్కొన్న సమస్యలకంటే భిన్నమైనవేమీ కావు. ఆ పరిస్థితుల్లోనే ఆయన పాలస్తీనా వాసులకు దేవుడు మెచ్చిన ప్రభుత్వ స్థాపనకు పిలుపు ఇచ్చారు. అందువల్ల ఆయన కార్యాచరణలో మనకు ఉపయుక్తమయిన

సూచనలనేకం లభ్యమవుతాయి. ఆ మహనీయుని ఉపదేశాలు కొన్నింటిని ఇక్కడ చూడండి :

## దేవుని ఏకత్వం వైపునకు పిలుపు

శాస్త్రులలో ఒకడు వచ్చి, వారు తర్కించుట విని, ఆజ్ఞలన్నింటిలో ప్రధానమైన దేదని అడిగెను. అందుకు యేసు– ప్రధానమైనది ఏదనగా– 'ఓ ఇశ్రాయేలూ, వినుము; మన దేవుడైన ప్రభువు అద్వితీయ ప్రభువు. నీవు నీ పూర్ణ హృదయముతోను, నీ పూర్ణాత్మతోను, నీ పూర్ణ వివేకముతోను, నీ పూర్ణ బలముతోను నీ దేవుడైన ప్రభువును ప్రేమింపవలెననునది ప్రధానమైన ఆజ్ఞ. రెండవ ఆజ్ఞ; వీటికంటే ముఖ్య మైన ఆజ్ఞ మరేదియు లేద'ని అతనితో చెప్పెను. ఆ శాస్త్రి, 'బోధకుడా! బాగుగా చెప్పితివి. ఆయన అద్వితీయుడనియు, ఆయన తప్ప వేరొకడు లేడనియు నీవు చెప్పిన మాట సత్యమే...' అనెను. (మార్కు– 12: 28–33)

## దేవుని సామ్రాజ్యం

కాబట్టి మీరీలాగు ప్రార్థన చేయుడి–

**'పరలోక మందున్న మా తండ్రీ! నీ నామము పరిశుద్ధపరచబడుగాక! నీ రాజ్యము వచ్చుగాక! నీ చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లు భూమి యందును నెరవేరును గాక!'** ***(మత్తయి– 6: 9,10)***

**"నీ దేవుడైన ప్రభువునకు మ్రొక్కి ఆయనను మాత్రమే సేవింపవలెను."**

***(లూకా– 4: 8)***

చివరి వాక్యాల్లో మహనీయ మసీహ్ (యేసు–అ) తన ప్రధాన ధ్యేయాన్ని స్పష్టం చేశారు. ఆయన దృష్టిలో దేవుని రాజ్యమంటే 'ఆధ్యాత్మిక సామ్రాజ్యం' మాత్రమేనన్న అపోహ సర్వత్రా ప్రబలి ఉన్నది. ఈ అపోహను ఈ వాక్యం ఖండిస్తోంది. సమస్త జగతిలో దేవుని శాసనాలు, షరీఅత్ ఆజ్ఞలు ఎలా విధితమై ఉన్నాయో అలాగే అవి భూమండలంలో కూడా ప్రవేశపెట్టబడాలన్నది ఆయన లక్ష్యం. ఈ విప్లవం కోసమే ఆయన జనుల సంస్కరణకు నడుం బిగించారు.

## సత్యాసత్యాల సంఘర్షణా సందేశం

**"నేను భూమి మీదికి సమాధానమును పంప వచ్చితినని తలంచకుడి; ఖడ్గమునే గాని సమాధానమును పంపుటకు నేను రాలేదు. ఒక మనుష్యునికి వాని**

తండ్రికిని, కుమార్తెకును ఆమె తల్లికిని, కోడలికిని ఆమె అత్తకును విరోధము పెట్టవచ్చితిని. ఒక మనుష్యుని ఇంటివారే అతనికి శత్రువులగుదురు. తండ్రి నైనను, తల్లినైనను నాకంటే ఎక్కువగా ప్రేమించువాడు నాకు పాత్రుడు కాడు. కుమారుని నైనను, కుమార్తెనైనను నాకంటే ఎక్కువగా ప్రేమించువాడు నాకు పాత్రుడు కాడు." *(మత్తయి – 10: 34– 37)*

## సత్యమార్గంలో పరీక్షలు అనివార్యం

"తన సిలువను ఎత్తుకుని నన్ను వెంబడింపనివాడు నాకు పాత్రుడు కాడు. తన ప్రాణము దక్కించుకొనువాడు దానిని పోగొట్టుకొనును గాని నా నిమిత్తము తన ప్రాణము పోగొట్టుకొనువాడు దానిని దక్కించుకొనును.

*(మత్తయి – 10 : 38, 39)*

"ఎవడైనను నన్ను వెంబడింపగోరిన యెడల, తన్ను తాను ఉపేక్షించుకుని, తన సిలువ నెత్తికొని నన్ను వెంబడింపవలెను." *(మత్తయి – 16: 24)*

"సహోదరుడు సహోదరుని, తండ్రి కుమారుని మరణమునకు అప్పగించెదరు; పిల్లలు తల్లిదండ్రుల మీద లేచి వారిని చంపించెదరు. మీరు నా నామము నిమిత్తము అందరిచేత ద్వేషింపబడుదురు. అంతము వరకు సహించిన వాడు రక్షింపబడును.' *(మత్తయి – 10: 21,22)*

"ఇదిగో, తోడేళ్ళ మధ్యకు గొర్రెలను పంపినట్లు నేను మిమ్మును పంపుచున్నాను గనుక... మనుష్యులను గూర్చి జాగ్రత్త పడుడి; వారు మిమ్మును మహాసభలకు అప్పగించి తమ సమాజ మందిరములలో మిమ్మును కొరడాలతో కొట్టింతురు... నా నిమిత్తము అధిపతుల యొద్దకును రాజుల వద్దకును తేబడుదురు." *(మత్తయి – 10: 16–18)*

"ఎవడైనను నా యొద్దకు వచ్చి తన తండ్రిని, తల్లిని, భార్యను, పిల్లలను, అన్నదమ్ములను అక్కాచెల్లెండ్రను తన ప్రాణము సహా ద్వేషింపకుంటే వాడు నా శిష్యుడు కానేరడు మరియు ఎవడైనను తన సిలువను మోసికొని నన్ను వెంబడింపని యెడల వాడు నా శిష్యుడు కానేరడు. మీలో ఎవడైనను ఒక గోపురము కట్టింపగోరిన యెడల దానిని కొనసాగించుటకు కావలసినది తన యొద్ద ఉన్నదో లేదో అని కూర్చుండి తగులబడి మొదట లెక్క చూచుకొనడా? చూచుకొనని యెడల అతను దాని పునాది వేసి, ఒకవేళ దానిని కొనసాగింప

లేక పోయినందున, చూచు వారందరు– ఈ మనుష్యుడు కట్ట మొదలుపెట్టెను గాని కొనసాగింప లేకపోయెనని అతని చూచి యెగతాళి చేయసాగుదురు... ఆ ప్రకారమే మీలో తనకు కలిగినదంతయు విడిచిపెట్టని వాడు నా శిష్యుడు కానేరడు.” ***(లూకా– 14: 26–33)***

## విప్లవాత్మక ఉద్యమం

పై వచనాలన్నింటి ద్వారా తేటతెల్లమయ్యేదేమిటంటే, మర్యమ్ కుమారుడగు మసీహ్ (యేసు– అలైహిస్సలామ్) కేవలం ఒక మత ప్రచారకునిగా మాత్రమే నడుం బిగించలేదు. పైగా ఆయన సామాజికంగా, సాంస్కృతికంగా, రాజకీయంగా వ్యవస్థనంతటినీ ప్రక్షాళనం చేసి, ఓ సువ్యవస్థను స్థాపించదలిచారు. ఆయన ఉద్యమం రోము రాజ్యాధిపతులకు, యూదు ప్రభుత్వానికి, శాస్త్రుల, పెరిసయ్యుల పెత్తనానికి, మనోవాంఛల వెనుక పరుగెత్తే వ్యక్తులందరికీ ప్రమాదకరంగా కనిపించింది. అందుకే యేసు తాను ఎన్నుకున్న బాట పూలబాట కాదని, అదెంతో కష్టభూయిష్టమైనదని జనులకు ముందే చెప్పేసేవారు. ఈ కష్టాలను ఓపికతో సహించగలిగే వారే తన వెంట రావాలని స్పష్టంగా తెలిపేవారు.

## సహన బోధ

**“నేను మీతో చెప్పునదేమనగా దుష్టుని ఎదిరింపక, నిన్ను కుడి చెంప మీద కొట్టువాని వైపునకు ఎడమ చెంప కూడా త్రిప్పుము. ఎవడైనా నీ మీద వ్యాజ్యము వేసి నీ అంగీ తీసుకొనగోరిన యెడల వానికి నీ పై వస్త్రము కూడా ఇచ్చి వేయుము. ఒకడు ఒక మైలు దూరము రమ్మని నిన్ను బలవంతము చేసిన యెడల వానితో కూడా రెండు మైళ్ళు వెళ్ళుము.”** ***(మత్తయి– 5: 39–41)***

**“ఆత్మను చంపనేరక దేహమునే చంపువారికి భయపడకుడి గాని ఆత్మను దేహమును కూడా నరకములో నశింపజేయగలవానికి భయపడుడి.”**

***(మత్తయి– 10: 28)***

## ప్రాపంచిక వ్యామోహాన్ని పరిత్యజించటం, పరలోక చింతన వైపు పిలుపు

**“భూమి మీద మీ కొరకు ధనమును కూర్చుకొనవద్దు; ఇక్కడ చిమ్మెటయు, తుప్పును తినివేయును. దొంగలు కన్నము వేసి దొంగిలెదరు. పరలోకమందు మీ కొరకు ధనమును కూర్చుకొనుడి.”** ***(మత్తయి– 6: 19, 20)***

"ఎవడును ఇద్దరు యజమానులకు దాసుడుగా ఉండనేరడు... మీరు దేవునికిని, సిరికిని దాసులుగా నుండనేరరు. అందువలన నేను మీతో చెప్పునదేమనగా- ఏమి తిందుమో ఏమి త్రాగుదుమో అని మీ ప్రాణమును గూర్చియైనను, ఏమి ధరించుకొందుమో అని మీ దేహమును గూర్చియైనను చింతింపకుడి; ఆహారము కంటే ప్రాణమును, వస్త్రముకంటే దేహమును గొప్పవి కావా? ఆకాశ పక్షులను చూడుడి; అవి విత్తవు, కోయవు, కొట్లలో కూర్చుకొనవు; అయినను మీ పరలోకపు తండ్రి వాటిని పోషించుచున్నాడు; మీరు వాటికంటే బహుశ్రేష్ఠులు కారా? మీలో నెవడు చింతించుట వలన తన యెత్తు మూరెక్కువ చేసుకొనగలడు? వస్త్రములను గూర్చి మీరు చింతింపనేల? అడవిపువ్వులు ఏలాగు నెదుగుచున్నవో ఆలోచించుడి. అవి కష్టపడవు. ఒడకవు. అయినను తన సమస్త వైభవముతో కూడిన సాలోమోను (సులైమాన్) సహితము వీటిలో ఒకదానివలెనైనను అలంకరింపబడలేదు. నేడుండి రేపు పొయ్యిలో వేయబడు అడవి గడ్డిని దేవుడీలాగు అలంకరించిన యెడల, అల్ప విశ్వాసులారా, మీకు మరి నిశ్చయముగా వస్త్రములు ధరింపజేయును గదా! కాబట్టి ఏమి తిందుమో, యేమి త్రాగుదమో, యేమి ధరించుకొందుమో అని చింతింపకుడి, అన్య జనులు వీటన్నింటి విషయమై విచారింతురు. ఇవన్నియు మీకు కావలెనని మీ పరలోకపు తండ్రికి తెలియును. కాబట్టి మీరు ఆయన రాజ్యమును, నీతిని మొదట వెదకుడి, అప్పుడవన్నియూ మీకనుగ్రహింపబడును." **(మత్తయి- 6: 24-33)**

"అడుగుడి, మీకియ్యబడును. వెదకుడి, మీకు దొరకును. తట్టుడి, మీకు తీయబడును." **(మత్తయి-7: 7)**

## సహన బోధ

మహనీయ మసీహ్ (యేసు క్రీస్తు- అలైహిస్సలామ్) సన్యాసత్వాన్ని ప్రబోధించారని, భవబంధాలను త్రెంచుకోమని చెప్పారన్న అపోహ లోకంలో సర్వసామాన్యమై ఉంది. వాస్తవానికి ఆయన ప్రారంభించిన విప్లవాత్మక ఉద్యమం కొరకు ప్రజాబాహుళ్యాన్ని మానసికంగా సన్నద్ధుల్ని చేయడానికి సహనం, ఆత్మ నిగ్రహం, దైవంపై భారం లాంటి గుణాలను గురించి ప్రబోధించటం తప్ప మార్గాంతరం లేకపోయింది.

ప్రపంచంలోని ఏ ప్రదేశంలోనయినా ఏదేని సంస్కృతీ నాగరికతల వ్యవస్థ బలంగా పాతుకుపోయి ఉండగా,

భౌతిక ఒనరులు, సాధన సంపత్తులన్నీ దాని స్వాధీనంలో ఉండగా,

అలాంటి చోట–

ప్రాపంచిక వ్యామోహాన్ని, ఆస్తీ అంతస్తులను పరిత్యజించి కష్టాలను సహించడానికి, బాధలను భరించడానికి సంతోషంగా ముందుకు వచ్చే మానవ నవనీతం లేనంతవరకూ, విప్లవం కోసం నడుం బిగించటం సముచితం అనిపించుకోదు. అలనాటి వ్యవస్థతో తలపడటమంటే కష్టాలను ఏరికోరి కొనితెచ్చుకోవటమే. ఆనాటి పరిస్థితుల దృష్ట్యా ఈ మహా కార్యానికి పూనుకోవటమంటే; ఒక చెంప దెబ్బ తిని మరో చెంపను ప్రత్యర్థికి ఇవ్వటమే. ఇది పూలబాట కాదు. తమ తలకు ఎండైనా తగలకుండా, తమ కాలికి ముల్లయినా గుచ్చుకోకుండా, తమ గుండెకు ఓ గాయమయినా కలగకుండా ఈ లక్ష్యం సిద్ధించేది కాదు. ఈ మహత్కార్యం కొరకు సంకల్పించుకున్నవారు కూడు గూడు గుడ్డ గురించి అతిగా ఆలోచించటం మానుకోవాల్సి ఉంటుంది. జీవనోపాధి ఖజానాలపై, పౌర సరఫరాల వ్యవస్థపై అధిపతులుగా ఉన్నవారితో పోరు పెట్టుకుని, వారి ద్వారా ఉపాధిని పొందగలమని ఆశిస్తే అది అత్యాశే అవుతుంది. కాబట్టి ఈ భౌతిక ఒనరులను లక్ష్యపెట్టకుండా కేవలం దైవంపై భారం మోపి ఈ మార్గంలోకి ఉరికినవారే అసత్యాన్ని ఎదిరించ గలరు.

## సమగ్రమైన మెనిఫెస్టో

**"ప్రయాస పడి భారము మోసికొనుచున్న సమస్త జనులారా! నా యొద్దకు రండి, నేను మీకు విశ్రాంతి కలుగజేతును. .... ఏల యనగా నా కాడి సులువుగాను, నా భారము తేలికగానూ ఉన్నవి" *(మత్తయి– 11: 28–30)***

దేవుడు ఇష్టపడే ప్రభుత్వ మెనిఫెస్టో ఏదీ ఇంతకన్నా క్లుప్తంగా, ఇంతకన్నా ప్రభావవంతంగా ఉండదేమో బహుశా. మనిషిపై మనిషి సాగించే ప్రభుత్వ పెత్తనపు కాడి చాలా కఠినంగా, బరువుగా ఉంటుంది. ఈ బరువు కింద నలిగిపోతున్న జనుల ముందు దేవుని రాజభటుడు చేసే ప్రకటన, ఇచ్చే సందేశం ఏమై ఉంటుంది!? ఇదిగో, ఇటు రండి, ఈ కాడిని ఎత్తుకోండి. దానిని ఎలా ఎత్తు కోవాలో నేను మీకు నేర్పుతాను. ఇది ఎంతో మృదువైనది, తేలికైనది కూడా.

## పరిపాలన కూడా సేవే

**'అన్య జనములలో రాజులు వారి మీద ప్రభుత్వము చేయుదురు; వారి మీద అధికారము చేయు వారు ఉపకారులనబడుదురు. మీరైతే ఆలాగు ఉండరాదు; మీలో గొప్పవాడు చిన్నవాని వలెను, అధిపతి పరిచారకుని వలెను ఉండవలెను." *(లూకా– 22: 25, 26)***

మర్యమ్ కుమారుడైన ఈసా మసీహ్ (యేసు–అ) తన హవారీలకు (సహచరులకు) చేసిన హితోపదేశమిది. ఆయన తరచూ ఇలాంటి హితబోధలెన్నో తన శిష్యులకు చేస్తుండేవారు. ఇలాంటి పలుకులెన్నో సువార్తలలో మనకు లభిస్తాయి. మీరు నిరంకుశ చక్రవర్తులైన ఫిరౌనులను, నమ్రూదులను తొలగించి మీరు స్వయంగా ఫిరౌనులు నమ్రూదులై కూర్చోరాదు సుమా! అన్నది దీని అంతరార్థం.

## యూదు విద్వాంసులపై, మతాచారులపై విమర్శ

**"శాస్త్రులును పరిసయ్యులును మోషే పీఠమందు కూర్చుండువారు గనక– వారు మీతో చెప్పు వాటినన్నింటినీ అనుసరించి గైకొనుడి, అయినను వారి క్రియల చొప్పున చేయకుడి; వారు చెప్పుదురే గాని చేయరు. మోయశక్యము కాని భారమైన బరువులు కట్టి మనుష్యుల భుజముల మీద వారు పెట్టుదురే గాని, తమ వ్రేలితోనైన వాటిని కదిలింపనొల్లరు. మనుష్యులకు కనబడు నిమిత్తము తమ పనులన్నియు చేయుదురు. తమ రక్షరేకులు వెడుల్పు గాను, తమ చెంగులు పెద్దవిగాను చేయుదురు. విందులలో అగ్రస్థానములను, సమాజ మందిరములలో అగ్ర పీఠములను, సంత వీధులలో వందనములను మనుష్యుల చేత బోధకులని పిలువబడుటయు కోరుదురు." (మత్తయి–23: 2–7)**

**"అయ్యో, వేషధారులైన శాస్త్రులారా! పరిసయ్యులారా! మీరు మనుష్యుల యెదుట పరలోక రాజ్యమును మూయుదురు. మీరందులో ప్రవేశింపరు, ప్రవేశించు వారిని ప్రవేశింపనియ్యరు." *(మత్తయి– 23: 13, 14)***

**"అయ్యో, వేషధారులైన శాస్త్రులారా, పరిసయ్యులారా! ఒకని మీ మతములో కలుపుకొనుటకు మీరు సముద్రమును భూమిని చుట్టి వచ్చెదరు; అతడు కలిసి**

నప్పుడు అతనిని మీకంటే రెండింతలు నరకపాత్రునిగా చేయుదురు.”

*(మత్తయి – 23: 15)*

“అంధులైన మార్గదర్శకులారా! దోమ లేకుండునట్లు వడియగట్టి ఒంటెను మ్రింగువారు మీరే.” *(మత్తయి – 23: 24)*

“అయ్యో, వేషధారులైన శాస్త్రులారా, పరిసయ్యులారా, మీరు సున్నము కొట్టిన సమాధులను పోలియున్నారు. అవి వెలుపల శృంగారముగా అగుపడును గాని లోపల చచ్చిన వారి యెముకలతోను, సమస్త కల్మషముతోను నిండియున్నవి. అలాగే మీరు వెలుపల మనుష్యులకు నీతిమంతులుగా నగుపడుచున్నారు గాని, లోపల వేషధారణతోను అక్రమముతోను నిండియున్నారు.”

*(మత్తయి – 23: 27,28)*

తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్

# 5

## దివ్యఖుర్‌ఆన్ వెలుగులో

# మర్యమ్ కుమారుడు ఈసా

## (యేసు- అలైహిస్సలామ్)

ఆమె (మర్యమ్) ఆ బాలుణ్ణి తీసుకొని తన జాతి వారి వద్దకు వచ్చింది. ప్రజలు ఇలా అన్నారు, "మర్యమ్! నీవు పెద్ద పాపమే చేశావు. ఓ హారున్ సోదరీ! నీ తండ్రి కూడ చెడ్డ మనిషి కాడే; నీ తల్లి కూడ నీతిబాహ్యమైన నడతగల స్త్రీకాదే!" మర్యమ్ బాలునివైపు సైగజేసి చూపింది. దానికి ప్రజలు, "ఉయ్యాలలోని ఈ పసిపిల్లవానితో మేము ఏం మాట్లాడము?" అని అన్నారు. పిల్లవాడు ఇలా పలికాడు, "నేను అల్లాహ్ దాసుణ్ణి. ఆయన నాకు గ్రంథాన్ని ఇచ్చాడు, నన్ను ప్రవక్తగా నియమించాడు. నేను ఎక్కడున్నా సరే, ఆయన నన్ను శుభవంతునిగా చేశాడు. నేను జీవించి ఉన్నంత కాలం నమాజును, జకాతును పాటించు అని ఆజ్ఞాపించాడు. నా తల్లి హక్కును నెరవేర్చేవానిగా నన్ను చేశాడు. నన్ను దౌర్జన్యపరునిగాను, పాషాణ హృదయునిగాను చేయలేదు. నేను పుట్టిన రోజునా, నేను మరణించే రోజునా, బ్రతికింపబడి లేపబడే రోజునా నాకు శాంతి కలుగుతుంది."

ఇతనే మర్యమ్ కుమారుడు ఈసా; ఇదే అతనికి సంబంధించిన అసలు నిజం. దానిని గురించి ప్రజలు సందేహిస్తున్నారు. ఎవరినైనా తన కుమారుడుగా చేసుకోవడం అనేది అల్లాహ్‌కు తగిన పద్ధతి కాదు. ఆయన పరమ పవిత్రుడు.

ఏ విషయాన్ని గురించియైనా ఆయన నిర్ణయం తీసుకుంటే, "అయిపో" అని ఆజ్ఞాపిస్తాడు. అంతే అది అయిపోతుంది.

(ఈసా ఇలా ప్రకటించాడు) "నాకూ, మీకూ ప్రభువు అల్లాహ్‌యే. కనుక మీరు ఆయనకే దాస్యం చేయండి. ఇదే ఋజుమార్గం." కాని తరువాత విభిన్న వర్గాలు పరస్పరం విభేదించుకోసాగాయి. *(మర్యమ్ : 27-36)*

★★★

(ప్రవక్తగా ఇస్రాయీలు సంతతి వద్దకు వచ్చినప్పుడు అతను ఇలా అన్నాడు): "నేను మీ ప్రభువు నుండి మీ వద్దకు సూచనను తీసుకువచ్చాను. మీముందే నేను మట్టితో పక్షి ఆకారం గల ఒక బొమ్మను తయారుచేసి దానిలోకి శ్వాస ఊదుతాను. అది అల్లాహ్ ఆజ్ఞతో పక్షి అవుతుంది. నేను అల్లాహ్ ఆజ్ఞతో పుట్టు గ్రుడ్డిని, కుష్ఠ రోగిని బాగుచేస్తాను. ఆయన అనుజ్ఞతో మృతులను బ్రతికిస్తాను. ఇంకా మీరు ఏమేమి తింటారో, మీ గృహాలలో ఏమేమి నిలువ చేసి ఉంచుతారో కూడా మీకు తెలుపుతాను. మీరు విశ్వసించేవారే అయితే, వాస్తవంగా ఇందులో మీకు గొప్ప సూచన ఉంది. ప్రస్తుతం నా కాలంలో ఉన్న తౌరాతు గ్రంథోపదేశాలను ధ్రువపరచటానికి నేను వచ్చాను. ఇంకా, పూర్వం మీకు నిషేధించబడిన (హరామ్ గావించబడిన) కొన్ని వస్తువులను ధర్మసమ్మతం (హలాల్) చెయ్యటానికి కూడా వచ్చాను. చూడండి! నేను మీ ప్రభువు నుండి మీ వద్దకు సూచనను తీసుకువచ్చాను. కనుక అల్లాహ్‌కు భయపడండి, నన్ను అనుసరించండి. అల్లాహ్ నాకూ ప్రభువే, మీకూ ప్రభువే. కనుక మీరు ఆయన దాస్యాన్నే చెయ్యండి. ఇదే రుజుమార్గం.

*(ఆలి ఇమ్రాన్ : 49-51)*

ఇస్రాయీలు వంశస్థుల అవిశ్వాసాన్ని, తిరస్కారాన్ని పసిగట్టినప్పుడు ఈసా ఇలా అన్నాడు: "అల్లాహ్ మార్గంలో నాకు సహాయకులుగా ఎవరు ఉంటారు?" అప్పుడు హవారీలు ఇలా జవాబు పలికారు: "మేము అల్లాహ్‌కు సహాయకులం. మేము అల్లాహ్‌ను విశ్వసించాము. మేము ముస్లిములము (అల్లాహ్‌కు విధేయులము) అనే విషయానికి మీరు సాక్షిగా ఉండండి. ప్రభూ! నీవు

అవతరింపజేసిన ఆజ్ఞను మేము విశ్వసించాము. నీ సందేశహరుణ్ణి అనుసరించటానికి మేము అంగీకరించాము. మా పేర్లు సాక్షుల జాబితాలో వ్రాయి.”

***(ఆలి ఇమ్రాన్ : 52, 53)***

★ ★ ★

వారు తమ అవిశ్వాసంలో ఎంత ముందుకు పోయారంటే, మర్యమ్‌పైనే తీవ్రమైన నింద మోపారు. స్వయంగా, “మేము మసీహ్, మర్యమ్ కుమారుడైన ఈసా అనే దైవప్రవక్తను చంపాము” అని అన్నారు– వాస్తవానికి వారు ఆయనను చంపనూ లేదు, శిలువపైకి ఎక్కించనూ లేదు. కాని ఆ విషయంలో వారు భ్రమకు గురిచెయ్యబడ్డారు. ఈ విషయం గురించి అభిప్రాయభేదం వ్యక్తం చేసిన వారు కూడా సందేహానికి లోనయ్యారు. దీనిని గురించి వారికి అసలు ఏమీ తెలియదు. వారు కేవలం ఊహనే అనుసరిస్తున్నారు. వారు అతనిని నిశ్చయంగా చంపలేదు. కాని అల్లాహ్ ఆయనను తన వైపునకు లేపుకున్నాడు. అల్లాహ్ అద్భుత శక్తి సంపన్నుడు, అత్యంత వివేకవంతుడు. గ్రంథ ప్రజలలో ఎవ్వరూ అతనిని అతని మరణానికి పూర్వం విశ్వసించకుండా ఉండరు. ప్రళయం నాడు ఆయన వారికి వ్యతిరేకంగా సాక్ష్యమిస్తాడు.

***(అన్ నిసా : 157, 158)***

గ్రంథ ప్రజలారా! మీ ధర్మ విషయాలలో అతిగా ప్రవర్తించకండి. అల్లాహ్‌కు సత్యం తప్ప వేరే విషయాన్ని ఆపాదించకండి. మసీహ్, మర్యమ్ కుమారుడైన ఈసా, అల్లాహ్ పంపిన ఒక ప్రవక్త, అల్లాహ్ మర్యమ్ వైపునకు పంపిన ఒక ఆజ్ఞ, అల్లాహ్ తరఫు నుండి వచ్చిన (మర్యమ్ గర్భంలో బిడ్డ రూపం దాల్చిన) ఒక ఆత్మ తప్ప మరేమీ కాదు. కనుక అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తలను విశ్వసించండి. ‘ముగ్గురు’ అని అనకండి. ఇలా అనటం మానివెయ్యండి. ఇది మీకే శ్రేయస్కరం. అల్లాహ్ ఒక్కడే దేవుడు. ఆయన పరిశుద్ధుడు. ఆయనకు ఒక కొడుకు ఉన్నాడనే విషయానికి ఆయన అతీతుడు. భూమ్యాకాశాలలో ఉన్న సమస్తమూ ఆయన ఆస్తియే. దాని పోషణకు, దాని రక్షణకు ఆయనే చాలు.

తాను అల్లాహ్‌కు దాసుడుగా ఉండటాన్ని మసీహ్ అగౌరవంగా భావించలేదు. అల్లాహ్‌కు అత్యంత సన్నిహితంగా ఉండే దూతలు కూడా దీనిని తమకు అగౌరవంగా భావించరు. అల్లాహ్ దాస్యాన్ని తనకు అగౌరవమైనదిగా భావిం

**చేవాడు, అలా భావిస్తూ విర్రవీగేవాడు, అల్లాహ్ అందరినీ పోగుచేసి తన ముందు హాజరు పరచబోయే ఒక సమయం వస్తుంది (అని తెలుసుకోవాలి).**

***(అన్ నిసా : 171, 172)***

★★★

**మర్యమ్ కుమారుడైన మసీహ్‌యే దేవుడు అని అన్నవారు నిశ్చయంగా అవిశ్వాసానికి పాల్పడ్డారు. ప్రవక్తా! వారితో ఇలా అను: "అల్లాహ్ గనక మర్యము కొడుకైన మసీహ్‌నీ, ఆయన తల్లినీ, సమస్త భూలోకవాసులనూ నాశనం చెయ్యగోరితే, ఆయన తన ఈ సంకల్పాన్ని విరమించుకునేలా చేసే శక్తి ఎవరికుంది? అల్లాహ్ భూమికీ, ఆకాశాలకూ, వాటిమధ్య ఉన్న సమస్తానికీ ప్రభువు. తాను కోరిన దానిని సృష్టిస్తాడు. ఆయన అధికారం ప్రతి వస్తువును లోబరచుకుని ఉంది."** ***(అల్ మాయిద : 17)***

**ఈ ప్రవక్తల తరువాత మేము మర్యమ్ కుమారుడైన ఈసాను పంపాము. ఆయన తన కాలంలో ఉన్నటువంటి తౌరాతు గ్రంథంలోని విషయాన్ని ధ్రువీకరించేవాడు. మేము ఆయనకు ఇంజీలును ప్రసాదించాము. అందులో మార్గదర్శకత్వమూ, జ్యోతీ ఉండేవి. అది కూడా ఆ కాలంలో ఉన్న తౌరాతులోని దానిని ధ్రువీకరించేది. అల్లాహ్ యందు భక్తిశ్రద్ధలు కలవారికి అది మార్గదర్శకం. అంతేకాదు, హితోపదేశం కూడా. మేము ఇంజీలు గ్రంథ ప్రజలను ఆ గ్రంథంలో అల్లాహ్ అవతరింపజేసిన శాసనం ప్రకారం తీర్పు చెయ్యాలని ఆజ్ఞాపించాము. అల్లాహ్ అవతరింపజేసిన శాసనం ప్రకారం తీర్పు చెయ్యని వారే హద్దులు మీరినవారు.** ***(అల్ మాయిదా : 46, 47)***

మర్యమ్ కుమారుడైన మసీహ్‌యే అల్లాహ్ అని అన్నవారు నిశ్చయంగా అవిశ్వాసానికి పాల్పడినట్లే. వాస్తవానికి మసీహ్ ఇలా అన్నాడు: ఇస్రాయీలు వంశీయులారా! అల్లాహ్‌కు దాస్యం చెయ్యండి. ఆయన నాకూ ప్రభువే, మీకూ ప్రభువే. ఇతరులను అల్లాహ్‌కు భాగస్వాములుగా చేసేవారికి అల్లాహ్ స్వర్గాన్ని నిషిద్ధం చేశాడు. వారి నివాసం నరకం. అటువంటి దుర్మార్గులకు సహాయం అందించే వాడెవడూ లేడు.

**"అల్లాహ్ ముగ్గురిలో ఒకడు" అని అన్నవారు నిశ్చయంగా అవిశ్వాసానికి పాల్పడినవారు. వాస్తవమేమిటంటే, దేవుడు ఒక్కడే. మరొక దేవుడు లేడు.**

వారు గనక తమ ఈ మాటలను మానుకోకపోతే, వారిలో అవిశ్వాసానికి ఒడిగట్టిన వారికి వ్యధాభరితమైన శిక్ష పడుతుంది.

*(అల్ మాయిదా : 72,73)*

మర్యమ్ పుత్రుడైన మసీహ్ ఒక ప్రవక్త తప్ప మరేమీ కాదు. ఆయనకు పూర్వం కూడా ఎంతోమంది ప్రవక్తలు గతించారు. ఆయన తల్లి సద్గుణ సంపన్నురాలు. వారు ఉభయులూ (ప్రతి రోజూ) భోజనం చేసేవారు – చూడండి! మేము వారిముందు యదార్థానికి సంబంధించిన సూచనలను ఎలా విశదీకరిస్తున్నామో. చూడండి! అయినా వారు సన్మార్గం తప్పి ఎటు పోతున్నారో!

*(అల్ మాయిదా : 75)*

ఇంకా అల్లాహ్ ఈ విధంగా అడగబోయే ఆ సమయాన్ని గురించి ఊహించండి, "మర్యమ్ కుమారుడైన ఈసా! జ్ఞాపకం తెచ్చుకో, నేను నీకూ, నీ తల్లికి ప్రసాదించిన అనుగ్రహాన్ని. నేను పరిశుద్ధాత్మ ద్వారా నీకు సహాయం చేశాను. నీవు ఊయలలో సైతం ప్రజలతో మాట్లాడేవాడివి, అదే విధంగా ఎదిగిన తరువాత కూడా. నేను నీకు గ్రంథాన్నీ, వివేకాన్నీ, తౌరాతునూ ఇంజీలునూ నేర్పాను. నీవు నా ఆదేశంతో పక్షి ఆకారంగల మట్టిబొమ్మను తయారుచేసి, దానిలో ఊదేవాడివి. అది నా ఆజ్ఞతో పక్షి అయ్యేది. నీవు పుట్టు గ్రుడ్డినీ, కుష్ఠ రోగినీ నా ఆజ్ఞతో బాగుచేసేవాడివి. నీవు మృతులను నా ఆజ్ఞతో వెలికి తీసేవాడివి. నీవు స్పష్టమైన సూచనలతో ఇస్రాయీలు సంతతి వారి వద్దకు వచ్చినప్పుడు, వారిలోని సత్యతిరస్కారులు 'ఈ సూచనలు మాయ తప్ప మరేమీ కాదు' అని అన్నారు. అప్పుడు నేనే నిన్ను వారి బారి నుండి రక్షించాను. నేను హవారీలకు, "నన్నూ నా ప్రవక్తను విశ్వసించండి" అని సూచించినప్పుడు వారు "మేము విశ్వసించాము, మేము ముస్లిములము అయ్యామన్న దానికి నీవే సాక్షి" అని అన్నారు. *(అల్ మాయిదా : 110)*

★★★

కరుణామయుడు ఎవరినో కుమారునిగా చేసుకున్నాడు అని వారు అంటారు– ఎంత ఘోరమైన విషయాన్ని మీరు కల్పించి తెచ్చారు! కరుణామయునికి సంతానం ఉన్నదని వారు చేసే వాదన కారణంగా, త్వరలోనే ఆకాశాలు పగిలి పోతాయేమో, భూమి బ్రద్దలవుతుందేమో, పర్వతాలు పడిపోతాయేమో! ఎవరినైనా కుమారునిగా చేసుకోవటం అనేది కరుణామయుని ఔన్నత్యానికి

తగినది కాదు. భూమ్యాకాశాలలో ఉన్న వారందరూ ఆయన సమక్షంలో దాసులుగా హాజరు కానున్నారు. ఆయన అందరినీ పరివేష్ఠించి ఉన్నాడు, వారిని సరిగ్గా లెక్కపెట్టి ఉంచాడు. ప్రళయం నాడు అందరూ ఆయన ముందు ఒక్కొక్కరే హాజరవుతారు. *(మర్యమ్ : 88-95)*

★★★

అల్లాహ్, "మర్యమ్ కుమారుడవైన ఈసా! నీవు మనుజ జాతితో, అల్లాహ్‌ను కాదని నన్నూ, నా తల్లిని దేవుళ్ళుగా భావించండి అని బోధించావా?" అని అడిగినపుడు అతను ఇలా మనవి చేసుకుంటాడు: "నీవు అత్యంత పవిత్రుడవు! ఏ మాటను అనే హక్కు నాకు లేదో ఆ మాటను అనటం నాకు యుక్తమైన పని కాదు. ఒకవేళ నేను ఆ విధంగా అని ఉంటే, అది నీకు తప్పకుండా తెలిసివుండేది. నా మనస్సులో ఏముందో నీకు తెలుసు. నీ మనస్సులో ఏముందో నాకు తెలియదు. నీవు గుప్తంగా ఉన్న యదార్థాలన్నీ తెలిసిన మహా జ్ఞానివి. నీవు ఆదేశించిన దానిని తప్ప దేనినీ నేను వారికి చెప్పలేదు. అది ఏమిటంటే అల్లాహ్‌ను ఆరాధించండి. ఆయన నాకూ ప్రభువే, మీకూ ప్రభువే. నేను వారిమధ్య ఉన్నంత కాలంవరకే నేను వారిని కనిపెట్టి ఉన్నాను. నీవు నన్ను తిరిగి పిలుచుకున్న తరువాత నీవే వారిని కనిపెట్టి ఉంటున్నావు. నీవు సర్వ విషయాలను కనిపెట్టి ఉండేవాడవు. ఇప్పుడు ఒకవేళ నీవు వారిని శిక్షించినట్లయితే వారు నీ దాసులు, ఒకవేళ క్షమించినట్లయితే నీవు శక్తిమంతుడవు, వివేకవంతుడవు." అప్పుడు అల్లాహ్ ఇలా సెలవిస్తాడు: "ఈ రోజు సత్యవంతులకు వారి సత్యం లాభాన్ని ఇస్తుంది. క్రింద కాలువలు ప్రవహించే ఉద్యానవనాలు వారికి లభిస్తాయి. అక్కడ వారు ఎల్లప్పుడూ ఉంటారు. వారు అల్లాహ్ అంటే ఇష్టపడతారు. అల్లాహ్ వారంటే ఇష్టపడతాడు. ఇదే గొప్ప విజయం." *(అల్ మాయిదా : 116-119)*

# 6

# యువతరానికి స్ఫూర్తి ఈ 'గుహ వారు'

**తాము నమ్మిన ఏకేశ్వరోపాసనా సిద్ధాంతం కొరకు ఆస్తిపాస్తులను, ఇల్లూ వాకిలిని వదిలిన అభిమాన ధనులైన నవ యువకులు వారు!**

తమ ఆంతర్యంలో జ్యోతిర్మయమై ఉన్న విశ్వాసాన్ని (ఈమాన్‌ను) పదిలంగా దాచుకోవడానికి ఆప్తులను, బంధు హిత గురుజనులను సయితం విడనాడి నిర్మానుష్య మైన కొండ గుహలను ఆశ్రయించిన సాత్వికులు వారు!!

"భూమ్యాకాశాలకు ప్రభువైనవాడే మాకూ ప్రభువవుతాడు. మేము ఆ స్వామిని కాదని వేరొక దైవాన్ని మొరపెట్టుకోవటమనేది మాకు ఎంతమాత్రం శోభించదు. ఒకవేళ మేము గనక అలా అన్నామంటే కచ్చితంగా అనుచితమయిన మాట పలికిన వారమవుతాము" అంటూ వారు దృఢ సంకల్పం చేసుకుని లేచి నిలబడినప్పుడు విశ్వేశ్వరుని అండదండలు వారికి విశేషంగా లభించాయి. అల్లాహ్ వారి మనసులను కుదుట పరిచాడు. వారికి కొండంత ఆత్మబలాన్ని ప్రసాదించాడు. వారి వజ్ర సంకల్పానికి ప్రకృతి పరవశించింది. పంచభూతాలు వారికి తోడైన ఆ శుభవేళ కాలచరిత్రకు మహత్తర సంకేతం అందింది.

★★★

దివ్యఖుర్‌ఆన్ వారిని 'గుహవారు' (అస్‌హాబె కహ్ఫ్)గా పేర్కొంది.

ఇంతకీ ఈ గుహవారు ఎవరు? ఎచటివారు? ఏ సముదాయానికి చెందిన వారు? ఏ కాలానికి చెందినవారు? –ఈ ప్రశ్నలకు ఖచ్చితమయిన సమాధానం

చెప్పటం కష్టం. ఖుర్‌ఆన్ వివరించినంత మటుకే ఎవరయినా ఇదమిత్థంగా చెప్ప గలుగుతారు. కాకపోతే ఈ వృత్తాంతం నుండి గుణపాఠం నేర్చుకునే అంశాలన్నింటినీ సంగ్రహించాలి. సందేహానికి తావిచ్చే వాటి గురించి కూపీలు లాగటం, అధిక ప్రశ్నలు వేయటం మానుకోవాలి. ఈ వృత్తాంతంలో ఖుర్‌ఆన్ మనకు చెప్పేది కూడా ఇదే.

అయితే ప్రాచీన వ్యాఖ్యాతల పరిశోధనల ప్రకారం మక్కా ఖురైషులతోగానీ, యూదులతోగానీ 'గుహవారి'కి సంబంధం లేదు. ఈ యువకులు దైవప్రవక్త ఈసా (యేసు– అలైహిస్సలామ్) ప్రబోధనలకు ప్రభావితులై ఏకదైవారాధన చేసేవారని తెలుస్తోంది. ధర్మావలంబనలో నికార్సయినవారు ఆ కాలంలో రోము పరిపాలకుల వేధింపులకు తరచూ గురయ్యేవారని మనకు చరిత్ర చెబుతోంది. దివ్యఖుర్‌ఆన్‌లో ప్రస్తావనకు వచ్చిన ఈ నవ యువకులు కూడా క్రైస్తవ మత ధర్మానికి కట్టుబడి, ఏకేశ్వరవాద సిద్ధాంతం కొరకు కాల ప్రవాహానికి ఎదురీత సాగించినవారే.

అల్ కహ్ఫ్ సూరాలోని 9వ ఆయత్ నుండి 26వ ఆయత్ వరకు 'గుహ వారి' యదార్థ గాథ వచ్చింది.

## పూర్వాపరాలు

గతించిన సముదాయాలలోని అతి ముఖ్యమయిన గాథలను, సంఘటనలను, పరిణామాలను వాటిలోని నీతిని పాఠకులకు వివరించటం ఖుర్‌ఆన్ ప్రత్యేకత. ఈ ప్రస్తావన వెనుక ఉన్న పూర్వాపరాలను పరిశీలిస్తే మన ముందుకు వచ్చే విషయాలివి:

క్రీ.శ. 7వ శతాబ్దిలో మక్కా పుణ్యపురిలో ప్రతిధ్వనించిన ఇస్లాం సందేశాన్ని, ముహమ్మద్ ప్రవక్త(స) ఉద్యమాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన పుర ప్రముఖులలో నజర్ బిన్ హారిస్ ఒకడు. అతను వర్తక నిమిత్తం తరచూ విదేశీ పర్యటనలు చేసేవాడు. అక్కడి ప్రజలు చెప్పుకునే పుక్కిటి పురాణాలను, వింత గాథలను విని జ్ఞాపకముంచు కునేవాడు. మహాప్రవక్త ముహమ్మద్(స) మక్కాలో ప్రజలకు ఖుర్‌ఆన్ సందేశం వినిపించి వెళ్ళిపోయాక నజర్ బిన్ హారిస్ అక్కడి ప్రేక్షకులందరినీ ఆపి, ఖుర్‌ఆన్ కన్నా మృదు మధురమయిన, మనోరంజకమయిన విషయాన్ని వినిపిస్తానని ప్రకటన గావించేవాడు. ప్రేక్షకులంతా చెవులు రిక్కించి తను చెప్పేది వినడానికి సిద్ధమవగానే, తాను ఆ నోటా ఈ నోటా విన్న పుక్కిటి పురాణాలను ఏకరువు పెట్టేవాడు. కాని ఖుర్‌ఆన్ సందేశమెక్కడ!? ఇతను చెప్పే కట్టు కథలెక్కడ!? దివ్యఖుర్‌ఆన్ వాక్యాలలోని తేటదనం ముందు అవి వెలవెలబోయేవి.

అదే సమయంలో మరో వైపున– ముహమ్మద్(స) అందజేసిన సత్యధర్మం అరేబియాలో అనుదినం విస్తరిల్లసాగింది. ప్రజలు ఒక్కొక్కరుగా ఏకేశ్వరవాదాన్ని ఆశ్రయించటంతో ఖురైషు శిబిరాలలో కలవరం మొదలయింది. అందుకే కురైషు సర్దారులు నజర్ బిన్ హారిస్, ఉఖబా బిన్ ముయీత్‌లతో కూడిన ఒక ప్రతినిధి బృందాన్ని యూదు పండితుల వద్దకు పంపారు. ముహమ్మద్ ప్రవక్త(స)ను ఉక్కిరిబిక్కిరి చేసే కొన్ని ప్రశ్నలను యూదుల నుండి సేకరించాలన్నది ఈ ప్రతినిధి బృందం లక్ష్యం. అంతకుముందు కూడా ఖురైషులు ఆధ్యాత్మిక విషయాలలో అప్పుడప్పుడూ యూదులను సంప్రదిస్తూ ఉండేవారు. యూదు మతాన్ని వాళ్ళు స్వీకరించలేదు గానీ, యూదులను జ్ఞాన సంపన్నులుగా, ధర్మవేత్తలుగా మాత్రం గౌరవించేవారు. ఎట్టకేలకు యూదు విద్వాంసులు సుదీర్ఘంగా ఆలోచించిన మీదట మూడు ప్రశ్నాస్త్రాలు ముహమ్మద్(స) పై సంధించమని ఆ ప్రతినిధి బృందానికి సూచించారు. అవేమంటే–

మొదటి ప్రశ్న– 'ఆత్మ' గురించి

రెండవ ప్రశ్న– 'జుల్ ఖర్నయిన్' గురించి

మూడవ ప్రశ్న– 'గుహవారి' గురించి

వాస్తవానికి 'గుహవారి గాథ'తో యూదులకు ఏ సంబంధమూ లేదు. ఆసక్తి కూడా లేదు. అయినప్పటికీ వారు రెండు కారణాల దృష్ట్యా ఈ ప్రశ్నను కీలక ఆయుధంగా ఉపయోగించుకోజూశారు–

**ఒకటి :** ఇస్లాంను, ఇస్లాం ప్రవక్త(స)ను వారు తమ ఉమ్మడి శత్రువుగా పరిగణించేవారు. ఇస్లాం గనక అరేబియా ద్వీపంలో ప్రాబల్యం వహించిందంటే అప్పటి వరకూ ఆ ప్రదేశంలో చెల్లుబాటవుతున్న తమ ధార్మిక గుత్తాధిపత్యానికి గండి పడినట్లే. అందుకే తాత్కాలికంగా క్రైస్తవంతో తమకున్న వైరాన్ని ఉపేక్షించి 'ఇస్లాం' రూపంలో దినదిన ప్రవర్ధమానమవుతున్న ఈ నూతన ధర్మాన్ని కూకటివ్రేళ్ళతో పెకలించటం చాలా అవసరమని యూదు విద్వాంసులు భావించారు. నేడు ప్రపంచంలో ఇస్లాంకు వ్యతిరేకంగా యూదులు– క్రైస్తవులు చెట్టాపట్టాలేసుకుని విధ్వంస రచన చేయటం వంటిదే ఇదీను.

**రెండు :** 'గుహవారు' (అస్‌హాబె కహ్ఫ్) ఏ ముష్రిక్కు పరిపాలకుని మూలంగా జనావాసానికి దూరంగా పోయి కొండ బొరియను ఆశ్రయించాల్సి వచ్చిందో, ఆ పరిపాలకుడు ఎవరో కాదు, అతను ఇస్మాయీల్ తెగవాడే. అరబ్బులు కూడా

ఇస్మాయీల్ వంశీయులే. అందువల్ల 'గుహవారి' గురించి వేసే ప్రశ్న మక్కా ప్రజలలో సంచలనం సృష్టించవచ్చు. అరబ్బులలో దీని ద్వారా చీలిక తీసుకురావచ్చు.

అప్పుడు దేవుడు సూరతుల్ కహ్ఫ్‌లోని ఈ గుహ వారి యదార్థ గాథకు సంబంధించిన ఆయతులను అవతరింపజేసి తన చివరి ప్రవక్త(స)కు అసలు సంగతి ఎరుక పరిచాడు. అనవసరమయిన విషయాలలోకి పోకుండా, అందులోని పాత్రలకు ఎలాంటి విఘాతం కలగకుండా వాస్తవాన్ని కళ్ళకు కట్టినట్లు చిత్రీకరించటం దివ్యఖుర్‌ఆన్ ప్రత్యేకత.

★★★

ఈ గుహవారి యదార్థ గాథ క్రీ.శ. మూడవ శతాబ్దిలో సంభవించింది. బహు దైవారాధకుడైన ఒక రాజు తన రాజ్య పరిధిలో నివసించే ప్రజలంతా విగ్రహారాధకులు గానే ఉండాలని ఒత్తిడి తీసుకువచ్చేవాడు. షిర్క్ ప్రబలి ఉన్న ఆ రాజ్యంలో కొందరు విశ్వాసులు, వజ్ర సంకల్పులైన యువకులు 'ఏక దైవారాధన'పై స్థిరంగా ఉన్నారు. 'తౌహీద్' విషయంలో వారు ఎవరికీ భయపడేవారు కాదు. ఎవరితోనూ రాజీపడేవారు కాదు. ఈ విషయం రాజు గారికి తెలిసింది. రాజాజ్ఞపై వారు దర్బారుకు పిలువ బడ్డారు. వారు అవలంబించే ధర్మం గురించి ఆరా తీయడం జరిగింది. తాము నమ్మి నడుచుకునే ఏకేశ్వరవాదం గురించి ఆ నవ యువకులు నిర్భయంగా, నిస్సంకోచంగా వివరించారు. వారి ధర్మం రాజధర్మానికి విరుద్ధంగా ఉంది, అంతే. రాజు గారి భృకుటి ముడిపడింది. మారు మాట్లాడకుండా తమ జీవన స్రవంతి (షిర్క్)లోకి తిరిగి రమ్మని ఆ యువకులను పురమాయించాడు రాజు. ఈ వ్యవహారంపై ఆలోచించుకునేందుకు వారికి స్వల్ప గడువు ఇచ్చాడు.

స్వాభిమానులైన ఆ నవ యువకులు పరస్పరం సమాలోచన జరిపారు. భవిష్యత్ కార్యాచరణ పథకంపై తీవ్రంగా తర్జనభర్జన చేశారు. పరిస్థితులు ఏమాత్రం సానుకూలంగా లేవు. ఒకవైపున బహు దైవారాధకులైన జాతి జనుల విరోధం, మరో వైపున రాజు గారి ఆగ్రహం! తాము గనక ఆ బస్తీలో ఉంటే హతమార్చబడటమో లేక ముష్రిక్‌ల మతంలోనికి మరల్చబడటమో తథ్యం! ఎట్టకేలకు వారంతా ఒక నిర్ణయానికి వచ్చారు– జనావాసానికి కొంత దూరాన ఉన్న పర్వత గుహలను ఆశ్ర యించి అక్కడే ఏక దైవారాధన చేసుకుంటూ గడుపుదామని!

ఆ యువకులు స్థలాన్వేషణ మొదలెట్టారు. ఒక విశాలమైన గుహను చూసి, దానినే తమ ఆశ్రమంగా ఎంపిక చేసుకున్నారు. ఆ గుహలోపలి భాగం బహు విశాలమైనది. దానికి ఇరువైపులా ద్వారాలున్నాయి. అందువల్ల గాలి, వెలుతురుకు ఏ ఇబ్బందీ ఉండదు. పైగా గుహ ద్వారాలు ఉత్తర దక్షిణ దిక్కుల్లో ఉండటం వల్ల ఎండ వారిపై పడేది కాదు. తూరుపు నుంచి పొద్దెక్కే సమయంలో గానీ, పడమటి దిక్కుకు పొద్దు వాలినప్పుడు గానీ గుహలో వెలుతురు మాత్రం ప్రసరించేది.



**ఇది 'అస్‌హాబె కహ్ఫ్' తలదాచుకున్న గుహ ముఖద్వారం అనబడుతోంది**

ఆ గుహను ఆశ్రయించగానే– దైవవశాత్తు– వారు గాఢ నిద్రలోకి జారుకున్నారు. సుదీర్ఘ కాలం వరకూ వారు నిద్రావస్థలోనే ఉండిపోయారు. మనిషి ఒకే స్థితిలో నేలకు అతుక్కుని ఉంటే నేలకు తగిలివున్న శరీరభాగాలపై పొక్కులు వస్తాయి. ఈ యువకులు మాత్రం నిద్రలో కుడివైపునకు, ఎడమ వైపునకు తిరిగి పండుకునే విధంగా ఏర్పాటు జరిగింది. వాళ్ళతోపాటు ఒక కుక్క కూడా ఉండేది. అది ఆ గుహ ముఖద్వారం వద్ద ముంగాళ్ళు చాపి గంభీరంగా కూర్చుని ఉండేది. బయటినుంచి చూస్తే విశాలమైన ఆ గుహలో ప్రమాదకరమైనది ఏదయినా ఉందేమో! అనిపించేది. ఆ కొండ గుహ ఉన్న చోట ఏ కాస్త కదలిక, సవ్వడి వినవచ్చినా బయటి మనిషి భయపడటం సహజం. అందుకే ఆ గుహ లోపలికి తొంగి చూడటానికి ఎవరూ సాహసించలేకపోయారు. ఆ యువకుల కోసం కొండ ప్రదేశమంతటా రాజ్య ప్రజలు గాలించి

ఉంటారు. ఆ గుహను కూడా సమీపించి ఉంటారు. కాని వారు తమ ప్రయత్నంలో సఫలీకృతులు కాలేకపోయారు. ఎందుకంటే తమ 'ఈమాన్'ను కాపాడుకునేందుకు బయలుదేరిన ఆ త్యాగధనులు ఇప్పుడు సూక్ష్మద్రష్ట అయిన అల్లాహ్ రక్షణలో విశ్రమించి ఉన్నారు. అంతిమ దైవప్రవక్త ముహమ్మద్(స)ను వెతుకుతూ 'సౌర్ గుహ' వరకూ వచ్చిన మక్కావారు తమ ప్రయత్నంలో విఫలమై తిరిగి వెళ్ళినట్లే, గుహ వారిని వెతుక్కుంటూ వచ్చినవారు కూడా అలసి సొలసి విఫలమై తిరోన్ముఖులై ఉంటారు బహుశా.

'నిద్రావస్థ'లోనే ఏండ్లు గడిచిపోయాయి. అక్కడి ప్రభుత్వం మారిపోయింది. క్రైస్తవ మతధర్మాన్ని అవలంబించే ఒక రాజవంశం అధికారంలోనికి వచ్చింది. కాకతాళీయంగా ఆ రోజుల్లోనే ఒక క్రైస్తవ మతాచార్యుడు మరణానంతరం మనిషి తిరిగి లేపబడతాడనే విషయాన్ని త్రోసిపుచ్చాడు. ఆ కాలంలో ఈ విషయం ఓ ముఖ్య చర్చనీయాంశంగా తయారయింది.

## కొత్త మలుపు

సరిగ్గా ఆ సందర్భంలోనే చరిత్ర ఓ మేలి మలుపు తిరిగింది.

ఏండ్ల తరబడి గుహ లోపల నిద్రిస్తున్న ఆ యువకులను లేపి, దైవధర్మంపై తిరుగుబాటు చేసిన క్రైస్తవ సన్యాసికి జ్ఞానోదయం చేయాలని, అక్కడి ప్రజా బాహుళ్యంలో మరణానంతర జీవితంపై ఏర్పడిన సైద్ధాంతిక ప్రతిష్ఠంభనను దూరం చేయాలని పరమ ప్రభువు అభిలషించాడు. ఈ సంఘటన ఆ నవ యువకుల విశ్వాసాన్ని ద్విగుణీకృతం చేయాలన్నదీ దైవేచ్ఛే. శతాబ్దాల తరబడి నిద్రలో ఉన్న మనిషికి మెలకువ వచ్చినప్పుడు వేనవేల సంవత్సరాలు మృతునిగా ఉన్నవాడు మాత్రం ఎందుకు సజీవిగా లేవడు?

> **ఈ విధంగా మేము వాళ్ళను పరస్పరం తర్జనభర్జన చేసుకునేందుకు లేపి కూర్చోబెట్టాము. వారిలోని ఒక వ్యక్తి, 'ఇంతకీ మీరిక్కడ ఎంతసేపు విశ్రమించి ఉంటారు?' అని అడిగితే, 'మహా అయితే ఒక దినమో లేక అంతకన్నా తక్కువ సమయమో!' అని అతని స్నేహితులు జవాబిచ్చారు. ఎట్టకేలకు వారంతా ఒక సమాధానానికి వస్తూ, 'ఎంత సమయం విశ్రమించి ఉంటామన్న సంగతి మీ ప్రభువుకే తెలుసు (కాబట్టి దీనిపై మల్లగుల్లాలు పడటం నిరర్థకం)' అన్నారు.**

ఇప్పుడు ఆకలి మంటను చల్లార్చేదెలా? అన్నది వారి ముందున్న ప్రశ్న. తమ దగ్గర ఉన్న నాణేలను తమ సహవాసికి ఇచ్చి పట్నం పంపాలని నిర్ణయించుకున్నారు. ఆ క్షణంలో వారు పలికిన మాటలు కూడా ప్రత్యేకంగా గమనించదగినవే-

**పట్నంలోని ఏ స్థలంలో పరిశుభ్రమైన, పరిశుద్ధమైన (హలాల్) భోజనం దొరుకుతుందో అతను పరిశోధించాకే (మన కోసం) తినడానికి భోజనం తెచ్చుకోవాలి. ఈ సందర్భంగా అతను ఎంతో లాఘవంగా చాకచక్యంగా వ్యవహరించాలి. పారదర్శకతను ప్రదర్శించాలి. తామిక్కడ విడిది చేసిన విషయం ఎవరికీ తెలియకుండా జాగ్రత్తపడాలి.**

తీరా పట్నానికి వెళ్ళి చూస్తే అక్కడి లోకమంతా మారిపోయి ఉంది. ఆ యువకుడు భయపడుతూనే, మెల్లగా ఒక భోజనశాలకు చేరుకున్నాడు. అతనిచ్చిన నాణాన్ని చూసి ఆ భోజనశాల యజమాని ఆశ్చర్యచకితుడయ్యాడు. ఎందుకంటే ఆ నాణం ఇప్పుడు చెలామణిలో లేదు. కొన్ని శతాబ్దులకు పూర్వం ముష్రిక్ రాజు పరిపాలించినప్పటి నాణెం అది. ప్రస్తుతం అక్కడి ప్రజలు క్రైస్తవులు. క్రైస్తవ రాజు ఆ ప్రదేశాన్ని పాలిస్తున్నాడు.

ప్రశ్నోత్తరాలు మొదలయ్యాయి. అసలు విషయం బయటపడింది. వారు దాచాలనుకున్నది దాగలేదు- దాగకూడదన్నదే దైవేచ్ఛ కాబట్టి! అప్పటికే ఆ యువకుల గురించి అక్కడి ప్రజలు తమ పూర్వీకుల నోట కథలు కథలుగా విని ఉన్నారు. 'వారే వీరు' అని తెలియగానే ప్రజలు ఆశ్చర్యంతోనూ,ఆనందంతోనూ ఆ మహనీయులకు స్వాగతం పలకడానికి తరలి వచ్చారు. ఆ పట్టణవాసులంతా తాము అవలంబించే సత్యధర్మం స్వీకరించారన్న విషయం ఆ గుహవారికి కూడా అర్థమయింది. వారి జీవితాశయం నెరవేరింది. అయితే ఇంతకాలంగా తాము ఆశ్రయం పొందిన గుహలోనే దైవధ్యానం చేసుకుంటూ శేషజీవితం గడపాలని ఆ యువకులు నిర్ణయించుకున్నారు. తమ మధ్యనే ఉండమని అక్కడి జనులు ప్రాధేయపడినప్పటికీ వారు మృదువుగా తిరస్కరించారు. కడకు వారు ఆ గుహలోనే తనువు చాలించారు.

## పోయినోళ్ళ పాపులారిటీ

గుహ వారు చనిపోయిన మీదట ఆ జాతి ప్రజలలో వచ్చిన 'విప్లవం' ఈ సందర్భంగా గమనించదగినది. మహనీయులు జన బాహుళ్యం మధ్యన ఉండి, వారి

సంస్కరణకు నడుం బిగించినప్పుడు జనులు వారిని ఆదరించరు. అందలమెక్కించరు. పూలదండలు వేసి సన్మానించరు సరికదా వారిని అనుమానిస్తారు. వారి ప్రబోధనలను పరిహసిస్తారు. వారి సిద్ధాంతాన్ని ఎద్దేవా చేస్తారు. వారిని పిచ్చోళ్ళ కింద జమ కడతారు. లేదా వారిని మాంత్రికులంటారు. వారి మార్గంలో అడ్డంకులు సృష్టిస్తారు. వారిపై రాళ్ళు రువ్వుతారు. వారిని సంఘం నుండి బహిష్కరిస్తారు. ఆఖరికి వారిని కడతేర్చడానికి కూడా కుట్రలు పన్నుతారు.

అయితే–

ఈ సంస్కరణాప్రియులు లోకం నుండి నిష్క్రమించిన మీదట పరిస్థితి మారిపోతుంది. ఆ మృతులతో తమకు గల బంధుత్వ బాంధవ్యాన్ని, అనువంశిక అనుబంధాన్ని, సైద్ధాంతిక సాన్నిహిత్యాన్ని జోడించడానికి భావితరాల వారు తెగ ఆరాటపడతారు. నిన్నటి వరకూ తూలనాడినవారినే ఇప్పుడు కొనియాడటం మొదలుపెడతారు. వారి భావజాలాన్ని స్వాగతిస్తారు. వారికి ఘనంగా శ్రద్ధాంజలి ఘటిస్తారు. వారి సమాధులపై ఆధ్యాత్మిక కట్టడాలను, గోపురాలను నిర్మిస్తారు. వారి పేర ఉరుసులు చేస్తారు.

ఎందుకంటే ఆ మహనీయుల మార్గం వర్తమాన కాలానిది కాదు, భూత కాలానిది. వారంతా గతించినవారు. బ్రతికి ఉన్నన్నాళ్ళూ వారికి తమ సమకాలికుల చేత శాపనార్థాలే ఎదురయ్యాయి. ఇప్పుడు వారు పోయినోళ్ళు కాబట్టి వారి పాపులారిటీ అంబరాన్ని చుంబిస్తుంది. ప్రజలు వారికి నీరాజనం పడతారు.

గుహ వారి విషయంలో జరిగింది కూడా ఇదే. మొత్తానికి ఈ యువకులు ఏక దైవారాధకులు (ముమహ్హిద్‌లు), పుణ్యాత్ములన్నది నిర్వివాదాంశం. కాబట్టి వీరి గుహపై, వీళ్ళ స్మారక చిహ్నంగా ఒక కట్టడం నిర్మించాలి అని ఒక వర్గం వాదించింది. కాని మరో వర్గం మాత్రం, మేము వీళ్ళ గుహపై ఒక ఆరాధనాలయం (మస్జిద్) నిర్మిస్తామని గట్టిగా వాదించింది. చివరకు ఈ రెండవ వర్గమే తన మాట నెగ్గించుకుంది.

## గతం నుండి గుణపాఠం

ఈ సంఘటన ఆధారంగా దేవుని ప్రియతముల (ఔలియా అల్లాహ్) సమాధులపై ఆరాధనాలయం నిర్మించటం సమ్మతమేనని పైకి అనిపిస్తుంది. ఆ మాటే కొంత మంది అంటుంటారు కూడా. కాని ఈ 'సమ్మతి' గత సముదాయాలకు మాత్రమే

వర్తిస్తుందన్న విషయం మరువరాదు. గత సమాజాలలో ధర్మసమ్మతంగా ఉన్న ఎన్నో విషయాలు కాలక్రమేణా బహు దైవారాధన (షిర్క్)కు దారితీశాయి. అందుచేతనే ముస్లిం సముదాయం (ఉమ్మతె ముస్లిమా)కై అలాంటివి నిషిద్ధంగా, అధర్మం (హరామ్)గా ఖరారు చేయబడ్డాయి. ఉదాహరణకు– గత సముదాయాలలో ఒకరి గౌరవార్థం 'సజ్దా' (సాష్టాంగ ప్రణామం) చేసే ఆచారం ఉండేది.

హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) కథనం ప్రకారం మహాప్రవక్త(స) సమాధులను సందర్శించే మహిళలను, సమాధిపై మస్జిద్‌ని నిర్మించే వారిని, సమాధులను దీపాలతో దేదీప్యమానం చేసే వారిని ధూత్కరించారు.

*(తిర్మిజీ, కితాబుస్సలాత్; హదీస్ నెం. 320)*

హజ్రత్ ఉమ్మె సలమా (ర.అ), హజ్రత్ ఉమ్మె హబీబా(ర.అ) లిద్దరూ అబిసీనియాలో కొన్ని చర్చీలను చూశారు. ఆ చర్చీలలో విగ్రహాలు ప్రతిష్ఠించబడి ఉండేవి. వారిద్దరూ దైవప్రవక్త(స) సమక్షంలో ఈ విషయాన్ని ప్రస్తావించినప్పుడు ఆయన ఇలా ఉద్బోధించారు:

"వారిలోని మహనీయుడెవరయినా చనిపోయినప్పుడు, వారు అతని సమాధిపై ప్రార్థనా మందిరం కట్టేవారు. ఆ మహనీయుని విగ్రహాన్ని ప్రతిష్ఠించేవారు. వారు ప్రళయదినాన దేవుని దృష్టిలో అందరికన్నా హీనులుగా ఉంటారు" *(బుఖారీ– మస్జిదుల అధ్యాయాలు, హదీసు నెం. 417; ముస్లిం– మస్జిద్‌ల ప్రకరణం– హదీసు నెం. 1209)*

అంతేకాదు, తనకు మరణ ఘడియలు సమీపించిన సందర్భంలో కూడా ప్రవక్త మహనీయులు (సఅసం), తన ముఖంపైన ఉన్న దుప్పటిని తొలగిస్తూ "యూదులపైన, నసారాలపైన అల్లాహ్ శాపం పడుగాక! వారు ప్రవక్తల సమాధులను ప్రార్థనాలయంగా చేసుకున్నారు" అని చెప్పారు (బుఖారీ– యుద్ధాల ప్రకరణం, హదీసు నెం. 4179; ముస్లిం– మస్జిద్‌ల ప్రకరణం: హదీసు నెం. 1215). అందువల్ల ముస్లిం సమాజ సభ్యులు సమాధిపైన మస్జిద్‌ను నిర్మించటం గానీ, మస్జిద్ లోపల సమాధిని నిర్మించటం గానీ ధర్మసమ్మతం కాదు. అంతేకాదు, సమాధిపైన ఏ రకమయిన కట్టడాన్నయినాసరే కట్టడం ధర్మసమ్మతం కాదు. ఇమామ్ అబూ హనీఫా (రహ్మ) దృష్టిలో, ఒకవేళ అలాంటి కట్టడం ఏదయినా కట్టి ఉంటే, దానిని నేలమట్టం చేసి వేయాలి. *(తఫ్సీరె ఖుర్తుబీ : 10/3815)*

## గుహ వారి సంఖ్యపై తర్జనభర్జన

“వారు ముగ్గురు, నాల్గవది వారి కుక్క” అని కొందరంటారు. “వాళ్ళు ఐదుగురు, ఆరవది వాళ్ళ కుక్క” అని మరి కొంత మంది అంటారు. వారు తమకు తెలియని విషయంలో ఊహాస్త్రాలు సంధిస్తున్నారు. “వారు ఏడుగురు, ఎనిమిదవది వారి కుక్క” అని ఇంకొందరంటారు. “(ప్రవక్తా!) వారి సంఖ్య ఎంత అన్న సంగతి నా ప్రభువుకే బాగా తెలుసు. ఇంతకీ వారెంతమంది? అన్నది కొద్దిమందికే తెలుసు” అని వారితో అను.

వారు మొత్తం ‘ఏడుగురు’ అన్న అంచనా వాస్తవాలకు దగ్గరగా ఉందని చాలామంది వ్యాఖ్యాతలు అభిప్రాయపడ్డారనుకోండి. అయినా ఈ ‘సంఖ్య’ గురించి తెలీకపోయినంత మాత్రాన ధర్మావలంబనలో మనకు వచ్చిపడిన ఇబ్బంది ఏమీ లేదు. ఆ యువకులు ఎందు నిమిత్తం నగరం విడిచారు? బహుదైవారాధకులు వారిపై ఎందుచేత దౌర్జన్యం చేశారు? ఆ త్యాగధనులు తమ విశ్వాసాన్ని (ఈమాన్‌ను) కాపాడు కునేందుకు గుహను ఆశ్రయించినప్పుడు వారికి అందిన దైవ సహాయం ఎలాంటిది? అల్లాహ్ వారి మనసులను కుదుటపరచిన వైనం ఎటువంటిది? ఈ యదార్థ గాథ ద్వారా భావితరాల వారికి లభించే సందేశం ఏమిటి? అన్నవే ప్రధానాంశాలు.

“మేమిక్కడ ఉన్న విషయం పట్నవాసులకు తెలిసిందంటే ఇంకేమీ లేదు. వారు మనపై రాళ్ళు రువ్వి చంపేస్తారు లేదా మనల్ని ధర్మభ్రష్టుల్ని చేసేస్తారు. అదే గనక జరిగితే మనం ఎన్నటికీ సాఫల్యం పొందలేము” అని వారు చెప్పిన మాటలు మరుపు రానివి, మరువరానివీను.

సత్యబలం ఉన్న మానవ నవనీతం అన్ని కాలాల్లోనూ అల్ప సంఖ్యలోనే ఉన్నప్పటికీ అది చరిత్ర గతిని మార్చే పనులు చేసింది. కాలచరిత్రకు చిరస్మరణీయ మైన సందేశం ఇచ్చింది.

వారు ఆ గుహలో సూర్యమానం ప్రకారం మూడు వందల సంవత్సరాలు గడిపారని, చంద్రమానం ప్రకారం చూస్తే 309 ఏండ్లు అని చాలామంది ఖుర్‌ఆన్ వ్యాఖ్యాతలు అభిప్రాయపడ్డారు.

“(ప్రవక్తా!) వారు అక్కడ ఖచ్చితంగా ఎంతకాలం ఉన్నారన్న విషయం

అల్లాహ్‌కే బాగా తెలుసు" అని వారితో చెప్పు అని అనటాన్ని బట్టి, ఈ విషయంపై కూడా మనం అదే పనిగా సందేహాలు వ్యక్తం చేసి సమయాన్ని వృథా చేసుకోవలసిన అవసరం లేదనిపిస్తుంది.

దివ్యఖుర్‌ఆన్ పదే పదే గుహవారిని 'ఫిత్‌యతున్'గా పేర్కొంది. ఫిత్‌యతున్ అంటే 'బహు కొద్దిమంది యువకులు' అని అర్థం. తరతరాల చరిత్రను శోధించినప్పుడు తేటతెల్లమయ్యే ముఖ్య విషయం ఏమిటంటే వృద్ధులు, వయస్సు పైబడిన వారికంటే యువకులలోనే సత్యాన్ని స్వీకరించే సామర్థ్యం అధికంగా ఉంటుంది. సన్మార్గంపై మొక్కవోని సాహసం ప్రదర్శించే గుణం కూడా వారిలోనే మెండు. అందుకే దైవప్రవక్తల సందేశానికి 'చిత్తం' అంటూ తొందరగా ముందుకు వచ్చినది కూడా యువ కిశోరాలే. అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స) పిలుపుపై మొదట 'లబ్బైక్' అన్న వారిలో కూడా అత్యధికులు యువకులే. ప్రవక్త మహనీయులు (స) మక్కానుండి మదీనాకు హిజ్రత్ చేసినప్పుడు, ఆయన్ని అనుసరించిన సహచరుల గడ్డాలు నల్లగా ఉండేవని, ఒక్క అబూ బక్ర్ (రజి) గడ్డంలోని వెంట్రుకలు మాత్రమే అక్కడక్కడా తెల్లబడ్డాయని సీరత్ గ్రంథ రచయితలు వ్రాశారు.

తెలుగు ఇస్లామీయ గ్రంథాలయం

# 7

# స్వీకృతి పొందిన పశ్చాత్తాపం

"మరి కొంతమంది ఉన్నారు– వారి వ్యవహారం దైవాజ్ఞ వచ్చేవరకూ వాయిదా వేయబడింది. అల్లాహ్ వారిని శిక్షించనూ వచ్చు లేదా వారి పశ్చాత్తాపాన్ని సమ్మతించి ఆమోదించనూ వచ్చు. అల్లాహ్ గొప్ప జ్ఞాన ధనుడు, వివేక సంపన్నుడు." ***(అత్ తౌబా– 106)***

"అల్లాహ్ (తన) ప్రవక్త వైపునకూ, గడ్డు కాలంలో ప్రవక్తకు ఆదరువుగా నిలిచిన ముహాజిర్లు, అన్సార్ల వైపునకు దయతో మరలాడు. వారిలో కొందరి హృదయాలు డోలాయమాన స్థితికి లోనైనప్పటికీ (వారు సత్యంపై స్థిరంగా ఉండటం చేత) ఆయన వారిని మన్నించాడు. నిశ్చయంగా ఆయన వారి యెడల వాత్సల్యం కలవాడు, దయాశీలుడు. వారిలో ఎవరి వ్యవహారం లోగడ వాయిదా వేయబడిందో 'ఆ ముగ్గురిని' కూడా ఆయన క్షమించాడు. భూమి విశాలంగా ఉండి కూడా వారికి ఇరుకైపోయింది. వారి ప్రాణాలు సయితం వారికి భారమైపోయాయి. అల్లాహ్ పట్టు (నిలదీత) నుండి తమ్మును తాము కాపాడుకోవటానికి, ఆయన కారుణ్యఛాయను ఆశ్రయించటం తప్ప మరో మార్గమేదీ లేదని వారు గ్రహించారు. అప్పుడు అల్లాహ్ వారి వైపునకు దయతో మరలాడు..." ***(అత్ తౌబా– 117, 118)***

## వ్యవహారం వాయిదా వేయబడిన ఆ ముగ్గురు ఎవరు?

1. హజ్రత్ కాబ్ బిన్ మాలిక్ (రజి)
2. మురారా బిన్ రబీ (రజి)
3. హిలాల్ బిన్ ఉమయ్య(రజి)

ఈ ముగ్గురూ సిసలైన విశ్వాసులు. వారిలో ద్వంద్వ స్వభావం ఏ కోశానా లేదు. కాకపోతే దైవప్రవక్త(స) ఆజ్ఞను శిరసావహించటంలో వారిలో కించిత్ బద్ధకం, అలసత్వం ఆవహించింది. వారు తమ తప్పిదాన్ని గ్రహించే లోగానే సమయం మించి పోయింది. తమ అశ్రద్ధను కప్పిపుచ్చుకోవటానికి వారు అబద్ధం చెప్పలేదు. కుంటి సాకులు చూపలేదు. పైగా తమ అలసత్వంపై సిగ్గుతో కుమిలిపోయారు. ఆంతర్యాల లోని రహస్య విషయాలను సయితం ఎరిగినవాడైన అల్లాహ్ ముందు తమ లోగుట్టు రట్టవకుండా ఉండదు. రేపు ఆయన సన్నిధిలో అపరాధులుగా నిలబడటం కంటే, ఈ రోజే నిజాన్ని నిజాయితీగా అంగీకరిస్తే ఆ కరుణామయుడు తమ పశ్చాత్తాపాన్ని ఆమోదిస్తాడని ఆ ముగ్గురూ భావించారు.

ఇంతకీ వారి వల్ల జరిగిన పొరపాటు ఏమిటి?

వాళ్ళ వ్యవహారం ఎందుచేత వాయిదా వేయబడింది?

ఎట్టకేలకు వెలువడిన ఆ తీర్పు ఎట్టిది? –స్వయంగా ఆ ముగ్గురిలో ఒకరైన మహనీయ కాబ్ ఇబ్నె మాలిక్ (రజి) ద్వారానే తెలుసుకుందాం–

★★★

హజ్రత్ కాబ్ బిన్ మాలిక్ (రజి) కుమారులలో ఒకరు హజ్రత్ అబ్దుల్లాహ్ (రజి). వృద్ధాప్యంలో కాబ్ బిన్ మాలిక్ (రజి)కి కంటిచూపు క్షీణించినప్పుడు అబ్దుల్లాహ్ గారే ఆయనకు తోడుగా ఉండి దారి చూపించేవారు. తబూక్ యుద్ధ సందర్భంగా దైవప్రవక్త(స) వెంట తబూక్‌కు ప్రయాణమవకుండా– వెనుక– ఉండిపోయిన ఉదంతాన్ని నెమరువేసుకుంటూ ఒకసారి ఆయన స్వయంగా తన కుమారునికి ఈ సంఘటనను పూసగుచ్చినట్లే వివరించారు.

మహనీయ కాబ్ బిన్ మాలిక్(రజి) ఇలా చెప్పారు:

“నేను ఒక్క తబూక్ యుద్ధంలో తప్ప మరే యుద్ధంలో కూడా ప్రవక్త మహనీయుల (సఅసం) వారిని విడిచి, వెనుక ఉండిపోలేదు. కాకపోతే ‘బద్ర్’ సంగ్రామంలో కూడా నేను పాల్గొనలేదు. అయితే బద్ర్ సంగ్రామంలో పాల్గొనకపోయినందుకు ఎవరిపైనా దైవాగ్రహం వ్యక్తమవలేదు. ఎందుకంటే బద్ర్ యుద్ధానికి ముందు ప్రవక్త మహనీయులు(స), ముస్లిములు ఖురైషు తెగవారి వర్తక బిడారులను నిలువరించే ఉద్దేశ్యంతో బయలుదేరారు. (అంటే ఆ సందర్భంగా ఆయనకు యుద్ధం చేయాలన్న ఉద్దేశం లేదు) కాని అల్లాహ్ అనూహ్యంగా శత్రు వర్గాన్ని తెచ్చి ముస్లింల ఎదుట

నిలబెట్టాడు. 'బైఅతె ఉఖబా' సందర్భంగా కూడా నేను దైవప్రవక్త(స) సమక్షంలో హాజరయ్యాను. ప్రజల్లో 'ఉఖబా ప్రతిజ్ఞ'కన్నా బద్ర్ యుద్ధ సంఘటనే ఎక్కువ చర్చనీయాంశంగా మారినప్పటికీ నా దృష్టిలో మాత్రం బద్ర్ యుద్ధంకన్నా 'బైఅతె ఉఖబా' (ఉఖబా ప్రతిజ్ఞ)లో పాల్గొనడమే ఎక్కువ ప్రీతికరమైనది.

ఇంతకీ నేను తబూక్ యుద్ధ ప్రయాణంలో వెళ్ళలేకపోవడానికి గల కారణం యిది : తబూక్ పయన బృందంలో పాల్గొనకుండా– వెనుక– ఉండిపోయిన రోజుల్లో నాకు తగు కారణమేదీ లేదు. పైగా ఆ రోజుల్లో నేను బాగా ఆరోగ్యవంతునిగా ఉన్నాను. సిరిసంపదలతో తులతూగుతూ ఉండేవాణ్ణి. దైవసాక్షిగా! అంతకు మునుపెన్నడూ నా దగ్గర రెండు వాహనాలు ఉండేవి కావు. కాని తబూక్ యుద్ధ సమయంలో నా దగ్గర రెండు వాహనాలుండేవి.

సాధారణంగా ప్రవక్త మహనీయులు(స) ఏ యుద్ధానికయినా వెళ్ళాలనుకుంటే– రణతంత్రపుటెత్తుగడలో భాగంగా– తాను ప్రయాణించే మార్గాన్నిగానీ, ప్రదేశాన్ని గానీ చూచాయగా మాత్రమే ప్రస్తావించేవారు. అంటే ఆయన ఏ దిశలో పోతున్నారో స్పష్టంగా చెప్పేవారు కాదు. దాంతో శత్రువులు ముస్లింల కదలికలను పసిగట్టడంలో బోల్తా కొట్టేవారు. కాని తబూక్ యాత్ర సందర్భంగా అలా జరగలేదు. తీవ్రమయిన వేసవి కాలంలో ప్రవక్త మహనీయులు(స) ఈ ప్రయాణ సన్నాహాలు మొదలెట్టారు. సుదీర్ఘ ప్రయాణం. దానికితోడు చుక్క నీరు కూడా లభించని ఎడారి ప్రాంతం గుండా సాగిపోవాలి. శత్రు సైనికుల సంఖ్య కూడా చాలా పెద్దదే. యుద్ధ సన్నాహాలు చేసుకునేందుకుగాను ఈసారి దైవప్రవక్త(స) ముందుగానే తాము చేయబోయే ప్రయాణ దిశను స్పష్టంగా సూచించారు. రణతంత్రాన్ని కూడా విడమరిచి చెప్పారు.

ప్రవక్త మహనీయుల(స)కు అండగా ముస్లింలు భారీ సంఖ్యలోనే ఉన్నారు. ముస్లిం యోధుల పేర్లన్నీ ఏదయినా రిజిస్టర్‌లో నమోదు చేయడం సులభం కానంత సంఖ్య అది. అందువల్ల ఆ ప్రయాణానికి ఎగనామం పెట్టాలనుకున్నవాడు, తనను గురించి అల్లాహ్ వహీ ద్వారా ప్రవక్తకు తెలియపరిస్తే తప్ప ఎవరికీ తెలియదని అనుకునేవాడు. దైవప్రవక్త(స) ఈ యుద్ధ నిర్ణయం తీసుకున్న రోజుల్లోనే (ఖర్జూర తోటలలో) పంట కోతకు వచ్చింది. చెట్ల నీడలు చల్లగా, ఆహ్లాదకరంగా ఉన్నాయి. నా మనసు కూడా ఆ (తోటల, నీడల) వైపునకే మొగ్గింది. అదే సమయంలో ప్రవక్త(స) వారు, ఆయన ప్రియ సహచరులు యుద్ధ సన్నాహాలు పూర్తి చేసుకున్నారు. నేను కూడా

ప్రయాణ సన్నాహాలు చేసుకుందామని తెల్లవారే బయలుదేరేవాణ్ణి. కాని ఏ నిర్ణయమూ గైకొనకుండానే ఇంటికి తిరుగు ముఖం పట్టేవాణ్ణి. మరి చూడబోతే నాకు ఏ ఇబ్బందులూ లేవు. అన్ని సౌకర్యాలూ పుష్కలంగా ఉన్నాయి. అందుకే ప్రయాణ సన్నాహాలు పూర్తి చేసుకోవడానికి నాకు అంతగా సమయం పట్టదులే అన్న మితిమీరిన ధీమా ఉండేది. ఆ ధీమాయే నా కొంపముంచింది. ఒకవైపున నేను ఇలా తాత్సారం చేస్తూ వాయిదాల మనస్తత్వంతో కాలయాపన చేస్తుండగా, మరోవైపున మదీనా నగరిలోని ముస్లిం యోధులు మాత్రం యుద్ధ సన్నాహాలలో తలమునకలై ఉన్నారు.

ఒకరోజు ఉదయాన ప్రవక్త మహనీయులు(స) ఓ పెద్ద సైనిక పటాలంతో తబూక్‌కు బయలుదేరారు. అప్పటికీ నేను ఎటూ తేల్చుకోలేని స్థితిలో ఉన్నాను. ఆ తరువాత కూడా నా పరిస్థితి అలాగే ఉంది. అదే సమయంలో అటు ముస్లిం యోధులు సమధికోత్సాహంతో కదన రంగం వైపునకు కదం తొక్కుతూ కదలివెళుతున్నారు. సమర వ్యూహం కూడా ఎంతో పకడ్బందీగా రచించబడింది. అప్పుడు కూడా నాలో ఒక ఆలోచన ఉంది– నా వాహనాన్ని దౌడు తీయిస్తూ వెళితే ఆ పయన బృందంలో కలుసుకోగలనని. అప్పుడన్నా బయలుదేరి వుంటే బాగుండేది. కాని నాకా అదృష్టం లేకపోయింది.

ప్రవక్త మహనీయులు (సఅసం) వెళ్ళిన తరువాత బయట (మదీనా) వీధుల్లో తిరిగి చూస్తే అధిక్షేపించబడిన కపటులు, దేవుడు కారణగ్రస్తులుగా ఖరారు చేసిన వృద్ధులు, బలహీనులు, వికలాంగులు తప్ప నాలాంటి ఆరోగ్యవంతులు ఎవరూ నాకు కనిపించలేదు. దాంతో నా దుఃఖం కట్టలు త్రెంచుకుంది. ఆవేదనతో విలవిల్లాడి పోయాను.



అటు ప్రవక్త మహనీయులు (సఅసం) కూడా తబూక్ చేరుకునేవరకూ నన్ను గుర్తు చేయలేదు. తబూక్‌ను సమీపించిన మీదటే, సహచరుల మధ్యన కూర్చుని ఉన్నప్పుడు నన్ను జ్ఞాపకం చేసుకుని, "కాబ్ బిన్ మాలిక్ ఏడి? (అతను మన వెంట రాలేదా?)" అని అడిగారు. అప్పుడు బనూ సలమా తెగకు చెందిన ఒక వ్యక్తి లేచి, 'అతనా! అతనికి తన రెండు దుప్పట్లనూ, రెండు బాహువుల్ని చూసుకుని మురిసి పోవటంతోనే సరిపోతుంది లెండి (అతని సిరిసంపదలు, అతని దేహదారుఢ్యమే అతన్ని ఈ ప్రయాణానికి రాకుండా చేశాయి)' అని వ్యాఖ్యానించాడు. ఈ మాట విన్న మహనీయ ముఆజ్ బిన్ జబల్ (రజి)కు కోపం వచ్చింది. వెంటనే ఈ వ్యాఖ్యను ఖండిస్తూ 'నువ్వు అపార్థం చేసుకుంటున్నావు. అల్లాహ్ సాక్షిగా చెబుతున్నాను. దైవప్రవక్తా(స)! మేము కాబ్ బిన్ మాలిక్‌లో మంచి తప్ప మరేమీ చూడలేద'న్నారు. ఇది విని దైవప్రవక్త(స) మౌనం వహించారు.

దైవప్రవక్త(స) తబూక్ నుండి తిరిగి వస్తున్నారని తెలియగానే నా దుఃఖం తీవ్రతరమయింది. కుంటిసాకులు చెప్పి ఈ గండం నుంచి గట్టెక్కాలన్న ఆలోచన నాకూ వచ్చింది. ప్రవక్త(స) వారి ఆగ్రహం నుండి తప్పించుకునే మార్గమేమిటి? అని మనసులోనే అన్వేషణ మొదలెట్టాను. నా కుటుంబీకుల్లోని విజ్ఞులందరినీ ఈ విషయమై సంప్రతించాను కూడా. ప్రవక్త మహనీయులు (సఅసం) మరికొన్ని క్షణాలలో మదీనా నగరికి విచ్చేయనున్నారన్న కబురు అందగానే నా ఆంతర్యంలోని కల్లబొల్లి పథకాలన్నీ పటాపంచలైపోయాయి. అబద్ధాలు చెప్పి సాఫల్యం పొందలేనని గ్రహించాను. ఏమయినాసరే అసలు విషయం చెప్పాలని గట్టిగా సంకల్పించుకున్నాను.

ప్రవక్త మహనీయులు (సఅసం) తబూక్ నుండి తిరిగి రాగానే ఆనవాయితీ ప్రకారం ముందుగా మస్జిద్‌కు వెళ్ళి రెండు రకతుల నమాజ్ చేశారు. ఆ తరువాత ఆయన ప్రజలతో సమావేశమయ్యారు. ఇది ఆయన సంప్రదాయం. అప్పుడు కపట విశ్వాసులు (మునాఫికీన్) వచ్చి, తాము యుద్ధానికి రాలేకపోవడానికి గల కారణాలను ఏకధాటిగా వివరించసాగారు. ఒట్లు వేసి మరీ కుంటిసాకులు చెబుతున్నారు. ఈ విధంగా కుంటిసాకులు చెప్పిన వారి సంఖ్య 80కి పైనే ఉంటుంది. వారు చెప్పే బాహ్య కారణాలను దైవప్రవక్త(స) అంగీకరించి, వారి లోగుట్టు వ్యవహారాన్ని మాత్రం దైవానికే వదిలేశారు. పైగా వారి మన్నింపు కోసం దైవాన్ని ప్రార్థించారు.

తరువాత నా వంతు వచ్చింది. నేను దైవప్రవక్త(స) సన్నిధిలో హాజరై 'సలామ్' చేయగానే ఆయన(స) చిరుమందహాసం చేశారు. అయితే ఆ నవ్వులో కించిత్ అయిష్టత, వ్యంగ్యం తొంగిచూడసాగాయి. నన్ను తన దగ్గరికి రమ్మన్నారాయన. నేను మరికాస్త ముందుకు జరిగి ఆయనకు ఎదురుగా కూర్చున్నాను. "ఇంతకీ తమరెందుకు రాలేదో! వాహనం కొనుక్కోలేదా?" అని ప్రశ్నించారాయన(స).

'దైవప్రవక్తా(స)! దేవుని సాక్షిగా చెబుతున్నాను. మీ బదులు ప్రపంచంలో వేరెవరయినా ఉంటే, ఏదో ఒక సాకు చెప్పి అతని ఆగ్రహం నుండి తప్పించుకునే వాణ్ణేమో! నాలో వాక్చాతుర్యం ఉంది. నేనూ మాటల్ని బనాయించగలను. కాని ఏం లాభం? దేవుని తోడు! ఈ రోజు నేను మీ ఎదుట అబద్ధం చెప్పి మీ ఆగ్రహం నుండి తప్పించుకున్నా, త్వరలో అల్లాహ్ మీకు నిజం తెలియజేస్తాడు. అప్పుడు నా మీద ఎలాగూ కోపం రాకమానదు. అలాకాకుండా నేను నిజం చెబితే (తాత్కాలికంగా) తమరు నన్ను కోపగించుకున్నప్పటికీ, ఈ నిజం మూలంగానే అల్లాహ్ నాకు మేలు చేస్తాడన్న నమ్మకం నాకుంది. దేవుని తోడుగా నేను నిజమే చెబుతున్నాను– నాకెలాంటి అడ్డంకులూ లేవు. పైగా నేను మునుపెన్నడూ లేనంత ఆరోగ్యవంతంగా ఉన్నాను. ఆర్థికంగా కూడా పూర్వం కంటే కూడా ప్రస్తుతం నేను మెరుగైన స్థితిలోనే ఉన్నాన'ని చెప్పాను.

నా సంజాయిషీని పూర్తిగా విన్న తరువాత ప్రవక్త మహనీయులు (స) "ఇతను చెప్పినదంతా నిజం" అన్నారు. తరువాత ఆయన(స) నా వైపు తిరిగి, "సరే వెళ్ళు. అల్లాహ్ నీ వ్యవహారంలో ఏదో ఒక నిర్ణయం అవతరింపజేసేవరకూ నిరీక్షించు" అన్నారు. నేను అక్కడి నుండి తిరిగి వెళుతుండగా, సలమా తెగకు చెందినవారు కొందరు నా వెనుకే వచ్చి, 'దేవుని సాక్షిగా! నువ్వు ఇప్పటివరకూ ఏ పాపమూ చేసినట్లుగా మేము ఎరుగము. యుద్ధానికి వెళ్ళకుండా ఉండిపోయిన మరికొంతమంది మాదిరిగానే నువ్వు కూడా ఏదో ఒక సాకు చెప్పలేకపోయావా! నీ వల్ల జరిగిన ఈ తప్పుకు దైవప్రవక్త(స) చేసే మన్నింపు ప్రార్థన సరిపోయేది కదా!' అని నిష్ఠూరంగా చెప్పారు.

అల్లాహ్ సాక్షి! నేను నిజం చెప్పినందుకు వాళ్ళు నన్ను తీవ్రంగానే నిందించారు, మందలించారు. వారి నిందలు భరించలేక నేనొక దశలో మళ్ళీ ప్రవక్త(స) వారి సన్నిధికి వెళ్ళి,ఇంతకు ముందు నేను చెప్పినదంతా అబద్ధమని చెప్పి, ఏదయినా

సాకు చెబుదామన్న ఆలోచన కూడా మనసులో వచ్చింది. ఆ తరువాత నేను వాళ్ళతో, 'ఇలాంటి పరిస్థితి నాతోపాటు వేరెవరికయినా ఎదురయిందా?' అనడిగాను. దానికి వారు, 'అవును. మరో ఇద్దరున్నారు. వాళ్ళూ నీలాగే నిజం చెప్పారు. వాళ్ళకీ ఇదే సమస్య ఎదురయింద'ని చెప్పారు.

'ఇంతకీ వారెవరు?' అడిగాను.

'ఒకరు మురారా బిన్ రబీ అమ్రీ (రజి), మరొకరు హిలాల్ బిన్ ఉమయ్యా (రజి).'

చూడబోతే వీళ్ళిద్దరు కూడా మంచివాళ్ళే. వీళ్ళు బద్ర్ యుద్ధంలో కూడా పాల్గొన్నారు. ఈ వ్యవహారంలో వాళ్ళిద్దరూ నాతోపాటు ఉండటం నాకు కొంత ఊరట కలిగించింది. వీళ్ళ సంగతి తెలిసిన మీదట నేను నా మొదటి అభిప్రాయం పైనే స్థిరంగా ఉన్నాను. (జనుల ఉచిత సలహాలను ఏమాత్రం ఖాతరు చేయలేదు)

యుద్ధానికి వెళ్ళకుండా వెనుక ఉండిపోయిన మా ముగ్గురితో ఎవరూ మాట్లాడ కూడదని ప్రవక్త మహనీయులు (స) ఆదేశించారు. ఆ ప్రకటన విన్న క్షణం నుంచే జనులు మాకు దూరంగా మసలుకోవటం మొదలెట్టారు. ప్రజలలో వచ్చిన ఈ ఆకస్మిక మార్పువల్ల నాకు లోకమే విచిత్రంగా కనిపించింది. నేను నా స్వస్థలంలో కాకుండా మరేదన్నా కొత్త ప్రదేశంలో ఉన్నానా? అనిపించింది.

ఈ వ్యవహారంలో మిగతా సహచరులిద్దరూ– ఈ బాధను భరించలేక– ఇంటి పట్టునే ఉండిపోయి కన్నీరుమున్నీరుగా విలపించసాగారు. కాని నేను యువకుణ్ణి. వారిద్దరికన్నా బలవంతుణ్ణి. కనుక నేను బజారులో తిరిగేవాణ్ణి. సామూహిక నమాజుకై (మస్జిద్‌కు) వచ్చేవాణ్ణి. కాని నాతో ఎవరూ మాట్లాడేవారు కారు. నేను ప్రవక్త(స)కు సమీపంలోనే ఉండేవాడిని. నమాజు ముగిసిన తరువాత ఆయన సమావేశమై ఉన్నప్పుడు నేనాయనకు 'సలామ్' చేసేవాణ్ణి, నా సలామ్‌కు సమాధానంగా ప్రవక్త మహనీయుల (స) వారి పెదవులు కదలుతాయేమోనని ఆసక్తితో చూసేవాణ్ణి. ఆయన(స)కు దగ్గరగా నిలబడి నమాజ్ చేస్తూ, క్రీగంట చూపులతో ఆయన్ని గమనిస్తూ ఉండేవాడిని. నేను నమాజులో లీనమై ఉండగా ఆయన(స) నా వైపు చూడటం, నేను ఆయన(స) వైపునకు దృష్టిని సారించగానే తన చూపుల్ని మరల్చుకోవటం నేను పసిగట్టాను.



**అరేబియాలోని ఖర్జూర తోటలలో ఇదొకటి**

ఆఖరికి ఈ ఎడబాటును, ఉదాసీనతా వైఖరిని భరించలేక ఒక రోజు నేను అబూ ఖతాదా (రజి) గారి తోట ప్రహారీ గోడ దూకి తోటలోనికి వెళ్ళాను. అబూ ఖతాదా ఎవరో కాదు, నా పినతండ్రి కుమారుడే. జనులలో నాకెంతో ప్రియతముడు కూడా. నేనతనికి సలామ్ చేశాను. వల్లాహ్! అతను నా సలామ్‌కు జవాబు ఇవ్వలేదు. నేను తట్టుకోలేకపోయాను.

'అబూ ఖతాదా! నేను అల్లాహ్‌పై ప్రమాణం చేసి అడుగుతున్నాను– చెప్పు, నేను దైవం, దైవప్రవక్త(స) యెడల నిష్కల్మషమయిన ప్రేమాభిమానం కలవాణ్ణి కానా?! ఈ సంగతి నీకు తెలియదా?' అని ప్రశ్నించాను.

మౌనమే అతని సమాధానమయింది.

రెండవసారి మళ్ళీ దైవసాక్షిగా అడిగాను.

ఈసారి కూడా ఖతాదా మౌనం వీడలేదు.

మూడవ సారి కూడా అతన్ని నిలదీసి అడిగితే, 'ఆ విషయం అల్లాహ్‌కు, ఆయన ప్రవక్త(స)కే బాగా తెలుసు' అని మాత్రం క్లుప్తంగా బదులిచ్చాడు.

ఈ మాట వినగానే నా కళ్ళల్లో కన్నీరు ఉబికి వచ్చింది. అవిసిపోయిన గుండెలతో గోడ దూకి ఇంటికి తిరిగి వచ్చేశాను.

ఒకరోజు నేను మదీనాలోని ఓ వీధి గుండా వెళుతుంటే, సిరియా నుండి

ధాన్యం అమ్ముకోవడానికి వచ్చిన రైతుల్లోని ఒక వ్యక్తి 'కాబ్ బిన్ మాలిక్ ఎవరో నాకు చెబుతారా?' అని జనులను అడగటం నేను గమనించాను. జనులు నా వైపు సైగ చేశారు– అదిగో అతనే అంటూ. అతను నా దగ్గరకు వచ్చి గస్సాన్ చక్రవర్తి పంపిన ఉత్తరమొకటి నాకు అందించాడు. ఆ ఉత్తరం పట్టువస్త్రంలో చుట్టబడి ఉంది. నేనా ఉత్తరాన్ని తీసి చదివాను. నేను చదవటం, వ్రాయటం వచ్చినవాణ్ణి. అందులో ఈ విధంగా లిఖించబడి ఉంది–

"మీ దొరగారు మిమ్మల్ని వేధిస్తున్నట్లు మాకు సమాచారం అందింది. దేవుడు మిమ్మల్ని పుట్టించింది మీరిలా అవమానాలు భరించే చోట ఉండి, నాశనమవటానికి కాదు. మేము మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాము. మిమ్మల్ని తగురీతిలో సత్కరిస్తాం. మా వద్దకు వచ్చేయండి".

నేను ఆ ఉత్తరం చదివిన తరువాత నిట్టూరుస్తూ 'ఇది కూడా ఒక పరీక్షేనేమో!' అనుకున్నాను. వెంటనే ఆ ఉత్తరాన్ని పొయ్యిలో పెట్టి తగులబెట్టేశాను.

అప్పటికి నలభై రోజులు గడిచిపోయాయి. అయినా మా వ్యవహారంలో దైవాజ్ఞ ఏదీ రాలేదు. కాని దైవప్రవక్త (స) వద్ద నుంచి ఒక వార్తాహరుడు రావటం నేను గమనించాను. అతను వచ్చీరాగానే 'నువ్వు నీ భార్యకు దూరంగా ఉండాలన్నది ప్రవక్త (స) ఆదేశం' అన్నాడు.

'ఏమిటి, నేనామెకు విడాకులివ్వాలా?' అని అడిగాను.

"విడాకులు ఇవ్వాల్సిన అవసరం లేదుగాని, నీవు ఆమెకు దూరంగా ఉండు, చాలు" అని చెప్పాడా వార్తాహరుడు.

నా సహచరులిద్దరికి కూడా దైవప్రవక్త(స) ఇదే ఆజ్ఞను జారీ చేశారు.

నేను నా భార్యతో, 'నీవు పుట్టింటికి వెళ్ళిపో. నా విషయంలో అల్లాహ్ ఏద యినా నిర్ణయం చేసేవరకూ రావద్దు' అని సూచించాను.

అయితే హిలాల్ బిన్ ఉమయ్యా (రజి) ఇల్లాలు మాత్రం దైవప్రవక్త(స) సన్నిధికి వెళ్ళి 'దైవప్రవక్తా(స)! హిలాల్ బిన్ ఉమయ్యా ఇప్పటికే నీరసించిపోయిన ముసలి వాడు. పైగా ఆయనకు సేవకులు కూడా లేరు. నేనాయనకు సేవలు చేసుకోవచ్చా. ఇలా చేయటం మీకు ఆగ్రహం కలిగించదు కదా!' అని సందేహపడగా "ఆహా! అతను నిన్ను కలవకూడదన్నదే (నీతో సంభోగించరాదన్నదే) ఈ ఆజ్ఞలోని ఉద్దేశం" అన్నారాయన(స). దానికామె, 'వల్లాహ్! అసలాయన కదల్లేనంత నీరసంగా ఉన్నారు.

ఈ సంఘటన జరిగిన నాటి నుంచీ ఆయన సమయమంతా ఏడుపులు, హాహాకారాల లోనే గడిచిపోతోంది' అని చెప్పింది.

ఈ విషయం తెలిసిన మా ఇంటి వారలు, హిలాల్‌కు సపర్యలు చేయడానికి దైవప్రవక్త(స) అనుమతి ప్రదానం చేశారు కదా! నువ్వు కూడా వెళ్ళి నీ భార్య విషయంలో అనుమతి తీసుకోరాదా!? అని సలహా ఇచ్చారు.

నాకు మనసొప్పలేదు.

'ఎట్టి పరిస్థితిలోనూ ఈ విషయమై నేను ప్రవక్త(స) నుండి అనుమతి కోరను. నేను యువకుణ్ణి. (హిలాల్ లాగా వృద్ధుణ్ణి కాను). ఒకవేళ నేను అనుమతికై అభ్యర్థించుకుంటే సమాధానంగా ఆయన(స) ఏమంటారో ఏమో!' అన్నాను.

ఆ విధంగా మరో పది రోజులు గడిచిపోయాయి. మాతో మాట్లాడరాదని ప్రవక్త మహనీయులు(స) ప్రజల్ని ఆదేశించి పూర్తిగా యాభై రాత్రులు గడిచాయి.

యాభయవ రోజు ఉదయం నేను నా ఇంటి కప్పు పైకెక్కి నమాజు చేసుకుని అక్కడే కూర్చున్నాను. అప్పుడు నా పరిస్థితి అల్లాహ్ (ఖుర్ఆన్‌లో) సెలవిచ్చినట్లు– నా అంతరాళం శోక సంతప్తమై ఉంది. భూమి ఎంతో విశాలంగా ఉన్నప్పటికీ అది నా కోసం కుంచించుకుపోయినట్లుగా ఉంది. అంతలోనే సలా కొండపైకెక్కి ఎవరో బిగ్గరగా నినదిస్తున్నట్లు నాకు వినిపించింది. అది నా పాలిట అనురాగ రావమయింది.

'కాబ్ బిన్ మాలిక్! నీకు శుభాకాంక్షలు. ఇక నీవు సంతోషించు' అన్న మాటలు నా కర్ణపుటాలకు తాకిన మరుక్షణమే (సంతోషాతిశయంతోనూ, దేవుని పట్ల కృతజ్ఞతా భావంతోనూ) 'సజ్దా'లో పడిపోయాను. అల్లాహ్ తరఫు నుండి కష్టాలు తొలగిపోయి, శుభం జరిగిందని అర్థం చేసుకున్నాను.

ఇంతకీ అసలేం జరిగిందంటే–

ఆ రోజు ఫజ్ర్ నమాజ్ అనంతరం ప్రవక్త మహనీయులు (సఅసం) ప్రజల సమక్షంలో ప్రకటన చేస్తూ అల్లాహ్ మా (ముగ్గురి) పశ్చాత్తాపాన్ని ఆమోదించాడని తెలిపారు. ఈ ప్రకటన వినగానే ముస్లింలు ఆనందంతో మాకు శుభాకాంక్షలు తెలుపడానికి తండోపతండాలుగా రావటం మొదలెట్టారు. మిగతా సహచరులిద్దరి ఇండ్లకూ ఇలాగే వెళ్ళారు. ఒకతను గుర్రాన్ని దౌడు తీయిస్తూ వస్తున్నాడు. అస్లం తెగకు చెందిన ఒక వ్యక్తి నా వైపు దూసుకు వస్తూ, వడివడిగా గుట్టపైకెక్కాడు. అతని కంఠ స్వరం గుర్రంకన్నా వేగంగా ఉంది. అందరికంటే ముందు నన్ను సమీపించి, శుభవార్త వినిపించిన వ్యక్తి అతనే. శుభవార్త వినగానే నేను నా ఒంటిపై ఉన్న వస్త్రాలతో అతన్ని

సత్కృతుణ్ణి చేశాను. దైవసాక్షిగా! ఆ రోజు నా వద్ద ఉన్నవి అవే. అందుచేత నేను మరో జత దుస్తులు వాడుక నిమిత్తం (ఇతరుల నుండి అరువుగా) తీసుకుని తొడుక్కున్నాను.

ఆ తరువాత నేను దైవప్రవక్త(స)ను కలుసుకోవటానికి బయలుదేరాను. (మార్గంలో) జనులు గుంపులు గుంపులుగా వచ్చి నా పశ్చాత్తాప స్వీకరణపై నాకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. 'నీకు శుభం. అల్లాహ్ నీ పశ్చాత్తాపాన్ని సమ్మతించి ఆమోదించాడ'ని హర్షం వెలిబుచ్చారు.

నేను మస్జిదె నబవీ (స)లోనికి ప్రవేశించాను. ఆ సమయంలో దైవప్రవక్త(స) ప్రజల మధ్య కూర్చుని ఉన్నారు. నన్ను చూడగానే తల్హా బిన్ ఉబైదుల్లాహ్ (రజి) అమాంతం నా వైపునకు లంఘించి కరచాలనం చేస్తూ, నాకు శుభాకాంక్షలు తెలి పారు. వల్లాహ్! ముహాజిర్లలో తల్హా (రజి) తప్ప ఇంకెవరూ ఆ విధంగా (అంత తొంద రగా) లేచి నిలబడలేదు. ఆనాటి తల్హా (రజి) ప్రవర్తనను ఈ కాబ్ ఎన్నటికీ మరువ లేడు.

మహనీయ కాబ్ (రజి) ఇంకా ఇలా అంటున్నారు :

నేను ప్రవక్త మహనీయుల (సఅసం) వారి దగ్గరికి వెళ్ళి సలామ్ చేశాను. పవిత్రమయిన ఆయన ముఖారవిందం ఆనందంతో వెలిగిపోతోంది.

"ఈ రోజు నీకు శుభమవుగాక! నీ తల్లి నీకు జన్మనిచ్చినప్పటి నుండీ, నీ జీవితంలో ఈ రోజు ఎంతో శ్రేష్ఠమైనది" అంటూ సంతోషం వెలిబుచ్చారాయన(స).

'దైవప్రవక్తా(స)! ఈ శుభవార్త మీ తరఫు నుండా? లేక అల్లాహ్ తరఫు నుండా?' అని అడిగాను.

"లేదు లేదు... ఈ శుభవార్త అల్లాహ్ తరఫు నుండి అందినదే" అన్నారు.

ప్రవక్త మహనీయులు (స) సంతోషంగా ఉన్నప్పుడు ఆయన ముఖారవిందం చంద్రబింబంలా దేదీప్యమానంగా ఉండేది. దానినిబట్టి మేము ఆయన సంతోషంగా ఉన్నారని భావించేవారం.

నేను ఆయన(స)కు ఎదురుగా కూర్చొని, 'దైవప్రవక్తా (స)! నా పశ్చాత్తాపం ఆమోదయోగ్యమైనందుకు కృతజ్ఞతగా నేను నా సంపదనంతటినీ దైవం మరియు దైవప్రవక్త మార్గంలో దానం చేయాలనుకుంటున్నాన'ని అన్నాను.

'అంతా వద్దు. కొంత నీ దగ్గరే ఉంచుకో. అదే నీకు శ్రేయస్కరం' అని ఆయన చెప్పారు.

'సరే. ఖైబర్‌లో (విజయప్రాప్తిగా) నాకు వచ్చిన వాటాను నా కోసం అట్టే పెట్టుకుంటాన'న్నాను.

ఇంకా ఈ విధంగా కూడా చెప్పాను : 'దైవప్రవక్తా(స)! నిజం చెప్పినందుకు అల్లాహ్ నాకు విముక్తిని ప్రసాదించాడు. కాబట్టి నేను దీనికి బదులుగా ఇక మీదట జీవితాంతం నిజమే చెబుతానని ప్రమాణం చేస్తున్నాను.'

దైవసాక్షిగా చెబుతున్నాను. ప్రవక్త మహనీయుల(సఅసం) సమక్షంలో నేను ఈ ప్రమాణం చేసిన నాటి నుండీ నేటివరకూ నేను అబద్ధం చెప్పలేదు. కేవలం నిజమే చెప్పినందువల్ల దేవుడు నన్ను అనుగ్రహించినంతగా మరే ముస్లింనీ అనుగ్రహించినట్లు నేను చూడలేదు. ఇకముందు కూడా జీవితాంతం అబద్ధాలు పలకకుండా అల్లాహ్ నన్ను రక్షిస్తూ ఉంటాడని ఆశిస్తున్నాను.

**"అల్లాహ్ క్షమించాడు ప్రవక్తనూ, బహుకష్టకాలంలో ప్రవక్తకు తోడ్పడిన ముహాజిరులనూ, అన్సారులనూ. వారిలో కొందరి హృదయాలు వక్రత్వం వైపునకు మొగ్గినప్పటికీ (కాని వారు ఆ వక్రత్వాన్ని అనుసరించకుండా ప్రవక్తకు తోడ్పడి నందుకు) అల్లాహ్ వారిని క్షమించాడు. నిస్సందేహంగా ఆయన వారి పట్ల వాత్సల్యంతో, కనికరంతో వ్యవహరించాడు. ఇంకా వ్యవహారం వాయిదా వెయ్యబడిన 'ఆ ముగ్గురిని' కూడా ఆయన క్షమించాడు. ఇంత పెద్ద వైశాల్యం కలిగి ఉండి కూడా, భూమి వారికి ఇరుకైపోయింది. వారి ప్రాణాలు కూడా వారికి భారమై పోయాయి. అల్లాహ్ నుండి తమను కాపాడుకోవటానికి స్వయంగా అల్లాహ్ కారుణ్యం తప్ప వేరే ఆశ్రయం ఏదీ లేదని వారు తెలుసుకున్నారు. అప్పుడు అల్లాహ్ కనికరంతో వారి వైపునకు మరలాడు, వారు ఆయన వైపునకు మరలి వచ్చేటందుకు. నిశ్చయంగా ఆయన చాలా క్షమించేవాడూ, కరుణించేవాడూను."** ***(సూరయె తౌబా- 117, 118)***

**"విశ్వాసులారా! అల్లాహ్‌కు భయపడండి. సత్యవంతులకు ఆదరువుగా ఉండండి."** ***(తౌబా :119)***

హజ్రత్ కాబ్ బిన్ మాలిక్ (రజి) ఇంకా ఇలా అన్నారు : దేవునితోడు! ఇస్లాం స్వీకార భాగ్యం తరువాత అల్లాహ్ నాకు ఎన్నో వరాలు వొసగాడు. అయితే నా దృష్టిలో అన్నిటికన్నా గొప్ప వరం, ఆయన నాకు దైవప్రవక్త(స) సమక్షంలో నిజం చెప్పే సద్బుద్ధిని వొసగటం! అబద్ధం నుండి రక్షించటం!! ఒకవేళ నేను కూడా ఆ క్షణంలో

అబద్ధం చెప్పి వుంటే అబద్ధాలాడిన వారిలాగా నేను కూడా సర్వనాశనమై పోయి ఉండేవాణ్ణి. ఎందుకంటే, అల్లాహ్ తన వాణిని అవతరింపజేసినప్పుడు, అందులో అసత్యవాదులను తూలనాడినట్లుగా వేరెవరినీ తూలనాడలేదు. అలాంటి అబద్ధీకులను గురించి అల్లాహ్ ఏమన్నాడంటే–

"నీవు (సమర క్షేత్రం నుండి) తిరిగి వచ్చిన మీదట, నువ్వు వారి పట్ల చూసీ చూడనట్లుగా వ్యవహరించాలని వారు నీ ఎదుట ప్రమాణాలు చేస్తారు. కాబట్టి నీవు వారి యెడల చూసీచూడనట్లుగానే మసలుకో. ఎందుకంటే వారొక మాలిన్యం. వారి గమ్యస్థానం నరకం. వారు సముపార్జించిన దానికి ప్రతిఫలంగా అది వారికి లభిస్తుంది. నీవు వారి యెడల ప్రసన్నుడవు అవ్వాలని వారు నీ సమక్షంలో ప్రమాణాలు చేస్తారు. ఒకవేళ నీవు వారి యెడల ప్రసన్నుడవు అయినా అల్లాహ్ మాత్రం అలాంటి అవిధేయుల (పాపాత్ముల) పట్ల ఎన్నటికీ ప్రసన్నుడు అవడు." (అత్ తౌబా– 95,96)

మహనీయ కాబ్ (రజి) ఇలా తెలిపారు : ప్రవక్త మహనీయులు (సఅసం) మా ముగ్గురి వ్యవహారాన్ని పక్కనబెట్టి, అబద్ధపు ప్రమాణాలతో కుంటిసాకులు చెప్పిన వారి వ్యవహారాన్ని తెమల్చారు. వారి చేత ప్రమాణాలు చేయించుకుని, వారి పాపాల మన్నింపుకై అల్లాహ్‌ను ప్రార్థించారు. మా (ముగ్గురి) వ్యవహారాన్ని మాత్రం వాయిదా వేశారు. కడకు అల్లాహ్ ఈ క్రింది వాక్యం ద్వారా తన తీర్పును అవతరింపజేశాడు–

**"వ్యవహారం వాయిదా వేయబడిన ఆ ముగ్గురిని కూడా అల్లాహ్ క్షమించాడు."**

(సహీహ్ బుఖారీ–యుద్ధాల ప్రకరణం; సహీహ్ ముస్లిం– పశ్చాత్తాప ప్రకరణం ఆధారంగా)

## గుణపాఠాలు

★ ఈ యదార్థ గాథలో ఎన్నో గుణపాఠాలున్నాయి

★ ముస్లిం అయిన వ్యక్తి ఎల్లప్పుడూ సత్యమే పలకాలి. సత్యం పలకటం వల్ల అతను తాత్కాలికంగా కష్టాల్లో పడినా అంతిమంగా సత్యంలోనే దైవప్రసన్నత ఇమిడి ఉంటుంది.

★ మనిషి ద్వంద్వ వైఖరిని విడనాడాలి. ద్వంద్వ వైఖరి ఎప్పటికైనా వినాశకార కమే. మాటల్లో స్పష్టత, చేతల్లో నిజాయితీ ఉంటే దాని చలువ వల్ల మనిషి తప్పులు దైవసన్నిధిలో క్షమాభిక్షకు నోచుకుంటాయి. ఇలాంటి నిష్కల్మష

మయిన మనస్సు గలవారి ఆచరణలను అల్లాహ్ చక్కదిద్దుతాడు. వారి ఆంతర్యాలను పరిశుద్ధపరుస్తాడు. వారి కార్యకలాపాలలో శుభాన్ని, సమృద్ధిని ప్రసాదిస్తాడు.

★ సత్యం, దేవునిపై దృఢమైన విశ్వాసం, నిజాయితీ లాంటి అంశాల ప్రాతిపదికపై రూపొందిన సముదాయంలో నివసించే ప్రజలు సదా సత్యవంతులకు అండగా ఉండాలి. కాపట్యం, దగా, మోసం,వంచన లాంటి దుర్గుణాల నుండి అల్లాహ్ శరణు వేడుకుంటూ ఉండాలి. ఈ వ్యవహారంలో వారు వేసే ప్రతి అడుగూ దైవాగ్రహం నుండి తప్పించుకునేదై ఉండాలి.

★ ఇతరులకు గుణపాఠం కావాలన్న ఉద్దేశ్యంతో నిజాయితీపరులైన ముస్లింలను కూడా– వారు చేసిన తప్పిదానికి గాను– సంఘం నుండి బహిష్కరించవచ్చు. (ఇలాంటి చర్య గైకొనే హక్కు నాయకులకు మాత్రమే ఉంటుంది) ఇలా చేయడం వల్ల సమాజంలో స్వామిద్రోహం, తిరుగుబాటు వంటి అవగుణాలను ఆదిలోనే త్రుంచివేయవచ్చు.

★ ధర్మమార్గంలో ఎదురయ్యే కష్టాలను ఓర్పుతో, స్థయిర్యంతో ఎదుర్కోవాలి.

★ సంతోష సమయంలో శుభాకాంక్షలు తెలుపటం వాంఛనీయం. శుభా కాంక్షలు, శుభవార్తలు అందజేసిన వారిని కానుకలతో సత్కరించటంలో తప్పులేదు.

★ మనిషి తాను ఇచ్చిన మాటను నిలుపుకోవాలి.

★ తమ వద్ద ఉన్న సిరిసంపదలన్నింటినీ దానంగా ఇచ్చివేయటం అభిలష ణీయమే అయినా మనిషి తన స్వంత అవసరాల కోసం కూడా ఉంచు కోవాలి. ఉన్నదంతా ఇచ్చేసి తన పిల్లలు ఇతరుల ముందు చేయి చాపే పరిస్థితి రానీయకూడదు.

★ ఈ సంఘటనలో మహనీయ కాబ్ బిన్ మాలిక్(రజి)తోపాటు మరో ఇద్దరు మహనీయులు (మురారా బిన్ రబీ, హిలాల్ బిన్ ఉమయ్యా) కూడా ఉన్నారు. ఈ యాభై రోజుల శిక్షా వ్యవధిలో (కాదు, 'శిక్షణా కాలం'లో) వారు ముగ్గురూ అవలంబించిన వైఖరిని కాస్త తరచి చూడండి...

ఆ ముగ్గురూ ఈ సందర్భంగా తమ నాయకునిపై కినుక వహించలేదు. తమ రథసారథిపై అసంతృప్తిని వ్యక్తపరచలేదు. సమాజంలో తమలాంటి వారు ఇంకా ఎందరున్నారా అని గాలించి, అలాంటి వారందరినీ ఒక వేదికపైకి తెచ్చి, అసమ్మతి బావుటాను ఎగుర వేయలేదు. విదేశీ చక్రవర్తుల ఆహ్వానాలను పురస్కరించుకుని మదీనా నుండి వలసపోనూ లేదు. పైగా ఈ ముగ్గురు మహనీయులు పలికిన మాట ఒక్కటే. వారు నడిచిన బాట కూడా ఒక్కటే– ఎన్ని కష్టాలెదురయినా సరే తాము అంకితమైన వ్యవస్థకు కడదాకా కట్టుబడి ఉండాలి. తామిక మడమ తిప్పి మరలి పోవటమనేది జరగని పని.

అందుకే అల్లాహ్ దయతో వారి వైపునకు మరలాడు. ఎంతో ప్రేమ పూర్వక మయిన పదాలతో వారి మన్నింపు ప్రస్తావన చేశాడు– **“మేము వారి వైపునకు మరలాము, వారు మా వైపునకు మరలాలని”** అని సెలవిచ్చాడు.

ఈ మన్నింపు ప్రకటనా విధానంలో ఉట్టిపడే కారుణ్యం, వాత్సల్యానికి కారణం ఆ ముగ్గురు వ్యక్తుల చిత్తశుద్ధి మాత్రమే.

తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్

తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్